ఈనాడు



విజయవాడ 26-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 197
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ
★ చప్పట్లు కొడుతూ అభినందిస్తున్న చట్టసభ సభ్యులు

ఉగ్రవాదం ఎక్కడున్నా.. శాంతికి ముప్పే

మోదీకి కనెసెట్ అత్యున్నత పురస్కారం ప్రదానం

- ఆ రక్కసిపై సమన్వయంతో పోరాడాలి
- ఇజ్రాయెల్ పార్లమెంటు వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- అంతర్జాతీయ స్థిరత్వానికి భారత్-ఇజ్రాయెల్ బంధం ఎంతో కీలకమని వ్యాఖ్య

జెరూసలెం: ఉగ్రభూతంపై ప్రపంచ దేశాలు ఉమ్మడిగా పోరాడాల్సిన ఆవశ్యకతను ప్రధాని మోదీ మరోసారి నొక్కిచెప్పారు. ఉగ్రవాదం ఎక్కడున్నా.. అది ప్రతిచోటా శాంతికి ముప్పుగా పరిణమిస్తుందన్నారు. గాజా శాంతి ప్రణాళికకు భారత్ తరఫున ఆయన విస్పష్ట మద్దతు ప్రకటించారు. పశ్చిమాసియాలో దీర్ఘకాలం శాంతి నెలకొనేందుకు అది దోహదపడుతుందని విశ్వాసం (మిగతా 3లో)

పునాది వేసింది.. పూర్తి చేసేదీ నేనే

వెలిగొండకు జులై నాటికి శ్రీశైలం నీళ్లు తెస్తాం

సీఎం చంద్రబాబు ప్రకటన

రూ.436 కోట్లతో వెలిగొండ ఫీడర్ కాలువ ఆధునికీకరణకు శ్రీకారం

ఐదేళ్లలో వైకాపా ఖర్చు పెట్టింది రూ.500 కోట్లే

ప్రాజెక్టు కట్టకుండానే జాతికి అంకితమంటూ జగన్ దొంగనాటకాలని ధ్వజం



వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ అధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈనాడు - ఒంగోలు; న్యూస్‌టుడే - పెద్దదోర్నాల, యర్రగొండపాలెం: 'సుమారు 30 ఏళ్ల క్రితం మార్కాపురంలో పర్యటించా. ఇక్కడ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, శ్రీశైలం నీళ్లు అందించాలని కోరారు. 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించా. వచ్చే జులైలో ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పూర్తి కాని ప్రాజెక్టును 2024 మార్చిలో జాతికి అంకితం చేస్తున్నట్లు అప్పటి సీఎం జగన్ దొంగ నాటక మాడారని ఎద్దేవా చేశారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో రూ.436 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనులకు బుధవారం సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం సొరంగంలో జరుగుతున్న పనులను దృశ్య మాధ్యమం ద్వారా పరిశీలించి, ఇంజినీర్లతో మాట్లాడారు. ప్రాజెక్టు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించారు. ప్రధానాంశాలివీ..

ఈ ఏడాది వెలిగొండ.. వచ్చే ఏడాది పోలవరం

పేదలకు దన్నుగా నిలవడం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం, పోలవరం, మదనపల్లె జిల్లాలను ఏర్పాటు చేశాం. గతేడాది హంద్రీనీవా ప్రాజెక్టుపై దృష్టి సారించాను. ఈ ఏడాది వెలిగొండ, వచ్చే సంవత్సరం పోలవరం పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. వెలిగొండకు రూ.9 వేల కోట్లు కావాలి. ఇప్పటి వరకు రూ.5,455 కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్ల పనులే చేసింది. 2021 అక్టోబరు 7న ఒంగోలులో జరిగిన సభలో జగన్ మాట్లాడుతూ 2022 ఆగస్టు నెలాఖరుకల్లా వెలిగొండ పూర్తిచేస్తామని ప్రకటించారు. తర్వాత చీమకుర్తి, మార్కాపురం బహిరంగ సభల్లోనూ ఇదిగో ప్రాజెక్టు పూర్తి చేసేస్తున్నామంటూ ప్రజలను (మిగతా 2లో)

కాంగ్రెస్ సిగ్గుపడాలి

ఎమర్జెన్సీ తరహాలో బాధపడాల్సి వస్తుంది

11లో

ఏఐ సమిట్‌లో అర్ధనగ్న నిరసనలపై కేంద్ర మంత్రి నిర్మల ఆగ్రహం

జాబ్ మేళాలతో లక్ష ఉద్యోగాలు



- 22 క్లస్టర్ల ద్వారా పరిశ్రమల విస్తరణ, ఉపాధి
- నైపుణ్యాభివృద్ధి శిక్షణతో 40 వేల మందికి కొలువులు
- మార్చినాటికి నైపుణ్యం పోర్టల్
- శాసనసభలో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ఇంతవరకు 1,587 జాబ్‌మేళాలు నిర్వహించి 1,08,747 మందికి ఉద్యోగాలిచ్చాం. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, సీడ్ యాప్ ద్వారా 74 వేల మందికి శిక్షణ ఇచ్చాం. అందులో 40 వేల మంది ఉద్యోగావకాశాలు కల్పించాం. వైకాపా ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉద్యోగులు వారి పార్టీ పనులు చేశారని, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేదని (మిగతా 8లో)

మార్చి 7న ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన

దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమకు అనకాపల్లి జిల్లాలో శ్రీకారం

'ఎక్స్'లో వెల్లడించిన ఆ సంస్థ యాజమాన్యం

ఈనాడు, డిజిటల్ అనకాపల్లి, నక్కపల్లి, న్యూస్‌టుడే: దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి మార్చి 7న అనకాపల్లి జిల్లా (నక్కపల్లి)లో శంకుస్థాపన చేస్తున్నట్లు ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్‌ఎస్) యాజమాన్యం 'ఎక్స్'లో ప్రకటించింది. ఇది చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆనందకరమైన విషయమంటూ పేర్కొంది. (మిగతా 3లో)

న్యాయవ్యవస్థను కించపరచడాన్ని అనుమతించను

వారెంత ఉన్నత స్థానంలో ఉన్నా సరే

- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో అధ్యాయంపై సీజేఐ ఆగ్రహం
- సుమోటోగా స్వీకరిస్తున్నట్లు ప్రకటన
- పుస్తక పంపిణీ నిలిపివేతకు విద్యాశాఖ ఆదేశం



జస్టిస్ సూర్యకాంత్

దిల్లీ: జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థలో అవినీతిపై ఒక అధ్యాయాన్ని ప్రచురించడంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థను కించపరచడానికి, దాని సమగ్రతకు భంగం కలిగించడానికి తాను ఎవరినీ అనుమతించబోనని (మిగతా 3లో)

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

- యంత్రాంగానికి సీఎం చంద్రబాబు ఆదేశం
- డయేరియా, పాల కల్తీ ఘటనలపై సమీక్ష

ఈనాడు, అమరావతి: ప్రజారోగ్యానికి అగ్రప్రాధాన్యం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వ్యవహరించొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి పలువురు మరణించడం, శ్రీకాకుళంలో డయేరియా ప్రబలడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా కీలక శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ రెండు ఘటనలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల యంత్రాంగంతో బుధవారం సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో చికిత్స పొందుతున్న ఇద్దరి ఆరోగ్యం విషమంగా ఉండటంతో వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. 'శ్రీకాకుళం ఘటనలో 76 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరు మినహా మిగిలిన అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఒకరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరొకరికి డయాలసిస్ చేస్తున్నామ'ని అధికారులు వివరించారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. తాగునీటి సరఫరా పైపులైన్ల లీకేజీలపై ఆరా తీశారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో అందిస్తున్నట్లు అధికారులు చెప్పారు. రాజమహేంద్రవరం పాల కల్తీ ఘటనలో అస్వస్థతకు గురైన వారికి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాల నమూనాలు పరీక్షలకు పంపామని, ఫలితాలు రావాల్సి ఉందని చెప్పారు. రెండుచోట్లా అప్రమత్తంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

ఇండియా స్కిల్స్ పోటీల్లో ఏపీకి 23 పతకాలు

ఈనాడు, అమరావతి: ఇండియా స్కిల్స్- 2025-26 సౌత్ రీజనల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 23 పతకాలు సాధించిందని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ తెలిపారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో రెండు బంగారు, ఎనిమిది వెండి, మూడు కాంస్య పతకాలు దక్కించుకోవడంతో పాటు.. మిగిలినవాటిలో ఉత్తమ ప్రతిభ పురస్కారాలు దక్కించుకున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్ పెయింటింగ్ ఇండస్ట్రియల్ మెకానిక్స్ విభాగంలో బంగారు పతకాలు.. ఇండస్ట్రీ 4.0, లాండ్‌స్కేప్ గ్రేడింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ, లాజిస్టిక్- ఫ్రైట్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ఫ్లోరిస్ట్రీ విభాగాల్లో వెండిపతకాలు దక్కాయని వెల్లడించారు. ఫ్లోరిస్ట్రీ, ఇండస్ట్రీస్ విభాగాల్లో మూడు కాంస్యపతకాలు వచ్చాయని తెలిపారు. విజేతలను కార్పొరేషన్ ఎండీ గణేష్‌కుమార్ అభినందించారు.

పునాది వేసిందీ..పూర్తి చేసేదీ నేనే

(మొదటి పేజీ తరువాయి)

మభ్యపెట్టారు. చివరకు ప్రాజెక్టు కట్టకుండానే జాతికి అంకితం అంటూ మోసం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తిచేసేందుకు మరో రూ.2 వేల కోట్లు కావాలి. మేం వచ్చాక 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు పెట్టాం. మార్కాపురం జిల్లాలో ఫ్లోరైడ్ 2.5- 5 పీపీఎం, కొన్నిచోట్ల 4-7 వరకు ఉంది. ఫ్లోరైడ్ ప్రభావిత ఈ ప్రాంత ప్రజలకు తాగునీరందించేందుకు వచ్చే జులై నాటికి నీళ్లు పారిస్తాం. జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు వద్దకు ఏడుసార్లు వచ్చి పరిశీలించారు. ప్రతి సోమవారం ఎంత మేర పని జరిగిందని నివేదిక తీసుకుని, పనితీరు పర్యవేక్షిస్తున్నాం. గోదావరి జలాలను నల్లమలసాగర్‌కు తీసుకొచ్చే పనులు చేపడతాం. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఇక్కడి నుంచి ఉద్యాన ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేందుకు చేయూతనిస్తాం.



మార్కాపురం బహిరంగ సభలో ర్యాంపు పైనుంచి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అసెంబ్లీకి రాకుండా గోల చేస్తున్నారు

జనం ఓట్లు వేస్తేనే మేమంతా అసెంబ్లీకి వెళ్తున్నాం. జగన్ మాత్రం ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానంటూ గోల చేస్తున్నారు. నా తల్లిని, భార్యను తిడుతున్నారు. ఎవరెన్ని తిట్టినా లెక్క చేయను. రాష్ట్రం కోసం, రేపటి తరం భవిష్యత్తు కోసం పని చేస్తా. తెదేపాకు అండగా ఉన్న బీసీలను అన్ని రంగాల్లోనూ పైకి తీసుకొస్తా. సామాజిక న్యాయం కోసం ఎస్సీలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాం. ప్రజలు మరోసారి వైకుంఠపాళి ఆడొద్దు. కులం, మతం చూసి ఓటేస్తే రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుంది. ఓటుతో అండగా నిలబడితే అభివృద్ధి చేసి చూపిస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

నీరొస్తే కష్టాలు తొలగినట్లే: సీఎంతో రైతులు



చంద్రబాబుతో మాట్లాడుతున్న రైతులు వెంకటేశ్వరరెడ్డి, గండి వీరారెడ్డి

గంటవానిపల్లె సమీపంలోని ఫీడర్ కాలువ వద్ద హెలికాప్టర్ దిగిన ముఖ్యమంత్రికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల తెదేపా ఇన్‌ఛార్జులు గూడూరి ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, అధికారులు స్వాగతం పలికారు. శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం గండి చెరువు నీటి సంఘం వైస్ ఛైర్మన్ అమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భాజపా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు, రైతు సురవరం గండి వీరారెడ్డిలతో మాట్లాడారు.

రైతు వెంకటేశ్వరరెడ్డి: మా పెద్దబొమ్మలాపురం గండి చెరువు పరిధిలో 4,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ 1,000 అడుగుల లోతు తవ్వినా నీరు రాదు.

సీఎం: ఆ ఆయకట్టు వెలిగొండ పరిధిలోకి వస్తుందా?

వెంకటేశ్వరరెడ్డి: వెలిగొండ కాలువకు రెండు కి.మీ.ల దూరంలో ఉంటుంది. ప్రాజెక్టు పూర్తయితే మాకు సాగు, తాగునీటి సమస్య తీరుతుంది. ప్రాజెక్టుకు మీరు శంకుస్థాపన చేశారు. మీరే ప్రారంభించాలన్నది ఇక్కడి ప్రజల కోరిక.

సీఎం: మేం పనులు చేస్తున్నా.. ఈ నియోజకవర్గంలో మాకు ఓట్లు వేయలేదు కదా!

రైతు వెంకటేశ్వరరెడ్డి: ప్రజలు ఐదేళ్ల దుర్మార్గ పాలన నుంచి బయటపడి అసలు విషయం తెలుసుకున్నారు. ఈసారి ఎరిక్షన్ బాబును గెలిపించుకుంటాం.

రైతు గండివీరారెడ్డి: గత ప్రభుత్వం కాలువ లైనింగ్ పనులు వదిలేసి ప్రాజెక్టును జాతికి అంకితమంటూ దుర్మార్గంగా వ్యవహరించింది.

సీఎం: రూ.2500 కోట్లు చెల్లించాల్సి ఉంటే చెల్లించకుండా ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని వారు ప్రజలను మోసం చేశారు.

రైతు గండివీరారెడ్డి: ఈ ప్రాంతంలో పత్తి, మిరప, అరటి, బొప్పాయి, బత్తాయి సాగు చేస్తారు. భూగర్భజలాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయలేకపోతున్నాం.

సీఎం: సాగు చేయడమే కాదు ప్రపంచ స్థాయి మార్కెట్‌కు అనుగుణంగా ఇక్కడి పంటల నాణ్యత పెంచాలి. దానిపై రైతులకు అవగాహన కల్పించాలి.

ఎమ్మెల్సీల రాజీనామాలపై మరోసారి విచారణ

- హాజరైన జయమంగళ వెంకటరమణ
- నేడు ఇద్దరు, రేపు మరో ఇద్దరికి పిలుపు

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్సీల రాజీనామాలపై దాదాపు మూడు నెలల తర్వాత మరోసారి విచారణ మొదలైంది. బుధవారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. వైకాపాకు చెందిన వెంకటరమణ గతేడాది ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, జనసేనలో చేరారు. బుధవారం ఆయన జనసేన కండువా కప్పుకొనే ఛైర్మన్‌ను కలిసి.. 'ఇంతకంటే మీకు ఏ ఆధారం కావాలి? నా రాజీనామాను ఆమోదించడానికి' అని అడిగినట్లు తెలిసింది. దానికి ఛైర్మన్ స్పందిస్తూ.. 'పార్టీ మారానని చెబుతున్నారు సరే.. నేను రోజూ ఉదయాన్నే జగన్ ఫొటోకు దండం పెట్టుకుంటా.. అని మీరు ఇదే అసెంబ్లీ సమావేశాల సమయంలో లాబీల్లో ఇతర సభ్యులతో మాట్లాడుతూ చెప్పిన విషయం వార్తల్లో వచ్చింది కదా' అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు కాబట్టి జగన్‌కు కృతజ్ఞత తెలిపానని, అంతకుముందు తెదేపాలో ఉన్నప్పుడు తనను ఎమ్మెల్యే చేసిన చంద్రబాబు ఫొటో కూడా తన ఇంట్లో ఉందని వెంకటరమణ ఛైర్మన్‌తో అన్నట్లు సమాచారం. ఛైర్మన్ స్పందిస్తూ.. 'మీరు మనస్ఫూర్తిగా, స్వచ్ఛందంగానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారా? లేదా వేరే ఏదైనా ఒత్తిడి ఉందా' అని అడిగినట్లు తెలిసింది. అదేమీ లేదని వెంకటరమణ సమాధానమిచ్చారు. కాసేపటి తర్వాత విచారణను వాయిదా వేశారు.

★ తన రాజీనామాపై మండలి ఛైర్మన్ నిర్ణయం తీసుకోవడం లేదని జయమంగళ వెంకటరమణ గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. రాజీనామాపై నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆ గడువు వచ్చే నెలతో ముగియనుంది. వచ్చేనెల 5న ఈ కేసుపై మరోసారి హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

ఏడాదిన్నరగా పెండింగులో..

2024 ఆగస్టులో పోతుల సునీత, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, 2024 నవంబరులో జయమంగళ వెంకటరమణ, 2025 మార్చిలో మర్రి రాజశేఖర్, 2025 మే నెలలో శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానమ్ రాజీనామా చేశారు. ఇప్పటివరకూ వారి రాజీనామాలపై మండలి ఛైర్మన్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గతేడాది డిసెంబరు 1న వారిలో ఐదుగురిని పిలిచి ఛైర్మన్ విచారించారు. ఇప్పుడు మళ్లీ రెండోసారి విచారణకు పిలిచారు. గురువారం మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, శుక్రవారం బల్లి కల్యాణ్‌చక్రవర్తి, పోతుల సునీతలను విచారణకు రావాలని ఛైర్మన్ సమన్లు జారీ చేశారు. జకియా ఖానమ్ పదవీకాలం వచ్చే జులైతో ముగియనున్న నేపథ్యంలో ఆమెను విచారణకు పిలిచే అవకాశం లేదు.

క్షణాల్లో ఆస్తి పన్ను చెల్లింపు

- ప్రతి ఇంటికీ క్యూఆర్ కోడ్ స్కానర్లు
- సమస్యలపైనా ఫిర్యాదులు చేయొచ్చు

ఈనాడు, అమరావతి: ఆస్తి పన్ను చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్తున్నారా? వీధిలో పేరుకుపోయిన చెత్త తొలగించాలని గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు వినతులివ్వాలని అనుకుంటున్నారా? ఇక నుంచి మీరు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు. అధికారులను కలవాల్సిన పని అంతకంటే లేదు. మీ ఇంటి గోడకు, డోర్‌కు అతికించే క్యూఆర్ కోడ్‌ని స్మార్ట్ ఫోన్ ద్వారా స్కాన్ చేసి ఆస్తి పన్ను చెల్లించొచ్చు. సమస్యలపైనా ఫిర్యాదులు చేయొచ్చు. ఈ వినూత్న ప్రాజెక్టు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో త్వరలో అమల్లోకి రానుంది. ఇప్పటికే వివిధ పనుల కోసం పుర, నగరపాలక సంస్థల కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఏడాది క్రితం ప్రారంభించిన పురమిత్ర యాప్ ఇదే కోవకు చెందుతుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు యాప్‌లో ఫొటోలతో సహా అప్‌లోడ్ చేసిన వెంటనే వాటిని పరిష్కరించేలా యాప్‌ని డిజైన్ చేశారు. దీనికి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. ఇప్పుడు ఆస్తి పన్ను, ఇతరత్రా ఫీజులు కూడా ఇళ్ల నుంచే చెల్లించేలా ఈ ప్రాజెక్టు రూపొందిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లోని 45 లక్షల ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సముదాయాలకు క్యూఆర్ కోడ్‌లు అతికించనున్నారు.

సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే ఇంటి సమగ్ర సమాచారాన్ని వాటి యజమానులు తెలుసుకోవచ్చు. ఇళ్లు, దుకాణాల నిర్మాణ విస్తీర్ణం, ఏటా చెల్లిస్తున్న ఆస్తిపన్ను, బకాయిలు ఉంటే ఆ వివరాలు కనిపిస్తాయి. వ్యాపారసంస్థ, దుకాణమైతే ట్రేడ్ లైసెన్స్ ఫీజుల బకాయిలు తెలుసుకోవచ్చు.

రెండో దశలో వాణిజ్య సంస్థల వివరాలు

క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ఇళ్లకు సమీపంలోని హోటళ్లు, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లు, సినిమా థియేటర్లు, జిమ్‌లు, క్లబ్‌లు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు, విద్యాసంస్థల వివరాలు తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాటిని సంప్రదించేందుకు ఫోన్ నంబర్లు పెడుతున్నారు. రెండోదశలో ఇవి అందుబాటులోకి వస్తాయి. పుర, నగరపాలక సంస్థల సేవల గురించి సులువుగా తెలుసుకునేలా కేంద్రం ప్రవేశపెట్టిన 'సిటీ సర్వీస్ సెంటర్ల' కార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రాజెక్టును రాష్ట్రప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందుకోసం కేంద్రం కేటాయించిన నిధుల్లోంచి కొంత ఖర్చుచేయనున్నారు.

సునీల్ నాయక్‌పై లుకౌట్ సర్క్యులర్!

- జారీకి ప్రక్రియ ప్రారంభించిన దర్యాప్తు బృందం

ఈనాడు, అమరావతి: శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజును వైకాపా హయాంలో సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ నమోదైన కేసులో నిందితుడైన బిహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి ఎం.సునీల్ నాయక్‌పై లుకౌట్ సర్క్యులర్ జారీచేయాలని దర్యాప్తు అధికారి, విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ నిర్ణయించారు. ఆ ప్రక్రియ ప్రారంభించారు. సోమవారం సునీల్ నాయక్‌ను పట్నాలో అరెస్టు చేసినా ఏపీకి తరలించేందుకు అక్కడి కోర్టు ట్రాన్సిట్ వారెంట్ నిరాకరించటం, ఆ తర్వాత ఆయన్ను బిహార్ పోలీసులు ఏపీ పోలీసుల అదుపులో నుంచి విడిపించుకుని తీసుకెళ్లిపోవడం లాంటి పరిణామాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఈసారి ఎలాగైనా ఆయన్ను మళ్లీ అరెస్టు చేసి ఏపీకి తరలించాలనే కృతనిశ్చయంతో ఉన్న దామోదర్ బృందం పట్నాలోనే మకాం వేసి... సునీల్ నాయక్ కదలికలపై నిఘా పెట్టింది. ఆయన విధులకు హాజరుకావట్లేదని గుర్తించింది. ఫోన్లన్నీ స్విచాఫ్ చేసేసి... అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు నిర్ధారించుకుంది. ఈ నేపథ్యంలోనే సునీల్ నాయక్‌పై లుకౌట్ సర్క్యులర్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు సునీల్ నాయక్‌పై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ కోరుతూ గుంటూరులోని న్యాయస్థానంలో పోలీసులు దాఖలుచేసిన పిటిషన్‌పై ఇంకా అధికారిక ఉత్తర్వులు రాలేదు. అవి రాగానే వాటికి అనుగుణంగా చర్యలు చేపట్టనున్నారు.

ముందస్తు బెయిల్‌కు హైకోర్టులో సునీల్‌నాయక్ పిటిషన్

ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఐపీఎస్ అధికారి, అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్ (ఏ7) బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'నేను బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్నాను. రఘురామ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన చిత్రహింసల కేసుతో నాకు సంబంధం లేదు. ఈ కేసులో తొలుత నా పేరు లేదు. రాజకీయ కారణాలతో నన్ను నిందితుడిగా చేర్చారు' అని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

26-2-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం

దశమి: రా. 12-43 తదుపరి ఏకాదశి
మృగశిర: మ. 12-37 తదుపరి ఆర్ద్ర
వర్జ్యం: రా. 8-29 నుంచి 9-59 వరకు
అమృత ఘడియలు: రా. 1-44 నుంచి 3-14 వరకు
దుర్ముహూర్తం: ఉ 10-16 నుంచి 11-03 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-41 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.25; సూర్యాస్తమయం: సా.6.01

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	30.0
తిరుపతి	20.5	34.4
అనంతపురం	20.6	36.0
గుంటూరు	21.0	29.0
విజయవాడ	21.0	33.6
రాజమహేంద్రవరం	21.0	38.0
కర్నూలు	21.7	36.0
శ్రీకాకుళం	22.0	31.0
తాడేపల్లిగూడెం	22.0	34.0
ఒంగోలు	23.0	33.6
కడప	23.0	34.0
విశాఖపట్నం	23.4	32.0
నెల్లూరు	24.4	32.6

ఇదీ సంగతి!



నేటి నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

పలు ఆర్జిత సేవల రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు గురువారం నుంచి మార్చి 2 వరకు జరగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తిగా, రెండోరోజు రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి అవతారంలో, చివరి మూడురోజులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు విహరిస్తారు. తెప్పోత్సవాల కారణంగా ఈ నెల 26, 27ల్లో సహస్రదీపాలంకార సేవ, 28, మార్చి 1, 2 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.

నకిలీ వెబ్‌సైట్లతో భక్తులు అప్రమత్తంగా ఉండాలి: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామంటూ భక్తులను మోసం చేస్తున్న దళారులు, నకిలీ వెబ్‌సైట్లతో అప్రమత్తంగా ఉండాలని తితిదే సూచించింది. తిరుమలలోని కర్ణాటక ప్రవాససౌధ పేరుతో గదులు ఇప్పిస్తామని చెప్పిన దళారి చేతిలో కేరళకు చెందిన సి.కె.సురేష్ బాబు మోసపోయారు. బాధితుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో తితిదే విజిలెన్స్ విభాగం సమగ్ర విచారణ చేపట్టింది. శ్రీవారి ఆలయ చిత్రాలు, తితిదే పేరును అనధికారికంగా వినియోగిస్తూ నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి భక్తులను తప్పుదారి పట్టిస్తున్నట్లు గుర్తించింది. గూగుల్ సెర్చ్‌లలో ఈ ఫేక్ వెబ్‌సైట్లు కనిపిస్తూ భక్తుల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ల రూపంలో నగదు వసూలు చేస్తున్నట్లు అధికారులు కనుగొన్నారు. ఈ నేపథ్యంలో తితిదే ఐటీ విభాగం ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తితిదే చిహ్నాలు, ఆలయ చిత్రాలను అనధికారికంగా వినియోగిస్తున్న వెబ్‌సైట్లపై కాపీరైట్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. దర్శనం, వసతి గదులు, సేవా టికెట్లను తితిదే అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.

అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణపై ముందుకెళ్లొద్దు

పురపాలక శాఖకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: అనధికారిక, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా తాము తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ముందుకెళ్లొద్దని పురపాలక శాఖ అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అనధికారిక, అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ నిమిత్తం 2025 నవంబర్ 12న పురపాలక శాఖ ఇచ్చిన జీవో 225, ఏపీ పురపాలక (మూడో సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ ప్రకాశం జిల్లా చంద్రారెడ్డిపల్లికి చెందిన సీహెచ్ హరికృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ 'జీవో 225 సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం. ఇప్పటికే పలుమార్లు అనధికారిక నిర్మాణాలను క్రమబద్ధీకరించారు' అని తెలిపారు. దీనిపై కౌంటర్ దాఖలుకు సమయం కావాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది (ఏజీపీ) విజ్ఞప్తి చేశారు. కౌంటర్ వేయాలని గతేడాది డిసెంబర్ 31న ఉత్తర్వులిచ్చినా, ఇంకా వేయకపోవడమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది.

విశాఖలో ఈదురుగాలుల బీభత్సం



గుల్లేపల్లిలో జలమయమైన క్రికెట్ మైదానం

విశాఖపట్నం (పెందుర్తి, సబ్బవరం), న్యూస్‌టుడే: విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలోని పలు ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కురిసిన భారీవర్షానికి బీఆర్టీఎస్ ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలు, హోర్డింగులు ఎగిరిపోయాయి. సరిపల్లి సమీపంలో విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు కుమారుడి వివాహానికి నిర్మించిన పెళ్లి సెట్టింగ్ కూలిపోయింది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లి అవెన్యూ స్పోర్ట్స్ అవేరా క్రికెట్ మైదానం వర్షానికి పూర్తిగా జలమయమైంది. దాంతో అక్కడ జరుగుతున్న జాతీయ దివ్యాంగుల వీల్‌చెయిర్ క్రికెట్ పోటీలను అర్ధాంతరంగా ముగించి అప్పటివరకు ఉన్న గణాంకాల ఆధారంగా విజేతలను ప్రకటించారు.

న్యాయవ్యవస్థను కించపరచడాన్ని అనుమతించను

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. పుస్తకంలో న్యాయవ్యవస్థపై అభ్యంతరకర వ్యాఖ్యలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీలు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ "ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. న్యాయవ్యవస్థతో అనుబంధం కలిగినవారందరూ దీనిపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చాలా మంది ఫోన్లు చేశారు. సందేశాలు పంపారు. హైకోర్టు న్యాయమూర్తులు కూడా నాతో మాట్లాడారు. న్యాయవ్యవస్థను కళంకం ఆపాదించేలా ఎవరు ప్రవర్తించినా అనుమతించను. వారెంత ఉన్నతస్థానంలో ఉన్నా సరే, చట్టం తన పని చేసుకుపోతుంది. ఈ అంశంపై ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాం. సుమోటోగా తీసుకుంటున్నాం" అని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. దీనిపై ఇంకా ఎక్కువ మాట్లాడాలని అనుకోవడం లేదు అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చినందుకు సిబల్, సింఘ్వీలకు ధన్యవాదాలు తెలిపారు. భారత రాజ్యాంగం మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా ఈ అధ్యాయం ఉందని ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి వ్యాఖ్యానించారు.

పాఠ్య పుస్తక పంపిణీ నిలిపివేతకు ఆదేశం: న్యాయ వ్యవస్థలో అవినీతి గురించిన పాఠ్యాంశంతో కూడుకున్న పుస్తక పంపిణీని నిలిపివేయాలంటూ ఎన్‌సీఈఆర్‌టీని కేంద్ర విద్యా శాఖ ఆదేశించింది. అసంబద్ధమైన విషయాలు పాఠ్యాంశంలో వచ్చాయని, నిర్ణయం తీసుకోవడంలో పొరపాటు కారణంగా అలా జరిగిందని ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. పాఠ్యపుస్తకాన్ని అధికారిక వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అనుచితమైన అంశాలను ప్రచురించినందుకు క్షమాపణ చెప్పింది.

మార్చి 7న ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీ చిత్రం, గూగుల్ మ్యాప్, సమగ్ర వివరాలను పొందుపరచనుంది. శంకుస్థాపన కార్యక్రమానికి ఎవరు ముఖ్య అతిథిగా వస్తారనే విషయాన్ని ప్రకటించలేదు. మరోవైపు ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్రమంత్రులు వస్తారని సమాచారంతో అధికార యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేపడుతోంది. నక్కపల్లి మండలంలో పరిశ్రమ ఏర్పాటుచేసే ప్రాంతంలో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమన్ పటేల్, జాజ్ గోపినాథ్ జెట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులు బుధవారం పరిశీలించారు. ఇప్పటికే ఏర్పాట్లపై సమీక్షించారు. దాదాపు రూ.1.35 లక్షల కోట్లతో రెండు దశల్లో ఏర్పాటుచేసే ఈ భారీ పరిశ్రమను ఏడాదిన్నరలోనే కార్యరూపం దాల్చేలా రాష్ట్రప్రభుత్వం నిరంతరం కృషి సాగించింది. దీనిద్వారా భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. అతి పెద్ద ప్రాజెక్టు సాకారం అవుతుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

24 మంది ఎంపీడీవోలు, శ్రీకాకుళం డీపీవో బదిలీ

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో ఉద్యోగాలకు ఎంపికైన 24 మంది ఎంపీడీవోలతో పాటు శ్రీకాకుళం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) కె.భారతీ సౌజన్యను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బదిలీ చేసింది. వీరందరినీ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారులు ఆయా జిల్లాల నుంచి అత్యవసరంగా రిలీవ్ చేశారు. వారంతా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎదుట గురువారం హాజరుకానున్నారు. 2018 నాటి నోటిఫికేషన్ గ్రూప్-1 పరీక్షల్లో ఎంపికైనవారిని ప్రాధాన్య పోస్టుల నుంచి అప్రాధాన్య స్థానాల్లోకి బదిలీ చేయాలన్న హైకోర్టు ఆదేశాలతో చర్యలు చేపట్టారు.

ఉగ్రవాదం ఎక్కడున్నా.. శాంతికి ముప్పే

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తంచేశారు. ఇజ్రాయెల్ పార్లమెంటు(కనెసెట్)లో మోదీ ఈ మేరకు చరిత్రాత్మక ప్రసంగం చేశారు. తమ అత్యున్నత పురస్కారమైన 'స్పీకర్ ఆఫ్ ది కనెసెట్ మెడల్'తో ఆయన్ను కనెసెట్ గౌరవించింది. రెండురోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న మోదీ.. తొలుత ఆ దేశ ప్రధానమంత్రి నెతన్యాహుతో కొంతసేపు భేటీ అయ్యారు. అనంతరం కనెసెట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించే గౌరవం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగాన్ని ఆరంభించిన ఆయన.. 'స్నేహం, గౌరవం, భాగస్వామ్యం' అనే సందేశాన్ని తాను మోసుకొచ్చానన్నారు.



టెల్ అవీవ్ సమీపంలోని బెన్ గురియన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహుల ఆత్మీయ ఆలింగనం

మేమూ వేదన అనుభవించాం

ఇజ్రాయెల్‌లో 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన పాశవిక దాడిలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదాన్ని, పౌరుల హత్యలను ఏ కారణాలూ సమర్థించబోవన్నారు. ఉగ్రభూతం వల్ల భారత్ కూడా తీవ్ర వేదన అనుభవించిందని పేర్కొన్నారు. "26/11 ముంబయి దాడుల్లో చాలామంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఇజ్రాయెలీలూ ఉన్నారు. ఇజ్రాయెల్‌లాగే భారత్ కూడా ఉగ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించదు. ఆ రక్కసిపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావివ్వదు. సమాజాలను అస్థిరపరచడం, అభివృద్ధిని అడ్డుకోవడం, విశ్వాసాన్ని దెబ్బతీయడం వంటి లక్ష్యాలతో ఉగ్రవాదం పనిచేస్తుంది. దాన్ని అంతమొందించేందుకు ప్రపంచ దేశాలు సమన్వయంతో, సుస్థిరంగా కృషిచేయాలి. ఎందుకంటే- ఉగ్రవాదం ఎక్కడున్నా.. అది ప్రతిచోటా శాంతికి ప్రమాదకరంగా మారుతుంది" అని పేర్కొన్నారు.

ముందున్న దారిలో మరిన్ని సవాళ్లు

గాజా శాంతి ప్రణాళికకు భారత్ మద్దతిస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి అది భరోసానిస్తుందన్నారు. "భద్రతామండలి ఆమోదించిన గాజా శాంతి ప్రణాళిక ప్రాంతీయంగా దీర్ఘకాలం శాంతిని నెలకొల్పుతుందని, ప్రజలందరికీ సముచిత న్యాయాన్ని అందిస్తుందని విశ్వసిస్తున్నాం. దానికి భారత్ మద్దతు ఉంటుంది. పాలస్తీనా వివాదాన్ని పరిష్కరించేందుకూ ఈ ప్రణాళిక దోహదపడుతుందని మేం విశ్వసిస్తున్నాం. వివేకం, ధైర్యం, మానవత్వంతో చర్యలు చేపడదాం" అని మోదీ వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల గురించి, కొన్నేళ్ల కిందట పలు దేశాలతో అబ్రహాం ఒప్పందాలపై ఇజ్రాయెల్ సంతకం చేయడం గురించి మోదీ ప్రస్తావించారు. "దీర్ఘకాలం సంక్షోభ పరిస్థితులతో అట్టుడికిన పశ్చిమాసియాకు అబ్రహాం ఒప్పందాలు కొత్త ఆశాకిరణంలా నిలిచాయి. ముందున్న దారి మరింత సవాళ్లతో కూడుకున్నది. అయినప్పటికీ ఆశతో ముందుకు వెళ్లడం ముఖ్యం" అని పేర్కొన్నారు.

ఎఫ్‌టీఏ చర్చలు జరుగుతున్నాయ్

భారత్, ఇజ్రాయెల్ మధ్య 2 వేల ఏళ్లకుపైగా కాలం నుంచి సంబంధాలు ఉన్నాయని మోదీ అన్నారు. "భారత్-ఇజ్రాయెల్ మధ్య బలమైన భాగస్వామ్యం.. ఇరు దేశాల ప్రయోజనాలకే కాకుండా, అంతర్జాతీయ స్థిరత్వానికీ కీలకం. ఇజ్రాయెల్ ప్రదర్శిస్తున్న తెగువ, సాధిస్తున్న విజయాలను భారత్‌లో అనేకమంది కొనియాడుతున్నారు. ఇరుదేశాల మధ్య రక్షణ భాగస్వామ్యానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఇటీవలి ఏళ్లలో ద్వైపాక్షిక సరకు వాణిజ్యం చాలారెట్లు పెరిగింది. ఇరుదేశాలు ప్రస్తుతం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కోసం చర్చలు జరుపుతున్నాయి" అని పేర్కొన్నారు. భారత ఆర్థికవృద్ధిని, ఇజ్రాయెల్ సాంకేతిక సామర్థ్యాలను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ప్రపంచంలోకెల్లా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ త్వరలోనే అవతరిస్తుంది. అదే సమయంలో.. నవకల్పనలు, సాంకేతిక నాయకత్వానికి ఇజ్రాయెల్ పవర్‌హౌస్‌గా నిలుస్తోంది. కాబట్టి రెండు దేశాలూ కలిసికట్టుగా ముందుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు.

- భారత్‌లో 'ఇక్రియేట్ టెక్నాలజీ బిజినెస్ ఇంకుబేటర్'ను 2018లో నెతన్యాహు, తాను కలిసి ప్రారంభించిన సంగతిని మోదీ గుర్తుచేశారు. అప్పటినుంచీ ఆ కేంద్రం దాదాపు 900 స్టార్టప్‌లకు అండగా నిలిచిందన్నారు.
- భారత ప్రధాని ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించడం ఇదే తొలిసారి.

మోదీకి 'స్పీకర్ ఆఫ్ ది కనెసెట్ మెడల్'

ప్రధాని మోదీని ఇజ్రాయెల్ పార్లమెంటు 'స్పీకర్ ఆఫ్ ది కనెసెట్ మెడల్'తో సత్కరించింది. కనెసెట్ అందించే అత్యున్నత పురస్కారమిదే. భారత్-ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతానికి మోదీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేసినట్లు పార్లమెంటు తెలిపింది. ఈ మెడల్‌ను అందుకున్న తొలి నేత మోదీయే. కనెసెట్ స్పీకర్ అమిర్ ఒహానా దీన్ని ప్రదానం చేశారు. ఇజ్రాయెల్, పాలస్తీనా.. రెండు దేశాల నుంచీ అత్యున్నత పురస్కారాలు అందుకున్న అరుదైన నేతగా మోదీ నిలిచారు. విదేశీ నేతలకు పాలస్తీనా ఇచ్చే అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా'ను 2018లో ఆయన స్వీకరించారు.

విమానాశ్రయంలో నెతన్యాహు దంపతుల స్వాగతం

అంతకుముందు, ఇజ్రాయెల్ చేరుకున్న మోదీకి బెన్ గురియన్ విమానాశ్రయంలో నెతన్యాహు, ఆయన సతీమణి సారా స్వాగతం పలికారు. మోదీని నెతన్యాహు ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని, కరచాలనం చేశారు.

- ఇజ్రాయెల్‌లో 2023 అక్టోబరు 7 నాటి దాడులకు భారత స్పందనను నెతన్యాహు గుర్తుచేస్తూ.. "మీరు ఇజ్రాయెల్ కోసం.. ఇజ్రాయెల్ వైపు నిలబడ్డారు. సత్యం వైపు నిలిచారు. అందుకు ధన్యవాదాలు" అని మోదీని ఉద్దేశించి పేర్కొన్నారు.
- మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం తొమ్మిదేళ్లలో ఇది రెండోసారి. 2017 జులైలో ఆయన తొలిసారి ఆ దేశాన్ని సందర్శించారు. ఆ పర్యటనలోనే ద్వైపాక్షిక బంధాన్ని 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి ఉన్నతీకరించారు.



ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీకి స్పీకర్ ఆఫ్ ది కనెసెట్ మెడల్ బహూకరిస్తున్న స్పీకర్ అమిర్ ఒహానా



ప్రధాని మోదీ ప్రసంగం సందర్భంగా చప్పట్లు కొడుతూ అభినందిస్తున్న ఆ దేశ ప్రధాని నెతన్యాహు, విదేశాంగ మంత్రి గిడియాన్ సార్, ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్



అధికారి దేబబ్రత మహంతి ఇంట్లో గుర్తించిన నోట్ల కట్టలు

గుట్టలు గుట్టలుగా నోట్ల కట్టలు

- రూ.30 వేల కేసులో సోదాలు చేస్తుంటే బయటపడిన 4 కోట్లు
- ఒడిశాలో గనులశాఖ అధికారి అరెస్టు



దేబబ్రత మహంతి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాలో రూ.30 వేల లంచం కేసులో తీగ లాగితే రూ.కోట్లకు పడగలెత్తిన ఓ అధికారి అవినీతి వ్యవహారం బయటపడింది. ఈ ఘటనకు సంబంధించి ఆ రాష్ట్ర అధికారులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం. గనులశాఖ కటక్ సర్కిల్‌లో ఉప సంచాలకునిగా విధులు నిర్వర్తిస్తున్న దేబబ్రత మహంతి.. ఓ బొగ్గు విక్రేత నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు చిక్కారు. దీంతో కేసు నమోదుచేసి ఆయన ఆస్తులపై మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్‌లోని ఆయన నివాసంలో అనేక నోట్ల కట్టలను గుర్తించారు. వాటిని లెక్కకట్టి మొత్తం రూ.4.27 కోట్లని తేల్చారు. దీంతోపాటు ఆయన కార్యాలయంలో వ్యక్తిగత టేబుల్ నుంచి మరో రూ.1.20 లక్షలు, నివాసంలో 305.40 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండిని గుర్తించారు. సోదాల అనంతరం మహంతిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు విజిలెన్స్ డైరెక్టర్ యశ్వంత్ జెత్వా తెలిపారు. రాష్ట్ర చరిత్రలో అవినీతి నిరోధక విభాగం స్వాధీనం చేసుకున్న అత్యధిక మొత్తం ఇదేనని వెల్లడించారు. 'మహంతికి 10 బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్నట్లు గుర్తించాం. భువనేశ్వర్‌లో రెండంతస్తుల భవనం ఉంది. ఆయనపై 2009లోనే ఒక అవినీతి కేసు నమోదు కాగా ప్రస్తుతం కోర్టులో విచారణ దశలో ఉంది' అని వివరించారు.



ఎర్రగా పొడవైన నోటితో భలే అందంగా ఉన్న ఈ జీవిని 'కదురు' చేప అని పిలుస్తారు. బుధవారం ఈ చేపలను మత్స్యకారులు విశాఖపట్నం రేవుకు తీసుకురాగా వెంటనే అమ్ముడుపోయాయి. ఇవి అరుదుగా దొరికే జీవులు కావడంతో రేవుకు వచ్చినవాళ్లు ఆసక్తిగా తిలకించారు. దీని రుచి కూడా బాగుంటుందని మత్స్యకారులు తెలిపారు. - ఈనాడు, విశాఖపట్నం

26 మంది డిప్యూటీ కలెక్టర్లు, 25 మంది డీఎస్పీల బదిలీ

- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో (2018 నాటి నోటిఫికేషన్) ఉద్యోగాలకు ఎంపికైనవారిలో 26 మంది డిప్యూటీ కలెక్టర్లు, 25 మంది డీఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి బదిలీచేసింది. వీరందరినీ ప్రాధాన్య పోస్టుల నుంచి తొలగించి అప్రాధాన్య పోస్టుల్లోకి వెంటనే బదిలీ చేయాలని, ఆ వివరాలతో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది.

- 26 మంది డిప్యూటీ కలెక్టర్లలో ఒకరే అప్రాధాన్య పోస్టులో ఉండటంతో వారిని మళ్లీ అదే స్థానంలో కొనసాగించింది. మిగతా 25 మందిలో 24 మంది రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవో)గానూ, ఒకరు పురపాలక సంఘం కమిషనర్‌గా ఉన్నారు. వీరికి ఎక్కడా పోస్టింగులివ్వలేదు. తదుపరి పోస్టింగుల కోసం సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి (పొలిటికల్) వద్ద రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.
- 25 మంది డీఎస్పీల్లో 22 మంది సబ్‌డివిజనల్ పోలీసు అధికారులుగా, ఏసీపీలుగా ప్రాధాన్య పోస్టుల్లో కొనసాగుతున్నారు. ఇద్దరు పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ విభాగం డీఎస్పీలుగా, ఒకరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్నారు. అయితే ఈ 25 మందినీ బదిలీ చేసి.. ఎక్కడా పోస్టింగులు ఇవ్వలేదు. వీరందర్నీ మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలిచ్చారు.

బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీల వివరాలు https://epaper.eenadu.net లో

లండన్‌లో అగ్నిప్రమాదం.. పెద్దాపురం వాసి మృతి

మృతుడు ఉద్యోగసంఘాల నేత ఆస్కార్‌రావు కుమారుడు



అభిషేక్

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, పెద్దాపురం: లండన్‌లోని క్రోయిడాన్ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన అగ్నిప్రమాదంలో రాష్ట్రానికి చెందిన గొంతి అభిషేక్ (28) మృతి చెందారు. ఈ ఘటనలో గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన 36 ఏళ్ల కామినేని సాయిశ్రీకర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. డుప్పాస్ హిల్స్ టెర్రస్‌లోని రెండు అంతస్తుల నివాసంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి జి.ఆస్కార్‌రావు కుమారుడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు వైద్యులుగా స్థిరపడగా, బిజినెస్ మేనేజ్‌మెంట్ చేసిన కుమారుడు అభిషేక్ మూడేళ్ల క్రితం లండన్ వెళ్లారు. ప్రస్తుతం అక్కడ ఎంఎస్ పూర్తిచేసి హోటల్ మేనేజ్‌మెంట్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నారు.

ఇక్కడికి వచ్చేయ్ నాన్నా..: 'నువ్వు ఒంటరిగా అక్కడ ఉండడం ఎందుకు..? ఉద్యోగం మానేసి ఇక్కడికి వచ్చేయ్ నాన్నా.. నిన్ను బాగా చూసుకుంటా' అని అభిషేక్ అనేవాడని కుమారుడి మాటలు గుర్తుచేసుకుని ఆస్కార్‌రావు కన్నీటిపర్యంతమయ్యారు. కృష్ణాజిల్లా అగిరిపల్లి పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తున్న ఆస్కార్‌రావు స్వస్థలం కాకినాడ జిల్లా పెద్దాపురంలోని కొండయ్యపేట. ఆస్కార్‌రావు భార్య రాధిక 2006లో అనారోగ్యంతో మరణించారు. అభిషేక్ మరణవార్త ఆ కుటుంబానికి అంతులేని వేదన మిగిల్చింది.



పెద్దాపురంలోని నివాసంలో విషాదంలో ఉన్న ఆస్కార్‌రావు, కుటుంబీకులు

కోర్టు ఆదేశాలు అమలు చేస్తారా.. జైలుకెళ్తారా?



- మీరే పాటించకపోతే కిందిస్థాయి అధికారులేం గౌరవిస్తారు?
- అలాంటప్పుడు కోర్టులు మూసేస్తే సరి
- సీఎస్ విజయానంద్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- గ్రూప్-1 ఉద్యోగుల బదిలీ వ్యవహారంలో ఆగ్రహం

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందినవారిని అప్రాధాన్య (నాన్‌ఫోకల్) పోస్టులకు తక్షణం బదిలీ చేయాలని, ఈ వ్యవహారంపై నివేదిక సమర్పించాలంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయనందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌పై హైకోర్టు మండిపడింది. బుధవారం కోర్టు విచారణకు హాజరైన ఆయన్నుద్దేశించి తీవ్రవ్యాఖ్యలు చేసింది. 'తక్షణం' అన్న పదానికి అర్థం తెలీదా, కోర్టు ఉత్తర్వులు పాటించాల్సిన అవసరం లేదంటూ కిందిస్థాయి అధికారులకు సందేశం ఇస్తున్నారా? కోర్టు ఆదేశాలను మీరే గౌరవించకపోతే.. ఇక వారేం గౌరవిస్తారంటూ నిలదీసింది. త్వరలో పదవీవిరమణ చేయనున్న సీఎస్‌ను నాలుగు రోజులు జైల్లో ఉంచితే మిగతా అధికారులందరూ దారిలోకి వస్తారని ఘాటుగా వ్యాఖ్యానించింది. 'ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నవారు దర్యాప్తును ప్రభావితం చేస్తారని ఎంపికకాని అభ్యర్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలోనే వారిని నాన్‌ఫోకల్ పోస్టులకు బదిలీ చేయాలని ఆదేశించాం. రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ హోదా పోస్టులు చాలా ఉన్నాయి. వారిని అక్కడికి మార్చడంలో ఇబ్బందేంటి? గ్రూప్-1కు ఎంపికై వివిధ పోస్టుల్లో కొనసాగుతున్నవారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలంటూ ప్రస్తుత అధికారపార్టీ అధినేత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. అయినా, మేమిచ్చిన ఆదేశాలు అమలు చేయలేదంటే.. ఉద్యోగాలకు ఎంపికైనవారు సీఎస్‌ను మేనేజ్ చేసినట్లుంది. వారితో ఆయన కుమ్మక్కైనట్లు కన్పిస్తోంది' అంటూ వ్యాఖ్యానించింది.

అమలుకు హామీ

'కోర్టు ఉత్తర్వులు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది. అలా చేయలేనప్పుడు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది. ఇక న్యాయస్థానాలను మూసేయడం మంచిది' అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇప్పటికైనా కోర్టు ఆదేశాలను అమలు చేస్తారా, జైలుకెళ్తారా చెప్పండంటూ సీఎస్‌ను సూటిగా అడిగింది. సహేతుక సమయమివ్వాలని సీఎస్ కోరగా, 'ఇప్పటికే 15 రోజులు గడిచిపోయాయి. విచారణను గురువారానికి వాయిదావేస్తాం. రేపటిలోగా కోర్టు ఆదేశాలు అమలుచేస్తారో, లేదో చెప్పాల'ని నిర్దేశించింది. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ వారం రోజుల సమయమివ్వాలని, కనీసం రెండు రోజులైనా ఇవ్వాలని కోరారు. ఆ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. దీంతో ఉత్తర్వులు అమలుచేసి గురువారం కోర్టుకు నివేదిస్తామని సీఎస్ తెలిపారు. ఈ వివరాలు నమోదుచేసిన ధర్మాసనం విచారణను గురువారానికి వాయిదా వేసింది. సీఎస్‌కు హాజరు నుంచి మినహాయించాలని ఏజీ కోరగా, కోర్టు ఆదేశాలు అమలుచేస్తే హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

ఇదీ నేపథ్యం

వైకాపా హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సిట్ వేయాలని హైకోర్టు ఈ నెల 11న ప్రభుత్వాన్ని ఆదేశించింది. దర్యాప్తును ప్రభావితం చేసే ఆస్కారం ఉన్నందున గ్రూప్-1లో ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న వారందరినీ అప్రాధాన్య పోస్టులకు 'తక్షణం' బదిలీ చేయాలని సూచించింది. ఈ ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యల వివరాలతో నివేదికను వారంలో రిజిస్ట్రార్ జ్యుడీషియల్ ముందుంచాలని సీఎస్‌ను ఆదేశించింది. నివేదిక సమర్పించకపోవడంతో సీఎస్ హాజరుకు మంగళవారం హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.

స్పష్టత కోసం మెమో వేశాం

ఈ నేపథ్యంలో బుధవారం విచారణకు సీఎస్ విజయానంద్ హాజరయ్యారు. ఆయన తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించేందుకు యత్నించగా ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. కోర్టు ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని సీఎస్‌ను నేరుగా ప్రశ్నించింది. విజయానంద్ స్పందిస్తూ 'సిట్ వేశాం. కోర్టు ఆదేశాల అమలుపై న్యాయసలహా కోరామ'న్నారు. ఏజీ జోక్యం చేసుకుంటూ 'ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టుల విషయంలో సర్వీసు నిబంధనల్లో నిర్వచనం లేదు. చట్టనిబంధనలు లేవు. దీనిపై అన్ని శాఖాధిపతుల నుంచి సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి వివరాలు అడిగారు. వారి నుంచి సమాచారం రాలేదు. అందుకే సీఎస్ న్యాయ సలహా కోరారు. కోర్టు తీర్పు అమలులో స్పష్టత కోసం ఈ నెల 19న హైకోర్టులో మెమో దాఖలు చేశాం. అదింకా నంబరు కాలేదు. ఇందులో మా కార్యాలయం తప్పు కూడా ఉంది. కోర్టు ఆదేశాలు పాటించకూడదన్న దురుద్దేశమేదీ సీఎస్‌కు లేదు. కొంచెం సమయమివ్వండ'ని కోరారు.

నిద్ర నటించేవారిని లేపలేం

ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ 'ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టులపై 1996లోనే సాధారణ పరిపాలన శాఖ కార్యనిర్వాహక ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం వివిధ సందర్భాల్లో ఉత్తర్వులిచ్చింది. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌కు సైతం ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టులేంటో తెలుసు. కృత్రిమ మేధ, గూగుల్‌ను అడిగినా చెబుతుంది. మీకు సదుద్దేశముంటే నిఘంటువులోని ఆ పదాల అర్థాన్ని బట్టి ముందుకెళ్లి ఉండాల్సింది. కోర్టు ఆదేశాలను అమలుచేయని అధికారులను సమర్థించేలా ఏజీ వాదిస్తారని మేం భావించడం లేదు. ఏజీ సూచనలతోనే కోర్టు ఆదేశాలను పట్టించుకోనట్లు కన్పిస్తోంది. నిద్రపోయేవారిని లేపొచ్చు, నిద్ర నటించేవారిని లేపలేం. కోర్టుల పట్ల అధికారులకు గౌరవం లేకపోయినా, మాకు అధికారులపై గౌరవముంది' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

దురుద్దేశాలు ఆపాదించొద్దు

ఏజీ శ్రీనివాస్ స్పందిస్తూ తనకు దురుద్దేశాలు ఆపాదించవద్దన్నారు. 'ప్రభుత్వం, సీఎస్ తరఫున ఏజీగా వాదనలు వినిపించాల్సిన బాధ్యత నాపై ఉంది. ఒక పోస్టుకు ఒక ప్రాంతంలో ప్రాధాన్యముంటే, అదే పోస్టు మరోచోట అప్రాధాన్యమవుతుంది. అందుకే స్పష్టత కోరుతూ హైకోర్టులో మెమో వేశామ'ని పేర్కొన్నారు. మరోవైపు ఎంపిక కాని అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వులపై ఎంపికైన అభ్యర్థులు కొందరు సుప్రీంకోర్టులో అప్పీల్ వేశారని పేర్కొన్నారు. ఆ హక్కు వారికి ఉంటుందని, అందులో తప్పులేదని ధర్మాసనం బదులిచ్చింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

ఈనాడు

గల్ఫ్ కలలు... కన్నీటి కథలు!

మెరుగైన భవిష్యత్తును ఆశించి ఎంతోమంది విదేశాల వైపు చూస్తుంటారు. కానీ, పరాయి దేశాలకు వెళ్లి అక్కడ ఏదో ఒక కొలువులో కుదురుకునేందుకు వారిలో చాలామందికి తగిన అర్హతలు కొరవడుతున్నాయి. ఇంకొందరికి నిర్దేశిత వీసా ప్రక్రియపై అవగాహన లోపిస్తోంది. వీటిని ఆసరాగా చేసుకుంటున్న దొంగ ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలుచేసి భారతీయులను అడ్డదారుల్లో విదేశాలకు పంపిస్తున్నారు. తీరా వాళ్లు అక్కడికి వెళ్లాక తనిఖీల్లో పట్టుబడి జైళ్లపాలవుతున్నారు. నానా బాధలూపడి చివరికి బిక్కుబిక్కుమంటూ వెనక్కి వస్తున్నారు. ఇలా అమాయకులకు మాయమాటలు చెప్పి నిలువునా ముంచుతున్న మోసకారి ఏజెంట్లపై గడచిన మూడేళ్లలో దేశవ్యాప్తంగా 3925 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో 1495 ఏపీ నుంచే దాఖలైతే- ఆ తరవాత తమిళనాడు(357), తెలంగాణ(339)ల నుంచి ఎక్కువ కేసులు వచ్చాయి. అంటే, నయవంచక ఏజెంట్ల బారినపడి బాధితులుగా మిగులుతున్నవారు తెలుగు రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నారన్నమాట! సామాన్యుల విదేశీ కలలను సొమ్ముచేసుకుంటూ, వారి జీవితాలను దుర్భర ఎడారుల పాల్జేస్తున్న కేటుగాళ్లపై కఠిన చర్యలు కొరవడుతుండటమే విషాదకరం!

ఆరు దేశాలతో కూడిన గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) పరిధిలో 90 లక్షల మందికి పైగా భారతీయులు పనిచేస్తున్నారు. తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్‌లతో పాటు ఏపీలోని గోదావరి జిల్లాలు, రాయలసీమ నుంచి లక్షల సంఖ్యలో అక్కడ ఉపాధి పొందుతున్నారు. గల్ఫ్ వెళ్తే చాలు బతుకు బంగారుమయం అవుతుందంటూ మాయదారి ఏజెంట్లు సాధారణ శ్రామికులను మభ్యపెడుతున్నారు. అక్కడికి పంపే బాధ్యత తమదంటూ అందినంతా దండుకుని ఆపై ముఖం చాటేస్తున్నారు. మరికొందరేమో కంపెనీల్లో ఉద్యోగాలంటూ తాత్కాలిక సందర్శక వీసాల వంటివాటితో బాధితులను విమానాలు ఎక్కించేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇంకొందరేమో ఒత్తిడిలేని పని అంటూ నమ్మబలికి ఒళ్లు హూనమయ్యే కొలువుల్లో కుదుర్చుతున్నారు. మరోవైపు, యజమానుల దాష్టీకాలూ వేతనాల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వంటివీ గల్ఫ్ దేశాల్లోని భారతీయ కార్మికులను కుంగదీస్తున్నాయి. వీటన్నింటిపై నిరుడు ఒక్క సౌదీ అరేబియా నుంచే కేంద్రానికి మూడు వేలకు పైగా ఫిర్యాదులు అందాయి. యూఏఈ, ఒమన్, కువైట్‌ల నుంచి సాయం కోరుతూ వచ్చిన 2749 విజ్ఞప్తులు సైతం గల్ఫ్ కార్మికుల దయనీయ స్థితిగతులను చాటుతున్నాయి!

సర్వం ఊడ్చి ఏజెంట్ల చేతిలో పోసి గల్ఫ్ చేరాక కానీ, మోసపోయినట్లు తెలుసుకోలేకపోతున్న నిర్భాగ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వెనక్కి రాలేక, చేసిన అప్పులు తీర్చే దారి తెలియక వారిలో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కఠినమైన పరిస్థితుల్లో పనిచేస్తూ ఆరోగ్యం పాడై లేదా ప్రమాదాలకు గురై పెద్దసంఖ్యలో ప్రాణాలు విడుస్తున్నారు. ఆ అభాగ్యుల మృతదేహాలను వెంటనే ఇండియాకు తీసుకురావడమూ వీలుకావట్లేదు. అధికారిక గణాంకాల ప్రకారం, గడచిన అయిదేళ్లలో జీసీసీ దేశాల్లో దాదాపు 35వేల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. అదే కాలంలో చట్టవిరుద్ధ మార్గాల్లో విదేశాలకు వెళ్లి పట్టుబడిన 1.67 లక్షల మంది భారతీయులు స్వదేశానికి తిరిగొచ్చారు. వారిలో 72శాతం మందిని సౌదీయే తిప్పిపంపింది. ఆర్థిక, సామాజిక సంక్షోభాలకు కారణమవుతున్న అక్రమ వలసలను నిరోధించాలంటే- అనైతిక ఏజెంట్లు, కన్సల్టెన్సీలను ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. గల్ఫ్ నుంచి భారీగా విదేశ మారక ద్రవ్యం లభిస్తోందని సంతసిస్తున్న ప్రభుత్వాలు- అక్కడి భారతీయ కార్మికుల సంక్షేమంపైనా శ్రద్ధ వహించాలి!




బాగా చదవాలి. ఏది చదివినా రచయిత మీదో, వస్తువు మీదో ముందస్తు అభిప్రాయాలూ తీర్పులూ లేకుండా చదవాలి. చదివింది హృదయానికి తాకిందా లేదా అన్నది ముఖ్యం. వృత్తితో సంబంధం లేకుండా చదువు మన ఆలోచనా పరిధిని విస్తృతపరుస్తుంది.

– మృణాల్ పాండే, రచయిత్రి

అసలైన పూజ ఏది?

మనిషి భగవంతుడికి దగ్గరవడానికి ఎంచుకునే మార్గమే పూజ. మన ఆత్మను పరమాత్మతో అనుసంధానించే వంతెనలాంటిది అది. అలాగని దేవుడి పటాలకు పూలు పెట్టి, ధూపదీపాలు సమర్పించినంత మాత్రాన అది పూజ అయిపోదు. పునాది లేని భవనం ఎలా కూలిపోతుందో.. భక్తి, ధర్మం లేని పూజ కూడా అలాగే నిష్ఫలమవుతుంది. పెద్దలు అన్నట్లు 'భావం లేని పూజ- పత్రికి చేటు'. భగవంతుడు బాహ్య ఆడంబరాలకు కాదు, హృదయంలోని భావానికి మాత్రమే వశుడవుతాడు. శాస్త్రం 'భావగ్రాహీ జనార్దనః' అని చెబుతుంది. మనసులో కల్మషం పెట్టుకుని చేసే పూజ ఎంత గొప్పదైనా అది దేవుడికి చేరదు. మనసు భగవంతుడిపై కాకుండా ప్రాపంచిక విషయాలపై ఉంటే, ఆ పూజ అర్థహీనమవుతుంది. భగవద్గీత ప్రకారం 'ఈశ్వరః సర్వ భూతానాం' అంటే- భగవంతుడు మన హృదయంలోనే నివసిస్తాడు.

'నేను గొప్పగా పూజిస్తున్నాను' అనే అహంకారంతో ఆర్భాటంగా చేసే పూజ రాజస గుణంతో నిండిపోతుంది. దక్ష ప్రజాపతి శివుణ్ని అవమానించాలనే ఉద్దేశంతో చేసిన మహాయజ్ఞం ఫలితం లేకుండా ధ్వంసమైంది. అలాగే రావణుడు గొప్ప భక్తుడైనా, అహంకారం వల్ల తపోఫలాలను కోల్పోయాడు. అన్యాయంగా సంపాదించిన డబ్బుతో దేవుడికి బంగారు ఆభరణాలు అర్పించినంత మాత్రాన పుణ్యం రాదు. దుర్యోధనుడు శ్రీకృష్ణుడి కోసం వైభవంగా విందులు ఏర్పాటు చేశాడు. అవి అహంకారం, అన్యాయంతో కూడినవి కావడంతో కృష్ణుడు వాటిని తిరస్కరించాడు. బదులుగా, విదురుడు ప్రేమతో పెట్టిన సాధారణ భోజనాన్ని స్వీకరించాడు. ఇది భక్తి ముందు ఆడంబరం విలువలేనిదని స్పష్టం చేస్తుంది. ఇంట్లో తల్లిదండ్రులను బాధపెడుతూ, బయట ఆలయాలకు వెళ్లి అర్చనలు చేస్తే పుణ్యం రాదు. 'మాతృదేవో భవ, పితృదేవోభవ' అనేది మన సంస్కృతికి మూలసూత్రం. పుండరీకుడు తల్లిదండ్రులను సేవిస్తున్నప్పుడు స్వయంగా పాండురంగడు దర్శనమిచ్చినా, సేవ పూర్తయ్యేవరకు దేవుణ్నే వేచి ఉండమన్నాడు. తల్లిదండ్రుల సేవనే అసలైన పూజగా భావించాడు.



అంతర్యామి

పైకి మంత్రాలు జపిస్తూ, లోపల ప్రాపంచిక విషయాలు ఆలోచించడమూ నిజమైన పూజ కాదు. చేత్తో దేవుడి ముందు దీపం వెలిగిస్తూ నోటితో పరులమీద నిందారోపణలు చేస్తుంటే... ఆ పూజ కేవలం శారీరక చర్యగా మిగులుతుంది. మనస్ఫూర్తిగా సమర్పించే చిన్న పువ్వు, యాంత్రికంగా చేసే వెయ్యి పూజలకన్నా గొప్పది. ఇక ఇతరులకు హాని చేయాలనే ఉద్దేశంతో చేసే పూజలు చివరికి నాశనానికే దారితీస్తాయి. భస్మాసురుడు ఘోర తపస్సు చేసినా, దురుద్దేశం వల్ల పొందిన వరమే అతడి మరణానికి కారణమైంది. శబరి ఎంగిలి పండ్లు, కన్నప్ప కంటి అర్పణ శాస్త్రోక్తంగా చేయకపోయినా, వారి నిష్కల్మషమైన భక్తి వల్ల అవి అత్యున్నత పూజలయ్యాయి. ఆడంబరాల జోలికి వెళ్లకుండా మనసును నిర్మలంగా ఉంచుకుని, తోటి జీవుల పట్ల కరుణతో, ధర్మబద్ధంగా జీవించడమే భగవంతుడికి మనం చేసే అసలైన పూజ.


– కె.నారాయణ స్వామి పిళ్లై

ఉద్గారాల కట్టడిలో విధాన వైరుధ్యం

భారతదేశం 2070 నాటికి కర్బన ఉద్గారాల తటస్థత(నెట్‌జీరో)ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా మళ్లుతోంది. సౌర విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని రికార్డు వేగంతో పెంచుకుంది. కర్బన ఉద్గారాలను అతి తక్కువగా వెలువరించే అధునాతన థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపననూ చేపట్టింది. కానీ, విధానపరమైన వైరుధ్యం ఒకటి 'నెట్‌జీరో' లక్ష్యసాధనలో సమస్యగా పరిణమిస్తోంది!

కర్బన ఉద్గారాల తటస్థత లక్ష్యాలను మెరిట్ ఆర్డర్ ఆఫ్ డిస్పాచ్ (ఎంఓడీ) అనే విధానపరమైన అంతర్గత వైరుధ్యం దెబ్బతీస్తోంది. ఎంఓడీ కింద మొదట తక్కువ ఖర్చుకు విద్యుత్తును ఉత్పత్తి చేసే సౌర, పవన విద్యుత్కేంద్రాల నుంచి కరెంటును కొనుగోలు చేయాలి. తరవాత ఉత్పాదక వ్యయం ఎక్కువగా ఉండే బొగ్గు ఆధారిత థర్మల్ కేంద్రాల నుంచి కొనాలి. దీనివల్ల రాష్ట్రాలకు, కొనుగోలుదారులకు విద్యుత్ కొనుగోలు ఖర్చులు తగ్గుతాయి. కానీ ఆచరణకు వచ్చేసరికి ఎంఓడీ విరుద్ధ పంథాలో నడుస్తోంది. విద్యుదుత్పాదనకు అయ్యే చర వ్యయ గణనలోని తిరకాసే ఈ వైరుధ్యానికి కారణమవుతోంది. ఖర్చులను తగ్గించడం కోసం తీసుకొచ్చిన ఎంఓడీ విధానం





అనూహ్యంగా తక్కువ సామర్థ్యం కలిగిన పాత థర్మల్ పవర్ ప్లాంట్లకు మేలు చేస్తోంది. అంతిమంగా అది ఉద్గారాల నివారణ లక్ష్యాల సాధనకు ఆటంకమవుతోంది.

సమస్య ఎక్కడ వస్తోందంటే...

పునరుత్పాదక ఇంధన వనరులను అందిపుచ్చుకోవడంలో ఇండియా గణనీయమైన పురోగతిని సాధించింది. 100 గిగావాట్ల సౌర విద్యుదుత్పాదన లక్ష్యాన్ని గడువుకన్నా ముందే చేరుకుంది. తక్కువ బొగ్గుతో, అంటే తక్కువ ఉద్గారాలతో ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేసే సూపర్ క్రిటికల్, అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాల స్థాపనను ప్రోత్సహించింది. పాతకాలం నాటి సబ్ క్రిటికల్ థర్మల్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతిని నిలిపేసింది. పాత థర్మల్ కేంద్రాలతో పోలిస్తే, సూపర్ క్రిటికల్ యూనిట్లు ఎక్కువ సామర్థ్యంతో విద్యుదుత్పాదన చేస్తాయి. ఇక్కడ అధిక సామర్థ్యం అంటే తక్కువ బొగ్గుతో, తక్కువ ఉద్గారాలతో ఎక్కువ విద్యుత్తును ఉత్పత్తి చేయడం. సబ్ క్రిటికల్ ప్లాంట్లు కార్బన్‌డయాక్సైడ్‌ను కొంత ఎక్కువగానే విడుదల చేస్తాయి. రోజూ వేల మెగావాట్లలో విద్యుదుత్పాదన జరుగుతుంటుంది కాబట్టి సబ్ క్రిటికల్ ప్లాంట్ల నుంచి వెలువడే ఉద్గారాలూ భారీగానే ఉంటాయి. అందుకే పాత థర్మల్ కేంద్రాలకు బదులుగా నవీన సూపర్ క్రిటికల్ ప్లాంట్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అలాంటప్పుడు ఇక వైరుధ్యం ఎక్కడుంది అంటే... సౌరశక్తి పగటి పూట, పవన విద్యుత్ గాలి ఉన్నప్పుడే లభిస్తాయి. ఇవి అస్థిర పునరుత్పాదక ఇంధన వనరులు కావడంతో విద్యుత్ గిరాకీ, సరఫరాలలో వ్యత్యాసం ఏర్పడుతుంది. దీన్ని పరిష్కరించడానికి గ్రిడ్ నిర్వాహకులు తరచుగా థర్మల్ విద్యుత్కేంద్రాలను వాటి పూర్తి సామర్థ్యంలో 40 శాతం వరకు తగ్గించి నడుపుతారు. అవసరానికి మించి హరిత విద్యుత్తు లభ్యమవుతున్నప్పుడు థర్మల్ యూనిట్లను పూర్తిగా బంద్ చేసి అవసరమైతే మళ్లీ వాటిని ఆశ్రయిస్తారు. ఈ నిర్ణయాలన్నీ ఎంఓడీ వ్యవస్థ ద్వారా నడుస్తాయి. ఈ పద్ధతిలో ఉత్పాదక వ్యయం తక్కువగా ఉన్న ప్లాంట్ల నుంచి మొదట విద్యుత్తు తీసుకోవాలి. వాణిజ్యకోణంలో చూస్తే ఇదంతా సక్రమమే అనిపిస్తుంది. కానీ, పర్యావరణంపై పడుతున్న ప్రభావాన్ని లెక్కలోకి తీసుకోకపోవడమే సమస్యాత్మకమవుతోంది.

విద్యుదుత్పాదనలో చర వ్యయం ఇంధన, రవాణా ఖర్చుల మీద ఆధారపడి ఉంటుంది. బొగ్గు గనులకు దూరంగా ఉన్న సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్కేంద్రానికి బొగ్గు సరఫరా చేయాలంటే ఎక్కువ రవాణా ఖర్చులవుతాయి. గనులకు దగ్గరగా ఉన్న పాత సబ్ క్రిటికల్ థర్మల్ కేంద్రాలకు రవాణా ఖర్చులు తక్కువగా ఉంటాయి. అందువల్ల పాత థర్మల్ కేంద్రాల విద్యుదుత్పాదన వ్యయం తక్కువగా ఉంటుంది. ఎంఓడీ విధానం కింద తక్కువ ధరకు దొరికే విద్యుత్తునే మొదట కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యుదుత్పాదన తక్కువ బొగ్గుతో జరిగిందా, లేదా అనేదానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దాంతో సౌర, పవన విద్యుత్ వనరులు లభ్యం కానప్పుడు రవాణా ఖర్చు ఎక్కువనే కారణంపై సూపర్ క్రిటికల్ ప్లాంట్లను తాత్కాలికంగా నిలిపేసి పాత థర్మల్ కేంద్రాల నుంచి విద్యుత్తు కొనుగోలు చేయడం జరుగుతుంది. ఫలితంగా ఉద్గారాలు ఎక్కువవుతాయి. భారతదేశం ఏటా వెయ్యి టెరావాట్ అవర్లకు పైగా థర్మల్ విద్యుదుత్పాదన సాగిస్తోంది. ఈ లెక్కన ఎంఓడీ కింద పాత థర్మల్ కేంద్రాల మీద ఎక్కువగా ఆధారపడితే కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరిగిపోతాయి. తక్కువ చర (ఇంధన, రవాణా) వ్యయంతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తునే కొనాలన్న ఎంఓడీ నియమాన్ని డిస్కమ్‌లు, ఇతర విద్యుత్ వ్యాపారులు పాటించకతప్పదు. కాబట్టి, అవి చేయగలిగింది ఏమీ లేదు. కొద్దిపాటి ఖర్చులను ఆదా చేయాలన్న విధానాలతో వాతావరణ మార్పుల నిరోధ లక్ష్యం దెబ్బతింటోంది.

ఫలితాలు రావాలంటే...

విదేశాలు ఈ సమస్యను గుర్తించి సరఫరా నియమాల్లో మార్పుచేర్పులు చేసుకున్నాయి. చైనా అధిక సామర్థ్యంతో ఉత్పత్తి అయ్యే హరిత విద్యుత్తుకే అన్ని వేళలా ప్రాధాన్యమిస్తోంది. ఐరోపా యూనియన్ కర్బన ఉద్గారాలకు ధర లేదా జరిమానా విధిస్తోంది. ఫలితంగా పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించే విద్యుత్కేంద్రాలకే అక్కడ ప్రాధాన్యం లభిస్తోంది. భారత్ కూడా ఈ పద్ధతిని చేపట్టాలి. అందుకోసం ఎంఓడీ విధానాన్ని రద్దు చేయనక్కర్లేదు. విద్యుత్కేంద్ర ఇంధన ఖర్చుతోపాటు ఉద్గారాల పరిమాణాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. బొగ్గు గనులకు దూరంగా ఉన్న సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాలకు బొగ్గు రవాణా ఖర్చులను తగ్గించాలి. కర్బన ఉద్గారాల ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదు. తద్వారా పాత థర్మల్ కేంద్రాలకు లభించే ఆధిక్యాన్ని తగ్గించాలి. భారతదేశం పునరుత్పాదక ఇంధన వనరులపై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతోంది. అవి ఆశించిన ఫలితాలను అందించాలంటే చర వ్యయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వరాదు. భూతాప కట్టడికే పెద్దపీట వేయాలి.

– జీఎస్ఆర్ భవానీ ప్రసాద్
ఏడీఈ, తెలంగాణ జెన్‌కో

అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎలాగో మలయాళీలను చూసి నేర్చుకోవచ్చు. కేరళ మైగ్రేషన్ సర్వే 2023 ప్రకారం సుమారు 22 లక్షల మంది మలయాళీలు విదేశాల్లో పనిచేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అరకోటి మంది మలయాళీలు 182 దేశాల్లో నివసిస్తున్నట్లు అంచనా. భారతదేశానికి వచ్చే విదేశీ మారకంలో 19.7 శాతం వాటా కేరళదే.

మలయాళీల విజయానికి వారి ఆలోచనాధోరణే కారణం అనిపిస్తుంది. వారిలో కొన్ని సుగుణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దాదాపుగా సంపూర్ణ అక్షరాస్యత సాధించిన కేరళ సమాజంలో చుట్టూ జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస

మలయాళీల తీరే వేరు!



మెండుగా ఉంటుంది. పుస్తకపఠనం మాత్రమే కాదు, వార్తల పట్ల ఆసక్తీ అధికమే. నిరంతరం నేర్చుకోవాలనే తపన వారి ఆలోచనా పరిధిని విస్తృతపరచడమే కాదు అవకాశాలకు అనుగుణంగా తమను తాము మలచుకునే నేర్పును ఒడిసిపట్టేలా చేస్తోంది. పచ్చని ప్రకృతి, సముద్రతీరాలు, పర్వతాలతో కనువిందు చేసే భౌగోళిక వైవిధ్యంలాగే విభిన్న వర్గాలు సామరస్యపూర్వకంగా కలిసి జీవించడం ఆకట్టుకుంటుంది. ఎటువంటి వైవిధ్య, సంక్లిష్ట, సంఘర్షణాత్మక పరిస్థితుల్లోనైనా మనుగడ సాగించేందుకు ఇది దోహదపడుతోంది. అందుకే ఎన్నెన్నో దేశాల్లో విభిన్న వాతావరణాల్లో హాయిగా జీవించే ధైర్యం, స్థైర్యం వారి సొంతమయ్యాయి. ప్రపంచంలో ఏ మూల ఉన్నా మలయాళీలు తమ మూలాలను గౌరవిస్తారు. అదే సమయంలో కొత్త భాషా సంస్కృతులను నేర్చుకోవడం, ఆయా సమాజాలతో సులభంగా కలిసిపోవడం వారికి అలవాటు. కష్టకాలంలో తగిన మార్పులు చేసుకోవడం, తక్కువ వనరులతో ముందుకు సాగడం, అవసరానికి అనుగుణంగా ఆలోచించడం... ఇవన్నీ వారికి అనుభవంతో అలవడిన గుణాలు. ఇవి వారికి ఉద్యోగాల్లోనే కాక సామాజిక జీవితంలోనూ తోడ్పడుతున్నాయి. ముఖ్యంగా మలయాళీలు ఏ పనినైనా గౌరవిస్తారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను పాటిస్తారు. దాంతో అవకాశాలను అందిపుచ్చుకోవడం తేలికవుతోంది. ఉద్యోగమైనా, సొంత వ్యాపారమైనా, వృత్తిపని అయినా చిన్నగానే ప్రారంభించి తమ కాళ్లపై తాము నిలబడటంపై దృష్టి పెడతారు. ఆ తరవాత క్రమంగా అభివృద్ధి చేసుకుంటారు. విదేశాల్లో ఆతిథ్య, వ్యాపార, సేవా రంగాల్లో వారి ఉనికిని గమనించవచ్చు. సంక్షోభాలను అవకాశాలుగా మార్చుకునే సామర్థ్యం వారికి ఉంది.

మలయాళీలు కేవలం ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు మాత్రమే కాదు. వారు ఒక జీవనవిధానానికి ప్రతీకలు. నిరంతరం నేర్చుకోవడం, కష్టపడే స్వభావం, సర్దుబాటు ధోరణి, వ్యాపార దృష్టి, సామాజిక చైతన్యం ఇవన్నీ కలిసి వారిని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా మారుతూ, కష్టాన్ని స్వీకరిస్తూ ముందుకు సాగడమే వారి విజయ రహస్యం. నూతన విద్యావిధానం-2020, గాంధీజీ నయీ తాలీమ్‌లలో మలయాళీల ఆలోచనాధోరణి చాలావరకు ప్రతిఫలిస్తుంది. అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉన్నచోటే ఉండి నిరాశలో కూరుకుపోకుండా ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉండటం, లేదా అవకాశాలను సొంతంగా సృష్టించుకోవడం... కేరళవాసులు మనకు ఇచ్చే స్ఫూర్తి.

– కె.పి.విఘ్నేశ్వరరావు



గిగ్ ఎకానమీ కొత్తపుంతలు

వేగవంతమైన డిజిటలీకరణ, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, అనుకూల సమయాన్నిబట్టి పనిచేసే వెసులుబాటు ఉండటం తదితరాలతో ఇండియాలో గిగ్ ఎకానమీ వేగంగా వృద్ధి చెందుతోంది. 2020-21లో దేశీయంగా 77 లక్షల మంది గిగ్ వర్కర్లుంటే, నాలుగేళ్లలో వారి సంఖ్య 1.2 కోట్లకు చేరింది. ప్రస్తుతం భారతదేశ శ్రామిక శక్తిలో గిగ్ వర్కర్ల వాటా రెండు శాతం. 2029-30 నాటికి దేశీయ శ్రామిక శక్తిలో వ్యవసాయేతర గిగ్ వర్కర్లు 6.7శాతానికి చేరతారని అంచనా. మన దేశంలో వివిధ రంగాల వారీగా గిగ్ వర్కర్లు (లక్షల్లో)...

ఈ-కామర్స్	37	ఆరోగ్యపరిరక్షణ	3
లాజిస్టిక్స్	15	ఐటీ ఆధారిత సేవలు	3
బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్	10	నిర్మాణం	3
		విద్య	3
తయారీ	10	ఆటోమోటివ్	1
రిటైల్	7	ఆతిథ్యం	0.8
రవాణా	6	మౌలిక వసతులు	0.7
ఐటీ	5	టెలికాం	0.5

(ఆధారం: ఇండియన్ ఫ్లెక్సీ స్టాఫింగ్ ఇండస్ట్రీ రిపోర్ట్-2025)

...మళ్లీ మరణించారు!

'అయ్యో! అబ్రహాం లింకన్, జాన్.ఎఫ్. కెన్నెడీలు మళ్లీ మరణించార్రా అబ్బాయ్!'

'ఏమిటి గురువుగారూ! ఎవరి విషయం మీరు చెబుతున్నది? అమెరికా మాజీ అధ్యక్షుల గురించేనా? వారు ఏనాడో చనిపోయారే! నాకు తెలిసి... లింకన్‌ను, కెన్నెడీని దుండగులు దారుణంగా హత్యచేశారు. అదీ చాలా ఏళ్లక్రితం! అదేదో తాజా వార్తలా ఇప్పుడు మళ్లీ ఎందుకు చెబుతున్నారు?'

'అవును! అది తాజా వార్తే! చెబుతున్నదీ ఆ గొప్ప నాయకుల గురించే! మరోసారి ఎందుకు చెప్పానంటే- వారిద్దరూ మళ్లీ మరణించారు కాబట్టి!'

'ప్రముఖ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి మరణించినప్పుడు, దుఃఖం పట్టలేక మహాకవి శ్రీశ్రీ 'షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ విలపించారని విన్నాను. అలాగే ప్రసిద్ధ సినీకవి వేటూరి సుందరరామ్మూర్తి స్వర్గస్థులైనప్పుడు 'శ్రీనాథుడు మళ్లీ మరణించాడు' అని పత్రికల్లో రాస్తే చదివాను. ఒకసారి చనిపోయినవారు మళ్లీ మళ్లీ ఎలా చనిపోతారు? కవులు ఎందుకలా రాస్తారు?'

'ఎందుకంటే- ఆంగ్లకవి పి.బి.షెల్లీతో పోల్చదగిన సుకుమారమైన రొమాంటిసిస్టు కవుల్లో మన కృష్ణశాస్త్రి ఒకరు. వారిదీ వీరిదీ ఒకే భావజాలానికి చెందిన కవితామార్గం. సారూప్యత, భావుకత, ఊహాశాలితల విషయంలో వారిద్దరి మధ్యా ఎన్నో పోలికలున్నాయని విమర్శకుల అభిప్రాయం. కాబట్టి కృష్ణశాస్త్రి మరణవార్త వినగానే శ్రీశ్రీకి వెంటనే ఆ షెల్లీ గుర్తొచ్చాడు. అలాగే, శ్రీనాథుడు, వేటూరి... ఇద్దరూ పండిత కవి పరంపరకు చెందినవారు. ప్రబంధ శైలికి చెందిన వేటూరి ప్రౌఢ పద ప్రయోగ నైపుణ్యం గమనిస్తే అడుగడుగునా మనకు శ్రీనాథ కవి సార్వభౌముడు గుర్తుకు వస్తాడు. కాబట్టి వేటూరిని శ్రీనాథుడితో పోల్చి చెప్పారు పత్రికలవారు. వేటూరి మరణిస్తే- శ్రీనాథుడు మళ్లీ మరణించినట్లేనని వారి అభిప్రాయం'

'అలాగా! పోనీ వారికీ వీరికీ అద్భుత కవితా వ్యాసంగంలో ఏవో దగ్గర పోలికలున్నాయి. కాబట్టి- ఆ దృష్టితో అలా అన్నారనుకుందాం. మీరు చెబుతున్న అబ్రహాం లింకన్, కెన్నెడీలు రాజకీయవేత్తలు. అలా అని, వారితో పోల్చదగిన గొప్ప రాజకీయనేతలు ఈ మధ్య ఎవరైనా మరణించారా... అంటే, లేదే! మరి ఈ ఇద్దరూ మళ్లీ మరణించారని మీరెందుకు అంటున్నారు?'

'బాగా అడిగావు! చెబుతాను కానీ, అది అర్థం



కావాలంటే- ముందుగా ఓ చిన్నకథ చెప్పాలి నీకు'


'సరే కథలంటే చెవికోసుకుంటానని మీకు తెలుసుగా! చెప్పండి'

'అనగనగా ఓ అడవి. దానిలో చాలారకాల జంతువులున్నాయి. కాబట్టి వేటగాళ్ల దృష్టి దానిపై పడింది. పదే పదే వేటకు రావడం మొదలు పెట్టారు. జంతుజాతుల్లో కలవరం మొదలైంది. రోజురోజుకు ఎన్నో అడవిప్రాణులు వేటకు బలై పోతుండటంతో, వాటికి ప్రాణభయం పెరిగి పోయింది. పరిష్కారం కనుగొనే దిశగా ఆలోచించాలని జంతువులన్నీ కూడబలుక్కుని సింహం అధ్యక్షతలో సమావేశం అయ్యాయి. తమతమ అభిప్రాయాలు చెప్పాయి. ఇంతలో ఓ గుంట నక్క లేచి ముందుకు వచ్చింది. తాను చెప్పాల్సిందంతా చెప్పేసి, చివర్లో సింహాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 'మనలాంటి అరుదైన జాతిమృగాలను ఈ తుచ్ఛ మానవులు ముందూ వెనకా ఆలోచించకుండా ఇలా సంహరించడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని గంభీరంగా ప్రకటించింది. సింహం వెంటనే లేచి నిలబడి, నక్క వంక ఓసారి చూసి, చటుక్కున వెను తిరిగి వెళ్లిపోబోయింది. జంతువులు ఆశ్చర్యపడి, ఆపాయి. అలా చెప్పా చెయ్యకుండా ఎక్కడికి పోతున్నావని సింహాన్ని అడిగాయి. ఆ జంతువుల వైపు సింహం నిర్వేదంగా చూసి 'అరుదైన జాతిమృగాలు అంటూ నాతో తననూ కలిపేసుకుందా గుంటనక్క. అది వినగానే నాకు నా జీవితంమీద ఒక్కసారిగా విరక్తి కలిగింది' అనేసి వేగంగా వెళ్లిపోయింది. అదీ కథ!'

'అవును! సింహం అంటే మృగరాజు కదా... ఆ మాత్రం ఆత్మాభిమానం ఉంటుంది మరి! అది సరే! ఆ కథ ఇప్పుడు ఎందుకు గుర్తొచ్చింది మీకు?'

'అమెరికాకు ఘనమైన అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తనపై జరిగిన హత్యాప్రయత్నం గురించి చెబుతూ ఏమన్నారో విన్నావా? లింకన్, కెన్నెడీ వంటి గొప్ప గొప్ప మేధావులు, రాజకీయ నేతలు, అసాధారణ విజేతల జోలికే తప్ప- మామూలు నాయకుల జోలికి ఎవరూ పోరని... తానూ అన్నివిధాలా వారితో సమానమైన వాణ్ని కాబట్టే- హంతకుల దృష్టి తనమీద కూడా పడిందని ట్రంప్ ప్రకటించారు చదివావా? వారూ ఈయనా సమానులేనట! లింకన్, కెన్నెడీలు నిజంగా బతికే ఉంటే- ఈ మాట వినే ఉంటే... వినగానే ఆ కథలో సింహం మాదిరే జీవితం మీద విరక్తి పెంచుకునే వారా కాదా? కాబట్టే అన్నాను- వారిద్దరూ మళ్లీ మరణించారని!'

– ఎర్రాప్రగడ రామకృష్ణ



రంజాన్ వేళలు
ఇఫ్తార్: (గురువారం) సాయంత్రం: 6.18
సహార్: (శుక్రవారం) ఉదయం:5.09

బాధ్యత లేదంతే.. బాధలు తప్పవంతే!

ఇంటర్ పరీక్షల నేపథ్యంలో సాధారణ రోజుల కన్నా... గత మూడు రోజుల నుంచి నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ మీదుగా ఫ్లైఓవర్ పై వెళ్లే వాహనాలకు దారివ్వకపోవడంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. ఫ్లైఓవర్ మార్గంలో వాహనాలను దారిస్తే ట్రాఫిక్ సమస్య అంతగా ఉండదు. ప్రత్యేకంగా ఈ ప్రదేశంలో పోలీసులను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని నగరవాసులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి



ఆంగ్ల పరీక్షకు 1,074 మంది గైర్హాజరు

మాచవరం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష నిర్వహించారు. దీనికి 1074 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. మొత్తం 38,247 మంది విద్యార్థులకు గాను 37,173 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లాలో 98 కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆయన వెల్లడించారు.

పట్టుదలతో చదువు.. పదింతల సులువు

పది పరీక్షల గడువు సమీపిస్తోంది. ఆయా సబ్జెక్టుల వారీగా ఉన్న సందేహాలు నివృత్తి చేసేందుకు ఈనాడు, ఈటీవీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల విద్యార్థులు, తల్లిదండ్రులు 250 మందికి పైగా ఫోన్ చేశారు. వారడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు ఏం చదవాలి, మార్కులెలా తెచ్చుకోవాలో ఒక్కొక్కరూ వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని డీఈవో యూవీ సుబ్బారావు అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన కార్యక్రమంలో డీఈవో, ఎంఈవో-2 మొమిన్, డీసీఈబీ కార్యదర్శి పి.వి.సాయి తదితరులు పాల్గొన్నారు. ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి లేడీయాంప్తిల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ హనీఫ్, సంస్కృతం పాఠ్యాంశంపై కానిస్టేట్ ఓరియంటల్ పాఠశాల ఉపాధ్యాయిని బి.దుర్గాదేవి విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్, కలెక్టరేట్


విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న ఉపాధ్యాయులు, డీఈవో యూవీ సుబ్బారావు తదితరులు



తెలుగులో 95.. తేలికేనోయ్..

తెలుగు

పద్యం, గద్యం, రామాయణ, సృజనాత్మక, లేఖ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. భాషాంశాలపై పట్టు సాధిస్తే 32 మార్కులు సాధించవచ్చు. ఇందులో పాఠాల చివర ఉన్న అలంకారాలు, ఛందస్సు, అర్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి, వికృతులు, సంధులు, సమాసాలు, ప్రత్యక్ష, పరోక్ష కథనాలు కేవలం వీటిని చదివితే చాలు. ఉత్తీర్ణులు అవుతారు. భాషాంశాలు రోజూ చదివేలా విద్యార్థులు కృషి చేస్తే మంచి మార్కులు రావడానికి అవకాశం ఉంటుంది. ప్రతిస్పందన లేని ఒకటో ప్రశ్న నుంచి మార్కులు సాధించవచ్చు. పద్యంలోని ప్రశ్నలకు 4 మార్కులు, గద్యం నుంచి నాలుగు ప్రశ్నలకు 8మార్కులు సాధించవచ్చు. పేరాలోని ప్రశ్నల జవాబులు అక్షరం ఉంటాయని విద్యార్థులు గమనించాలి. రామాయణంలోని పాత్రల పై ఏ కాండలకు చెందినవి చేరితే 8మార్కులు వస్తాయి. వ్యక్తీకరణ- సృజనాత్మకతలోని కవి పరిచయం ప్రక్రియ లేదా నేపథ్యం, పాత్ర స్వభావాలు సాధారణ విద్యార్థులు కూడా ఒకసారి వింటే రాయవచ్చు. తెలుగులో 95 నుంచి 100 మార్కులు సులువుగా సాధించవచ్చు. **-కె.బాలకృష్ణ (చిన్నాపురం జడ్పీహెచ్ఎస్)**

పటాలు గీసెయ్.. అర్థం చేసుకుని రాసెయ్

జీవశాస్త్రం

జీవశాస్త్రంలో పటాలు చక్కగా గీయడం, పట్టికల కింద ఇచ్చే ప్రశ్నలను అర్థంచేసుకుని రాయ గలిగితే మంచి మార్కులు సాధించవచ్చు. ప్రయోగాలు, ప్రశ్నల రూపకల్పన, జాగ్రత్తలు, పటాలను గీసి భాగాలను గుర్తించడం, పర్యావరణం తదితర అంశాల సాధన ద్వారా అధిక మార్కులు అవకాశం ఉంటుంది. ఈసారి పరీక్ష బ్లూప్రింట్ టాక్సానమీ, ఆబ్జెక్టివ్ ఆధారంగా జరుగుతుంది. వినియోగం, విశ్లేషణ ఉంటాయి. ప్రశ్నలు అర్థం చేసుకుని పాయింట్ల వారీగా, ప్రయోగాల వివరాలు చక్కగా అధ్యయనం చేయాలి. బొమ్మలు, ప్రయోగాల ఆధారిత ప్రశ్నలపై దృష్టి సారించాలి. అర్థవంతంగా సమర్పించే తీరు విద్యార్థులను విజయ శిఖరాలకు చేరుస్తుంది. **-పీవీ మల్లేశ్వరరావు, పినుమల్లి జడ్పీహెచ్ఎస్**

పాయింట్ల రూపంలో ఆవిష్కరించు..

భౌతికశాస్త్రం

మంచి మార్కులకు ఎస్సీఈఆర్టీ బ్లూప్రింట్ ప్రకారం చదవాలి. హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి లోపాల నివారణ, శ్రేణిసంధానం, సమాంతర సంధానం, నిర్వచనాలు, విద్యుదయస్కాంత ప్రయోగాలు, రసాయనిక చర్యల రకాలు, సమీకరణాలు తుల్యం చేయడంపై పట్టుసాధించాలి. ఆమ్లాలు-క్షారాలు, లవణాలు, లోహాలు, అలోహాలు, ఆల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్ ప్రమేయ సమూహాల ఫార్ములాలు అభ్యాసం చేయాలి. కాంతి పాఠం నుంచి పట్టికరకం ప్రశ్నలపై పట్టుసాధించాలి. కాంతి పరావర్తనం, వక్రీభవనం పాఠ్యాంశం నుంచి కిరణ రేఖాచిత్రాలపై సాధన చేయాలి. పాయింట్ల రూప సమాధానాలతో మంచి మార్కులొస్తాయి. **-కె.అంకాలరావు (తరగటూరు జడ్పీహెచ్ఎస్)**

మంచి దస్తూరి..మార్కులకు దారి..

హిందీ

హిందీలో 100 మార్కులు సాధించాలంటే అక్షర, వ్యాకరణ దోషాలు లేకుండా అందమైన దస్తూరితో రాయాలి. ఒకటి నుంచి ఐదు పేరాలను సంపూర్ణంగా చదివి అవగాహన చేసుకుంటే సులువుగా సమాధానాలు రాయవచ్చు. 6వ ప్రశ్న లేఖ పద్యంలో ఇచ్చిన పేరా చదివి ఖాళీలు పూరించాలి. 7వ ప్రశ్న బిహారీ, రహీమ్‌ల గురించి సాధన చేయాలి. 8వ ప్రశ్న ఛాయా, 11వ ప్రశ్న ఉపవాచకం పాఠంలోని దోహాలు, అనోఖాపాయ్ తప్పనిసరి ప్రశ్నలు. అక్షర దోషాలు లేకుండా రాసి 4మార్కులు సాధించొచ్చు. పద్య భాగ సారాంశంలో బరస్తేబాదల్, ఏక్ కహానీ ... సారాంశంలో ఈద్గాహ్, లోకగీత్, ప్రతీకలేఖ్‌లో మర్జివర, పితా జీకో పత్ర, పుస్తక విక్రేత కో నామిషన్ తదితరాలు ముఖ్యమైనవి. ప్రతిసారాంశం తరవాత నీతి ఉండాలి. వ్యాకరణాంశాల్లో 16 నుంచి 30వరకు బిట్స్ ఉంటాయి. వాటిని సాధన చేయాలి. **-జె.ర్యూనిస్ (తాళ్లపాలెం జడ్పీహెచ్ఎస్)**

నీకంటూ వ్యూహం.. సాధనతో ఫలితం

ఆంగ్లం

సరైన వ్యూహం, సాధన, మారిన ప్రశ్నపత్రాల అధ్యయనం ద్వారా ఇంగ్లిషులో మంచి మార్కులు సాధించవచ్చు. అక్షర, వ్యాకరణ దోషాలు లేకుండా చక్కటి దస్తూరితో రాయాలి. ప్రశ్నపత్రం సెక్షన్ ఏలో రీడింగ్ కాంప్రహెన్షన్, నాన్-డిటైల్డ్ డేటా, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. క్రమపద్ధతి తప్పకుండా రాయాలి. ప్రతి పాఠం, పద్యం పై అవగాహనతో ఉండాలి. వాటిలో పాత్రలు, స్వభావం, ఆ పాఠం సారాంశాన్ని గమనించాలి. సెక్షన్ బీలో గ్రామర్, వొకాబులరీ ఉంటాయి. వ్యాకరణ అంశాలపై సాధన ద్వారా 30 మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్ సీలో రైటింగ్ స్కిల్స్ భాగం ఉంటుంది. కన్వర్జేషన్, డైరీ, లెటర్స్, స్పీచ్, డయాగ్రమ్ వివరణలపై నిర్దిష్ట నమూనా నేర్చుకుంటే పూర్తి మార్కులు సాధించవచ్చు. సవరణ ప్రశ్నల్లో వాక్యాల్లో ఇచ్చిన తప్పు పదాలు సరిచేయాలి. పదసంపద ప్రశ్నల్లో సందర్భానికి తగినట్టు రాయాలి. **-పీఆర్ సీతాకుమారి (మల్లవోలు జడ్పీహెచ్ఎస్)**

నూటికి నూరు.. ఇలా సాధిస్తారు

గణితం


గణితంపై పట్టుసాధిస్తే అది ఎంతో సులువైన పాఠ్యాంశం. సరైన వ్యూహంతో సిద్ధమైతే నూటికి నూరూ సాధ్యమే. డీజీఈ-ఏపీ బ్లూప్రింట్‌ను అధ్యయనం చేయాలి. ఏ అధ్యాయానికి ఎంత వెయిటేజీ ఉందో, 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నల పంపిణీ ఎలా ఉందో తెలుసుకోవాలి. సూత్రాల వెనకున్న భావాన్ని అర్థం చేసుకోవాలి. రోజూ 2 నుంచి 3గంటలు సాధన చేయాలి. సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, బహుపదులు, రేఖీయసమీకరణాలు, వాస్తవసంఖ్యలు, నిరూపకజామితి అధ్యాయాలు ఎక్కువ మార్కులు కలిగి ఉంటాయి. వీటిపై పట్టు సాధించాలి. గత ప్రశ్నపత్రాల సాధనతో ఉపయుక్తంగా ఉంటుంది. ముందుగా తెలిసిన ప్రశ్నలు చేయాలి. స్టెప్స్ స్పష్టంగా రాయాలి. వీటిలో ప్రతిదశను స్పష్టంగా రాస్తే పూర్తి మార్కులొస్తాయి. అవసరమైనచోట బొమ్మలు, సూత్రాలు స్పష్టంగా ఉండాలి. చివరి 10 నిమిషాలు రాసిన సమాధానాలు పరిశీలించుకోవాలి. **-కె.వాహిని (మొవ్వ జడ్పీహెచ్ఎస్)**

గ్రాఫ్‌లపై అవగాహనతో ఉండాలి..

సాంఘికశాస్త్రం

గ్రాఫ్‌లపై అవగాహనతో ఉండాలి. భూగోళ శాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రాల ప్రాథమిక అంశాలపై పట్టుతో మంచి మార్కులు వస్తాయి. పట్టికలా ఇచ్చిన ప్రశ్నలను జాగ్రత్తగా అర్థం చేసుకుని సమాధానాలు రాయాలి. మ్యాప్ పాయింటింగ్‌లో ఈస్ట్ టు వెస్ట్, వెస్ట్ టు ఈస్ట్ బాగా సాధన చేయాలి. ప్రపంచ పటంలో ముఖ్యమైన దేశాలు, సముద్రాలు, మహాసముద్రాలు, భారత దేశ పటంలో రాష్ట్రాలు, రాజధానులు, పోర్టులు, జాతీయ రహదారులు, ఎత్తయిన శిఖరాలు, పర్వతాలు, పీఠభూములు, సరిహద్దుదేశాలు, ఖనిజాలు లభించే ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాలను స్పష్టంగా గుర్తించాలి. జ్ఞాపకశక్తి, అంచనా, సృష్టించడం లాంటి సామర్థ్యాలు పరీక్షించే ప్రశ్నలూ వస్తాయి. సమాధానాలు స్పష్టంగా రాయాలి. **-షాజహాబేగం (బుదాలపాలెం జడ్పీహెచ్ఎస్)**





భళారే... సపరివార్!

రాజకీయాల్లోనే కాదు.. రసవత్తర క్రీడల్లోనూ తగ్గేదే లేదని ప్రజాప్రతినిధులు సందడి చేశారు. 'ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026'లో భాగంగా రెండో రోజైన బుధవారం.. ప్రజాప్రతినిధులు విభిన్న క్రీడల్లో చురుకుగా.. చలాకీగా ఆడి సరిలేరు మాకెవ్వరు అనేలా విజృంభించారు. **-ఈనాడు, అమరావతి**



13 ఖాతాలు.. రూ.8.50 కోట్ల లావాదేవీలు

విజయవాడ నుంచి తమిళనాడు ఖాతాలకు నగదు బదిలీ ✪ మ్యూల్ ఎకౌంట్స్ కేసు దర్యాప్తులో కొత్త కోణాలు

ఈనాడు, అమరావతి

'చట్టవ్యతిరేక లావాదేవీల బదిలీకి నిందితులు ఎక్కువగా కరెంట్ ఖాతాలనే ఎంచుకున్నారు. వీటితో ఎక్కువ మొత్తాల్లో లావాదేవీలను చేసేందుకు వీలుండడమే కారణం. తొమ్మిది నెలల్లో విజయవాడలో తెరిచిన ఖాతాల ద్వారానే రూ.8.50 కోట్ల నగదు బదిలీలు జరిగాయి. ఇవన్నీ తమిళనాడులో వివిధ ఖాతాలకు వెళ్లాయి. అద్దె ఖాతాల విశ్లేషణలో వెలుగు చూస్తున్న దారుణాలివి.' యనమలకుదురు.. మ్యూల్ ఎకౌంట్స్ కేసులో నలుగురు నిందితుల కస్టడీ బుధవారంతో ముగిసింది. లావాదేవీలు, వ్యవహారాలు సాగిన తీరుపై రవికుమార్ (ఏ1), స్టీవెన్ (ఏ2)లను పోలీసులు ప్రశ్నించారు. కస్టడీ ముగిశాక నిందితులకు వైద్యపరీక్షలు చేయించి.. కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వీరికి రిమాండ్ విధించగా విజయవాడ కారాగారానికి తరలించారు.'

ఇండియన్ బ్యాంకువే అధికం...

విజయవాడలో పలువురి ద్వారా తెరిచిన 37 ఖాతాల్లో 13 ఎకౌంట్లనే నిందితులు ఉపయోగించారు. కోటక్ మహీంద్రా, ఇండియన్ బ్యాంక్, ఉత్కర్ష్ బ్యాంక్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచినట్లు గుర్తించారు. అత్యధికంగా ఇండియన్ బ్యాంకులోనే తెరిచారు. దుర్గాప్రసాద్ (ఏ4) ఈ బ్యాంకులో పొరుగుసేవల ఉద్యోగి కావడంతో సహకరించాడు. లావాదేవీలు జరిగిన 13 ఖాతాలకు సంబంధించి బ్యాంకుల నుంచి వచ్చిన వివరాలను పోలీసులు విశ్లేషించగా.. రూ.8.50 కోట్లు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

పరిమితి ఉండదనే...

తొలుత చెన్నై నుంచి ఈ ఖాతాల్లో నగదు జమయ్యేది. ఆ సొమ్మును తిరిగి అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 113 ఖాతాలకు ఏ1, ఏ2లు బదిలీ చేశారు. అంతకు మించి చెన్నైలో సుబ్రమణి రాజా వెంకట్, ఆకాశ్‌పైన ఇంకా ఎవరున్నారనేది తమకు తెలియదని నిందితులు వెల్లడించారు. వ్యాపార సంస్థలు వాడే కరెంట్ ఖాతాలను పెద్దమొత్తంలో నగదు బదిలీలకు వాడారు. వీటికి పరిమితి ఉండదని ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. కరెంట్ ఖాతాల్లో రూ.8 కోట్లు బదిలీ కాగా.. పొదుపు ఖాతాల ద్వారా రూ.50 లక్షల లావాదేవీలు సాగాయి. ఒక్కో పొదుపు ఖాతా నుంచి గరిష్ఠంగా రూ.4 లక్షలే జరిగాయి.

నెలకు రూ.15 వేలు జీతానికి...

అద్దె ఖాతాల ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు చేసిన రవికుమార్, స్టీవెన్‌లు ఒక్కొక్కరికి నెలకు కేవలం రూ.15 వేల జీతమే దక్కేది. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతే. కార్యాలయం అద్దె, ఫోన్లు, ఇతర అవసరాలకు సుబ్రమణి వెంకట్ డబ్బులు సర్దేవాడు. అంతకు మించి వీరేమీ మిగుల్చుకోలేదు. అరకొర జీతానికి ఆశ పడి చివరకు కటకటాలపాలయ్యారు.

వెబ్ డెవలపర్ కోర్సు దరఖాస్తుకు గడువు 28

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: వెబ్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తు గడువు ఈ నెల 28వ తేదీతో ముగుస్తోందని జిల్లా నైపుణ్యాధికారి శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి మధుభూషణ్‌రావు, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా అర్హతతో దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని చెప్పారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా సంప్రదించాలని, వివరాలకు 99857-59304, 63050-04318 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఇద్దరు ఏసీపీల బదిలీ

విజయవాడ నేరవార్తలు: హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది. ఎన్టీఆర్ కమిషనరేట్‌లో సౌత్ ఏసీపీ దేవినేని పావన్‌కుమార్‌రెడ్డి, నార్త్ ఇన్‌ఛార్జి ఏసీపీ నర్రెడ్డి భానుప్రకాశ్‌రెడ్డిలను బదిలీ చేశారు. సౌత్ ఏసీపీ గత ఏడాది బాధ్యతలు స్వీకరించగా.. భానుప్రకాశ్‌రెడ్డి రెండు రోజుల క్రితమే నియమితులయ్యారు. సౌత్ ఏసీపీగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, స్పెషల్ బ్రాంచ్‌లో ఏసీపీగా పనిచేస్తున్న సత్యానందంను నార్త్ ఏసీపీగా నియమించారు.

ప్రమాదాలకు నిలుపుటద్దం!

★ జాతీయ రహదారుల్లో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
★ వెనుక నుంచి ఢీ.. ఘటనాస్థలిలోనే గాల్లోకి ప్రాణాలు..

ఈనాడు, అమరావతి

'జాతీయ రహదారులపై అడ్డదిడ్డంగా ఆపేస్తున్న వాహనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మంచు, చీకటి కమ్మేసిన వేళ వాహనాలున్న విషయం గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీ డ్రైవర్లు పార్కింగ్ చేసి.. వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన లారీబేల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో దారులపై వాహనాలు నిలిపేస్తూ.. మృత్యువును మోసుకొస్తున్నారు.'


వీరవల్లి సమీపంలో రోడ్డు మధ్య వరకు ఆపేసిన వాహనాలు

హడలిపోవాల్సిందే...

★ ఇటీవల అంబారుపేట సమీపంలో లారీ రోడ్డుపై పార్క్ చేయగా.. కారులో వస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచు వల్ల దగ్గరకు వచ్చే వరకు వాహనం కనిపించక ఢీకొట్టారు. ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ★ జి.కొండూరు - కొండపల్లి మధ్య పదుల సంఖ్యలో ఆయిల్ ట్యాంకర్లు రోడ్డుపైనే ఆపేస్తున్నారు. దీంతో కొద్దిరోజుల కిందట తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యారు. ★ కొంతకాలం కిందట గొల్లపూడి-ఇబ్రహీంపట్నం మధ్యలో ఓ దాబా సమీపంలో రోడ్డుపైనే లారీ ఆపారు. వెనుక నుంచి వచ్చిన ఆటోకు చీకట్లో వాహనం కనిపించక.. ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ ప్రాణాలు వదిలాడు. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణ నష్టం తగ్గింది.

అడ్డగోలుగా ఆపేదిక్కడే..

★ పొట్టిపాడు, కలపర్రు టోల్‌ప్లాజాల దగ్గర అర కిలోమీటరు మేర వాహనాలు ఆపేస్తున్నారు. ★ పొట్టిపాడు లారీ బేలో 4 లారీలైనా పట్టవు. దీంతో టోల్‌గేటు వద్దనే వాహనాలు ఆపేస్తున్నారు. ★ వీరవల్లి, హనుమాన్ జంక్షన్ దగ్గర సర్వీస్ రోడ్లపై వాహనాలు అడ్డంగా పెడుతున్నారు. ★ హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో మూలపాడు తర్వాత మళ్లీ చిల్లకల్లు వరకు 65 కిమీ మేర లారీబే లేదు. దీంతో అంబారుపేట, వైజంక్షన్ ఇలా ప్రతీచోట వాహనాలు ఆపేస్తున్నారు. ★ విజయవాడ బైపాస్‌పై గొల్లపూడి, పి.నైనవరం, నున్న తదితర ప్రాంతాల్లో రోడ్డుపైనే వాహనాలు ఆపేస్తున్నారు.

పేరుకే లారీ బే...

★ ఉమ్మడి జిల్లాలో 16, 30, 65 జాతీయ రహదారుల్లో చిల్లకల్లు, మూలపాడు, పొట్టిపాడు, కొండపల్లిలోనే లారీ బేలు ఉన్నాయి. ★ కొండపల్లి, పొట్టిపాడులో కనీస వసతులు లేవు. మరుగుదొడ్లు ధ్వంసమైనా బాగుచేయలేదు. కొళాయిల్లో నీరు రావు. దీంతో డ్రైవర్లు కాలకృత్యాలు తీర్చుకునేందుకు అల్లాడుతున్నారు. ★ మూలపాడు లారీబేలో దూరం నుంచి వచ్చే వాహనాలేవీ ఉండవు. మూలపాడులో చాలా మందికి సొంత లారీలున్నాయి. పార్కింగ్ సౌకర్యం లేక వారంతా ఇక్కడే నిలుపుతున్నారు. ★ అసలు లారీడ్రైవర్లు లారీబే లో వాహనాలు ఆపడం లేదు. టోల్‌గేటు సమీపంలో, దాబాలు, బార్లు ఉన్నచోట ఆపుతున్నారు. దీంతో రాత్రుళ్లు వచ్చే వారికి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.


పొట్టిపాడు లారీ బే: విరిగిన మరుగుదొడ్ల తలుపులు

చదువరి చేత.. చెత్త రాత





విద్యార్థులకు చదువుతో పాటు బుద్ధులు నేర్పాల్సిన విద్యాలయాలు మార్కుల కోసమే అనేలా మారిపోయాయి. పిల్లల్లో నైతిక విలువలు కనుమరుగు అవుతున్నాయి. అందుకు ఉదాహరణ... ఇంటర్ పరీక్ష పూర్తయ్యాక వసతి గృహాలు, కళాశాలకు వెళ్లేందుకు బస్ ఎక్కగానే తమ పుస్తకాలు చింపి రహదారిపై విద్యార్థులు విసురుతున్నారు. బుధవారం విజయవాడ బందరు రోడ్డు, కానూరు, తాడిగడప ప్రాంతాల్లో బస్సుల్లోంచి విద్యార్థులు పుస్తకాలు, పేపర్లు విసిరిపడేశారు. రహదారులను శుభ్రం చేయడం పారిశుద్ధ్య కార్మికులకు తలకు మించిన భారం అవుతోంది. ఏటా విద్యార్థులు ఇలాగే ప్రవర్తిస్తున్నా.. నిలువరించాల్సిన విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. అలా చేయకూడదని చెప్పడం లేదు. అధికారులు స్పందించి ఏ బస్సులో నుంచి కాగితాలు విసురుతున్నారో గమనించి.. సంబంధిత విద్యాసంస్థ యాజమాన్యాన్ని బాధ్యులను చేస్తే మార్పు వచ్చే అవకాశం ఉంటుంది. **- ఈనాడు, అమరావతి**

ఇప్పుడు తల్లడిల్లి.. ఏం లాభం?

☛ పెట్టుబడులతో పేరుతో సైబరాసురుల వంచన
☛ కేంద్రప్రభుత్వ అధికారికి రూ.1.26 కోట్ల టోకరా

ఈనాడు, అమరావతి

అతను కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి. ఆన్‌లైన్‌లో పెట్టుబడి ప్రకటన చూసి.. నమ్మారు. ఇబ్బడిముబ్బడిగా లాభాలు వస్తాయనే ఆశతో పెట్టుబడులు పెట్టారు. బంగారాన్నీ తాకట్టు పెట్టి, తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి.. విడతలవారీగా నెల రోజుల్లో రూ.1.26 కోట్లు పెట్టుబడి పెట్టి మోసపోయి పోలీసులను ఆశ్రయించారు.

విజయవాడకు చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి ట్రేడింగ్ అలవాటుంది. గత నెలలో ఆన్‌లైన్‌లో ఓ ప్రకటన చూశారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు సంబంధించి మెలకువలు చెబుతామని అందులో ఉంది. ఆ లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం అతడిని ఓ వాట్సాప్ గ్రూప్‌లో కలిపారు. ట్రేడింగ్‌కు సంబంధించి నిత్యం పలు టిప్స్ అందులో పోస్టు చేసేవారు. అందులో ఉండే మోసగాళ్ల తాలూకా సభ్యులతో తమకు ఈ టిప్స్‌తో అధికంగా లాభాలు వచ్చాయని పోస్టు చేయించారు. ఇదే నిజమని నమ్మి తానూ పెట్టుబడులు పెడతానని అధికారి వారిని సంప్రదించారు. తమ కంపెనీ గంపగుత్తగా తక్కువ ధరకే షేర్లను కొనుగోలు చేస్తుందనీ, తమ గ్రూప్‌లో సభ్యుడిగా చేరితే వాటిని కేటాయిస్తామని నమ్మించారు. తమ సభ్యులకు మార్కెట్‌లోకి వచ్చే ఐపీవోలను కూడా కేటాయిస్తామని మోసగాళ్లు అధికారికి చెప్పారు. దీనికి అంగీకరించడంతో యాప్ పంపిలాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చారు... మోసగాళ్లు.

38 ఖాతాలకు బదిలీ...

యాప్‌లోకి లాగిన్ అయ్యాక మొదటగా.. రూ.లక్ష పెట్టుబడి పెట్టి కొన్ని షేర్లు కొనుగోలు చేశారు. బాగా లాభం వచ్చినట్లు యాప్‌లో చూపించడంతో నమ్మకం కుదిరింది. తర్వాత విడతల వారీగా మోసగాళ్లు చెప్పిన బ్యాంకు ఖాతాలకు రూ.80 లక్షలు బదిలీ చేసి స్టాక్స్ కొనుగోలు చేశారు. దీనికి యాప్‌లో లాభం రూ.5 కోట్లు చూపించింది. ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించినా కుదరలేదు. అవతల వ్యక్తిని సంప్రదించగా.. కంపెనీ పన్నులు, టీడీఎస్, ఈడీ పేర్లతో మరో రూ.46 లక్షలు జమ చేయించుకున్నారు. నెల రోజుల్లో మొత్తం 38 బ్యాంకు ఖాతాలకు రూ.1.26 కోట్లు బదిలీ చేశారు. ఇంకా పలు కారణాలు చెబుతూ.. నగదు పంపాలని మోసగాళ్లు డిమాండ్ చేయడం ప్రారంభించారు. రూ.5 కోట్లు వస్తాయనే ఆశతో అప్పటికే దాచుకున్న సొమ్ముతోపాటు బంగారం తాకట్టు పెట్టారు. చాలాచోట్ల అప్పులు కూడా చేశారు. ఇంకా అడుగుతుండే సరికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.18 లక్షల విలువైన 122 చరవాణుల అప్పగింత

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లి అపార్ట్‌మెంట్‌కు వచ్చాను. బూట్లు విడుద్దామని చరవాణి పక్కన పెట్టి తర్వాత మరిచిపోయి వెళ్లిపోయాను. 10 నిమిషాల తర్వాత చూస్తే అది కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే దాన్ని కనుగొని అప్పగించారు'. 'ఆటో దిగుతూ చరవాణి సీట్లో పెట్టి నగదు చెల్లించాను. ఫోన్ మరిచిపోయి దిగిపోయాను. తర్వాత వేరే నంబరుతో ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ చేసి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పట్టుకుని అప్పగించారు'. అంటూ చరవాణులు పోగొట్టుకున్న వారు హర్షం వ్యక్తం చేశారు. బాధితుల్లో సీనియర్ సిటిజన్లు ఎక్కువ మంది ఉన్నారు. బుధవారం కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న చేతుల మీదుగా రూ.18 లక్షల విలువైన 122 చరవాణులను బాధితులకు అప్పగించారు. ఎన్టీఆర్ కమిషనరేట్‌లో 4,900 చరవాణులు పోయాయని.. వాటిలో 4,200 ఫోన్లను గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 6 విడతల్లో 2,467 చరవాణులను స్వాధీనం చేసుకుని, యజమానులకు అప్పగించామని వెల్లడించారు. 7వ విడతలో 122 చరవాణులు అందించామని వివరించారు. మిగిలినవి ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయని.. వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. చరవాణి పోయిన వెంటనే సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)లో లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. నిఘా ఉంచి స్వాధీనం చేసుకుంటామని డీసీపీ తెలిపారు.

★ డీసీపీ కృష్ణప్రసన్న మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్ యాప్‌ల్లో పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు అంటూ ప్రకటనలు గుప్పించి మోసం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ బి.రాజశేఖర్, సీఐలు దుర్గాప్రసాద్, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



యజమానికి ఫోన్ అందిస్తున్న డీసీపీ కృష్ణప్రసన్న

కనిపించని పల్లె వెలుగులు

మన రాష్ట్ర అధికారుల నిర్లక్ష్యం
తెలంగాణ ఆర్టీసీకి ఆదాయం

నందిగామ గ్రామీణం, వీరులపాడు, వత్సవాయి, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు గ్రామాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు నడపకపోవడంతో ఏపీఎస్ ఆర్టీసీ ఆదాయం కోల్పోతోంది. మరోవైపు మహిళలు స్త్రీశక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. కొన్ని గ్రామాలకు దశాబ్దాలుగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు అసలు వెళ్లడమే లేదు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ, వీరులపాడు, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఈ సమస్య ఉంది. తెలంగాణ మధిర డిపో నుంచి అర గంటకో ఆర్టీసీ బస్సు వస్తున్నా మన రాష్ట్ర మహిళలు బస్ ఛార్జీ చెల్లించాల్సి వస్తోంది. గతంలో విజయవాడ, మధిర డిపోల నుంచి వీరులపాడు మండలం మీదుగా తెలంగాణలోని మధిర, ఖమ్మం పట్టణాలకు బస్సులు తిరిగేవి. ప్రస్తుతం మధిర డిపో బస్సులు పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, జగన్నాథపురం గ్రామాల


విజయవాడ- మధిర మార్గంలో ప్రయాణిస్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు

మీదుగా కంచికచర్ల, విజయవాడకు నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ప్రయాణించే మహిళలు స్త్రీశక్తి పథకం పొందలేకపోతున్నారు.

☛ విజయవాడ, ఇబ్రహీంపట్నం, తిరువూరు డిపోల బస్సులు తక్కువగా నడుపుతున్నారు. మధిర డిపో పల్లె వెలుగు బస్సులు తగ్గించి ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎక్కువగా నడుపుతుండడం వల్ల ఛార్జీ అధికంగా ఉంటోంది. దీంతో కంచికచర్ల, నందిగామలోని కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు భారంగా మారింది.

☛ జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధి ఉన్న నందిగామ మండలం ఏటిపట్టు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవు. జగ్గయ్యపేట డిపో నుంచి విద్యార్థుల కోసం బడి బస్సు మాత్రం నడుపుతున్నారు. కొణతమాత్మకూరు, దాములూరు, సోమవరం, తొర్రగుడిపాడు, రుద్రవరం, గోళ్లమూడి, పల్లగిరి, కమ్మవారిపాలెం, రాఘవాపురం గ్రామాలకు రెండు దశాబ్దాలుగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు నడపడం లేదు. జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, కొండూరు, మాగల్లు, పాతకంచల, లింగాలపాడు, తక్కెళ్లపాడు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిప్పడం లేదు.

స్త్రీశక్తి పథకం ఉన్నా ఫలితం లేదు

తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీలు భరించి ప్రయాణించాల్సి వస్తోంది. జుజ్జూరు నుంచి విజయవాడకు ఆర్డినరీ బస్సు ఛార్జీ రూ.50, ఎక్స్‌ప్రెస్‌బస్ ఛార్జి రూ.70గా ఉంది. మన డిపో బస్సులు తక్కువగా నడుపుతున్నారు. దీనివల్ల స్త్రీశక్తి పథకం అమలవుతున్నా ఫలితం ఉండడం లేదు.

- పి.సాయిరేఖ, జుజ్జూరు

ఏఐతో కచ్చితంగా భూగర్భ జలాల అంచనా

సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సభ్యుడు వరదరాజ్

విజయవాడ సిటీ - న్యూస్‌టుడే: భూగర్భ జలవనరుల అంచనా, సమర్థ నిర్వహణ, వినియోగానికి ఏఐ ఆధారిత సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని సీజీడబ్ల్యూబీ (సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్) సభ్యుడు ఎన్.వరదరాజ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూగర్భ జల రంగంలో అద్భుతంగా పని చేస్తున్నాయని ప్రశంసించారు. సీజీడబ్ల్యూబీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్రంలో భూగర్భ జలాల డేటా, ఆక్విఫర్ (జలధార పొరలు) మ్యాపింగ్ ఫలితాలపై రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వరదరాజ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, వర్షపాతంలో తేడాలు, అధిక నీటి వినియోగం వంటి కారణాలతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో శాస్త్రీయ ఆధారిత డేటా సేకరణ, విశ్లేషణ అవసరమని అన్నారు. ఏఐ ఆధారిత నమూనాల ద్వారా భూగర్భ జలాల నిల్వలు, రీఛార్జ్ సామర్థ్యం, వినియోగ ధోరణులను కచ్చితత్వంతో అంచనా వేయవచ్చని తెలిపారు. నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం 2012లో ప్రారంభమైన నేషనల్ ఆక్విఫర్ మ్యాపింగ్ ఆంధ్రప్రదేశ్‌లో 1.46 లక్షల చ.కి.మీ. మేర పూర్తయినట్లు వివరించారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 679 అసెస్‌మెంట్ యూనిట్ల (మండలాలు)లో 601 యూనిట్లు సురక్షితంగా ఉన్నాయని.. 12 అతి వినియోగం కేటగిరీలో, 3 క్రిటికల్ కేటగిరీలో, 24 సెమీ క్రిటికల్ కేటగిరీలో ఉన్నట్లు వివరించారు.


నివేదిక విడుదల చేస్తున్న వరదరాజ్, పండిత్ మధునూర్, కేఎస్ శాస్త్రి, జ్యోతికుమార్, కృష్ణమూర్తి తదితరులు

సంరక్షణతో పాటు నాణ్యత ముఖ్యం

భూగర్భ జలాల పరిమాణంతో పాటు నాణ్యతపైనా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని.. ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి కాలుష్య కారకాలపై పర్యవేక్షణ అవసరమని సీజీడబ్ల్యూబీ రీజనల్ డైరెక్టర్ (ఏపీ, తెలంగాణ) కేఎన్ జ్యోతికుమార్ అన్నారు. సమృద్ధిగా నాణ్యమైన భూగర్భ జల వనరులను భవిష్యత్తు తరాలకు అందించాలంటే ప్రజల్లో అవగాహనతో పాటు అందరూ కలిసికట్టుగా అడుగు వేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

డేటా సమర్థ వినియోగంతో మేలు

ఆంధ్రప్రదేశ్ గ్రౌండ్ వాటర్, వాటర్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కేఎస్ శాస్త్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మార్గనిర్దేశనంతో రాష్ట్రంలో 1,800కు పైగా పీజియోమీటర్ల సహాయంతో రియల్ టైమ్ డేటా సేకరిస్తున్నట్లు తెలిపారు. ☛ ముగింపు సెషన్‌కు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియా సరెల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, సుస్థిర వినియోగం, సమర్థ నిర్వహణపై నిపుణులు స్పష్టమైన దిశానిర్దేశం చేశారని చెప్పారు. సమష్టిగా కృషి చేస్తేనే జలసిరులను భావితరాలకు బహుమతిగా అందించగలమనే సందేశాన్ని కార్యశాల అందించిందని తెలిపారు. ఏపీ డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్సెస్-2025, నేషనల్ ఆక్విఫర్ మ్యాపింగ్ అండ్ మేనేజ్‌మెంట్ నివేదిక విడుదల చేశారు. సీజీడబ్ల్యూబీ (బెంగళూరు) రీజనల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి, శాస్త్రవేత్తలు డా.పండిత్ మధునూర్, టి.మధు, పి.యాదయ్య, డా.ఎస్ఎస్ విట్టల, రేష్మా పిళ్లై, డా.అనంతరావు, జి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం నియోజకవర్గంలో మెట్ట ప్రాంత రైతాంగం నీటి అవసరాలకు నిర్మించిన తారకరామా ఎత్తిపోతల పథకం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోరారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రూ.75 లక్షలతో తాత్కాలిక మరమ్మతులను చేయిస్తే నిధులివ్వకుండా ఐదేళ్ల పాటు ఇబ్బందులు పెట్టారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని విడుదల చేసినట్లు వివరించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి అభివృద్ధికి రూ.4.05 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, వాటికి తక్షణమే ఆమోదం తెలిపి మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నెస్పీ మూడో జోన్ పరిధిలో ఉన్న నియోజకవర్గంలోని చివరి భూములకు నీరందని నేపథ్యంలో 1988లో అప్పటి తెదేపా ప్రభుత్వం, నీటిపారుదల శాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి, జిల్లా మంత్రి వసంత నాగేశ్వరరావుల చొరవతో పథకం రూపుదిద్దుకుందని చెప్పారు. సుమారు 13,800 ఎకరాలకు కృష్ణా నది నుంచి సాగునీరు అందుతుందని, పథకం సరిగా పనిచేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలువ ద్వారా గన్నవరం నియోజకవర్గానికీ నీరు అందించాలని చేసిన ప్రతిపాదనలు మధ్యలోనే నిలిచిపోయాయని, దాని వల్ల భారీ వర్షాల సమయంలో తమ నియోజకవర్గ పరిధిలోని జక్కంపూడి, కె.తాడేపల్లి గ్రామాల్లో భూములు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారానికి అక్కడ భూసేకరణ పూర్తి చేసి, కాలువను కొనసాగించాలన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

రాజకీయాలకు అతీతమైన వ్యక్తిత్వం వెంకయ్య సొంతం

కరెన్సీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతమైన వ్యక్తిత్వం ఐలాపురం వెంకయ్య సొంతమని, పార్టీ వేరైనా అందరినీ ఆప్యాయంగా పలకరించేవారని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య సంస్మరణ సభ బుధవారం విజయవాడ గురునానక్ రోడ్డులోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో శాలివాహనుల సంక్షేమానికి వెంకయ్య కృషి చేశారని పేర్కొన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శమని అన్నారు. రాజకీయ నాయకులు ఎలా ప్రవర్తించాలి, శత్రుత్వం లేకుండా ఎలా మెలగాలనే దానికి ఆయనే నిదర్శనమని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ... వెంకయ్య జీవన ప్రస్థానాన్ని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండడం.. ఆయన్ని చూసి నేర్చుకోవాలని అన్నారు. కష్టాన్ని నమ్ముకొని అంచలంచెలుగా ఎదిగారని మాజీ మంత్రి జేడీ శీలం వివరించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వెంకయ్య కృషి చేశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. శాసనసభ్యుడు గద్దె రామ్మోహన్, మాజీ మంత్రి బసవరాజు సారయ్య, ప్రముఖ హీరో సుమన్, మాజీ ఎమ్మెల్యేలు వంగవీటి రాధాకృష్ణ, యలమంచిలి రవి, తెదేపా సీనియర్ నాయకుడు వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జేడీ శీలం తదితరులు

విజయవాడ ఇన్‌ఛార్జి ఆర్డీవోగా బాలకృష్ణ

ఎన్టీఆర్ కలెక్టరేట్ : విజయవాడ రెవెన్యూ డివిజన్ (సబ్ కలెక్టరేట్) ఇన్‌ఛార్జి ఆర్డీవోగా, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణను బుధవారం నియమించారు. ఇప్పటి వరకు విజయవాడ ఆర్డీవోగా ఉన్న కావూరి చైతన్యను జీఏడీలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

గొల్లపూడిలో తెదేపా జిల్లా కార్యాలయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా తెదేపా కార్యాలయం నిర్మాణానికి త్వరలో పునాదులు పడనున్నాయి. విజయవాడ గ్రామీణ మండలం గొల్లపూడి-జక్కంపూడి రహదారిలో గ్రామ పంచాయతీ సామాజిక స్థలంలో.. ఎకరంన్నరను నిర్మాణానికి కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. లీజు పద్ధతిలో భూమిని కేటాయించనున్నారు. ఆ భూమిని పార్టీ కార్యాలయానికి కేటాయిస్తూ ఇటీవల గ్రామ పంచాయతీ అధికారులు తీర్మానం చేశారు. భూమి కేటాయింపునకు సంబంధించి త్వరలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు రానున్నాయి. ఈ నేపథ్యంలో గొల్లపూడిలోని భూమిని ఎంపీ కేశినేని శివనాథ్, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, నాయకులు బుధవారం పరిశీలించారు. త్వరలోనే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని గద్దె అనూరాధ పేర్కొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, గద్దె అనూరాధ

బీఎస్సీ నర్సింగ్‌కు నీట్ యూజీ అర్హత తప్పనిసరి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వచ్చే (2026-27) విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ (నాలుగేళ్లు)లో చేరాలంటే.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ - యూజీ ప్రవేశ పరీక్ష రాయడం తప్పనిసరి చేసినట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్ బుధవారం తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కన్వీనర్, యాజమాన్య కోటా సీట్లకు నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో పాల్గొనడం అర్హతగా చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ జీవో విడుదల చేసిందని తెలిపారు. ఇప్పటికే వచ్చే విద్యా సంవత్సరానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ యూజీ షెడ్యూల్ విడుదల చేసిందని, ఆన్‌లైన్ దరఖాస్తుకు మార్చి 8 చివరి తేదీ అని పేర్కొన్నారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేయాలనుకునే విద్యార్థులంతా నీట్ యూజీకి దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

టావి చికిత్సతో మెరుగైన ఫలితాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: జపాన్‌లో గత వారం జరిగిన 'పీసీఆర్ టోక్యో వాల్వ్స్-2026' అంతర్జాతీయ వైద్య సదస్సులో విజయవాడ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చెందిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్.రాజారమేష్ పాల్గొన్నారు. సదస్సులో సంక్లిష్టమైన టావి (ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్) కేసుల గురించి వివరించి అంతర్జాతీయ వైద్య నిపుణుల అభినందనలు పొందారు. బుధవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో టావి చికిత్సలు క్రమం తప్పకుండా చేస్తున్నామని, ఇప్పటివరకు 35 మంది రోగులకు చికిత్స చేసి మెరుగైన ఫలితాలు సాధించామని తెలిపారు. రాష్ట్రంలోనే టావి చికిత్సకు కేంద్రంగా రమేష్ ఆస్పత్రి మారిందని, ఈ రంగంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ రాజారమేష్‌ను అభినందించారు. రాజా రమేష్ మాట్లాడుతూ.. ఈ పద్ధతిలో రోగులకు మెరుగైన జీవితాన్ని అందించవచ్చని అన్నారు.

4.. 5 తేదీల్లో మహిళా ఉద్యోగుల ఆటా పాటా

7న ఏపీ ఐకాస రాష్ట్ర స్థాయి మహిళా దినోత్సవం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఏపీ ఐకాస అమరావతి మహిళా విభాగం నేతృత్వంలో మార్చి మొదటి వారంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 4, 5 తేదీల్లో ఆటా, పాట కార్యక్రమాలు ఉంటాయి. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణ (మాంటిస్సోరి కళాశాల ప్రాంగణం)లో 7వ తేదీ శనివారం రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నారు. మహిళా దినోత్సవానికి విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోని ప్రధాన శాఖాధిపతి కార్యాలయాలు (హెడ్ ఆఫీసులు), విజయవాడలోని అన్ని జిల్లా స్థాయి కార్యాలయాల్లో పని చేసే మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, మహిళా విభాగ ఛైర్‌పర్సన్ పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. నగరంలోని రెవెన్యూ భవన్‌లో పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి, మహిళా విభాగ కోశాధికారి వి.ఎస్.సాయిలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ నిర్వహణ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. బొప్పరాజు తదితరులు పాల్గొన్నారు. ఆట, పాటల్లోనూ, మహిళా దినోత్సవ కార్యక్రమంలోనూ పాల్గొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందని వారు కృతజ్ఞతలు తెలిపారు.


కరపత్రాలతో ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు

బ్రాయిలర్ ధరలు
(కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 148, 157, 168 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

ఉగాది కానుకగా పీఆర్సీ కమిషన్ వేయరూ!

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తమకు ఉగాది కానుకగా పీఆర్సీ కమిషన్ వేయడంతో పాటు, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఏపీ ఐకాస అమరావతి అనుబంధ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని కేంద్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి.శాస్త్రి మాట్లాడుతూ.. మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డుల (ఈహెచ్ఎస్)పై నగదు రహిత వైద్య సేవలు, మెడికల్ క్లెయిమ్ స్లాబు రేటు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం, జిల్లా పరిధిలో మెడికల్ రీఎంబర్స్‌మెంటు మంజూరు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం, ప్రాపర్టీ రద్దు జీవోను విడుదల చేయాలని విన్నవించారు. వైద్య ఖర్చుల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఎంతో మంది పింఛనుదారులు అప్పుల బారినపడి బాధ పడుతున్నట్టు వివరించారు. వివిధ రూపాల్లో తమకు రావాల్సిన బకాయిలను లెక్కగట్టి తెలియజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వేలిడేషన్ యాక్టును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో అన్ని రాష్ట్రాల పెన్షనర్లు దిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపడతారని హెచ్చరించారు. అసోసియేషన్ నాయకులు బి.లోవకుమార్, పి.నాగరాజు, ఎన్.నారాయణరావు, షానుద్దీన్, డి.సుబ్బారావు, హెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష 8కి వాయిదా

ఎన్టీఆర్ కలెక్టరేట్: బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 6వ తరగతి నుంచి పది వరకు మార్చి నెల రెండో తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్షను.. 8వ తేదీకి వాయిదా వేసినట్టు గురుకులాల ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు మార్చి 1న యథాతథంగా పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని ఆయన సూచించారు.

'ఇన్నర్ రింగ్‌రోడ్ కేసుపై న్యాయపోరాటం'

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఇన్నర్ రింగ్‌రోడ్ కేసుపై తాను న్యాయపోరాటం చేస్తానని గుంటూరు జిల్లా మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2022, ఏప్రిల్‌లో తాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసిందని తెలిపారు. ఈ నెల 27వ తేదీన కోర్టుకు వచ్చి అభ్యంతరాలు చెప్పాలని తనకు సమన్లు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇన్నర్‌రింగ్ రోడ్ కేసులో భారీ అవినీతి జరిగిందని.. 2014లో తెదేపా ప్రభుత్వం వచ్చినప్పటికే పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్‌కు గుంటూరు జిల్లా కాజా, నంబూరు, మంగళగిరి, కాకాని ప్రాంతాల్లో 350 ఎకరాలు కలిగి ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, లింగమనేని రమేష్‌లు పక్కా ప్లాన్‌తోనే ఈ భూములకు అతి దగ్గరగా వెళ్లేలా ఇన్నర్ రింగ్‌రోడ్ డిజైన్ చేశారని ఆయన ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదు అని చెప్పి ఇప్పుడు కేసు మూసివేయడం అన్యాయమన్నారు. ఈ కేసులో తనకు న్యాయం జరగకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

27న నిధి ఆప్కే నికత్

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే : ఈనెల 27న నిధి ఆప్కే నికత్ నిర్వహిస్తున్నట్లు భవిష్యనిధి ప్రాంతీయ కమిషనర్-2 తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రతి నెలా 10వ తేదీన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 27వ తేదీకి మార్చినట్లు వెల్లడించారు. ఆరోజు సెలవయితే తర్వాత రోజు నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లు పీఎమ్‌వీబీఆర్‌వై, ఈఈసి-2025, కెవైసీ, సెల్‌ఫోన్ నంబర్ సీడింగ్, యూఏఎన్ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణ, ఒంగోలు జిల్లాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలోని వరుణ్ ఆటో పార్కులో, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం కేసీపీ లిమిటెడ్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు.

జోగి సోదరుల బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో జోగి రమేష్, రాము బెయిళ్ల రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్ బుధవారం ఎనిమిదో ఏడీజే కోర్టులో విచారణకు వచ్చింది. నిందితులకు నోటీసుల కోసం గురువారానికి న్యాయాధికారి వాయిదా వేశారు. ఇదే కేసుకు సంబంధించి ఎక్సైజ్ కోర్టులో తాండ్ర రమేష్ (ఏ15) బెయిల్ పిటిషన్‌పై వాదనలు వచ్చే నెల 2కు వాయిదా పడ్డాయి. నిందితుడి తరఫు న్యాయవాది కోర్టుకు హాజరుకాకపోవడంతో.. తదుపరి వాదనల నిమిత్తం న్యాయాధికారి వాయిదా వేశారు.

వెంకటేష్ నాయుడు కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు వెంకటేష్ నాయుడు (ఏ34) కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. నిందితుడిని ఒక రోజుకు కస్టడీకి కోరుతూ గతంలో సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం.. ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. దీనిని ఈనెల 27కు న్యాయాధికారి వాయిదా వేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేలకు ఒరిగిన పంటలను బుధవారం ఆ సంఘం నాయకులు పరిశీలించారు. మండలంలో 600 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి తక్షణమే పంట నష్టాన్ని అందించి ఆదుకోవాలని కోరారు. ఎకరాకు రూ.50 నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అయిందని తెలిపారు. ఆయన వెంట ఆనందరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: స్థానిక పంచాయతీ 9వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుని మురుగునీరు పారడం లేదని అందిన ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించారు. కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

27న ఎస్సీ కమిషన్ సమావేశం

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఈ నెల 27 శుక్రవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తెలిపారు. దళితుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నందున జిల్లాలో వారికోసం చేపట్టిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై చర్చిస్తామన్నారు. బుధవారం మండలంలోని అమ్మిరెడ్డిగూడెం వచ్చిన సందర్భంగా ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో ఎస్సీల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు కలెక్టర్, సీపీతో సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

దిగుబడులు ఘనం.. ధరలు పతనం

కూరగాయల ధరలు తగ్గడంతో ఆందోళనలో అన్నదాతలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

నియోజకవర్గ రైతులు పండించిన కూరగాయలకు విపణిలో గిట్టుబాటు ధర లభించడం లేదు. స్థానికంగా అన్నదాతలు టమాటా, సొర, బెండ తదితర కూరగాయలు పండిస్తున్నారు. పంట దిగుబడి బాగున్నా మార్కెట్‌లో ఆశించిన ధర లభించక ఇబ్బందులు తప్పడం లేదు. సొర, టమాటా ధరలు పూర్తిగా క్షీణించి పెట్టుబడి కూడా రాదేమోనన్న ఆందోళనలో ఉన్నారు. ఉత్పత్తి దారునికి - వినియోగదారునికి మధ్య జరిగే కూరగాయల క్రయ విక్రయాల్లో కిలోకు రూ.10 వరకు ప్రయివేటు వ్యాపారుల జేబుల్లోకి చేరుతోంది. ✪ పండించిన రైతు వద్ద సొరకాయ రూ.6, కిలో టమాటా రూ.10, బీర రూ.40, బెండ రూ.20 వరకు ఉంది. వ్యాపారులు మార్కెట్‌లో రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు. విపణిలో సొరకాయ రూ.15 నుంచి రూ.20, కిలో టమాటా రూ.20, బీర రూ.60, బెండ రూ.40 వరకు ఉంది.

పెట్టుబడి కూడా రాని దుస్థితి..

తిరువూరు మండలం సూరవరం, గొల్లగూడెం, కొత్తూరు, గంపలగూడెం మండలం చింతలనర్వ, సొబ్బాల, గాదెవారిగూడెం, ఎ.కొండూరు మండలం మారేపల్లి, విస్సన్నపేట మండలంలో ఈ ఏడాది 200 ఎకరాల్లో ఆకు, కాయగూరలు సాగు చేశారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి, కౌలు భూమి అయితే మరో రూ.25 వేలు వెరసి రూ.65 వేలు టమాటా సాగుకు ఖర్చు చేశారు. ప్రస్తుతం 25 కిలోల ట్రే ధర రూ.200కు అమ్మితే గగనమే. ప్రధాన మార్కెట్లకు తరలిస్తే కూలీలు, రవాణా ఖర్చు అధికమై ఆ సొమ్ము కూడా వచ్చే పరిస్థితి లేదు.



సూరవరం: రహదారి పక్కన టమాటాలు విక్రయిస్తున్న రైతు

ఒకేసారి రావడంతో..

ఒకేసారి సొర, టమాటా తదితర కాయగూరలు మార్కెట్‌కు చేరడంతో ధర తగ్గింది. చిత్తూరు, మదనపల్లిలో అధిక విస్తీర్ణంలో సాగయ్యే టమాటా కూడా విపణికి చేరడంతో ధర పడిపోయింది. ఇక్కడి రైతులు ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు నాణ్యమైన టమాటా దిగుబడి సాధిస్తున్నారు. రైతు నుంచి వ్యాపారి వద్దకు వచ్చేసరికి విక్రయ ధరలో వ్యత్యాసం ఉంది. - **సోహెల్ అహ్మద్, గంపలగూడెం మండల ఉద్యానాధికారి**

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వేసవిలో పైపులైన్ల ఇబ్బంది లేకుండా గుర్తించిన ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు తెలిపారు. పురపాలికలోని పలు ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్టీసీ డిపో, ఆంజనేయ నగర్, ఆర్టీసీ కాలనీల వద్ద రూ.35 లక్షలతో తాగునీటి పైపులైన్లను వేయనున్నామని చెప్పారు. తాగునీటి పైపులైన్ల పనులన్నీ 15 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

25 టన్నుల యూరియా పంపిణీ

ఎ కొండూరు: మండల పరిధిలోని పోలిశెట్టిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున 25 టన్నుల యూరియా అందించినట్లు పీఏసీఎస్ ఛైర్మన్ తుమ్మూరు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో రావడంతో, యూరియా అందని వారి పేర్లు నమోదు చేసుకున్నామని.. రాగానే వారికి ఇస్తామని చెప్పారు.

ఔషధాల వినియోగంపై అవగాహన అవసరం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఔషధాల వినియోగంపై ప్రజలు సరైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. మందుల గడువు తేదీలను పరిశీలించి తీసుకోవాలన్నారు. వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయోటిక్స్ వాడవద్దన్నారు. ఎవరికి వారు సొంతంగా మందులు వాడకూడదని, వైద్యులు సూచించిన విధంగా పూర్తి కోర్సు వాడాలని చెప్పారు. ఆయా అంశాలతోపాటు నాణ్యమైన జనరిక్ ఔషధాల ప్రోత్సాహంపై రూపొందించిన ప్రచార పత్రాలను నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీరామమూర్తి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు కె.వి.భూపేష్, బి.గోపాలకృష్ణ, జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి డి.వి.ఆర్.సాయికుమార్, ఉపాధ్యక్షుడు కె.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిసలు కావొద్దు

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని సినీ నటుడు సుమన్ కోరారు. బుధవారం రాత్రి నందిగామ శ్రీకరం కల్యాణ మండపంలో డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై సినీ రంగంలో కొందరు తమ భవిష్యత్తును కోల్పోయారన్నారు. తాను ఆరోగ్యంగా ఉండబట్టే ఇప్పటికీ సినిమాల్లో నటించగలుగుతున్నానని అన్నారు. 35 రోజులు 500 కి.మీ సైకిల్ యాత్ర చేసిన మహిళా పోలీసులు రేవతి, హైమావతి, శైలజ, త్రివేణి, ఉషారాణిలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అభినందించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, నాయకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. విజయవాడ రూరల్ మండలం రాయనపాడులో చెరువు వద్ద నిర్మించిన శ్రీసోమేశ్వరస్వామి శివాలయంలో శివలింగం, నందీశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సానుకూల భావాలను పెంపొందిస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు భక్తి, ఐక్యత ప్రతీకలు అని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



శివపార్వతుల ఉత్సవమూర్తులతో వేదపండితులు

సత్యాలపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని సత్యాలపాడు సమీప చెన్నవరం క్రాస్ రోడ్డులో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. గంగా పార్వతి సమేత కాశీ విశ్వనాథ శివలింగం, గణపతి, ద్వారా పాలకులు, నందీశ్వరుడు, నవగ్రహాలు, శిఖరం, దక్షిణామూర్తి, ఈశ్వరీదేవి, మత్స్య యంత్రం, కాలభైరవుడు, చండీశ్వరుడు, వీరభద్రస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, జంట నాగులు విగ్రహాలు, ధ్వజస్తంభం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

పోస్టల్ సేవలు ప్రజలకు చేరువ చేయాలి



వెల్లటూరులో సమావేశంలో పాల్గొన్న శ్రీదేవి, పోస్టల్ సిబ్బంది

జి.కొండూరు, న్యూస్‌టుడే: పోస్టల్ సేవలను ప్రజలకు మరింతగా చేరువయ్యేలా చేయాలని ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి ఆదేశించారు. వెల్లటూరు బ్రాంచి పోస్టాఫీసులో బుధవారం మండలంలోని పోస్టల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మెయిల్ బుకింగ్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను ప్రజలకు వివరించాలని, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పోస్టాఫీసులు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. వ్యయ-ఆదాయ నిష్పత్తి సక్రమంగా నిర్వహించాలని, బీమా సంకల్పం 3.0లో మంచి ప్రతిభ చూపిన వారిని ఘనంగా సన్మానించారు. పోస్టల్ సిబ్బంది అందించే సేవలు పేదలకు వివరించి వారంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. విజయవాడ డివిజన్ సూపరింటెండెంట్ నరసింహస్వామి, ఏఎస్‌పీ రవికిశోర్, ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజకుమారి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ వి.రాజకుమారి బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, ఎంపీడీవో టి.సరస్వతి, డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు, సర్పంచి డి.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కె.వెంకటకృష్ణ, తెదేపా నాయకులు బి.మధుసూదనరావు, వి.రాజశేఖర్, వి.చినఅనంతరామయ్య, వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పోలిశెట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్ బాబు సూచించారు. మండల పరిధిలోని ఆ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. శోభన్ బాబు మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ఇప్పటి నుంచే తమ లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకోవాలన్నారు. పాఠశాల సిబ్బంది, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

200 మందికి మందుల పంపిణీ



సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న కూటమి నాయకులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడిలో బుధవారం ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 240 మంది గ్రామస్థులు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని తెదేపా రాష్ట్ర కార్యదర్శి జంపాల సీతారామయ్య ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవే లక్ష్యంగా ఎన్టీటీపీఎస్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్టీటీపీఎస్ పర్యవేక్షక ఇంజినీరు మారుతి ప్రసాద్, పి.అనురాధ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో తమ సంస్థ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కూటమి నాయకులు అక్కల గాంధీ, విజయబాబు, పిచ్చేశ్వరరావు, గ్రామ సర్పంచి దేవమాత, కార్యదర్శి భాగ్యలక్ష్మి, అధికారులు శ్రీదేవి, ప్రభాకరశాస్త్రి, హరినారాయణ, సుభాషిణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, రహదారి నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు హెల్ప్ ఫౌండేషన్ సంస్థ కో ఛైర్మన్ ఎలిజబెత్ రాణి తెలిపారు. కేతనకొండ గ్రామంలోని జానెట్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు ముందుకు వచ్చి తమ సంస్థతో కలిసి బాధ్యతతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి బాధ్యతతో.. సామాజిక దృష్టితో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు సున్నా శాతానికి వస్తాయన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎలిజబెత్ రాణి

డంపింగ్ యార్డులా రోడ్డు మార్జిన్



నూజివీడు-గంపలగూడెం ఆర్ అండ్ బీ రహదారి రంగాపురం చెరువు కట్ట దగ్గర రోడ్డు మార్జిన్‌లో చెత్త పడేస్తుండటంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారుతోంది. కుళ్లిన వ్యర్థాలను రహదారి పక్కనే పారబోయడంతో తీవ్ర దుర్గంధంతో పాటు చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మార్జిన్‌లో చెత్త వేయడం వల్ల మార్జిన్లు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

మార్చి 10 వరకు జనసేన సభ్యత్వ నమోదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నుంచి మార్చి 10వ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ వెంకటకృష్ణారావు తెలిపారు. సభ్యత్వం ఉన్న వారికి ప్రమాద మరణం సంభవిస్తే రూ.5 లక్షల వరకు బీమా వస్తుందన్నారు. సభ్యత్వ నమోదు రుసుం రూ.400 చెల్లించాలన్నారు.

1న గురుకులాల్లో ప్రవేశాలకు అర్హత పరీక్ష

గంపలగూడెం, : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 1న అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి అంగడి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎ.కొండూరు, తిరువూరు, జి.కొండూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల్లోని గురుకులాల్లో 1వ తేదీన 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 11 వరకు, ప్రథమ ఇంటర్‌కు మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు, నీట్, ఐఐటీకి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఖాళీలు భర్తీ చేసేందుకు 8వ తేదీన 6, 7 తరగతులకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, 8, 9, 10 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు అర్హత పరీక్ష జరుగుతుందన్నారు. హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, హాల్ టికెట్‌తో రావాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు.. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు బుధవారం తెలిపాయి. డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్ కోర్సులో మూడు నెలలపాటు తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే శిక్షణ తరగతుల్లో పాల్గొనేందుకు మార్చి 8వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

లంక భూముల విక్రయాలపై చర్యలు చేపట్టండి

ఇబ్రహీంపట్నం: నకిలీ పాస్ పుస్తకాలతో దాములూరు లంక భూములు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయని స్థానికులు తహసీల్దారు వెంకటేశ్వర్లుకు తెలిపారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త హఫీజ్ తహసీల్దారుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఇబ్రహీంపట్నం మండల శివారు దాములూరుకు చెందిన 129 సర్వే నంబర్‌లో ఈ క్రయ విక్రయాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. నకిలీ పుస్తకాలను తయారు చేయడం వెనుక ఉన్న రెవెన్యూ సిబ్బందిని సైతం గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కొన్ని విక్రయాలు జరిగినందున వాటిని సైతం వెలికితీయాలని కోరారు.

ఆలయంలో చోరీ... రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నాగులూరులోని అంకమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి హుండీలోని కానుకలు చోరీ చేశారు. గుడి తలుపులు పగలగొట్టి హుండీని బయటకు తీసుకొచ్చి అందులో ఉన్న నగదును తీసుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయాన్ని శుభ్రపరిచేందుకు వెళ్లిన కోటేశ్వరమ్మ చూసి గ్రామ పెద్దలకు తెలియజేయడంతో విషయం తెలిసింది. రెడ్డిగూడెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

మూడో రోజు సజావుగా ఇంటర్ పరీక్షలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మూడో రోజు బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం నాలుగు కేంద్రాలలో 1812 మందికి గాను 1737 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, 75 మంది గైర్హాజరు అయ్యారని కస్టోడియన్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు తరలిరావడంతో మండల కేంద్రం విస్సన్నపేటలో సందడెల కొంది. ఎస్ఐ అర్జున్‌రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మైలవరం, న్యూస్‌టుడే: ఇంటర్ మొదటి సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు 11 మంది గైర్హాజరు అయినట్లు వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఎస్ రాధాకృష్ణ తెలిపారు. బుధవారం మొత్తం 322 మందికి గానూ 311 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండలం చిక్కుళ్లగూడెంలో ఇటీవల జరిగిన బంగారు గొలుసు చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని లక్ష్మీపురం గ్రామ కూడలి వద్ద అదుపులోకి తీసుకుని అతని నుంచి 40 గ్రాముల బంగారు గొలుసు, చోరీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శాతకర్ణి బుధవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... నిందితుడు సుభాష్ బాబు విజయవాడ సీతారాంపురంలో విద్యుత్తు శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

అదృశ్యమైన బాలిక గుర్తింపు

మైలవరం, న్యూస్‌టుడే: ఇంటర్ చదువుతున్న పదిహేనేళ్ల బాలిక అదృశ్యం కాగా.. ఒక రోజు వ్యవధిలోనే పోలీసులు గుర్తించారు. తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు నిరాకరించడంతో తిరువూరులోని గ్రామవికాస శక్తిసదన్ హోంకు తరలించారు. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎ.కొండూరు మండలానికి చెందిన ఒక కుటుంబం ఉపాధి నిమిత్తం మైలవరంలో నివసిస్తూ పనులు చేసుకుంటున్నారు. ఇంటర్ చదువుతున్న తమ కుమార్తె సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదంటూ బాలిక తల్లిదండ్రులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె సెల్‌ఫోన్ సిగ్నల్ మంగళగిరి సమీపంలో ఆగినట్లు గుర్తించిన పోలీసులు ఒక బృందాన్ని అక్కడికి పంపారు. గతంలో ఆ ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఉన్న పరిచయాన్ని గుర్తించి ఆరా తీయగా.. వారి అనుమానం నిజమై, మంగళగిరిలో ఆమె ఆచూకీ లభించింది. అయితే తానే వచ్చేశానని తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు నిరాకరించడంతో పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో తిరువూరులోని హోంకు పంపినట్లు ఎస్సై తెలిపారు.

'దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి డ్రగ్స్ వాడొద్దు'



ప్రదర్శనగా బయలుదేరిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'సే టూ నో డ్రగ్స్' కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాక్‌ఫెల్లర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ సమాజానికి శత్రువు, దేశాన్ని ప్రేమించే ఏ వ్యక్తి డ్రగ్స్‌ను వినియోగించవద్దని పేర్కొన్నారు. గ్రామంలో డ్రగ్స్ ఎక్కడ కనిపించినా.. వాటికి సంబంధిన సమాచారం తెలిసినా 1972 టోల్ ఫ్రీ నంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. ఎన్‌డీపీఎస్ చట్టం, దాని పరిధిలో విధించే శిక్షల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఏఎన్‌వో అదిలక్ష్మి, పీడీ ఎస్కే రషీద్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టిన ముగ్గురి అరెస్టు

నకిరేకల్(శాలిగౌరారం), న్యూస్‌టుడే: నకిలీ బంగారు ఆభరణాలు అంటగట్టి డబ్బులతో ఉడాయించిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శాలిగౌరారం మండలం రామాంజపురం గ్రామానికి చెందిన సీహెచ్.రాజు వద్దకు ఈనెల 6న ముగ్గురు వచ్చారు. తాము బాతులు పెంచుతుంటామని పరిచయం చేసుకున్నారు. రాజమండ్రి ప్రాంతంలో గతంలో వచ్చిన వరదల వల్ల గ్రామాలు నీట మునిగి పలువురు మృతి చెందారని, వారికి సంబంధించిన 35 తులాల బంగారు ఆభరణాలు తమకు దొరికాయని, వాటిని సగం ధరకు విక్రయిస్తామని చెప్పారు. నమూనాగా మూడు గ్రాముల అసలైన బంగారం ఇచ్చి నమ్మించారు. రూ.7 లక్షలకు బేరం కుదుర్చుకుని ఈనెల 9న బాధితుడు రాజు వద్ద నుంచి డబ్బు తీసుకుని నకిలీ బంగారు వడ్డాణం, నల్లపూసల గుండ్లు అంటగట్టి ఉడాయించారు. బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఊటుకూరు గ్రామం వద్ద వాహనాల తనిఖీ సమయంలో అనుమానాస్పదంగా, పొంతనలేని సమాధానాలు చెబుతున్న విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన కె.మాల్యాద్రి అలియాస్ వెంకటేశ్వర్లు, కె.సుబ్బమ్మ అలియాస్ సుభాషిణి, కె.కిశోర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నేరం అంగీకరించారని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి ఎస్సై డి.సైదులు తెలిపారు. వారి నుంచి రూ.50వేలు, ఒక ఆటో, ద్విచక్రవాహనం, నకిలీ బంగారు నల్లపూసల గుండ్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పర్చామన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నసీరోద్దీన్, పీసీలు పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్ జాగ్రత్త..!



విస్సన్నపేటలో...

విస్సన్నపేట, న్యూస్‌టుడే: వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వీధుల్లోని రోడ్ల వెంట నడవాలంటే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు వణుకుతున్నారు. మండల కేంద్రం విస్సన్నపేటలోని బస్టాండు సెంటర్ నుంచి ఎ.కొండూరు, పుట్రేల, రెడ్డిగూడెం, నూజివీడు రోడ్లు, ప్రధాన దేవాలయాలు, చికెన్ సెంటర్లు, మటన్ దుకాణాల ప్రాంతాల్లో శునకాల సంచారం అధికమవడంతో ఆయా ప్రాంతవాసులు బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఇప్పటికే వీటి బారినపడి 20 మంది ఆసుపత్రి పాలయ్యారంటే బెడద ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది.

ఒకేరోజు ఐదుగురిని కరిచి..

ఎన్టీఆర్ కాలనీలో కొందరు వేట కుక్కలను పెంచుతున్నారని వాటిని అదుపు చేయకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఒక్క రోజే ఐదుగురిని కరవడంతో కాలనీలో అలజడి మొదలైంది. పిల్లలు, వృద్ధుల రక్షణ కోసం పనులు మానుకుని ఇంటిపట్టునే ఉండాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. సంబంధిత మండల, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఆవులు, గేదెలు, జీవాలు (మేకలు, గొర్రెలు)పై కూడా దాడి చేసి కరవడం వల్ల ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని సంబంధిత యజమానులు చెబుతున్నారు.

యజమానులకు నోటీసులు ఇచ్చాం - ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు పంచాయతీ అధికారుల సమక్షంలో సంబంధిత వేట కుక్కల యజమానులకు నోటీసులు ఇచ్చాం. అదుపులో పెట్టకపోతే వాటిని స్వాధీనం చేసుకుని బ్లూ క్రాస్ ఆఫ్ ఇండియా జంతు సంరక్షణ కేంద్రానికి తరలిస్తాం.

విధుల్లో చేరిన పీఏసీఎస్ ఉద్యోగులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం సమస్యలు పరిష్కరించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని పీఏసీఎస్ ఉద్యోగులు నిరవధిక సమ్మెను విరమించి బుధవారం విధుల్లో చేరారు. సహకార సంఘాల్లో రైతులకు అందించాల్సిన సేవలు ప్రారంభించారు. మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో జరిగిన చర్చలు సఫలమయ్యాయని పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ నాయకుడు బొల్లినేని రఘురామ్ బుధవారం తెలిపారు. గ్రాట్యుటీ, వేతనం, ఆరోగ్య బీమా పరిష్కరించగా మరికొన్ని సమస్యల పరిష్కారానికి హై లెవల్ కమిటీకి బాధ్యతలు అప్పగించారన్నారు. సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులకు అభినందనలు తెలిపారు.

తిరువూరు వైకాపా నేతలు తెదేపాలో చేరిక

పటమట, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గానికి చెందిన వైకాపా నేతలు కొందరు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. తెదేపా తిరువూరు పట్టణ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరువూరుకు చెందిన వైకాపా రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రామడుగు రామకోట చారి, గీతం స్కూల్ కరస్పాండెంట్ గీతమ్మ చారి ఎంపీ శివనాథ్ సమక్షంలో తెదేపాలో చేరారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో వారికి ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెదేపా బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నాయకులు కందిమళ్ల శ్రీనివాసరావు, మాదల హరిచరణ్, మోదుగ వెంకటేశ్వరరావు, యండ్రాతి కిరణ్, తుళ్లూరి అనిల్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, చిన్న జమలయ్య, తదితరులు పాల్గొన్నారు.




సభా సమయం

బాబాయ్‌ని చంపి కత్తి మా చేతిలో పెట్టారు

- వీఎస్ఆర్‌ను హెరిటేజ్‌కు ముడిపెట్టడమూ అలాంటిదే
- 2022లో హెచ్ఎఫ్ఎల్ నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ రుణం తీసుకుంది
- మా ఎంపీ కేంద్ర మంత్రి అవుతారని... అజిత్‌పవార్ వీఎస్ఆర్ విమానంలో ప్రయాణిస్తారని కలగన్నామా?
- మంత్రి లోకేశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'బాబాయ్‌ని చంపి కత్తి మా చేతిలో పెట్టారు. ఇప్పుడు వీఎస్ఆర్ ఏవియేషన్ సంస్థకు, హెరిటేజ్‌కు ముడిపెడుతూ వైకాపా నాయకులు చేస్తున్న ఆరోపణలూ అలాంటివే' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. హెరిటేజ్‌కు, వీఎస్ఆర్ ఏవియేషన్‌కూ ఎలాంటి సంబంధం లేదన్నారు. శాసనసభ లాబీలో బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "హెరిటేజ్ ఫిన్‌లీజ్ (హెచ్ఎఫ్ఎల్) నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ 2022, 2023 సంవత్సరాల్లో రుణం తీసుకుంది. హెచ్ఎఫ్ఎల్ 1996లో రిజర్వుబ్యాంకు మార్గదర్శకాల ప్రకారం ఏర్పాటైన నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ). ఆ సంస్థ వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలు, అడ్వాన్సులు ఇస్తుంది. హెచ్ఎఫ్ఎల్ నుంచి రుణం తీసుకున్న సంస్థలు, వ్యక్తులు సుమారు 10 వేల మంది ఉంటారు. వారిలో వీఎస్ఆర్ వెంచర్స్ ఒకటి. వీఎస్ఆర్ వెంచర్స్ మొత్తం రుణాల్లో.. హెచ్ఎఫ్ఎల్ నుంచి తీసుకుంది ఆరు శాతమే' అని లోకేశ్ తెలిపారు. 'ఆ సంస్థకు రుణం ఇచ్చినప్పుడు.. మేం అధికారంలోకి వస్తామని, మా ఎంపీ రామ్మోహన్‌నాయుడు పౌరవిమానయానశాఖ మంత్రి అవుతారని, వీఎస్ఆర్ కంపెనీకి చెందిన విమానంలో అజిత్ పవార్ ప్రయాణిస్తారని, అది ప్రమాదానికి గురవుతుందని కలగన్నామా? మేమేమన్నా జ్యోతిష్యులమా?' అని లోకేశ్ ప్రశ్నించారు. జగన్, ఆయన పత్రిక సాక్షి చేసే ప్రతి నిరాధార ఆరోపణకూ తాను సమాధానం చెప్పాల్సిన పనిలేదని, స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకూ దీటైన సమాధానం చెబుతామని తెలిపారు.

గజదొంగ జగన్ అని బొత్స చెబుతున్నారా?



చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగల్ని వదిలేస్తున్నారంటూ ప్రభుత్వంపై శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రస్తావించగా.. 'అంటే జగన్ గజదొంగని, ఆయనను పట్టుకోవాలని బొత్స చెబుతున్నారా' అని లోకేశ్ బదులిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తమ పార్టీ నాయకులపై ఫైబర్‌నెట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, మద్యం, ఇసుక, ఎసైన్డ్ భూములకు సంబంధించి దొంగ కేసులు పెట్టారని లోకేశ్ ధ్వజమెత్తారు. 'ఛార్జిషీటు దాఖలు చేసేటప్పుడు కాంపిటెంట్ అథారిటీ నుంచి అనుమతి పొందాలి. మంత్రులైతే గవర్నర్, ఎమ్మెల్యేలైతే స్పీకర్ నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఒక్క ఆధారమైనా చూపారా? వారు పెట్టినవన్నీ తప్పుడు కేసులు' అని లోకేశ్ ధ్వజమెత్తారు.

ఎమ్మెల్యేలకు ఓరియంటేషన్ క్లాసులు

పార్టీ కార్యాలయాన్ని ఒక యూనివర్సిటీలా మార్చేశామని, సంవత్సరమంతా ఇక్కడ ఎప్పుడూ ఎవరికో ఒకరికి శిక్షణ తరగతులు జరుగుతూనే ఉంటాయని లోకేశ్ తెలిపారు. త్వరలో ఎమ్మెల్యేలకు రెండు రోజులపాటు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో మాదిరిగా.. ఎమ్మెల్యేలు రెండు రోజులు పూర్తి సమయం పార్టీ కార్యాలయంలోనే ఉండాలని ఆయన చెప్పారు. దానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రిన్సిపల్ కాగా.. తామంతా విద్యార్థులమని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాలవారీగా పార్టీ ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తాను నిర్వహిస్తున్న భేటీలు... పూర్తిగా కుటుంబ సమావేశాల్లానే జరుగుతున్నాయని, వాటిలో రాజకీయాల గురించి అసలు ప్రస్తావించడం లేదని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాయకుల్లో సగం మందివి ప్రేమవివాహాలే అని తెలిసి బాగా నవ్వుకున్నానని చెప్పారు.

జాబ్ మేళాలతో లక్ష ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు పేర్కొన్నారు. వీటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం' అని మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, బుచ్చయ్య చౌదరి, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, మద్దిపాటి వెంకట్రాజు తదితరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన పలు అంశాలు వెల్లడించారు. వివరాలివీ..

22 క్లస్టర్ల ఆధారిత వ్యవస్థ ద్వారా అన్ని పరిశ్రమలూ ఏర్పాటు

'ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామనేది మన హామీ. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను గుర్తించాం. రాయలసీమలోని అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలు జిల్లాలో రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్, కడప, చిత్తూరు జిల్లాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, నెల్లూరులో గ్లాస్, ఏసీలు, ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైజెస్, స్టీల్ ఇలా...అనేక రకాల క్లస్టర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఒక పరిశ్రమతో పాటు అనుబంధ తయారీ రంగాలను కూడా అదే వ్యవస్థలోకి తీసుకురావాలనేది దీని లక్ష్యం.

- ఉదాహరణకు ఐఫోన్‌లో డిజైన్, మార్కెటింగ్ మినహా మిగిలిన తయారీ అంతా ఫాక్స్‌కాన్ చేస్తుంది. ఆ ఫోన్‌లో వివిధ విభాగాలను 2వేల మంది సరఫరాదారులు అందిస్తారు. వీరందరినీ ఒకే వ్యవస్థలోకి తీసుకురావడమే క్లస్టర్.
- భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా గ్లాస్ వినియోగం పెరుగుతుంది. దాని తయారీ యంత్రాలను ఉత్పత్తి చేసే సంస్థలను కూడా ఒకే క్లస్టర్‌లోకి తీసుకువస్తాం.
- ర్యాపిడ్ ప్రొటోటైపింగ్ డిజైన్ టెస్టింగ్ సెంటర్‌ను తిరుపతి ఐఐటీకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. తిరుపతి ఐఐటీలో సోలార్ సెల్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో బీటెక్, ఎంటెక్‌తోపాటు పరిశోధన కోర్సుల ఏర్పాటుకు అక్కడి డైరెక్టర్‌తో మాట్లాడుతున్నాం.

ఏసీల ఉత్పత్తిలో 50% వాటా ఏపీదే

- భారత్‌లో 100 ఏసీలు ఉత్పత్తవుతుంటే అందులో 50 ఏపీలోనే తయారవుతున్నాయి. పరిశ్రమల శాఖ మంత్రి భరత్ కృషి వల్ల డైకిన్, బ్లూస్టార్, ఎల్‌జీ కంపెనీలు రాష్ట్రంలో మరింతగా విస్తరించనున్నాయి. ఇవన్నీ పూర్తయితే 70% ఏసీలు ఏపీలోనే తయారవుతాయి. హీట్ పంపులు తయారుచేస్తామని పరిశ్రమలు ముందుకొస్తున్నాయి. వాటికి యూరప్‌లో డిమాండ్ ఉంది. వాటి పరీక్షలకు ఖర్చు ఎక్కువని, పరీక్షలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పరిశ్రమ కోరుతోంది.
- ఇప్పటికే వివిధ పెట్టుబడుల సదస్సులో వచ్చిన 770 ప్రాజెక్టులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం అనుశీలన చేస్తోంది. వారితో ఒప్పందాలు అయ్యాయి. వారు ఏ క్లస్టర్‌లోకి వస్తారు? ఎలాంటి పనివారు కావాలో పరిశీలించి, అందించే ప్రయత్నాలు చేస్తున్నాం.
- నైపుణ్యం పోర్టల్‌లో ఉద్యోగార్థులను, ఉద్యోగం ఇచ్చేవారిని అనుసంధానిస్తాం. దీనిలో యువత తమ రెజ్యూమ్ తయారు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవచ్చు. ఈ పోర్టల్ ద్వారా ఏఐ ఆధారిత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఆధారిత కోర్సులు చేయొచ్చు. ఏఐ స్కిల్ ఎసెసర్‌తో నైపుణ్యాన్ని సొంతంగా అంచనా వేసుకోవచ్చు. మార్చి నెలాఖరుకు ఈ పోర్టల్ పూర్తిగా సిద్ధమవుతుంది.

ఇంటర్న్‌షిప్ మెరుగుదలకు కమిటీ

రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ అవసరమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చెప్పారు. నిజమే. నేను కూడా జి క్యాపిటల్, సింగపూర్ ప్రధాని ఆఫీసు ఇలా మూడు చోట్ల ఇంటర్న్‌షిప్ చేశాను. దాని వల్ల ప్రయోజనమేంటో కాదు అందులో ఇబ్బందులు కూడా తెలుసు. మన బాస్ మనకు సమయం ఇవ్వకపోతే, మెంటార్‌గా ఉండకపోతే ఇంటర్న్‌షిప్ ఉపయోగం ఉండదు. అందుకే ఎమ్మెల్యే వెంకట్రావు నాయకత్వంలో ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేద్దాం. ఉపసభాపతి మిగిలిన నలుగురి పేర్లు ఇవ్వాలి. వారి సిఫార్సుల ఆధారంగా ఇంటర్న్‌షిప్ అంశాన్ని మెరుగుపరుద్దాం. నేనొక్కడినే కాదు.. 175 మంది కలిసి అన్ని పనులూ పూర్తి చేద్దాం.

5 లక్షల మందికి పారా మెడికల్ శిక్షణ

పారా మెడికల్, నర్సింగ్ కోర్సులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. జపాన్, జర్మన్ భాషల్లో శిక్షణ ఇచ్చాం. 5 లక్షల మందికి శిక్షణ ఇచ్చి విదేశాలకు పంపాలనుకుంటున్నాం. వైకాపా ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, పార్లమెంట్ నియోజకవర్గానికో స్కిల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెప్పినా చేయలేదు. వారి హయాంలో 2019-24 మధ్య ఎంత మందికి శిక్షణ ఇచ్చారో నివేదిక సమర్పిస్తాం. స్కిల్ శిక్షణ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నాం.

- నైపుణ్య శిక్షణపై సభ్యులు మంచి ప్రశ్నలు అడిగారని, మంత్రి లోకేశ్ చక్కగా సమాధానాలు చెప్పారని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో దేవాలయాలకు 150 శాతం పెరిగిన భక్తుల రద్దీ

- వైకాపా హయాంలో భక్తులకు మర్యాద, గౌరవం లేదు
- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాలయాలకు వచ్చే భక్తులు 150% పెరిగారని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. వైకాపా హయాంలో భక్తులకు గౌరవమే దక్కలేదని, అమర్యాదగా ప్రవర్తించారని.. దీంతో దేవాలయాలకు వెళ్లేవారి సంఖ్య కూడా తగ్గిపోయిందని విమర్శించారు. 'గత ప్రభుత్వంలో తగాదాలు, కొట్లాటలు చూశాం..కానీ భగవంతుడితో కూడా కొట్లాడే పరిస్థితి ఉంది. రామతీర్థం ఆలయంతో దేవాలయాల విధ్వంసం ప్రారంభించారు' అని ఆయన ధ్వజమెత్తారు. అసెంబ్లీలో బుధవారం ఆయన దేవాదాయశాఖకు గ్రాంట్ల అభ్యర్థనపై చర్చ అనంతరం మాట్లాడారు. 'శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 5వేల భజన మందిరాలకు శ్రీకారం చుట్టాం. 66 నియోజకవర్గాల్లో రూ.113.25 కోట్లతో 679 మందిరాలు నిర్మించాం. టిడ్కో కాలనీల్లో ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఆలయాలు నిర్మిస్తాం' అని వివరించారు. గోదావరి పుష్కరాలను మహా కుంభమేళాకు మించి నిర్వహించేలా ప్రతిపాదనలు రూపొందించామని, వీటికి అదనపు నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి నిధులు కోరాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సూచించారు. రాజమహేంద్రవరంలో ఉమామార్కండేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని, పట్టిసీమ దేవస్థానానికి ఫుట్‌బ్రిడ్జి నిర్మించాలని రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి కోరారు. దళితవాడల్లో భజన మందిరాలను కల్యాణ మండపాలకు ఉపయోగించుకునేలా నిర్మించాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూచించారు.

కల్తీ నెయ్యి వ్యవహారంలో గజదొంగని కదా పట్టుకోవాల్సింది..?

మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



ఈనాడు, అమరావతి: 'కల్తీ నెయ్యి వ్యవహారంలో చిల్లర దొంగలనే కాదు.. గజదొంగని కదా పట్టుకోవాల్సింది' అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. తప్పు చేశారని తేలినవారిపై చర్యలు తీసుకుంటే అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. 'చిల్లర దొంగలందరికీ ఎందుకు.. ఇక మొత్తంగా కొట్టేద్దామని ఇప్పుడు కేజీ నెయ్యి ధరను రూ.320 నుంచి రూ.658కి పెంచేశారేమో' అని ఆరోపించారు. 'వైవీ సుబ్బారెడ్డి భార్య బైబిల్ పట్టుకున్నారంటూ అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడడం చూస్తుంటే ప్రపంచం ఎటు పోతోందో అనిపిస్తోంది. విజయమ్మ తన చేతిలోని బైబిల్‌ను పట్టుకోవాలని ఇస్తే వైవీ సుబ్బారెడ్డి భార్య పట్టుకుని తర్వాత ఆమెకు తిరిగిచ్చేశారు. అది చూపించి అదిగో ఆమె బైబిల్ పట్టుకున్నారని సీఎం మాట్లాడటం ఏమిటి? సుబ్బారెడ్డి భార్య పెద్ద భక్తురాలు. తిరుమలలో, వారి ఇంట్లో ఆమె ఎప్పుడూ పూజలు చేస్తుంటారు' అని బొత్స తెలిపారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ దినేష్‌కుమార్ బుధవారం సీఎంను కలవడం గురించి విలేకరులు ప్రస్తావించగా... 'మర్యాదపూర్వకంగా ఆయన సీఎంను కలిసి ఉంటారు. ప్రభుత్వ ఇంట్రస్ట్ ఏంటనేది సీఎం ఆయనకు చెప్పి ఉంటారు' అని బొత్స వ్యాఖ్యానించారు.

స్త్రీశక్తి పథకం కింద 47 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు

- ఇక దివ్యాంగులకూ ఉచితమే
- హాల్ టికెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు కూడా...
- రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు-అమరావతి: స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం కింద మహిళలు ఇప్పటివరకు 47 కోట్ల ప్రయాణాలు చేశారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వివరించారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.1,660 కోట్లు కేటాయించిందని వివరించారు. స్త్రీశక్తి పథకానికి 9,500 బస్సులను కేటాయించామన్నారు.



అసెంబ్లీలో బుధవారం రవాణాశాఖకు గ్రాంట్ల విడుదలపై చర్చ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగులకూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ సూచన మేరకు విద్యార్థులు హాల్‌టికెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్షా కేంద్రాలకు వెళ్లే అవకాశం కల్పించామన్నారు. ఆటోడ్రైవర్‌సేవలో పథకం కింద వాహన మరమ్మతుల నిమిత్తం 2,90,699 మందికి రూ.15వేల చొప్పున రూ.436 కోట్ల ఆర్థిక సాయం అందించామని, దీన్ని ఏటా కొనసాగిస్తామని మంత్రి చెప్పారు. ట్రాక్టర్లకు దమ్ముచక్రాలు బిగించుకుని తిరగడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, దీనిపై రవాణాశాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తామని మంత్రి మండిపల్లి పేర్కొన్నారు. ఆర్టీసీకి 2,700 కొత్త బస్సులు సమకూర్చనున్నట్లు వివరించారు. పీఎం ఈ-బస్ సేవ ద్వారా రాష్ట్రానికి 750 కొత్త బస్సులు రానున్నాయన్నారు. 9 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్‌ట్రాక్‌లు పనిచేస్తున్నాయని.. సీఎస్ఆర్ కింద మారుతీ సుజుకి మరో 5 ఏర్పాటు చేయనుందని వివరించారు. 18 జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయని, మిగిలిన జిల్లాల్లో త్వరలో ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు.

ఛార్జీలు పెంచలేదు

స్త్రీశక్తి పథకాన్ని మహిళలు బాగా ఉపయోగించుకుంటున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు చెప్పారు. ఈ పథకానికి బడ్జెట్‌లోనూ నిధులు భారీగా ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పల్లెవెలుగు బస్సులు తగ్గించిందని, వాటిని పెంచాలని కోరారు. ఇంద్ర బస్సుల స్థానంలో కొత్తవి తీసుకోవాలని ఈశ్వరరావు కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పింఛను రూ.వెయ్యే

ఆర్టీసీలో రిటైరైన ఉద్యోగులకు రూ.వెయ్యి పింఛనే వస్తోందని, ప్రభుత్వం సామాజిక పింఛన్ల కింద రూ.4వేల చొప్పున ఇస్తోందని, ఆర్టీసీ ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోరారు. వాహనాల ఫిట్‌నెస్‌కు ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు జిల్లాకొకటే ఉండగా, నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటుచేయాలని కోరారు.

వైకాపా పాలనలో ఏపీ రోడ్లను హేళన చేసిన జగన్ మిత్రుడు కేటీఆర్

మంత్రి జనార్దన్‌రెడ్డి



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు వైన్, మైన్ ద్వారా వచ్చే సొమ్ములు చాలవన్నట్లుగా.. తమ కమీషన్ల కోసం ఎన్‌డీబీ (న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) సహకారంతో చేపట్టే రోడ్ల నిర్మాణాన్నీ నిలిపేశారని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని ప్రాధాన్య క్రమంలో చేపట్టామని వివరించారు. వైకాపా హయాంలో ఏపీలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయంటూ.. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్నేహితుడైన కేటీఆర్ హేళన చేశారని పేర్కొన్నారు. 2026-27 ఏడాదికి రహదారులు, భవనాలశాఖకు నిధుల కోసం అభ్యర్థనపై చర్చ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో 43,505 కి.మీ ఆర్‌అండ్‌బీ రహదారులు ఉంటే వైకాపా హయాంలో 23 వేల కి.మీ మేర నడిచే పరిస్థితి కూడా లేనంతగా దెబ్బతిన్నాయి. రోడ్ల నిర్వహణ గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంక్రాంతిలోపే రూ.861 కోట్లతో 20,600 కి.మీ. మరమ్మతులు పూర్తి చేశాం' అని వివరించారు. పీపీపీ విధానంలో 12 రహదారుల పరిధిలోని 712 కి.మీ. విస్తరణకు రూ.5,231 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. రహదారుల నిర్మాణంలో అధునాతన సాంకేతికత వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. సకాలంలో మరమ్మతులు నిర్వహించేందుకు వీలుగా టెండర్ల విధానంలో సంస్కరణలు అమలు చేశామన్నారు. రహదారుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.2,526 కోట్లు కేటాయించారని.. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత కేటాయింపు లేదని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పెట్టిన బకాయిలను కూటమి ప్రభుత్వమే చెల్లించిందన్నారు. '2024-25లో రూ.11,325 కోట్లతో 770 కి.మీ జాతీయ రహదారులు నిర్మించాం. రూ.55,506 కోట్లతో 2,487 కి.మీ పనులు జరుగుతున్నాయి. 2025-26లో రూ.98,635 కోట్లతో 1,902 కి.మీ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం' అని తెలిపారు.

పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్‌లో సవరణలకు అవకాశం

ఈనాడు, అమరావతి: మార్చి నెలలో జరగనున్న పదో తరగతి (ఎస్ఎస్‌సీ) పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్‌లో వివరాల సవరణలకు పాఠశాల విద్యా శాఖ- ప్రభుత్వ పరీక్షల బోర్డు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు విద్యార్థులకు, పాఠశాలల యాజమాన్యాలకు కీలక సూచనలు జారీ చేసింది. విద్యార్థుల పేరు, పుట్టిన తేదీ లాంటి వివరాల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు ఈ నెల 26 నుంచి 28 వరకు గడువు విధించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కె.వి.శ్రీనివాసులురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 614 మండలాల పరిధిలో 3,497 పాఠశాలల నుంచి 9,986 మంది విద్యార్థుల సవరణ అభ్యర్థనలు అందాయి. ఆధార్‌తో ధ్రువీకరించిన వివరాలను మాత్రమే నిర్దేశిత గడువులోగా యూడీఐఎస్ఈ ప్లస్ పోర్టల్‌లో అప్డేట్ చేసుకోవచ్చు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోని వారికి, రికార్డులు ఇంకా సరిపోలని వారికి మార్చి చివరి వారం లేదా. . ఏప్రిల్ మొదటి వారంలో చివరిసారిగా అవకాశం కల్పిస్తాం' అని తెలిపారు.



ఆరోగ్యానికీ చక్రవడ్డీ సూత్రం

ఎంత తక్కువ వయసులో పెట్టుబడులు మొదలు పెడితే అంతమంచిదన్నట్లుగానే.. ఆరోగ్యం విషయంలోనూ ఇదే సూత్రం పనిచేస్తుంది. *20-30 ఏళ్ల వయసులో* వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం వంటి మంచి అలవాట్లు అలవరచుకుంటే ఆ ఫలితం *50 ఏళ్ల* వయసులో కనిపిస్తుంది. మీ శక్తి, చురుకుతనం, హృదయ సంబంధ దారుఢ్యం అత్యంత మెరుగైన స్థితిలో ఉంటాయి.

– కోమల్, ఆన్‌లైన్ ఫిట్‌నెస్ ట్రైనర్

102కు చేరిన అతిసార బాధితులు

- శ్రీకాకుళంలో వ్యాధి తీవ్రత తగ్గినట్లు వైద్యుల వెల్లడి
- ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన

ఈనాడు డిజిటల్ – శ్రీకాకుళం, న్యూస్‌టుడే– శ్రీకాకుళం అర్బన్, బలగ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రబలిన అతిసారం కేసులు 102కి చేరాయి. మంగళవారంతో పోల్చితే వ్యాధి ఉద్ధృతి తగ్గుముఖం పట్టింది. పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రి, కిమ్స్, జెమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర చర్యలను ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పర్యవేక్షిస్తున్నారు. ప్రత్యేకంగా నియమించిన 50 బృందాలు 24 గంటలు అందుబాటులో ఉండి వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాయి. బుధవారం నాటికి 85 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు డిశ్చార్జి అయ్యారు.

మరో 24 గంటల్లో సాధారణ స్థితి: మంత్రి

పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్థానిక ఎమ్మెల్యే శంకర్, కలెక్టర్‌లతో కలిసి అతిసారం ప్రబలిన ప్రాంతాలను పరిశీలించారు. కండ్రవీధిలో మృతిచెందిన సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుమార్తెకు ప్రభుత్వోద్యోగం ఇప్పించి, ఆదుకోవాలని స్థానికులు కోరారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి పరామర్శించారు. నగరపాలక కార్యాలయంలో అధికారులతో సమీక్ష అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 'శ్రీకాకుళంలో అతిసారాన్ని మరో 24 గంటల్లో అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నాం. 99 శాతం తాగునీటి కలుషితం, ఆహారకల్తీ వల్లే వ్యాధి వచ్చి ఉండొచ్చు. శ్రీకాకుళం నగర మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణకు రూ.10 కోట్లు మంజూరుచేస్తున్నాం. మరో రూ.60 కోట్లతో శాశ్వతమైన సంపులు, పైపులైన్లు రిజర్వాయర్, ప్లాట్‌ఫాం నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం' అని మంత్రి నారాయణ వివరించారు.



శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం కమిషనర్ కూర్మారావు సస్పెన్షన్

- అతిసారం కేసుల విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళంలో అతిసారం ప్రబలిన వ్యవహారంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.కూర్మారావును సస్పెండ్ చేసింది. పురపాలక శాఖ విశాఖ ప్రాంతీయ సంచాలకులు రవీంద్రకు శ్రీకాకుళం కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళంలో గత రెండు రోజుల్లో 91 అతిసారం కేసులు నమోదయ్యాయి. ఒకరు మృతిచెందారు. కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారాన్ని ప్రజలు తీసుకోవడమే అతిసారానికి కారణమని అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నీటిసరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని, పైపులైన్లలో లీకేజీలు లేకుండా చూడాలన్న సూచనలు విస్మరించారన్న కారణంతో నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మారావును సస్పెండ్ చేసినట్లు ముఖ్య కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన 14 రోజుల్లో సస్పెన్షన్

వ్యవసాయశాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) క్యాడర్‌కు చెందిన కూర్మారావు డిప్యుటేషన్‌పై ఈ నెల 11న శ్రీకాకుళం కమిషనర్‌గా చేరారు. బాధ్యతలు చేపట్టిన 14 రోజుల్లోనే సస్పెండయ్యారు.

'రైల్ పార్సిల్ యాప్'తో ఇక ఇంటి నుంచే బుకింగ్

ఆవిష్కరించిన ద.మ.రైల్వే జీఎం

ఈనాడు, హైదరాబాద్: పార్సిల్ బుకింగ్ కోసం క్యూలో నిలబడటం, ఫారాలు నింపడం, కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి వ్యయప్రయాసలు ఇక గతం కానున్నాయి. ద.మ.రైల్వే జోన్ నూతన తరం 'రైల్ పార్సిల్ యాప్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. బుధవారం రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో జోన్ జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. భారతీయ రైల్వేలో ఇదే తొలి సమగ్ర డిజిటల్ పార్సిల్ లాజిస్టిక్స్ అప్లికేషన్ అని ద.మ.రైల్వే తెలిపింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఇక పార్సిల్ బుకింగ్‌ను ట్యాక్సీ బుక్ చేసుకున్నంత సులభంగా బుక్ చేసుకోవచ్చని, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. యాప్‌తో ఇంటి నుంచే బుకింగ్, డెలివరీ సదుపాయం అందుతుందని తెలిపారు. కాగా, పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై నగరాల్లో అమలు చేస్తున్నారు.

అవగాహన ఒప్పందం..: ఐఐఎం బెంగళూరుతో ద.మ.రైల్వే అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జోన్ వ్యాప్తంగా ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌పై అధ్యయనం చేయడానికి ఎంఓయూపై సంతకాలు చేశారు. 2030 నాటికి 3,000 మిలియన్ టన్నుల సరకు రవాణా లక్ష్యాన్ని సాధించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని జీఎం పేర్కొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జోన్ జీఎం సంజయ్‌కుమార్

చిన్నారి పునర్వీక చికిత్స బాధ్యత నాదే

- ఇంజెక్షన్‌కు అవసరమైన మిగిలిన రూ.6 కోట్లు సమకూరుస్తాను
- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన చిన్నారి పునర్వీక చికిత్స బాధ్యత తాను తీసుకుంటానని... అందుకు అవసరమైన రూ.6 కోట్లు సమకూరుస్తానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. పునర్వీక ప్రాణాలు కాపాడే ఇంజెక్షన్ ధర రూ.16 కోట్లు కాగా, ఇప్పటికే దాతలు ముందుకొచ్చి రూ.10 కోట్లు సమకూర్చడం హర్షణీయమన్నారు. పాప ఆరోగ్యం కోసం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసినవారు, ప్రార్థించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. చిన్నారి పూర్తి ఆరోగ్యవంతురాలయ్యేందుకు అవసరమయ్యే అన్ని చర్యలూ తీసుకోవాల్సిందిగా తన సిబ్బందిని ఆదేశించారు. పాప పరిస్థితిని వివరిస్తూ ఆమె తల్లిదండ్రులు ఎక్స్ వేదికగా నారా లోకేశ్‌కు చేసిన విజ్ఞప్తిపై ఆయన ఈ మేరకు స్పందించారు.

కారడవిలో.. కారు చీకట్లో కాన్పు



లైట్ల వెలుతురులో బాలింత, బిడ్డకు సపర్యలు చేస్తున్న ఆశా కార్యకర్త, మహిళలు



ఆసుపత్రిలో బిడ్డతో సుమిత్ర

అనంతగిరి, న్యూస్‌టుడే: కారడవిలో, కారు చీకట్లో కటిక నేలపై ఓ గర్భిణికి ఆశా కార్యకర్త, మహిళలు పురుడుపోసిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలో చోటుచేసుకుంది. లుంగపర్తి పంచాయతీ మల్లిపాడుకు చెందిన గర్భిణి గొల్లోరి సుమిత్రకు బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో నొప్పులు వచ్చాయి. స్థానికులు, ఆశా కార్యకర్త కలిసి ఆమెను డోలీలో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో వారే సెల్, టార్చిలైట్ల వెలుతురులో సుమిత్రకు పురుడుపోశారు. ఈలోపు సమాచారం తెలుసుకున్న లుంగపర్తి ఆసుపత్రి సిబ్బంది అక్కడకు చేరుకుని బాలింత, శిశువును ఆసుపత్రికి తరలించారు. సుమిత్ర ఆడబిడ్డకు జన్మనివ్వగా.. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని బంధువులు తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

కొవ్వు తగ్గి... కండబలం పెరగాలంటే..!

నా వయసు 30 ఏళ్లు. ఎత్తు 155 సె.మీ. బరువు 60కిలోలు. బాడీఫ్యాట్ 34 శాతం. మజిల్‌మాస్ 23శాతం. ఫ్యాట్ తగ్గి, కండరాల సామర్థ్యం పెరగాలంటే ఎలాంటి డైట్ పాటించాలి? – ఓ సోదరి

మీరు తెలిపిన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) వివరాల ప్రకారం ఉండాల్సిన బరువు కంటే ఎక్కువగా ఉన్నారు. ఒబెసిటీ కేటగిరీలోకి వస్తారు. మీ ఎత్తు, వయసు ప్రకారం బాడీ ఫ్యాట్ 25-30శాతం, మజిల్‌మాస్ 27-33శాతంలోపు ఉండాలి. ఎందుకంటే వయసు పెరిగే కొద్దీ కండరాల దృఢత్వం తగ్గుతూ ఉంటుంది. మీకు 30ఏళ్లు అంటున్నారు. బహుశా ఇది కూడా ఒక కారణం కావొచ్చు. ముందు మీరు 8-10కిలోల బరువు తగ్గాలి. దాంతోపాటు కొవ్వు శాతాన్ని తగ్గించుకుని కండరాల దృఢత్వాన్ని పెంచుకోవాలి. ఇందుకు పోషకాహారం ఒక్కటే సరిపోదు. బ్రిస్క్ వాకింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు వారానికి 4-5రోజులు 30నిమిషాలపాటు తప్పనిసరిగా చేయాలి. ఇవి చేస్తూనే క్యాలరీలు తక్కువ, ప్రొటీన్ ఎక్కువగా ఉండే... బ్రౌన్ రైస్, మిల్లెట్స్‌తో చేసిన చపాతీ, పప్పు దినుసులు, పనీర్, సోయా వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే ఆకుకూరలు, కాయగూరల్ని తక్కువ నూనెతో వండి తినాలి. చికెన్, చేపలు, గుడ్లు ఆహారంలో తప్పక ఉండేలా చూడాలి. అలాగే రోజూ మీరు తినే ఆహారంలో ఆయిల్ నాలుగు టీస్పూన్లకు మించనీయొద్దు. మైదా, బేకరీ పదార్థాలు, రిఫైన్డ్ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. సుమారు 124గ్రా. చొప్పున పండ్లు, సలాడ్లు రోజూ తినడం వల్ల మీ జీవక్రియ మెరుగుపడుతుంది. నట్స్, సీడ్స్‌ను మితంగా తీసుకోవాలి. వీటితోపాటు 7-8 గంటలు నిద్ర అవసరం. రోజూ 3లీటర్ల నీళ్లు తప్పనిసరిగా తాగాలి.

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు



షామిలీ

షామిలీ... ఈ పేరుని దక్షిణాదిన ఎవరు విన్నా... 'బేబి షామిలీ' అనేస్తారు. పసితనం దాటి, పెరిగి పెద్దయినా, హీరోయిన్‌గా మారినా ఇప్పటికీ అదే ఆమె పేరు. అంతలా బాలనటిగా అందరి మనసుల్లో ముద్ర వేసిన ఆమె... ఇప్పుడు వేరే రంగంలోనూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

బేబి షామిలీ... మంచి 'ఆర్టిస్ట్'

'అంజలి'... ఈ సినిమానీ, నాలుగేళ్ల వయసులో మానసిక స్థితి సరిగాలేని చిన్నారిగా షామిలీ నటననీ ఎవరూ మర్చిపోలేరు. కాబట్టే, అంతచిన్న వయసులోనే జాతీయ అవార్డునీ అందుకున్నారామె. నిజానికి ఆమె నటనా జీవితం పూర్తిగా రెండేళ్లు కూడా రాకముందే ప్రారంభమైంది. షామిలీ పుట్టిపెరిగింది చెన్నైలో. తల్లిదండ్రులు అలిస్, బాబు. నటన మీద ఆసక్తితో ఆమె తండ్రి మద్రాస్‌కి మారారు. కానీ ఆ కల నెరవేరక పిల్లలను ఆ వైపుగా ప్రోత్సహించారు. అలా అక్క షాలినీతోపాటు సినిమాల్లోకి అడుగుపెట్టారు షామిలీ. బాలనటిగా దక్షిణాదిన అన్ని భాషల్లో, స్టార్ హీరోలతో నటించారు. ఒకరకంగా బాలనటిగా దక్షిణాదిన ఆధిపత్యం ప్రదర్శించారు. అప్పట్లో ఎక్కువ సంపాదన ఉన్న అమ్మాయి. కేరళ, కర్ణాటక రాష్ట్రీయ అవార్డులు సహా ఎన్నో పురస్కారాలూ అందుకున్నారు.

దాదాపు 70 సినిమాల్లో బాలనటిగా నటించిన షామిలీ తరవాత వాటిని పక్కన పెట్టేశారు. 'స్కూలు, కాలేజీల్లో నటించడానికి అనుమతి ఇవ్వలేదు' అంటారామె. కాబట్టే, చదువయ్యాక దాదాపు 12 ఏళ్ల తరవాత తిరిగి సినిమాల్లోకి అడుగుపెట్టారు. తెలుగు, తమిళ, మలయాళ అవకాశాలు వచ్చాయి. 'ఓయ్'కి 'బెస్ట్ ఫిమేల్ డెబ్యూ' అవార్డునీ అందుకున్నారు. అయితే అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే... ఆమె ఆర్ట్స్ వైపు వెళ్లడం. 'నటనంటే ఇష్టమే. కానీ దానికే పరిమితం అవ్వాలని నేనెప్పుడూ అనుకోలేదు. డ్యాన్స్ నేర్చుకున్నా, పర్యటనలంటే ఇష్టం. నచ్చిన ప్రాంతాలు చుట్టేదాన్ని. నేను విజువల్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేశా. ఆపై సింగపూర్‌లో ఫిల్మ్ ప్రొడక్షన్‌లో డిప్లొమా చేస్తున్నప్పుడు ఆర్ట్ వైపునకి మనసు మళ్లింది' అనే షామిలీ... పారిస్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. చైనీస్ ఇంక్ పెయింటింగ్, ఇటలీలోని అకడమియా రియాచి ఇన్ ఫ్లోరెన్స్ నుంచి గ్లాస్ పెయింటింగ్, డిజిటల్ ఆర్ట్స్ వంటివీ నేర్చుకున్నారు. ప్రముఖ ఆర్టిస్ట్ ఏవీ ఇలాంగో ఆమెకు మెంటార్.

'సినిమాలు చేస్తూనే ఆర్ట్‌నీ కొనసాగించా. ఏమాత్రం ఖాళీ దొరికినా క్యారవ్యాన్‌లో కూర్చుని బొమ్మలు గీసేదాన్ని. చాలామంది 'ఇప్పుడు ఆర్ట్ ఎందుకు? తరవాత ఎప్పుడైనా ప్రయత్నించొచ్చుగా' అనేవారు. నేను మాత్రం వదల్లేదు. కొన్ని సినిమాలు వదులుకున్నా. మధ్యలో కొన్ని చేసినా... మళ్లీ ఆర్ట్‌వైపే వెళ్లాను. ఒక్కోసారి ప్యాషనే మనల్ని వెతుక్కుంటూ వస్తుంది. అందుకు నేనే ఉదాహరణ. మా ఇంట్లో ఆర్టిస్టులు ఎవరూ లేరు. అయినా ఆర్ట్‌ని చూడగానే ప్రేమలో పడిపోయా. చుట్టూ ఉన్న ప్రతిదీ నాలో స్ఫూర్తిని రగులుస్తుంది' అంటారు షామిలీ. ఫిగరేటివ్ పెయింటింగ్ ఆమె ప్రత్యేకత. మహిళా చిత్రాలు, రోజువారీ కార్యకలాపాలు, భావోద్వేగాలు వంటివాటికి ఆమె చిత్రాల్లో ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. తన చిత్రాలతో ఎగ్జిబిషన్లనీ ఏర్పాటుచేశారు. 2023లో 'షీ' పేరుతో చెన్నైలో సోలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆపై వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన వరల్డ్ ఆర్ట్ దుబాయ్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్‌లోనూ పాల్గొన్నారు. 'పవర్ బైనరీ' పేరుతో బెంగళూరులో మరో షో చేశారు. ఆర్టిస్ట్‌గా తనదైన ముద్ర వేస్తున్నారు. ఇంకా ఎన్నో దేశాల్లో ఎగ్జిబిషన్లు నిర్వహించడం ఆమె కల అట. భవిష్యత్తులో సినిమాలు నిర్మించే ఆలోచనలోనూ ఉన్నారట. మొత్తానికి ఒకప్పటి బుల్లిస్టార్... నేడు పెద్ద ఆర్టిస్ట్‌గా దూసుకెళ్తున్నారన్నమాట.



సరదాగా వెనక్కి వెళదాం!

ఏదో రీల్ చూస్తుంటాం... ఇంతలో ఏదో ఉత్పత్తి ఆకర్షిస్తుంది. చకచకా ఆర్డర్ పెట్టేస్తాం. ఇంట్లో కూరగాయలు అయిపోయాయి... ఫోన్ తెరిస్తే పది నిమిషాల్లో తాజావి హాజరు. రుచులు ఆస్వాదించాలంటే ఫుడ్ యాప్‌లు ఉండనే ఉన్నాయి. ఏఐని అడిగితే మెసేజ్‌లు, మెయిల్ రాసిచ్చేస్తుంది. కాస్త దూరాలకైనా క్యాబ్ సౌకర్యముంది. టెక్నాలజీ వచ్చాక అబ్బా పనులన్నీ ఎంత సులువయ్యాయో! కోరుకున్నవన్నీ నిమిషాల్లో ప్రత్యక్షమవుతున్నాయి. అంతా బాగానే ఉంది కానీ... సమస్యల మాటేంటి? చకా చకా ఆర్డర్లు పెడుతున్నాం... ఖాతా ఎప్పుడు ఖాళీ అయ్యిందో తెలియదు. క్రెడిట్ కార్డు లిమిట్ అయిపోయేదాకా గుర్తించం. కట్టేటప్పుడు బాధ. పనిలోనైనా సొంతంగా ఏదైనా ప్రయత్నిద్దామనుకుంటే బుర్ర ఓ పట్టాన పని చేయదే! పొరపాటున ఫోన్ పనిచేయలేదో... ఏం తోచని స్థితి. అమ్మో... ప్రమాదమే అనిపించట్లేదు? దీన్ని గుర్తించే ప్రపంచమంతా వెనక్కి వెళదాం అంటోంది. 'ఫ్రిక్షన్ మ్యాక్సింగ్' అంటూ దీన్నో ట్రెండ్‌గానూ మార్చింది.

ఫ్రిక్షన్ మ్యాక్సింగ్... అంటే టెక్నాలజీని పక్కన పెట్టేయమని కాదు. మన రోజువారీ దినచర్యల్లో కొన్నింటినైనా సొంతంగా చేసుకోవడం. అంటే... కాస్త దూరమే అనుకోండి క్యాబ్ పక్కనపెట్టి నడవడం. కూరగాయలు, సరకులకు మార్కెట్‌కి వెళ్లడం. నచ్చిన రుచులను స్వయంగా ప్రయత్నించడం. మీటింగ్‌ల్లో ల్యాపీలు, రికార్డింగులు పక్కనపెట్టి, పాయింట్లను చేత్తో రాసుకోవడం, ఏదైనా నచ్చితే స్వయంగా వెళ్లి కొనడం... ఇలాగన్న మాట. ఇది మనం కోల్పోతున్న ఓ విలువైన నైపుణ్యం- నలుగురిలో కలవడాన్ని తిరిగి పరిచయం చేస్తుంది. స్పర్శ, వాసన చూడటం, మాట్లాడి తెలుసుకోవడం... ఇలాంటి వాటి ద్వారా నేర్చుకోవడమెలాగో అనుభవంలోకి తెస్తుంది. ముఖ్యంగా మెదడునీ, శరీరాన్నీ చురుకుగా ఉంచుతుంది. ఏకాగ్రత, సంతృప్తిలను పరిచయం చేస్తుంది. అలాగని పూర్తిగా టెక్నాలజీని పక్కన పెట్టమని కాదు. ఆరోగ్యం కోసం రెండింటినీ సమన్వయం చేసుకోమంటోందీ ట్రెండ్. ప్రయత్నించదగ్గదే కదూ!

కష్టాల్ని జయించి... అనుకున్నది సాధించి!

భావోద్వేగాలకు బానిసై తీసుకున్న ఒక్క నిర్ణయం జీవితాన్ని తలకిందులు చేస్తుంది. అన్నే శివ జీవితమే ఇందుకు ఉదాహరణ. ఆడుతూ పాడుతూ ర్యాంకుల వెనక పరుగెత్తాల్సిన వయసులో తను వేసిన ఒక్క అడుగు తనను కష్టాల కడలిలో ముంచేసింది. అలాగని ఆమె ఎన్నడూ కుంగిపోలేదు. పరిస్థితులతో పోరాడి గెలిచారీమె.

కేరళలోని శివగంగ జిల్లా, కంజిరామ్‌కుళంలో పుట్టిపెరిగారు అన్నే. స్థానిక కాలేజీలో సోషియాలజీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ఇంట్లో విషయం తెలిసి, కట్టడి మొదలైంది. ఎలాగో తప్పించుకుని ప్రేమించిన అబ్బాయిని గుళ్లో పెళ్లి చేసుకున్నారు అన్నే. పెళ్లయిన కొన్ని రోజులు బాగానే గడిచాయి. తర్వాతే తెలిసింది భర్త మంచివాడు కాదని, వ్యసనపరుడని. 'బాబు పుట్టాక మా ఇద్దరినీ వదిలి వెళ్లిపోయాడు అతను. దిక్కు తోచని స్థితిలో కన్నవారిని ఆశ్రయిస్తే... వాళ్లూ దగ్గరకు రానీయలేదు. నా జీవితం ఎలానో ఇలా అయిపోయింది. బాబు జీవితం అన్నా బాగుండాలి అనుకున్నా' అంటారామె. అప్పటికి ఆమెకు 20ఏళ్లే. 'బాబు పోషణకోసం కూరగాయలు అమ్మేదాన్ని. ఐస్‌క్రీమ్ బండి తోసుకుంటూ వీధి వీధి తిరిగేదాన్ని' అని గుర్తుచేసుకుంటారామె. ఈ క్రమంలో ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నారు అన్నే. ఒంటరి తల్లి కావడం వల్ల ఇల్లు కూడా అద్దెకు ఇచ్చేవారు కాదట. ఎక్కడో చోట ఇల్లు దొరికినా 'భర్త ఏమయ్యాడు. ఎందుకు వదిలేసి పోయాడు. నువ్వేం చేయకుండానే పోతాడా అంటూ మాటలతోనే హింసించేవారు కొందరు. నా నిస్సహాయతని ఉపయోగించుకుని లొంగదీసుకోవాలని చూసేవారు మరికొందరు'అనే అన్నే ఈ సమస్యల నుంచి బయటపడటానికి తన రూపాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. జుట్టు మొత్తం కత్తిరించుకుని బాయ్ కట్ చేసుకున్నారు. ఉంటున్న చోటు వదిలి వర్కాల వెళ్లారు. పగలు బీమా ఏజెంటుగా పనిచేస్తూనే... సాయంత్రం వేళల్లో చిన్న చిన్న పనులు చేసేవారీమె.



20 గంటలు చదువుతూ...

ఇన్ని కష్టాలు వచ్చినా చదువుని మాత్రం విడిచిపెట్టలేదు. దూరవిద్యలోనే పరీక్షలు రాసి డిగ్రీ సంపాదించారీమె. అన్నే కష్టాల్ని చూసి చలించిన తన అమ్మమ్మ ఆశ్రయం ఇచ్చి ఆదుకున్నారు. దాంతో జీవితం కాస్త కుదుట పడినట్లు అనిపించిందామెకు. ఈ క్రమంలోనే ఒక రోజు అన్నే వాళ్ల నాన్న స్నేహితుడు కనిపించి... 'మీ నాన్న నిన్ను సివిల్స్ రాయించి ఉన్నతాధికారిణిగా చూడాలని కలలు కన్నారు. నువ్వేమో ఇలా ఐస్‌క్రీమ్‌లు అమ్ముతూ ఇదే జీవితం అనుకుంటున్నావు' అని అన్నారట. 'ఆయన్ని నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆయన అందించిన సహాయంతోనే పోటీ పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యా. మూడు నెలల క్రాష్ కోర్సు కూడా చేశా. పోలీస్ ఆఫీసర్‌గా రాణించాలనే లక్ష్యం ఏర్పడింది కూడా ఆ ఇన్‌స్టిట్యూట్‌లోనే' అనే అన్నే ఓ పక్క పనులు చేస్తూనే తన లక్ష్య సాధనకు సన్నద్ధమయ్యారు. 2017లో ఆ అవకాశం రానే వచ్చింది. కేరళ పోలీస్ విభాగంలో నోటిఫికేషన్ విడుదలైంది. అన్నే దరఖాస్తు చేసుకుని, రోజుకి 20 గంటలు చదివేవారట. ఫలితంగా మొదటి ప్రయత్నంలోనే... కానిస్టేబుల్‌గా ఉద్యోగాన్ని సాధించారీమె. అయితే సబ్‌ఇన్‌స్పెక్టర్ కావాలన్నది అన్నే కోరిక. దాంతో కాస్త నిరాశ ఆవరించినా... మళ్లీ ప్రయత్నిస్తా అంటూ తనకి తను సర్దిచెప్పుకొన్నారు. తర్వాతి నోటిఫికేషన్‌లో పరీక్ష రాసి పాసై 2021లో అనుకున్న ఉద్యోగాన్ని సంపాదించుకున్నారీమె. దాంతో ఈమె కథ, కష్టం స్థానికులకు పాఠంగా మారింది.

మీకు తెలుసా!



నవజాత శిశువులు పుట్టిన మొదటి ఆరు వారాలు రోజు మొత్తంలో సుమారు 2-3గంటలు ఏడుస్తారట. వాళ్ల ఆకలి, నిద్ర, చిరాకు, అసౌకర్యం వంటివి తెలియజెప్పడానికే చిన్నారులు ఇలా ఏడుస్తారట.

బంగారం - వెండి



25న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,64,310	1,48,800	2,76,941
విజయవాడ	1,59,370	1,48,400	2,78,000
ప్రొద్దుటూరు	1,57,800	1,45,180	2,76,200
రాజమహేంద్రవరం	1,61,890	1,48,400	2,95,000
విశాఖపట్నం	1,61,900	1,48,400	2,78,000
తమిళనాడు	-----	1,49,300	2,95,000

మరకలు పడ్డాయా.. చింతొద్దు!

చిన్న పనులే ఒక్కోసారి చాలా చిరాకుని తెప్పిస్తాయి కదా... వాటిల్లో గోడలపై క్రేయాన్స్ గీతలు, దుస్తులపై హెన్నా, చిన్నపిల్లలుంటే ఇంక్ మరకలు... ఇవి ఎన్నిసార్లు ఉతికినా, శుభ్రం చేసినా ఓ పట్టాన వదలవు. ఈ చిట్కాలు ప్రయత్నించండి. సులువుగా వదిలించొచ్చు.

- జుట్టుకు హెన్నా, హెయిర్ కలర్ వేసుకున్నప్పుడు దుస్తులకు మరకలు అంటితే గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఈనో కలిపి, మరక ఉన్నచోట ఆ నీటితో పదినిమిషాల పాటు రుద్ది ఉతికితే సరి.
- బట్టలకు, జుట్టుకు పొరపాటున చూయింగ్ గమ్ అంటుకుంటే దాన్ని పూర్తిగా తీయలేం. దాంతో దుస్తుల్ని పక్కన పెట్టేస్తాం లేదా జుట్టుని కత్తిరిస్తాం. అలాకాకుండా ఐస్ క్యూబ్‌తో ఐదు నిమిషాలు ఆ ప్రాంతాన్ని రుద్దితే అది గట్టిపడి సులువుగా వచ్చేస్తుంది.
- చిన్న పిల్లలుంటే ఇంట్లో గోడలపై పెన్సిల్, క్రేయాన్ గీతలు ఉండకుండా ఉంటాయా! వీటిని వదిలించాలంటే గోడను తడిచేసి టూత్‌పేస్ట్ పట్టించి పది నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే ఇట్టే మాయం అవుతాయి.



చేతులు నాజూగ్గా మారాలంటే!

బరువు తగ్గాలనేది కొందరి ఆలోచన అయితే... మరికొందరు మహిళలు మాత్రం చేతులు నాజూగ్గా కనిపించాలనుకుంటారు. ఇవి సన్నగానే కాదు... బలంగానూ ఉండాలి. అందుకోసమే ఈ వ్యాయామాలు...



కుర్చీతో... బలమైన కుర్చీని తీసుకోండి. దాని అంచుల్ని పట్టుకుని మీరూ అక్కడే కూర్చోండి. ఇప్పుడు మీ కాళ్లను ముందుకు చాచి, మెల్లగా కుర్చీ నుంచి కిందకి రావాలి. ఈ సమయంలో మీ బరువంతా చేతుల మీద ఉండాలి. తిరిగి మళ్లీ పైకి లేవాలి. ఇలా రోజులో పది సార్లైనా చేస్తూ ఉండండి. వీటినే 'చెయిర్ డిప్స్' అంటారు. ఇవి భుజాలు, చేతుల దగ్గర ఉన్న కొవ్వుని తగ్గిస్తాయి. బలంగానూ మారుస్తాయి.

చున్నీతో... రెసిస్టెన్స్ బ్యాండ్‌లా చున్నీని ఉపయోగించి చేతుల్ని టోన్ చేయవచ్చు. చున్నీ కొనలను రెండు చేతులతో పట్టుకుని తల వెనక్కీ ముందుకీ తీసుకురండి. ఇలా కనీసం ఓ పదిహేను సార్లు చేయండి. క్రమంగా ఫలితం మీకే కనిపిస్తుంది.

నీళ్ల సీసాలతో... రెండు చేతుల్లో లీటరు బరువున్న నీళ్ల సీసాలను పట్టుకుని పక్కకు చాచండి. అలా చాచిన చేతులను చిన్నగా సవ్యదిశలో 50 సార్లు, అపసవ్యదిశలో 50 సార్లు తిప్పాలి. ఇలా తిప్పడం వల్ల మీ భుజాలు, చేతుల దగ్గరున్న కొవ్వు తగ్గి, బలంగా మారుతాయి.

మదుపూ నేర్చుకోదగ్గ నైపుణ్యమే!

పొదుపు అనే మాటకు పర్యాయపదంగా ఉంటున్నారు మహిళలు. కానీ మదుపు (ఇన్వెస్ట్‌మెంట్) విషయంలో మాత్రం కొంత వెనకబాటే. ఈ పరిస్థితిని మార్చడానికి నిపుణులు ఏం సూచిస్తారంటే....

పొదుపులో మహిళల్ని మించినవాళ్లు లేరు. ఇల్లాలు దాచిన కొద్దిపాటి డబ్బు ఎన్నోసార్లు నెలాఖరున కుటుంబ ఆర్థిక అవసరాల్ని తీరుస్తుంది. మహిళా పొదుపు సంఘాలు ఎంతో విజయం సాధించాయి. అయితే డబ్బు ఎప్పుడూ ద్రవ్యోల్బణాన్ని తట్టుకొని నిలవాలి. అందుకని మదుపు దిశగా ఆలోచించాలి.



- ఆర్థిక నైపుణ్యాలు లేవనే ఆలోచనలు వద్దు. ఇంటిని తీర్చిదిద్దడంలో మీకుండే నైపుణ్యాలకంటే ఇదేమీ ఎక్కువ కాదు. ఒకటి కంటే ఎక్కువ నైపుణ్యాలు ఉన్నవాళ్లకు కొత్తవి నేర్చుకోవడం అంత కష్టమేమీ కాదు.
- మహిళలు తమ ఆర్థిక వ్యవహారాల్ని తామే చూసుకోవాలి. ఊహించని పరిస్థితుల్లో ఇంటి ఆర్థిక వ్యవహారాలు చూడాల్సి వస్తే, ఒక్కసారిగా అన్నీ భారంగా అనిపిస్తాయి. అదే ముందునుంచీ ఆర్థిక ప్రణాళికలు వేస్తుంటే, అనవసర ఆందోళనలు లేకుండా ధైర్యంగా ముందుకు వెళ్తారు.
- మొదట్లో మీకు ఇంట్లోవాళ్ల నుంచి ప్రోత్సాహం రాకపోవచ్చు. కానీ అత్యవసర పరిస్థితుల్లో, ప్రత్యేక సందర్భంలో ఏదైనా కొనాలన్నప్పుడు మీరు డబ్బు సర్దుబాటు చేయగలిగితే అప్పుడు వాళ్లకు అర్థమవుతుంది.
- సంపాదన మొదలుపెట్టిన రోజు నుంచే మదుపు వైపు ఆలోచించండి. కొన్నాళ్లకు అది మీ రెండో సంపాదనగా మారుతుంది. ఆర్థిక లక్ష్యాల్ని సులభంగా చేరుకోగలరు.
- ఆధునిక మహిళలు కాస్త మేలు. వీళ్ల ఆర్థిక స్వేచ్ఛను కోరుకుంటున్నారు. వీళ్ల లక్ష్యాల్లో కుటుంబ అవసరాలతోపాటు పర్యటనలు, నగలు లాంటి వ్యక్తిగత లక్ష్యాలకీ చోటిస్తున్నారు. కాబట్టే, వీటిని నెరవేర్చుకోవడానికి మదుపు వైపు అడుగులు వేస్తున్నారు.







రాణీ పూల చెట్టు సోయగమిది!

సొగసుల చెట్టు... పేరుకు తగ్గట్లే కంటికింపైన రంగుల పూలతో కనువిందు చేస్తుంది. ఆయుర్వేదంలో అపార ఔషధ విలువలున్న మొక్కగా ప్రాధాన్యమూ ఎక్కువే. దీన్ని మనమెలా పెంచుకోవాలో తెలుసుకుందామా!



ఇంటి తోట

హిందీలో జరుల్ ఫూల్, ఆంగ్లంలో ప్రైడ్ ఆఫ్ ఇండియా, క్వీన్స్ క్రేప్ మిర్టిల్(రాణీపువ్వు), మన దగ్గర వారగోగు, సొగసుల చెట్టు అంటూ ప్రాంతాన్ని బట్టి దీన్ని ఎన్నో పేర్లతో పిలుస్తారు. నేల మీదే కాదు... ఇందులో కుండీల్లో పెంచుకోగలిగే డ్వార్ఫ్, సెమీ డ్వార్ఫ్ వెరైటీలూ ఉన్నాయి. సొగసుల చెట్టు పుట్టింది దక్షిణాసియాలోనే. దీని పూలు చూడ్డానికి క్రింకిల్డ్ క్రేప్ పేపర్‌లా ఉంటాయి. గులాబీ, ఊదాతో పాటు తెలుపు, ఎరుపు రంగుల్లోనూ ఇవి వికసిస్తాయి. దీని చెక్కను టేకు తర్వాత ఉత్తమమైనదిగా భావిస్తారు. ముఖ్యంగా మయన్మార్, అసోంలలో వాణిజ్యం కోసం విరివిగా పెంచుతారు.

డయాబెటీస్‌కు సంప్రదాయ వైద్యంగా పలు దేశాల్లో భావిస్తారు. ముఖ్యంగా ఫిలిప్పీన్స్‌లో బనాబా టీ పేరుతో ఇది చాలా పాపులర్. అంతేకాదు ఈ సొగసుల చెట్టు వాయు కాలుష్యాన్నీ తగ్గించగలదట.

నిండుగా పూయాలంటే...

ఈ మొక్కని కనీసం 6-8 గంటల పాటు సూర్యరశ్మి అందే చోట నాటుకోవాలి. నీడలో ఉంచితే పూలు తక్కువ వస్తాయి. కుండీల్లో పెంచాలనుకుంటే మాత్రం పరిమాణంలో పెద్దవాటిని ఎంచుకోవాలి. వదులుగా ఉండే సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. ఇందులో పర్లైట్, పేడ ఎరువు, కంపోస్ట్ కలిపితే ఆరోగ్యంగా ఎదుగుతుంది. ప్రతి పదిహేను రోజులకోసారి బ్యాలెన్స్‌డ్ ఎన్‌పీకే 10-10-10 నిష్పత్తిలో అందించాలి. అప్పుడే పూలు రంగు మారకుండా నిండుగా పూస్తాయి. ఆకులు పసుపు రంగులోకి మారితే మాత్రం ఐరన్, సూక్ష్మపోషకాలు వంటివి లోపించాయని అర్థం. దీనికి తేమ అవసరమే. అయితే చుట్టూ ఉండే మట్టిలో నీళ్లు నిలవకుండా చూసుకోవాలి. ఇది నాటిన రెండేళ్ల తర్వాత నుంచి నీటి ఎద్దడిని తట్టుకోగలదు.

చీడపీడలు వస్తే...

ఈ చెట్టు కొంచెం పెద్దది అయ్యాక కింద కొమ్మల్ని కత్తిరిస్తే మంచి ఆకారంలో కనిపిస్తుంది. పూలు పూయడం ఆగాక... ఎండిన కొమ్మలు, బలహీనంగా ఉన్నవాటిని మాత్రం తుంచేయాలి. అలాగని మరీ ఎక్కువగా ప్రూనింగ్ చేస్తే మొక్క దెబ్బతింటుంది. దీని కొమ్మల్ని నాటుకున్నా కొత్త మొక్కలు వస్తాయి. దీనికి సాధారణంగా చీడపీడలు తక్కువ. కొన్నిసార్లు మాత్రం తెల్లదోమ, పిండి నల్లి రావొచ్చు. ఇలాంటప్పుడు షాంపూ నీళ్లని బలంగా స్ప్రే చేయడం వేప, వెల్లుల్లి కషాయాలను పిచికారీ చేయడం వంటివి ఈ సమస్యను తీరుస్తాయి.







చాంపియన్

డిఫెండింగ్ ఛాంపియన్. ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టింది. ఆశించినంత ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయినా గ్రూప్ దశలో అగ్రస్థానం సాధించింది. కానీ సూపర్ 8లో ఓ భారీ ఓటమి ఆ జట్టును త్వరగా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించే ప్రమాదంలోకి నెట్టింది. బ్యాటర్ల అస్థిర ప్రదర్శన, ముఖ్యంగా టాప్ ఆర్డర్ పేలవ ఫామ్ టీమ్‌ఇండియాకు పెద్ద సమస్య. ఇలాంటి పరిస్థితుల్లో అత్యంత కీలక పోరాటానికి సిద్ధమైంది భారత్. చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో నేడు జింబాబ్వేను ఢీకొంటుంది. ఓడితే ఇంటికే! సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే గెలిస్తేనే సరిపోదు.. చాలా ఘనంగా నెగ్గాలి. నెట్ రన్‌రేట్‌లో బాగా వెనుకబడ్డ టీమ్‌ఇండియా.. శక్తులన్నింటినీ కూడదీసుకుని అసాధారణ ప్రదర్శనే చేయాలి.

గట్టిగా కొడితేనే..

- టీమ్‌ఇండియాకు కఠిన సవాల్
- జింబాబ్వేతో సూపర్-8 మ్యాచ్ నేడు

చెన్నై

టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాకు పరీక్షా సమయం. భారత్ తన రెండో సూపర్ 8 మ్యాచ్‌లో గురువారం జింబాబ్వేను ఢీకొంటుంది. జింబాబ్వేపై గెలవడం కష్టమేమీ కాకపోవచ్చు. కానీ తొలి మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో భారీ పరాజయంతో నెట్ రన్‌రేట్ (-3.80) తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో భారీ విజయం సాధించడమే సవాల్. ఈ మ్యాచ్‌లోనే కాదు.. సెమీఫైనల్ రేసులో ఉండాలంటే తన చివరి సూపర్ 8 (వెస్టిండీస్‌తో) పోరులోనూ టీమ్‌ఇండియా మంచి విజయం సాధించాల్సి రావొచ్చు. చెరో మ్యాచ్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా (3.800), వెస్టిండీస్ (5.350) గ్రూప్-1లో రన్‌రేట్‌లో చాలా ముందున్నాయి. ఈ నేపథ్యంలో గ్రూప్‌లో టాప్-2లో నిలవాలంటే భారత జట్టు అద్భుతంగా ఆడాల్సిందే.



అభిషేక్ పుంజుకునేనా?

టోర్నీలో టీమ్‌ఇండియా ప్రస్తుత సంకట స్థితికి ప్రధాన కారణం బ్యాటింగే అనడంలో సందేహం లేదు. మెరుపులు మెరిపించకపోయినా ఏదోలా గ్రూపు దశలో అగ్రస్థానంలో నిలిచిన ఆ జట్టు సూపర్ 8 తొలి మ్యాచ్‌లో బొక్క బోర్లా పడింది. ఈ సమస్యను పరిష్కరించుకోవడం భారత్‌కు అత్యవసరం. దక్షిణాఫ్రికాపై చాలా మంది బ్యాటర్లు పరిస్థితులకు తమను తాము అన్వయించుకోకుండా, పేలవ షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. ముఖ్యంగా టాప్ ఆర్డర్‌లో అభిషేక్ శర్మ వైఫల్యం జట్టును దెబ్బతీస్తోంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఈ ఓపెనర్ నాలుగు మ్యాచ్‌ల్లో 3.75 సగటుతో కేవలం 15 పరుగులు చేశాడు. అందులో మూడు డకౌట్లు. అతడు తనదైన శైలిలో ఆరంభాలు ఇచ్చి ఉంటే టోర్నీలో భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేది. ఇప్పటికైనా అభిషేక్ పుంజుకోవడం ఆతిథ్య జట్టుకు చాలా కీలకం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అతడు తన సహజ శైలిలో ఆడతాడా లేదా నియంత్రణ పాటిస్తాడా అన్నది ఆసక్తికరం. కొన్ని మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడిన మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ కూడా గత రెండు మ్యాచ్‌ల్లో రాణించలేపోయాడు. అతడు తిరిగి జోరందుకోవాలని జట్టు కోరుకుంటోంది. అభిషేక్, ఇషాన్ బ్యాట్లకు పనిచెబితే భారత్ పని సగం పూర్తయినట్లే. సూర్యకుమార్ 180 పరుగులు చేశాడు కానీ స్ట్రైక్‌రేట్ 127 మాత్రమే. తిలక్ వర్మ కూడా అంతే. వేగంగా బ్యాటింగ్ చేయలేకపోతున్నాడు. స్ట్రైక్‌రేట్ 118 మాత్రమే. శివమ్ దూబె, హార్దిక్ పాండ్య జోరు పెంచకపోయుంటే టోర్నీలో ఓ మాదిరి స్కోర్లు చేయడానికి కూడా టీమ్‌ఇండియా ఇబ్బందిపడేది. బ్యాటర్లంతా సమష్టిగా రాణించాల్సి వుంది. ముఖ్యంగా స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవాలి.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, దూబె, హార్దిక్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

జింబాబ్వే: మరుమాని, బెనెట్, మయర్స్, ర్యాన్ బర్ల్, సికందర్ రజా, మున్యోంగా, ముసెకివా, ఎవాన్స్, క్రీమర్, ముజరబాని, ఎంగరవ.



జట్టులో శాంసన్, అక్షర్!

తండ్రి అనారోగ్యం కారణంగా ఇంటికి వెళ్లిన రింకు సింగ్.. తిరిగి జట్టుతో చేరాడు. కానీ ఈ మ్యాచ్‌కు అతడికి తుది జట్టులో స్థానం దక్కడం అనుమానమే. సంజు శాంసన్ ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. అతణ్ని అభిషేక్‌కు జోడీగా ఓపెనింగ్‌కు పంపే అవకాశముంది. ఇషాన్ మూడో స్థానంలో దిగుతాడు. టోర్నీలో ప్రత్యర్థి జట్లు తెలివిగా.. పవర్‌ప్లేల్లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఇషాన్, అభిషేక్, తిలక్‌లకు ఆఫ్‌స్పిన్నర్లతో బౌలింగ్ చేయించడం ద్వారా వాళ్ల స్కోరింగ్ అవకాశాలను తగ్గించాయి. కుడిచేతి వాటం బ్యాటరైన శాంసన్‌ను తీసుకోవడం ద్వారా సమస్యను అధిగమించవచ్చని భారత జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్ రావడం కూడా ఖాయమే. ఇక బౌలింగ్‌లో బుమ్రా సూపర్ ఫామ్ భారత్‌కు గొప్ప సానుకూలాంశం. అతడితోపాటు అర్ష్‌దీప్, హార్దిక్, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి, అక్షర్‌లతో కూడిన భారత బౌలింగ్ దాడిని తట్టుకుని నిలవడం జింబాబ్వేకు పెద్ద సవాలే.

పిచ్ ఎలా ఉందంటే..

మ్యాచ్ వేదిక చెపాక్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. కానీ ఈ ప్రపంచకప్‌లో మాత్రం అదే అత్యుత్తమ బ్యాటింగ్ మైదానం. స్పిన్నర్లకు పెద్దగా కలిసి రాలేదు. పేసర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వికెట్లు తీయడానికి, పరుగుల ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి చాలా కష్టపడ్డారు. ఇక్కడ అఫ్గానిస్థాన్‌పై 183 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ కేవలం 17.5 ఓవర్లలో ఛేదించింది. ఈ మ్యాచ్‌లో కూడా పిచ్ బ్యాటర్లకు సహకరించే అవకాశముంది. మ్యాచ్‌కు ఎలాంటి వర్షం ముప్పు లేదు.

వాళ్లను తేలికగా తీసుకోవద్దు



తన తొలి సూపర్-8 మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తయినప్పటికీ జింబాబ్వేను తక్కువ అంచనా వేయడం పొరపాటే అవుతుంది. ఆ జట్టు ఆస్ట్రేలియా, శ్రీలంకలకు షాకిచ్చి గ్రూప్ దశలో అజేయంగా నిలిచింది. ఆ జట్టుకు కోల్పోయేదేమీ లేదు కాబట్టి.. స్వేచ్ఛగా ఆడుతుంది. బ్యాటింగ్‌లో బెనెట్, కెప్టెన్ సికందర్ రజా, మరుమాని.. బౌలింగ్‌లో ముజరబాని, ఎవాన్స్‌లు జింబాబ్వేకు కీలకం.

1

టీ20 ప్రపంచకప్పుల్లో భారత్, జింబాబ్వే ఇంతకుముందు ఒకే ఒక్కసారి తలపడ్డాయి. 2022లో ఎంసీజీలో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ 71 పరుగుల తేడాతో గెలిచింది. భారత్‌లో టీమ్‌ఇండియాతో టీ20 మ్యాచ్ ఆడడం జింబాబ్వేకు ఇదే తొలిసారి.

మధ్యాహ్నం 3 నుంచి

ఎవరిదో గెలుపు

నేడు వెస్టిండీస్‌తో దక్షిణాఫ్రికా ఢీ


మార్‌క్రమ్


హోప్

అహ్మదాబాద్: జోరుమీదున్న వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు గురువారం టీ20 ప్రపంచకప్ సూపర్ 8 మ్యాచ్‌లో తలపడనున్నాయి. రసవత్తర పోరు ఖాయంగా కనిపిస్తోంది. వెస్టిండీస్ హిట్టింగ్ సామర్థ్యానికి దక్షిణాఫ్రికా పేస్ దళం నుంచి గట్టి పరీక్ష ఎదురుకానుంది. గత మ్యాచ్‌ల్లో భారత్‌పై దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో నెగ్గగా.. జింబాబ్వేను 107 పరుగుల తేడాతో విండీస్ చిత్తు చేసింది. ఈ నేపథ్యంలో రెండు జట్లూ రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ గెలిస్తే టీమ్‌ఇండియా సెమీఫైనల్ సమీకరణం చాలా క్లిష్టమవుతుంది. విండీస్ సెమీఫైనల్ చేరువవుతుంది. భారత్ సెమీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఆ జట్టు తన చివరి రెండు మ్యాచ్‌ల్లో జింబాబ్వే, వెస్టిండీస్‌లపై భారీ విజయాలు సాధించాల్సివుంటుంది. ఒకవేళ విండీస్‌పై దక్షిణాఫ్రికా గెలిస్తే భారత్ పని కాస్త తేలికవుతుంది. విండీస్, జింబాబ్వేలపై గెలిస్తే చాలు సెమీఫైనల్లో ప్రవేశిస్తుంది.

లంక ఔట్

కివీస్ సెమీస్ ఆశలు సజీవం

- రాణించిన రచిన్, శాంట్నర్

కొలంబో

ఆతిథ్య శ్రీలంకకు షాక్! సూపర్-8లో మరో మ్యాచ్ ఉండగానే ఆ జట్టు టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. బుధవారం న్యూజిలాండ్‌తో గ్రూప్-2 పోరులో ఆఖరి ఓవర్లలో పరుగులు ఇచ్చేసి.. ఆ తర్వాత బ్యాట్‌తో విఫలమైన లంక 61 పరుగుల తేడాతో చిత్తయింది. మొదట న్యూజిలాండ్ 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. శాంట్నర్ (47; 26 బంతుల్లో 2×4, 4×6), రచిన్ రవీంద్ర (32; 22 బంతుల్లో 3×4, 1×6), మెకాంకీ (31 నాటౌట్; 23 బంతుల్లో 3×4, 2×6) మెరిశారు. తీక్షణ (3/30), చమీర (3/38) ఆకట్టుకున్నారు. ఛేదనలో రచిన్ (4/27), హెన్రీ (2/3), శాంట్నర్ (1/19) విజృంభించడంతో లంక 20 ఓవర్లలో 8 వికెట్లకు 107 పరుగులే చేయగలిగింది. కమిందు మెండిస్ (31; 23 బంతుల్లో 4×4), వెల్లలాగే (29; 23 బంతుల్లో 2×4, 1×6) మాత్రమే పోరాడారు.

విజృంభించిన రచిన్: అలవాటైన పిచ్.. మరీ పెద్ద స్కోరు కాదు..కానీ శ్రీలంక ఆరంభం నుంచే తడబడింది. తొలి బంతికే నిశాంక (0) ఔటైపోవడం ఆ జట్టుకు పెద్ద దెబ్బ. అసలంక (5) కూడా నిలవలేదు. ఈ రెండు వికెట్లు పేసర్ హెన్రీ ఖాతాలోకి వెళ్లాయి. తర్వాత కుశాల్ మెండిస్ (11), పవన్ రత్నాయకే (10) వికెట్ల పతనాన్ని ఆపగలిగారు కానీ.. పరుగులు మాత్రం చేయలేకపోయారు. వీళ్లిద్దరూ ఆత్మరక్షణకు పోయి మరీ నెమ్మదిగా ఆడడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోయింది. 8 ఓవర్లకు 27/2తో లంక ఛేదనలో వెనకబడింది. దీనికి తోడు పతనం మళ్లీ మొదలైంది. స్పిన్నర్ రచిన్ రవీంద్ర విజృంభించడంతో లంక బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. మొదట 9వ ఓవర్లో కుశాల్, పవన్‌లను ఔట్ చేసిన రచిన్.. ఆ తర్వాత శానక (3), హేమంత (3) వికెట్లను పడగొట్టి ప్రత్యర్థిని మరింత కష్టాల్లోకి నెట్టాడు. కాసేపు నిలిచి కమిందు మెండిస్ కూడా నిష్క్రమించాడు. చివర్లో వెల్లలాగే పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది. లంక ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లను న్యూజిలాండ్ స్పిన్నర్లతోనే వేయించింది.

పడి లేచిన కివీస్: 30/0.. 84/6.. 168/7.. ఇదీ న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సాగిన తీరు. ఆ జట్టు ఇన్నింగ్స్‌ను ధాటిగానే మొదలుపెట్టింది. ఓవర్‌కు పది రన్‌రేట్‌తో పరుగులు చేసింది. ఉన్నంతసేపు అలెన్ (23; 13 బంతుల్లో 3×4, 1×6) దూకుడుగా ఆడాడు. తీక్షణ, చమీర విజృంభించడంతో పరిస్థితి మారిపోయింది. ఓవర్ తేడాతో అలెన్, సీఫర్ట్ (8) పెవిలియన్ చేరిపోయారు. రచిన్ రవీంద్ర, ఫిలిప్స్ (18) కాసేపు వికెట్ల పతనం ఆపారు. స్వల్ప వ్యవధిలో ఫిలిప్స్, రచిన్, చాప్‌మన్ (0), మిచెల్ (3) ఔట్ కావడంతో కివీస్ 84/6తో కష్టాల్లో చిక్కుకుంది. లంక బౌలర్ల జోరు చూస్తే ఆ జట్టు వంద పరుగులైనా చేస్తుందా అనిపించింది. కానీ కివీస్ అనూహ్యంగా పుంజుకుంది. కెప్టెన్ శాంట్నర్, మెకాంకీ బాదుడు మొదలుపెట్టారు. చమీర వేసిన 17వ ఓవర్లో మెకాంకీ 2 సిక్స్‌లు, ఓ ఫోర్ కొట్టి స్కోరుబోర్డు కదిలించగా.. ఆ తర్వాతి ఓవర్లో శాంట్నర్ అందుకున్నాడు. తీక్షణ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టాడు. ఈ జంట అదే జోరు కొనసాగించడంతో 19వ ఓవర్లో 19.. ఆఖరి ఓవర్లో 12 పరుగులొచ్చాయి. కివీస్ స్కోరు 160 దాటింది. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి శాంట్నర్ ఔటయ్యాడు. చివరి 4 ఓవర్లలో న్యూజిలాండ్ ఏకంగా 70 పరుగులు రాబట్టడం విశేషం.



పాయింట్ల పట్టిక సూపర్-8 గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నెట్‌రన్‌రేట్
ఇంగ్లాండ్	2	2	0	0	4	1.491
న్యూజిలాండ్	2	1	0	1	3	3.050
పాకిస్థాన్	2	0	1	1	1	-0.461
శ్రీలంక	2	0	2	0	0	-2.800

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

కివీస్ మెరుగ్గా...

ఆడిన రెండు మ్యాచ్‌లూ ఓడిన లంక సెమీస్‌కు దూరం కాగా... లంకపై భారీ విజయంతో కివీస్ సెమీస్‌కు చేరువైంది. పాక్‌తో మ్యాచ్ వర్షంతో రద్దవడంతో పాయింట్లు పంచుకున్న న్యూజిలాండ్ ఖాతాలో ప్రస్తుతం 3 పాయింట్లున్నాయి. ఒక మ్యాచ్ రద్దయి, ఒక మ్యాచ్‌లో ఓడిన పాకిస్థాన్ (1) మూడో స్థానంలో ఉంది. ఈ గ్రూప్ నుంచి ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీస్ చేరింది. శుక్రవారం న్యూజిలాండ్‌తో ఇంగ్లాండ్.. శనివారం పాకిస్థాన్‌తో లంక తలపడాల్సి ఉంది. ఇంగ్లాండ్‌పై న్యూజిలాండ్ గెలిస్తే 5 పాయింట్లతో నేరుగా సెమీస్ చేరుతుంది. ఒకవేళ ఓడినా ఆ జట్టుకు అవకాశం ఉంటుంది. పాక్ (-0.461)తో పోలిస్తే కివీస్ (3.050)కు మెరుగైన రన్‌రేట్ ఉండడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో పాక్ ముందంజ వేయాలంటే.. లంకపై ఆ జట్టు భారీ తేడాతో గెలవాలి, అంతకుముందు ఇంగ్లాండ్ చేతిలో కివీస్ ఓడాలి.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (సి) కమిందు మెండిస్ (బి) చమీర 8; అలెన్ (సి) అండ్ (బి) తీక్షణ 23; రచిన్ రవీంద్ర (సి) హేమంత (బి) తీక్షణ 32; ఫిలిప్స్ (బి) చమీర 18; మిచెల్ (బి) వెల్లలాగె 3; చాప్‌మన్ (బి) తీక్షణ 0; శాంట్నర్ (సి) అసలంక (బి) చమీర 47; మెకాంకీ నాటౌట్ 31; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **168; వికెట్ల పతనం:** 1-30, 2-34, 3-75, 4-84, 5-84, 6-84, 7-168; **బౌలింగ్:** మదుశంక 3-0-34-0; వెల్లలాగె 4-0-27-1; తీక్షణ 4-0-30-3; చమీర 4-0-38-3; హేమంత 2-0-22-0; అసలంక 3-0-16-0

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక (బి) హెన్రీ 0; కుశాల్ మెండిస్ (స్టంప్డ్) సీఫర్ట్ (బి) రచిన్ 11; అసలంక (సి) మిచెల్ (బి) హెన్రీ 5; పవన్ రత్నాయకే (స్టంప్డ్) సీఫర్ట్ (బి) రచిన్ 10; కమిందు మెండిస్ (సి) ఫిలిప్స్ (బి) శాంట్నర్ 31; శానక (సి) అలెన్ (బి) రచిన్ 3; హేమంత (సి) మిచెల్ (బి) రచిన్ 3; వెల్లలాగే (సి) రచిన్ (బి) ఫిలిప్స్ 29; చమీర నాటౌట్ 7; తీక్షణ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **107; వికెట్ల పతనం:** 1-0, 2-6, 3-27, 4-29, 5-46, 6-59, 7-77, 8-105; **బౌలింగ్:** హెన్రీ 2-1-3-2; మెకాంకీ 3-0-20-0; శాంట్నర్ 4-0-19-1; ఫెర్గూసన్ 1-0-2-0; ఇష్ సోధి 2-0-13-0; రచిన్ రవీంద్ర 4-0-27-4; ఫిలిప్స్ 4-0-21-1

భారత్ ఎట్టకేలకు..

హాకీ ప్రొ లీగ్‌లో ఆస్ట్రేలియాపై విజయం

హోబర్ట్: హాకీ ప్రొ లీగ్‌లో భారత్ ఎట్టకేలకు గెలుపు బోణీ కొట్టింది. బుధవారం షూటౌట్‌లో 3-1తో ఆస్ట్రేలియాపై నెగ్గింది. శిలానంద్ లక్రా, మణిందర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్ షూటౌట్‌లో గోల్స్ కొట్టి.. టోర్నీలో భారత్‌కు తొలి విజయాన్నందించారు. షూటౌట్‌లో ప్రత్యర్థి గోల్ చేయకుండా గోల్‌కీపర్ మోహిత్ శశికుమార్ మూడుసార్లు అడ్డుకున్నాడు. అంతకుముందు హోరాహోరీగా సాగిన మ్యాచ్ 1-1తో సమమైంది. హేవార్డ్ (49వ నిమిషం) పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ కొట్టి ఆస్ట్రేలియాను ముందంజలో నిలిపాడు. శిలానంద్ (51వ నిమిషం) రెండు నిమిషాల వ్యవధిలో గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ప్రొలీగ్‌లో బెల్జియం (22 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. భారత్ (4 పాయింట్లు) ఎనిమిదో స్థానంలో ఉంది. ఆసీస్‌తో గత పోరులో భారత్ షూటౌట్‌లో ఓడిన సంగతి తెలిసిందే. ఆస్ట్రేలియా అంచె ముగించుకున్న భారత్ తర్వాత నెదర్లాండ్స్, జర్మనీలతో తలపడనుంది.

జమ్మూకశ్మీర్ 527/6


రాణించిన కన్నయ్య, పరాస్, సాహిల్



హుబ్లీ: తొలిసారి రంజీ ఫైనల్ ఆడుతున్న జమ్మూకశ్మీర్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. కర్ణాటకతో పోరులో ఆ జట్టు బలమైన స్థితిలో నిలిచింది. రెండో రోజు, బుధవారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 527 పరుగులు చేసింది. సాహిల్ (57 బ్యాటింగ్; 93 బంతుల్లో 7×4), అబిద్ ముస్తాక్ (20 బ్యాటింగ్; 31 బంతుల్లో 2×4) క్రీజులో ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోరు 284/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూకశ్మీర్ కొంతసేపు బాగానే ఆడినా.. తర్వాత తడబడింది. తొలి రోజు సెంచరీ చేసిన శుభమ్ పుండిర్ (121; 247 బంతుల్లో 12×4, 2×6) ఎక్కువ సేపు నిలవలేదు. అతడు వ్యక్తిగత ఓవర్‌నైట్ స్కోరు 117కు 4 పరుగులే జోడించి ఔటయ్యాడు. తర్వాత అబ్దుల్ సమద్ (61; ఓవర్‌నైట్ 52) కూడా అతడిని అనుసరించాడు. దీంతో జమ్మూకశ్మీర్ 307/4తో నిలిచింది. ఈ స్థితిలో తొలి రోజు 9 పరుగుల వద్ద రిటైర్డ్‌హర్ట్ అయిన పరాస్ డోగ్రా (70; 166 బంతుల్లో 8×4) మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చి నిలిచాడు. అతడు కన్నయ్య (70; 166 బంతుల్లో 8×4)తో జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. ఈ జంట అయిదో వికెట్‌కు 110 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌ను బలోపేతం చేసింది. అర్ధసెంచరీ తర్వాత కన్నయ్య ఔటైనా.. సాహిల్‌తో కలిసి పరాస్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే అతడు అర్ధసెంచరీ అందుకున్నాడు. పరాస్ వెనుదిరిగినా.. సాహిల్, అబిద్ జంట స్కోరు 500 దాటించింది. అర్ధసెంచరీ చేసిన సాహిల్.. అభేద్యమైన ఏడో వికెట్‌కు అబిద్‌తో కలిసి 56 పరుగులు జోడించాడు.

పరాస్ తలతో ఢీకొట్టాడని..: రెండో రోజు ఆటలో జమ్మూకశ్మీర్ సారథి పరాస్ డోగ్రా దురుసుగా ప్రవర్తించాడు. తొలి రోజు గాయంతో రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగిన పరాస్.. సమద్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చాడు. అతడిని పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ షార్ట్ బంతులతో ఇబ్బంది పెట్టాడు. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో ఓ బౌండరీ కొట్టిన తర్వాత.. సిల్లీ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న అనీష్‌ను పరాస్ తలతో ఢీకొట్టాడు. అక్కడే ఉన్న సీనియర్ ఆటగాడు మయాంక్ అగర్వాల్ జోక్యం చేసుకుని డోగ్రాతో వాగ్వాదానికి దిగాడు. అనీష్ మాటలే పరాస్‌ను ఇలా తలతో ఢీకొనడానికి ప్రేరేపించాయా అన్నది తెలియదు. క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించిన పరాస్‌కు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పడింది. "అనీష్‌ను ఢీకొట్టడం క్షణికావేశంలో జరిగింది. రంజీ ఫైనల్ లాంటి వాటిలో ఇలాంటివి సహజం. ఆ తర్వాత అనీష్‌తో బాగానే మాట్లాడా. మా మధ్య ఏ గొడవ లేదు" అని పరాస్ చెప్పాడు.

భారత్‌కు మేలుకొలుపు


రవిశాస్త్రి

చెన్నై: సూపర్ 8లో దక్షిణాఫ్రికా చేతిలో పరాజయం భారత జట్టుకు ఒకరంగా మేలు చేసేదేనని మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. టీ20 ప్రపంచకప్‌లో కీలక దశకు ముందు లోపాల్ని సరిదిద్దుకోడానికి, వ్యూహాల్ని సమీక్షించుకోడానికి ఈ ఓటమి ఎంతో అవసరమని రవిశాస్త్రి తెలిపాడు. "వరుసగా 12 మ్యాచ్‌లు గెలిచినప్పుడు ఏదో ఒకరోజు ఆట కలిసిరాకపోవచ్చు. ఆ రోజు ముందే రావడం మంచిదైంది. ఇది జట్టును మేలుకొలుపుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతివిశ్వాసానికి పోకుండా.. జట్టు కూర్పుపై పునరాలోచించుకోవాలి. సూపర్ 8 దశలో మరో మ్యాచ్‌లో ఓడితే జట్టు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లే ప్రమాదముంది. అక్షర్ పటేల్ వంటి అనుభవజ్ఞుడు జట్టులో ఉండాలి. అక్షర్, వాషింగ్టన్ సుందర్ ఇద్దరినీ ఆడించాలి. దీనివల్ల బౌలింగ్‌లో అదనపు ప్రత్యామ్నాయం లభిస్తుంది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తిలా ఎవరైనా బౌలర్ విఫలమైనప్పుడు అదనపు స్పిన్నర్ ఉండటం లాభిస్తుంది. అక్షర్ ఆడితే అతను ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. హార్దిక్ పాండ్య (5), శివమ్ దూబె (6), సుందర్ (7) వంటి హిట్టర్లు ఉన్నప్పుడు బ్యాటింగ్ గురించి ఆందోళన అవసరం ఉండదు. ఎనిమిది మంది బ్యాటర్లు ఉన్నా కూడా లక్ష్యాన్ని ఛేదించలేకపోతే అది బ్యాటింగ్ వైఫల్యమే అవుతుంది. బౌలింగ్ విభాగమూ బలోపేతం అవుతుంది" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

అయిదో స్థానానికి ఇషాన్

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటుతున్న భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధించాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన టీ20 బ్యాటింగ్ జాబితాలో ఇషాన్ మూడు స్థానాలు మెరుగై అయిదో ర్యాంకు చేరుకున్నాడు. ఓపెనర్ అభిషేక్‌శర్మ నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ 6, తిలక్ వర్మ ఏడో స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బుమ్రా ఏడు స్థానాలు మెరుగై ఎనిమిదో స్థానం దక్కించుకున్నాడు. ఆల్‌రౌండర్లలో హార్దిక్ పాండ్య 3, శివమ్ దూబె ఏడో స్థానాల్లో నిలిచారు.

పాక్ ఆటగాళ్లపై వివక్ష వద్దు: ఈసీబీ

లండన్: 'ది హండ్రెడ్' క్రికెట్ లీగ్ వేలంలో ఆటగాళ్ల జాతీయతను ప్రాతిపదికగా తీసుకుని వారిని పక్కన పెట్టకూడదని ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), ఫ్రాంఛైజీలు స్పష్టంచేశాయి. ముఖ్యంగా భారత యాజమాన్యంలోని జట్లు పాకిస్థాన్ క్రికెటర్లను కావాలనే విస్మరిస్తాయనే ఆందోళనల నేపథ్యంలో ఈ సంయుక్త ప్రకటన వెలువడింది. లీగ్‌లో నాలుగు ఫ్రాంఛైజీలు భారత యాజమాన్యాల చేతిలో ఉన్నాయి. "జాతి, లింగ లేదా జాతీయతతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రికెట్లో భాగమని భావించాలి. కేవలం జాతీయత కారణంగా ఏ ఆటగాడిని దూరం పెట్టకూడదు" అని ఈసీబీ, మొత్తం 8 ఫ్రాంఛైజీలు సంయుక్తంగా ప్రకటనలో తెలిపాయి. మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ (ఆర్‌పీఎస్‌జీ గ్రూపు), ఎమ్‌ఐ లండన్ (రిలయన్స్), సదరన్ బ్రేవ్ (జీఎంఆర్), సన్‌రైజర్స్ లీడ్స్ (సన్ గ్రూపు) జట్లు ఐపీఎల్ యాజమాన్యాలతో ముడిపడి ఉన్నాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం ఈ నాలుగు ఫ్రాంఛైజీలు వేలంలో పాక్ ఆటగాళ్లకు దూరంగా ఉండే అవకాశముంది. గత ఏడాది యాజమాన్యాలలో భారతీయులు లేకపోయినా.. కేవలం ఇద్దరు పాక్ ఆటగాళ్లు మాత్రమే లీగ్‌లో భాగమయ్యారు. మొత్తంమీద తొలి 5 సీజన్‌లలో తొమ్మిది మంది పాక్ ఆటగాళ్లు మాత్రమే పాల్గొన్నారు.

తెలంగాణ పరాజయం

వడోదర: జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ పరాజయం పాలైంది. బుధవారం పూల్-ఎలో రెండో మ్యాచ్‌లో హర్యానాపై 18-49 తేడాతో భారీ ఓటమి చవి చూసింది. నీరజ్ నర్వాల్ (11 పాయింట్లు) సూపర్-10 సాధించాడు. నితిన్ కుమార్ (9 పాయింట్లు) రాణించాడు. సుర్జీత్ సింగ్, నితేశ్ కుమార్ చెరో నాలుగు ట్యాకిల్ పాయింట్లతో ప్రత్యర్థిని దెబ్బ కొట్టారు. అంతకు ముందు జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 47-45తో తెలంగాణపై గెలిచింది.

భారత్‌దే టైటిల్

బధిరుల క్రికెట్ ఆసియాకప్

కటక్: బధిరుల క్రికెట్ ఆసియాకప్‌ను భారత్ కైవసం చేసుకుంది. బుధవారం ఫైనల్లో శ్రీలంకపై 6 వికెట్లతో భారత్ విజయం సాధించింది. సాయి ఆకాశ్ (27 పరుగులు, 2 వికెట్లు) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. టోర్నీలో శ్రీలంక బ్యాటర్ గిమాదు మల్కమ్ (196 పరుగులు) ఉత్తమ బ్యాటర్‌గా, గిహాన్ లసిదు (10 వికెట్లు) ఉత్తమ బౌలర్‌గా నిలిచారు. బధిరుల క్రికెట్లో ఇదే తొలి ఆసియాకప్.

కాశీలో గంగమ్మ అలలపై
మెక్సికో జంటకు పడవ పెళ్లి



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఆకర్షితులు అవుతున్న ఎన్నో విదేశీ జంటలు వారణాసి వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను వేదికగా చేసుకొని ఒక్కటవుతున్నాయి. రూయిజ్ కార్లోస్, గొంజలో మిగ్యుయెల్ల జంట సైతం ఇదే ఆలోచనతో మెక్సికో నుంచి వారణాసికి వచ్చింది. అస్సీ ఘాట్ వద్ద నదిపై ఉన్న పడవలో వేద మంత్రాల నడుమ అగ్నిసాక్షిగా ఈ జంట పెళ్లి విన్యాస రీతిలో జరిగింది. వరుడు ధోవతి, కుర్తాతో తలపాగా ధరించగా.. వధువు బనారస్ చీరలో మెరిసిపోయింది. ఆచార్య దీపక్ పాండే పెళ్లి మంత్రాలు చదివారు. దేశ, విదేశీ పర్యాటకులు ఘాట్ వద్ద గుమికూడి ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. కొత్తజంటపై కొందరు పూలవర్షం కురిపించారు. ఈ అద్భుతమైన క్షణాలు భిన్న సంస్కృతుల సంగమం అంటూ పలువురు తమ కెమెరాల్లో చిత్రీకరించారు.

దేశంలో మొట్టమొదటి
దివ్యాంగుల నటనాలయం





అస్సాంకు చెందిన థియేటర్ ఆర్టిస్ట్ రాజీవ్ కుమార్ సొంతంగా దివ్యాంగులకు నటనలో మెళకువలు నేర్పించడమే కాకుండా, ఇతర రంగాల్లోనూ వారు స్వావలంబన సాధించి సమాజంలో గౌరవంగా జీవించేలా ప్రోత్సహిస్తున్నారు. రిటైర్డ్ టీచరు, కళాకారుడైన తన తండ్రి సాయంతో 2019లో దేశంలోనే మొట్టమొదటి దివ్యాంగ్ థియేటర్ స్కూలును గువాహటిలో 30 మంది విద్యార్థులతో ప్రారంభించారు. వారికి నటనతోపాటు నృత్యం, పాటలు, యోగా, ధ్యానం, పేపర్ క్రాఫ్ట్ వంటి పలు రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. గువాహటి నడిబొడ్డున ఉన్న ఈ పాఠశాలలో ప్రతి శని, ఆదివారాలు క్లాసులు జరుగుతాయి. ఇక్కడి విద్యార్థులు ఇప్పటికే దిల్లీ సహా పలు నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ పాఠశాలలో చేరాక తమ పిల్లల మాట తీరు బాగా మెరుగుపడిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తప్పే.. క్షమించండి
ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై సిబ్బందితో బిల్ గేట్స్



న్యూయార్క్: సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తన సంబంధాలపై సంస్థ సిబ్బందితో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ క్షమాపణలు చెప్పారు. తను ఎటువంటి చట్టవిరుద్ధమైన పనులు చేయలేదనంటూనే ఇద్దరు రష్యన్ యువతులతో సంబంధాలున్న విషయాన్ని అంగీకరించారు. కానీ వారిద్దరూ ఎప్‌స్టీన్ కుంభకోణంలో బాధితులు కారని స్పష్టం చేశారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మహిళలతో ఉన్న తన ఫొటోలు విడుదల కావడంపై స్పందిస్తూ.. అవి అతడు అడిగితే దిగిన ఫొటోలని తెలిపారు. 'ఎప్‌స్టీన్ బాధితులతో, ఆయన చుట్టూ ఉండే మహిళలతో నాకు ఎటువంటి సంబంధాలు లేవు. అతడిని కలుసుకోవడం, గేట్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌లను ఆయన సమావేశాలకు తీసుకెళ్లడం పెద్ద తప్పు. నా తప్పిదం కారణంగా ఈ వ్యవహారంలో చిక్కుకున్న వారందరికీ నేను క్షమాపణలు చెబుతున్నా' అని మంగళవారం సిబ్బందితో జరిగిన సమావేశంలో బిల్ గేట్స్ పేర్కొన్నారు.



మిమ్మల్ని మీరు తక్కువ చేసుకోకండి

నగటు మనుషులు నొచ్చుకుంటారని, లేదా ఇబ్బంది పడకూడదని మీ గొప్పతనాన్ని, సామర్థ్యాన్ని తక్కువ చేసుకోకండి. ప్రపంచం సాధారణ ప్రతిభను గుర్తించదు. ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకుని వాటి కోసం గట్టిగా ప్రయత్నించండి. ప్రజలు మిమ్మల్ని గుర్తించేలా మీ ఉనికిని చాటుకోండి.

– ఎలీనా కార్డన్, ఇన్‌ఫ్లుయెన్సర్

మళ్లీ గెలవబోతున్నాం

- సుంకాలకు ప్రత్యామ్నాయ చట్టాలను రూపొందిస్తాం
- అమెరికన్ కాంగ్రెస్‌లో ట్రంప్



వాషింగ్టన్: 'మనం గెలవబోతున్నాం.. మరింతగా గెలవబోతున్నాం.. ఎంతగా అంటే ప్రజలు ఇక చాలు.. ఇంత భారీ విజయాలను భరించలేకపోతున్నాం అధ్యక్షా అనేంతగా.. దీంతోపాటు ప్రపంచాన్ని కొత్త దారిలో పెట్టి దేశంలో ఉద్యోగ, తయారీ బూమ్‌ను తీసుకొచ్చాం' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రతీకార సుంకాలపై ప్రత్యామ్నాయ చట్టాలను ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. వాటికి కాంగ్రెస్ ఆమోదం అవసరం ఉండదని తేల్చి చెప్పారు. అమెరికా చట్టసభల సంయుక్త సమావేశంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. గత ఏడాది ప్రసంగ రికార్డును అధిగమిస్తూ 100 నిమిషాలకుపైగా ఆయన ప్రసంగం సాగింది. చాలా మంది నమ్ముతున్న దానికంటే ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చెప్పడానికి ట్రంప్ ప్రయత్నించారు. వచ్చే నవంబరులో వివిధ రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో తమకే ఓట్లు వేయాలని చెప్పేందుకు ఈ ప్రసంగాన్ని వినియోగించుకున్నారు. ఆశ్చర్యకర అతిథులను సభలో పరిచయం చేశారు. అందులో అమెరికా యుద్ధ వీరులతోపాటు ఒలింపిక్స్‌లో గెలిచిన హాకీ బృందం ఉంది. హాకీ గోల్‌కీపర్ హెల్‌బ్యాక్‌కు అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం'ను ప్రకటించారు.

సుంకాలు దేశాన్ని రక్షిస్తున్నాయ్

సుంకాలు దేశాన్ని రక్షిస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. డెమోక్రాట్లు దేశాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు.

■ 'ఇరాన్ సమస్యకు దౌత్యం ద్వారా పరిష్కారం కనుగొనాలనేది నా లక్ష్యం' అని ట్రంప్ స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని తాను ఆపకపోతే 3.5 కోట్ల మంది చనిపోయేవారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తనను ప్రశంసించారని ట్రంప్ మరోసారి చెప్పారు. భారత్ యుద్ధాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు తను లేకపోతే పాక్ ప్రధాని చనిపోయి ఉండేవారని నోరు జారారు. కానీ వెంటనే 3.5 కోట్ల మంది యుద్ధంలో చనిపోయేవారని పాక్ ప్రధాని తనతో చెప్పినట్లు వెల్లడించారు.

■ ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు దురదృష్టకరమని ట్రంప్ వ్యాఖ్యానించారు.

వ్యక్తిగత పర్యటనకు 50 మంది సిబ్బంది పురమాయింపు
బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ అధికార దుర్వినియోగంపై కేంద్రం ఆగ్రహం

దిల్లీ: ఆయనో ప్రభుత్వ రంగ సంస్థ సీనియర్ ఉన్నతాధికారి. బంధు మిత్ర సమేతంగా ప్రయాగ్‌రాజ్ సందర్శనకు ప్రణాళిక సిద్ధం చేశారు. అధికార విధులతో ఏ మాత్రం సంబంధంలేని పూర్తిగా వ్యక్తిగత పర్యటన ఇది. అయినా సరే తన హోదాను అడ్డు పెట్టుకుని అధికార యంత్రాంగానికి హుకుం జారీ చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో అడుగుపెట్టింది మొదలు తాము వెళ్లే ప్రతిచోటా సమకూర్చాల్సిన సేవలను, సిద్ధం చేయాల్సిన ఏర్పాట్లతో కూడిన భారీ చిట్టాను పంపించారు. ఉన్నతాధికారి కావడంతో పదుల సంఖ్యలో సిబ్బందిని అధికారులు పురమాయించాల్సి వచ్చింది. ఈ వ్యవహారమంతా బహిర్గతం కావడంతో కేంద్రం సీరియస్ అయ్యింది. షోకాజ్ నోటీస్ జారీచేసి వివరణ కోరింది. దీంతో ఈ నెల 25, 26 తేదీల్లో జరగాల్సిన వివేక్ బంజల్ వ్యక్తిగత పర్యటన రద్దయ్యింది.



ఇదీ పనుల జాబితా..

వివేక్ బంజల్, ఆయన బంధుమిత్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడానికి 50 మంది బీఎస్ఎన్ఎల్ సిబ్బందిని కేటాయించాలనే ఆదేశాలు వచ్చాయి. 'రైల్వేస్టేషన్‌లో దిగగానే స్వాగతం పలకాలి. హోటల్ గదులు బుక్ చేయాలి. ఆలయ సందర్శనలు, బోట్ రైడ్స్‌ను సమన్వయం చేసుకోవాలి. టవల్స్, లోదుస్తులు సహా నూనె, దువ్వెన వంటి వాటితో 'స్నాన్ కిట్స్' సిద్ధం చేయాలి. పురుషులకు, మహిళలకు స్నాన్ కిట్స్ విడివిడిగా ఉంచాలి. ఆలయాల సందర్శనకు రవాణా సౌకర్యాలు చూసుకోవాలి. ఫొటోలు తీయాలి. వాహనాల్లో వాటర్ బాటిల్స్, స్నాక్స్ ఉండేలా చూడాలి'.. అంటూ సాగిన పనుల జాబితా ఆన్‌లైన్‌లో వెలుగులోకి రావడంతో నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రం వెంటనే స్పందించింది.

కాంగ్రెస్ సిగ్గుపడాలి

- ఎమర్జెన్సీ తరహాలో బాధపడాల్సి వస్తుంది
- ఏఐ సమిట్‌లో అర్ధనగ్న నిరసనలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

దిల్లీ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

కృత్రిమ మేధ (ఏఐ) సమిట్‌లో యువజన కాంగ్రెస్ అర్ధనగ్న నిరసనపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పని చేసినందుకు ఆ పార్టీ సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించినందుకు ఆ పార్టీ విచారించిన రీతిలో ఏఐ సమిట్ వద్ద నిరసన నిర్వహించినందుకూ బాధపడాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. దిల్లీలోని భారత్ మండపంలో రెండు రోజులపాటు నిర్వహించిన బిజినెస్ స్టాండర్డ్ మంథన్ సదస్సులో చివరి రోజైన బుధవారం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ చర్యలపై విపక్షం ప్రశ్నించవచ్చని.. కానీ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించడం భారతీయులకు తలవంపులు తెచ్చే ప్రయత్నమేనని విమర్శించారు. ఈ చర్యవల్ల దేశ ప్రజల పరువేం పోలేదని, కాంగ్రెస్ పరువే పోయిందని 90 శాతం మంది ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు.



రాజకీయ కోణంలో రాష్ట్రాల నిర్ణయాలు

రాష్ట్రాల స్థాయిలో రాజకీయపరమైన అంశాల కారణంగానే బడ్జెట్‌లో కేటాయింపులు ఖర్చు కావడం లేదని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మూలధన పెట్టుబడి కోసం కేంద్రం ఇస్తున్న ప్రత్యేక సాయాన్ని స్వీకరించే విషయంలో రాజకీయ కోణంలో రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని తెలిపారు. సంప్రదాయ పెట్టుబడుల ఉపసంహరణ విధానాలను మించి ప్రభుత్వ సంస్కరణలు ఉంటున్నాయని వెల్లడించారు. చైనా విధానాలను భారత్ అనుసరించలేదని, రెండూ భిన్న ఆర్థిక వ్యవస్థలని అభిప్రాయపడ్డారు. 'అగ్రి స్టాక్' సంస్కరణలు విప్లవాత్మకమైనవి చెప్పారు. ఇవి యూపీఐ తరహా విప్లవాన్ని తెస్తాయని తెలిపారు.

■ శిలాజేతర ఇంధన రంగంలో భారత్ పురోగతి సాధిస్తోందని సదస్సులో పాల్గొన్న కేంద్ర పునరుత్పాదక ఇంధన వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. ఈ రంగంలో 2030 నాటికి 500 గిగావాట్ల ఉత్పాదకతను సాధించాల్సి ఉందని తెలిపారు.

■ 'ఏఐ ఫర్ ఇండియా- ఫ్రం యాంబిషన్ టూ ఎగ్జిక్యూషన్'పై చర్చలో హైదరాబాద్ ఐఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా పాల్గొన్నారు.

■ హైటెక్ డిఫెన్స్ రంగంలో భారత్ అవకాశాలు అనే అంశంపై జరిగిన చర్చలో మిధానీ లిమిటెడ్ సీఎండీ కల్యాణ్ రాజగోపాల్ పాల్గొన్నారు.

■ వ్యూహాత్మక రంగంలో భారత్ స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవడం అనే అంశంపై జరిగిన చర్చలో [illegible] సైనిక రంగాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. యుద్ధ విమానాలు, నౌకలు, ట్యాంకులను తయారు చేస్తున్నప్పటికీ వాటి ఇంజిన్లను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడం సరి కాదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక శక్తితోపాటు సైనిక శక్తీ అవసరమేనని, జపాన్, జర్మనీ ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ వాటి సైనిక శక్తి అంత బలంగా లేకపోవడంవల్ల ప్రపంచం వాటిని శక్తిమంతమైనవిగా భావించలేమని పేర్కొన్నారు. భారత్‌కు స్వయం ప్రతిపత్తి ఉండాలని స్వాతంత్ర్యానికి ముందే మహాత్మా గాంధీ భావించారని చెప్పారు.

■ ఆహార, ఇంధన భద్రత, డిజిటల్ మార్కెట్ల నియంత్రణపై బుధవారం చర్చించారు.

■ పరిశ్రమలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలపై ఏఐ ప్రభావం గురించీ చర్చలు సాగాయి. ఈవీల విప్లవం, ఈవీల దిశగా పరివర్తన, సమస్యలు, సవాళ్లు, అవకాశాలపైనా చర్చలు జరిగాయి.

■ సినిమా రంగంపై ఏఐ ప్రభావం గురించి ప్రముఖ దర్శకుడు, నిర్మాత శేఖర్ కపూర్ మాట్లాడారు. రాజమౌళి ఆర్ఆర్ఆర్‌ను రూ.350 కోట్లకు పైగా వ్యయంతో తీశారని, ప్రస్తుతం ఏఐ సాయంతో చౌకగా దానిని తీయవచ్చని అభిప్రాయపడ్డారు. తదుపరి తరంలో సినిమాకు నిర్దిష్ట స్క్రిప్ట్ ఉండదని, థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకుడిని బట్టి కథ సాగేలా మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు. మూడేళ్లలో తీసే సినిమాను ఏఐతో రెండు రోజుల్లో తీయవచ్చని వివరించారు.

దిల్లీ పోలీసులపై హిమాచల్‌లో కిడ్నాప్ కేసు

- మలుపు తిరిగిన యువజన కాంగ్రెస్ అరెస్టులు

దిల్లీ, శిమ్లా: ఏఐ సదస్సులో నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ కార్యకర్తల వ్యవహారం హిమాచల్‌ప్రదేశ్‌లో ఇబ్బందికర వాతావరణానికి దారితీసింది. నిరసనకారుల్లో ముగ్గురిని తమతో తీసుకువెళ్లేందుకు దిల్లీ పోలీసులు సాధారణ దుస్తుల్లో హిమాచల్‌ప్రదేశ్‌కు వచ్చారు. ఆ ముగ్గురినీ బుధవారం తమ వాహనాల్లో తీసుకువెళ్తుండగా శిమ్లా సమీపంలోని షోగి సరిహద్దు వద్ద హిమాచల్ పోలీసులు అడ్డగించారు. రోహ్రూలోని రిసార్టులో ఉన్నవారిని అపహరించుకుని తీసుకుపోతున్నారంటూ 15-20 మంది గుర్తుతెలియని వ్యక్తులపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు కార్యకర్తల్ని తాము అరెస్టుచేసినట్లు అంతకుముందు దిల్లీ పోలీసులు ప్రకటించారు. వారిని హిమాచల్‌లోని స్థానిక కోర్టులో హాజరుపరిచి న్యాయమూర్తి ఆదేశాలతో దిల్లీకి తరలించడానికి అనుమతి పొందినట్లు చెప్పారు. ట్రాన్సిట్ రిమాండును దిల్లీ పోలీసులు పొందలేదంటూ హిమాచల్ పోలీసులు అడ్డుపడి యువజన కాంగ్రెస్ కార్యకర్తల్ని తిరిగి శిమ్లాకు తీసుకువెళ్లారు. మరోవైపు.. అరెస్టయిన కార్యకర్తల జ్యుడీషియల్ కస్టడీని దిల్లీ న్యాయస్థానం మరో నాలుగు రోజులు పొడిగించింది.

బ్రోకలీ, పర్పుల్ క్యాబేజీతో
గుజరాత్ రైతు లాభాల సాగు



ఈటీవీ భారత్: గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లా అంధారియావాడ్ గ్రామ రైతు శాంతి భాయ్ వేగడ్ బ్రోకలీ, పర్పుల్ క్యాబేజీ లాంటి విదేశీ కూరగాయలను పండించి మంచి లాభాలు గడిస్తున్నారు. ఈ రైతు చాలా ఏళ్లుగా రకరకాల కూరగాయలు, పండ్లు పండిస్తున్నారు. ఈసారి కాస్త వినూత్నంగా ఆలోచించి బ్రోకలీ, పర్పుల్ క్యాబేజీ సాగు చేయడంతో జిల్లాలో శాంతిభాయ్ పేరు మారుమోగుతోంది. ఈ పంటలకు చీడపీడల బెడద చాలా తక్కువ. శాంతిభాయ్ తన పొలంలో గింజలు లేని నిమ్మకాయలతోపాటు నేపియర్ గడ్డిని కూడా పెంచుతూ మిశ్రమ సాగులో రాణిస్తున్నారు. మార్కెట్లో కిలో రూ.150 వరకు పలుకుతున్న బ్రోకలీని వ్యాపారులు నేరుగా పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. పర్పుల్ క్యాబేజీలో పోషక విలువలు అధికం. తక్కువ నీరు, ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చే పంటలను ఎంచుకొని శాంతిభాయ్ లాంటి రైతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఉద్యానశాఖ అధికారి ఎంబీ వాఘ్మాసి ప్రశంసలు కురిపించారు. ఎటువంటి రసాయనాలు వాడకుండా సహజ సిద్ధంగా పండిస్తున్న ఈ పంటల వల్ల ఆర్థిక ప్రయోజనంతోపాటు సంతృప్తి కూడా లభిస్తుందని శాంతిభాయ్ అంటున్నారు.



భారత్ సహా 40 దేశాల కోళ్లు, గుడ్లపై సౌదీ నిషేధం

ఇంటర్నెట్‌డెస్క్: సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ సహా 40 దేశాల నుంచి కోళ్లు, గుడ్ల దిగుమతులపై పూర్తి నిషేధం విధించింది. ఈ జాబితాలో భారత్‌తో పాటు అఫ్గానిస్థాన్, చైనా, జర్మనీ, ఇండోనేసియా, బ్రిటన్, జపాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలున్నాయి. ఇక, మరో 16 దేశాల్లోని నిర్దిష్ట ప్రాంతాలపై పాక్షిక ఆంక్షలు విధించింది. ఆస్ట్రేలియా, అమెరికా, ఇటలీ, భూటాన్, ఫ్రాన్స్ వంటి దేశాలపై ఈ పాక్షిక ఆంక్షలు అమలవుతాయని తెలిపింది. అయితే, ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వేడి చేసిన కోడి మాంసం, దాని సంబంధిత ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తించబోదని సౌదీ అధికారులు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో బర్డ్‌ఫ్లూ, వైరస్‌లు వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలోనే సౌదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఆ ఎయిర్ అంబులెన్స్‌లో బ్లాక్‌బాక్స్ లేదా..?


ఝార్ఖండ్ ఎయిర్‌అంబులెన్స్ కూలిన ఘటనలో ఓ కొత్తకోణం వెలుగు చూసింది. దానిలో బ్లాక్‌బాక్స్ లేదని తెలుస్తోంది. దీంతో ప్రమాద కారణాన్ని తెలుసుకోవడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారనుంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం బరువు 5,700 కిలోల కంటే తక్కువ ఉండటంతో దానిలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్ లేవు. పౌర విమానయాన నిబంధనల ప్రకారం ఈ బరువు కంటే తక్కువ ఉన్న విమానాల్లో వాటి అవసరం లేదు. ఈ నేపథ్యంలో ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్‌తో పైలట్ జరిపిన కమ్యూనికేషన్ రికార్డుల ఆధారంగానే ఇప్పుడు దర్యాప్తు చేయాల్సిఉంటుంది.

ఝార్ఖండ్, బెంగాల్‌లో మూడు కోర్టులకు బాంబు బెదిరింపులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్‌లోని మూడు కింది కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. భద్రతా బలగాలు కోర్టుల పరిసరాలను ఖాళీ చేయించి తనిఖీలు నిర్వహించగా.. పేలుడు పదార్థాలేవీ లభించలేదు. తనిఖీల కారణంగా న్యాయ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్, సురీ జిల్లా న్యాయస్థానాలకు, ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్ సివిల్ కోర్టుకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని పలు కోర్టులకు మంగళవారం కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. అనంతరం అవి బూటకమని తేలాయి.

పదో తరగతి పత్రాలతోనూ
ఓటరు గుర్తింపు నిర్ధరణ

- బెంగాల్‌లో 'సర్' కసరత్తుపై సుప్రీంకోర్టు



దిల్లీ: అర్హులైన ఓటర్లుగా నిరూపించుకోవడానికి ప్రజలు పదో తరగతి ప్రవేశ (అడ్మిట్) కార్డు, ఉత్తీర్ణత ధ్రువీకరణనూ అనుబంధ పత్రంగా ఎన్నికల అధికారులకు సమర్పించవచ్చని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుకు సంబంధించి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వు ఇచ్చింది. ఓటరు నమోదు అభ్యర్థనల్లో సహేతుక వ్యత్యాసాలు, తల్లిదండ్రుల పేర్లపై అభ్యంతరాలకు సంబంధించి వచ్చిన 80లక్షల క్లెయిమ్‌ల పరిష్కారానికి బెంగాల్‌లోని జిల్లా, సబార్డినేట్ జడ్జీలను కేటాయించాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ధర్మాసనం ఇది వరకే సూచించింది. అయితే, బెంగాల్‌లోని 250 మంది జిల్లా, సబార్డినేట్ జడ్జీలు సరిపోరని తెలపడంతో ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాల న్యాయాధికారుల సహకారాన్నీ తీసుకోవాలని సీజేఐ ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై మరింత స్పష్టతనిస్తూ పదో తరగతి పత్రాలను ఓటర్ల గుర్తింపు నిర్ధరణకు అనుబంధ పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవచ్చని బుధవారం వివరించింది. గురువారం సాయంత్రం 5 గంటల్లోగా వాటిని ఎన్నికల అధికారులకు అందజేయాలని పేర్కొంది. బెంగాల్‌లో సర్ కసరత్తు ఈ నెల 28వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ స్పష్టతనిచ్చింది.

ఝార్ఖండ్ ముఖ్యమంత్రిపై ఈడీ కేసు
విచారణ నిలిపివేతకు సుప్రీం ఆదేశం

దిల్లీ: నగదు అక్రమ చలామణికి సంబంధించి ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో విచారణపై సుప్రీం కోర్టు నిలిపివేత(స్టే) ఉత్తర్వులిచ్చింది. ఈ కేసును కొట్టివేయాలంటూ హేమంత్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీ ధర్మాసనం బుధవారం ఈడీకి నోటీసు జారీ చేసింది. ఈడీ తనకు పదేపదే సమన్లు జారీ చేయడాన్నీ ఈ పిటిషన్‌లో హేమంత్ సవాల్ చేశారు. తనకు వ్యతిరేకంగా దాఖలైన ఈడీ కేసును ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరిశీలనకు స్వీకరించగా హేమంత్ దానిని ఝార్ఖండ్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ అభ్యర్థనను జనవరి 15న హైకోర్టు తోసిపుచ్చడంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఏ వర్గాన్నీ కించపరచడానికి వీల్లేదు: సుప్రీం

దిల్లీ: జాతీయ, సామాజిక సమైక్యత సాధించేందుకు సౌభ్రాతృత్వ భావనే కీలకమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. ఉన్నతమైన రాజ్యాంగ పదవుల్లో ఉన్న ప్రముఖులు మతం, కులం, భాష, ప్రాంతాల ప్రాతిపదికన ఏ వర్గాన్నీ తమ వేధింపుల లక్ష్యంగా ఎంచుకోడానికి వీల్లేదని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రముఖులు తమ ప్రసంగాలు, మీమ్‌లు, కార్టూన్లు, కళా ప్రదర్శనల ద్వారా ఏ వర్గాన్నీ దూషణలకు, అవమానానికి గురిచేయరాదని కోర్టు స్పష్టంచేసింది. నెట్‌ఫ్లిక్స్‌లో "ఘూస్‌ఖోర్ పండిత్" అనే క్రైం థ్రిల్లర్ చిత్ర విడుదలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై వెలువరించిన ప్రత్యేక తీర్పులో న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఏ వర్గాన్ని కించపరిచినా అది రాజ్యాంగ విరుద్ధమేనని ఆయన తన 39 పేజీల తీర్పులో పేర్కొన్నారు. వ్యక్తి గౌరవాన్ని, జాతీయ సమైక్యత, సమగ్రతలను కాపాడాలని రాజ్యాంగ ప్రవేశిక పేర్కొంటోందని కోర్టు తెలిపింది.

ఇరాన్‌పై తాజా ఆంక్షలు

వాషింగ్టన్: ఇరాన్‌పై మరోసారి అమెరికా ఆంక్షల కొరడా ఝుళిపించింది. ఆ దేశ బాలిస్టిక్ క్షిపణుల కార్యక్రమానికి, డ్రోన్ల ఉత్పత్తికి సహకరిస్తున్న వ్యక్తులు, కంపెనీలపై ఈ ఆంక్షలను విధించింది. 30 మంది వ్యక్తులతోపాటు కంపెనీలు, నౌకలపై ఈ ఆంక్షలు అమల్లోకి వస్తాయని అమెరికా ఆర్థికశాఖ బుధవారం వెల్లడించింది.

ఇరాన్ గుట్టు చెప్పాలంటూ సందేశాలు

ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే అమెరికా నిఘా సంస్థ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ) ఓ ఆఫర్‌ను ప్రకటించింది. ఇరాన్ గుట్టు చెప్పాలని కోరింది. సురక్షితంగా సీఐఏను ఎలా సంప్రదించాలో పార్సీ భాషలో సూచనలు ఇచ్చింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. 'హలో.. సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మీ మాట వింటోంది. మేం సహాయం చేయాలనుకుంటున్నాం. మాతో సురక్షితంగా వర్చువల్ కాల్ ఎలా చేయాలో కొన్ని సూచనలు ఇవి' అని సామజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టింది.

దీపక్ రక్షించింది మన రాజ్యాంగాన్ని
ప్రస్తుతించిన రాహుల్

దిల్లీ: బజరంగ్‌దళ్ కార్యకర్తలుగా భావిస్తున్న కొందరి వేధింపుల నుంచి ఒక పేద ముస్లిం దుకాణదారుణ్ని కాపాడి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఉత్తరాఖండ్ జిమ్ యజమాని దీపక్.. వాస్తవానికి మన రాజ్యాంగాన్ని పరిరక్షించారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బుధవారం ప్రశంసించారు. ఒక బలహీన ముస్లింకు అండగా నిలిచినందుకు "మహమ్మద్ దీపక్"గా ప్రసిద్ధుడైన ఆ జిమ్ యజమాని- బలహీనుడికి రక్షణ కల్పించడం కోసం ద్వేషానికి ఎదురు నిలిచారని, ఇంతకు మించిన దేశభక్తి మరొకటి ఉండదని రాహుల్ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. దీపక్ కుమార్‌ను, అతని స్నేహితుడు విజయ్ రావత్‌ను ఇటీవల కలిసిన సందర్భంగా తీసిన వీడియోను ఆయన తన పోస్టుకు జతచేశారు. "ప్రేమ, సహనాల భావజాలం దేశంలో కోట్లమంది మనసుల్లో గూడు కట్టుకొని ఉంది. దీపక్ ధైర్యంగా తన మనసులోని విషయాన్ని బహిర్గతం చేసి వారందరికీ మార్గం చూపారు. సమాజంలో ద్వేషాన్ని, భయభ్రాంతులను వ్యాప్తి చేస్తున్నవారు పిరికిపందలు. వారికి ఎన్నడూ భయపడకండి" అని రాహుల్ పిలుపునిచ్చారు.



హెచ్ఐవీ కేసులు మేఘాలయలోనే ఎక్కువ
వెల్లడించిన ప్రభుత్వం

షిల్లాంగ్: దేశంలో హెచ్ఐవీ బాధితులు అత్యధికంగా ఉన్నది మేఘాలయలోనే అని ఆరోగ్య శాఖ మంత్రి డబ్ల్యూ షిల్లా అసెంబ్లీలో ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10,293 మంది దానికి చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. 'గత దశాబ్ద కాలంలో హెచ్ఐవీ బారినపడి రాష్ట్రంలో 749 మంది మరణించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ చట్టంలోని గోప్యత నిబంధన ప్రకారం.. సమ్మతి లేకుండా ఎవ్వరికీ వైద్య పరీక్షలు నిర్వహించలేం. ఔషధాలు వేసుకోవాలని బలవంతపెట్టలేం. సామాజిక కారణాలు చాలామందిని ఆసుపత్రులకు రాకుండా అడ్డుకుంటున్నాయి. అయినా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. హెచ్ఐవీ బాధితులు ఆసుపత్రులకు వచ్చేలా చేస్తున్నారు. పెరుగుతున్న హెచ్ఐవీ కేసులను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఐదేళ్ల కార్యక్రమానికి ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది' అని మంత్రి వివరించారు.

పేరులో ఒక్క అక్షరం తేడా.. 45 ఏళ్లుగా ఆగిన పెన్షను

ఇంటర్నెట్ డెస్క్: తండ్రి మరణం తర్వాత ఆగిన పింఛను కోసం ఓ మహిళ నాలుగు దశాబ్దాలకు పైగా న్యాయపోరాటం చేశారు. పేరులో ఒక్క అక్షరం తేడా ఉందనే కారణంతో పింఛను ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తూ రావడంతో ఆమె అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఉన్నత న్యాయస్థానం అధికారుల తీరుపై మండిపడింది. వారంలోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు చెందిన మంజురాయ్ తండ్రి స్థానిక మున్సిపల్ కార్పొరేషనులో పనిచేసి, 1975లో పదవీ విరమణ పొందారు. 1980లో ఆయన మృతిచెందగా.. అప్పటివరకు పింఛను సక్రమంగా వచ్చేది. ఆ తర్వాత ఫ్యామిలీ పెన్షను కోసం కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకోగా.. ఆయన పేరులో అక్షరం తేడా ఉందనే కారణంతో నిరాకరించారు. సర్వీసు రికార్డుల్లో ఉద్యోగి పేరు శిఖర్ నాథ్ శుక్లాగా నమోదై ఉండగా.. దరఖాస్తు తదితర పత్రాల్లో శేఖర్‌నాథ్ శుక్లాగా ఉంది. 'ఐ', 'ఈ' తేడాతో ఫ్యామిలీ పెన్షను మంజూరు 45 ఏళ్లుగా ఆగిపోయింది. పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నందున అఫిడవిట్ కూడా సమర్పించినట్లు మంజురాయ్ తన పిటిషనులో పేర్కొన్నారు. వారసత్వ ధ్రువీకరణ పత్రం, ఇతర పత్రాలను కూడా జత చేశారు. విచారించిన హైకోర్టు.. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించకపోతే తదుపరి విచారణకు మున్సిపల్ కమిషనరు స్వయంగా హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది.

పాక్ అనుకూల శక్తులతో రాహుల్‌కు సంబంధాలు

- దేశ వ్యతిరేకతలో ఆయనది నెహ్రూ వారసత్వం
- భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు



పట్నా: భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర భద్రతా సంస్థలకు సమాచారం ఇవ్వకుండా ఆయన 247 విదేశీ పర్యటనలు చేశారని, భారత వ్యతిరేక, పాకిస్థాన్, చైనా అనుకూల శక్తులతో రాహుల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని ఆరోపించారు. ఆయన ముత్తాత నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు వ్యక్తిగత స్వార్థం కోసం దేశ ప్రయోజనాలు పట్టించుకోకుండా 'రాజీ మిషన్'ను మొదలుపెట్టారని, అనంతరం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దాన్ని కొనసాగించారని, ఇప్పుడు రాహుల్ కూడా వారి బాటలో నడుస్తున్నారని మండిపడ్డారు. గత వారం దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌లో భారత యువజన కాంగ్రెస్ కార్యకర్తలు 'ప్రధాని రాజీపడ్డారు' అనే నినాదంతో చొక్కాలు విప్పి నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో, నబీన్ బుధవారం బిహార్‌లోని పట్నాలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్, చైనా అనుకూలురైన బిలియనీర్ జార్జ్ సోరస్, అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు ఇల్హాన్ ఒమర్, కెన్యా ఫైనాన్షియర్ షకీర్ మెరలీలతో రాహుల్‌కు దగ్గర సంబంధాలున్నాయని, ఆయన రాజకీయాలను ప్రజలు, యువత అర్థం చేసుకున్నారని నబీన్ పేర్కొన్నారు.







ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ బ్యాటింగ్ ★ ఎమ్మెల్యే పరిటాల సునీత బ్యాట్ పట్టారిలా ★ క్యారమ్స్ ఆడుతున్న ఎమ్మెల్యేలు జగదీశ్వరి, విజయశ్రీ. ఆట చూస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఆటవిడుపు అదిరింది

- రెండో రోజూ సత్తాచాటిన ప్రజాప్రతినిధులు
- ఉత్సాహంగా క్రికెట్ ఆడిన బుచ్చయ్యచౌదరి
- బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లో హోరాహోరీ పోరు



టీటీ ఆడుతున్న కర్రి పద్మశ్రీ, పల్లె సింధూర, వంకా రవీంద్రనాథ్

ఈనాడు, అమరావతి: సభలోనే కాదు సభ వెలుపలా తగ్గేదే లేదంటూ రెండోరోజూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్రీడాపోటీల్లో సత్తాచాటారు. ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించిన క్రికెట్ పోటీలు సరదాగా జరిగాయి. ఉపసభాపతి రఘురామకృష్ణరాజుతో పాటు మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సవిత, అనిత తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాసంశెట్టి సుభాష్ బ్యాటింగ్‌లో రాణించారు. నాదెండ్ల మనోహర్ వికెట్ కీపర్‌గా ఆకట్టుకున్నారు. సత్యకుమార్ యాదవ్ బాగా బౌలింగ్ చేశారు. సవిత, అనితలు ఫీల్డింగ్‌లో చురుగ్గా కదిలారు. మొత్తం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. తొలి మ్యాచ్‌లో సత్యకుమార్ యాదవ్ జట్టు, రెండో మ్యాచ్‌లో రాంప్రసాద్‌రెడ్డి జట్టు, మూడో మ్యాచ్‌లో అచ్చెన్నాయుడి జట్టు, నాలుగో మ్యాచ్‌లో కొల్లు రవీంద్ర జట్టు విజయం సాధించాయి. గురువారం జరిగే ఫైనల్స్‌లో ఈ నాలుగు టీంలలోని సభ్యులు కలిసి పాల్గొననున్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రి 10 గంటల వరకూ మ్యాచ్‌లు జరిగాయి.

క్రికెట్‌లో చమక్కులు..

◆ ఎమ్మెల్యేల్లో అందగాడు, శోభన్‌బాబు మన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అని సత్యకుమార్ యాదవ్ అన్నారు. కందుల దుర్గేష్ వేదిక మీదకు వస్తున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

◆ బల్లి కల్యాణ చక్రవర్తి, వర్ల కుమార్‌రాజా మాత్రమే సిక్స్‌లు కొట్టారు. ఈ సందర్భంగా సిక్స్ కొట్టి వీరు రూ.25 వేలు సంపాదించారంటూ ఈశ్వరరావు సరదాగా వ్యాఖ్యానించారు.

నువ్వా.. నేనా అన్నట్లుగా బ్యాడ్మింటన్

◆ దండమూడి రాజగోపాలరావు నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో స్త్రీ, పురుష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉత్సాహంగా తలపడ్డారు. పురుషుల 50+ కేటగిరీలో నరేంద్ర వర్మ, ఆరిమిల్లి రాధాకృష్ణ మధ్య పోటీ నువ్వా.. నేనా.. అన్న రీతిలో సాగింది. చివరగా నరేంద్రవర్మ 22-20 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. ◆ మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆరిమిల్లి రాధాకృష్ణ, కావలి గ్రీష్మ జోడీ 2-0 తేడాతో కె.శ్రీనివాస్, బండారు శ్రావణిశ్రీ జోడీపై ఏకపక్షంగా విజయం సాధించింది. ◆ మహిళల సింగిల్స్‌లో బండారు శ్రావణిశ్రీ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోగా.. కావలి గ్రీష్మ సెమీఫైనల్‌లో ప్రవేశించారు. ◆ ఏలూరి సాంబశివరావు మోచేతి కండరం గాయమైనా క్రీడాస్ఫూర్తితో పోటీ కొనసాగించారు.



షటిల్ ఆడుతున్న బండారు శ్రావణిశ్రీ, భూమా అఖిలప్రియ

సంధ్యారాణి జట్టుపై పరిటాల జట్టు విజయం

◆ త్రోబాల్ పోటీలు మహిళల విభాగంలో మంత్రి సంధ్యారాణి బృందంపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జట్టు 21-14 తేడాతో గెలుపొందింది. తొలి నుంచి పరిటాల సునీత జట్టు ఆధిక్యం కనబరిచింది. బండారు శ్రావణిశ్రీ ఉత్తమ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించారు. ఒక దశలో సునీత జట్టు 11 పాయింట్ల ఆధిక్యంలో ఉండగా.. సంధ్యారాణి జట్టు 0గా ఉంది. కోర్టు మారిన తర్వాత సంధ్యారాణి జట్టు బోణీ కొట్టింది. ఆ బృందంలో ఉన్న పల్లె సింధూరరెడ్డి ఒక్కరే ఎక్కువ పాయింట్లు సాధించారు. 'నువ్వే మా ఆశ, శ్వాస ఆడమ్మా' అంటూ సింధూరతో సంధ్యారాణి వ్యాఖ్యానించారు.

◆ టెన్నికాయిట్ మహిళల సింగిల్స్ విభాగంలో సునీత, సింధూరరెడ్డి పోటీపడ్డారు. సునీతపై పది పాయింట్ల తేడాతో సింధూరరెడ్డి గెలిచారు

◆ టెన్నికాయిట్ మహిళల డబుల్స్ విభాగంలో సింధూరరెడ్డి, ఎన్.విజయశ్రీ జోడీపై కర్రి పద్మశ్రీ, జగదీశ్వరి జోడీ 4 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

◆ టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్‌లో కావలి గ్రీష్మ విజయం సాధించారు.

◆ టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్‌లో కావలి గ్రీష్మ, పల్లె సింధూరరెడ్డి జోడీ గెలుపొందింది.

◆ క్యారమ్స్‌లో విజయశ్రీ ప్రథమస్థానంలో, బండారు శ్రావణిశ్రీ ద్వితీయ, పల్లె సింధూరరెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు.

భీముడు, శతధృవంశ యోధుడు అచ్చెన్న

◆ అచ్చెన్నాయుడు క్రీడా దుస్తులు ధరించి.. ప్యాడ్ కట్టుకుని టోపీ, హెల్మెట్ పెట్టుకొని బ్యాట్ చేతబట్టి మైదానంలోకి అడుగు పెడుతుంటే స్టేడియం కేకలతో హోరెత్తింది. ఆయన బ్యాటింగ్‌కు వెళ్లే సందర్భంలో భీముడు, శతధృవంశ యోధుడు.. అంటూ సభ్యులు కేకలు వేశారు. ◆ అచ్చెన్నాయుడు పరుగులు తీసేందుకు బైరన్నర్‌ను పెట్టుకున్నారు. 8 పదుల వయసులోనూ ఉత్సాహంగా క్రికెట్ ఆడిన బుచ్చయ్యచౌదరి బ్యాటింగ్ చేస్తూ పరుగులు తీశారు. ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా కదిలారు.





త్రోబాల్ ఆడుతున్న మంత్రులు సవిత, అనిత, సంధ్యారాణి ★ వాలీబాల్‌లో సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఉపసభాపతి రఘురామకృష్ణరాజుకు గాయం

ఎమ్మెల్యే పార్థసారథికి పాదం, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు కాలర్ బోన్ ఫ్రాక్చర్



క్రికెట్ రన్ తీస్తూ కింద పడిపోతున్న రఘురామ



రఘురామకృష్ణరాజు చేతి గాయాన్ని పరిశీలిస్తున్న క్యాంప్ సిబ్బంది

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో పలువురు చాలా ప్రొఫెషనల్‌గా ఆడుతూ ప్రతిభ చాటుతున్నారు. ఈ క్రమంలో ముగ్గురు సభ్యులు గాయాల పాలయ్యారు కూడా. బుధవారం క్రికెట్ ఆడిన ఉపసభాపతి రఘురామకృష్ణరాజు.. రనౌట్ నుంచి తప్పించుకునేందుకు క్రీజ్‌లోకి వేగంగా పరుగెత్తే ప్రయత్నంలో అదుపుతప్పి కింద పడిపోయారు. శరీర భారమంతా ఎడమ భుజంపై పడింది. కిందపడే సమయంలో ఆ చేతిని నేలకు ఆనించడంతో మణికట్టు వద్ద గాయాలయ్యాయి. వెంటనే ఫిజియో వైద్యుడు పరిశీలించి, పట్టీ వేశారు. తర్వాత ఆయన మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకున్నారు. భుజానికి నొప్పి ఉండటంతో పాటు చేతి బొటన వేలికి గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం ఆయన గురువారం హైదరాబాద్ వెళ్లనున్నారు.

కబడ్డీలోనూ..: ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఓ ఎమ్మెల్యే, మరో ఎమ్మెల్సీ గాయపడ్డారు. తమ జట్టుపై కూతకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి, ఇంకోసారి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పట్టుకునే ప్రయత్నంలో ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ వారిపై పడ్డారు. పార్థసారథికి పాదం భాగంలో, శ్రీకాంత్‌కు భుజం వద్ద కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యాయి. వీరి గాయాలను బుధవారం పరీక్షల్లో గుర్తించారు. బుధవారం చేతికి కట్టుతో మైదానానికి వచ్చిన శ్రీకాంత్.. సహచరులను ఉత్సాహపరిచారు.


ఏప్రిల్ 1 నుంచి పెట్రోలులో 20% ఇథనాల్ తప్పనిసరి

కేంద్రం నోటిఫికేషన్

దిల్లీ: అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏప్రిల్ 1 నుంచి తప్పనిసరిగా పెట్రోలులో 20% వరకు ఇథనాల్ కలిపి విక్రయించాలని కేంద్రం తెలిపింది. రీసెర్చ్ ఆక్టేన్ నంబరు (ఆర్‌ఓఎన్) 95తో ఈ పెట్రోలు ఉండాలనీ చమురు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రత్యేక పరిస్థితుల్లో నిర్దిష్ట ప్రాంతాలకు, పరిమిత కాలం పాటు కేంద్రం మినహాయింపులు ఇచ్చే అవకాశమూ ఉంది. ఇథనాల్‌ను చెరకు, మొక్కజొన్న నుంచి తయారు చేస్తారు. వాహన ఇంజిన్లలో కేవలం పెట్రోలును వాడడంతో పోలిస్తే, ఇథనాల్ కలిపి వాడడం వల్ల పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుంది. చెరకు, మొక్కజొన్న వంటి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగి రైతులకు మద్దతు ధర లభిస్తుంది. దేశంలోకి ముడి చమురు దిగుమతులూ తగ్గించొచ్చు.

మైలేజీ తగ్గుతుందా?: 2023 నుంచి తయారైన చాలా వరకు వాహనాల ఇంజిన్లను ఇ20 పెట్రోలుకు అనుగుణంగానే డిజైన్ చేశారు కాబట్టి ఆయా వాహనాల్లో పెద్దగా ఇబ్బందులేవీ రావని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. పాత వాహనాల మైలేజీ మాత్రం కాస్త (3-7%) తగ్గొచ్చని అంచనా. ఆర్‌ఓఎన్ 95 కారణంగా ఇంజిన్ డ్యామేజీని అరికట్టొచ్చు. ఇంజిన్ లోపల ఇంధనం అసమానంగా బర్న్ అయినపుడు నాకింగ్(ప్రీ ఇగ్నిషన్) జరుగుతుంది. ఆర్‌ఓఎన్ ఎంత ఎక్కువగా ఉంటే నాకింగ్‌ను అంత సమర్థంగా అడ్డుకోవచ్చు. 2022 జూన్ నుంచే పెట్రోలులో 10% ఇథనాల్ కలపడాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం, 2030 నుంచి ఇ20 పెట్రోలుకు వెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతకంటే ముందే అమల్లోకి తెస్తుండడం విశేషం.

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఏడీఎన్ రావు కన్నుమూత



ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఏడీఎన్ రావు అనారోగ్యంతో బుధవారం మరణించారు. మూడు దశాబ్దాలపాటు సుప్రీంకోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగించిన ఆయన గ్రీన్ లాయర్‌గా ప్రసిద్ధి పొందారు. పర్యావరణ సంబంధ కేసుల్లో కేంద్ర సాధికార సంస్థకు అమికస్‌క్యూరీగా వ్యవహరించారు. ఓబుళాపురం మైనింగ్‌తోపాటు, దేశవ్యాప్తంగా జరిగిన పలు మైనింగ్ వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో ఆయన ఇచ్చిన నివేదికలు పలు కీలక నిర్ణయాలు తీసుకోవడానికి సుప్రీంకోర్టుకు దోహదపడ్డాయి. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా. తండ్రి అన్నంసుబ్బారావు తొలి తరం న్యాయవాదిగా సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ కొనసాగించారు. ఎంసీ మెహతా కేసుల్లో ఏడీఎన్ రావు అమికస్‌క్యూరీగా ఉన్నారు. 1984-85 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల విచారణను ముగించబోతున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రకటించిన రెండురోజుల్లోనే ఆయన కన్నుమూయడం యాదృచ్ఛికం. ఏడీఎన్ రావు మృతిపట్ల సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీవ్ర సంతాపం ప్రకటించింది.

సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను అస్తమయం



చెన్నై, న్యూస్‌టుడే: సీపీఐ సీనియర్ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు నల్లకన్ను(101) చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. వయోధిక ఆరోగ్య సమస్యలతో ఏడాది నుంచి ఇబ్బంది పడుతున్న ఆయన పలుమార్లు ఆస్పత్రిలో చేరి చికిత్సలు పొందారు. ఈ నెల 1న రక్తపోటు, మూత్రపిండాల సమస్య, ఆహారం మింగలేకపోవడం వంటి ఇబ్బందులతో ఆస్పత్రిలో చేరిన ఆయన ఆరోగ్య పరిస్థితి సోమవారం రాత్రి విషమంగా మారడంతో అప్పట్నుంచి కృత్రిమశ్వాస అందించారు. బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు తుదిశ్వాస విడిచారు.



అంగీకరించాల్సిన కొన్ని సత్యాలు

✦ మీరు కోరుకునే నైపుణ్యం మీరు వద్దనుకునే కఠిన శిక్షణలో ఉంటుంది.
✦ మీరు కావాలనుకునే ఎదుగుదల మీరు తప్పించుకునే కష్టాల్లోనే ఉంటుంది.
✦ మీరు సృష్టించాలనుకునే సంపద మీరు దూరంగా ఉండే అనిశ్చితపరిస్థితుల్లో ఉంటుంది. ✦ మీరు కోరుకునే ఆరోగ్యం మీరు వదిలిపెట్టడానికి ఇష్టపడని జీవనశైలి మార్పుల్లో ఉంటుంది.

– బీఎస్ గుప్తా, యోగా శిక్షకుడు

విషమంగానే కిడ్నీ బాధితుల ఆరోగ్యం

- ముంబయి నుంచి ప్రత్యేక ఔషధాలు
- 12 మంది నమూనాలకు తిరుపతి ఐఐటీలో పరీక్షలు

ఈనాడు, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి, కిడ్నీ సమస్యలు తలెత్తి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న 8 మంది బాధితుల పరిస్థితి విషమంగానే ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. వారిని వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేస్తున్నారు. మరో ఆరుగురికి వార్డుల్లో డయాలసిస్ చేస్తున్నారు. వారం రోజులుగా ఆసుపత్రుల్లో ఉన్నా ఎవరికీ మూత్రవిసర్జన సరిగా కావడం లేదని కుటుంబసభ్యులు వాపోయారు. కొందరికి మూత్రంతో పాటు రక్తం వస్తోంది. బాధితుల్లో 12 మంది నుంచి రక్తం, ముగ్గురి నుంచి మూత్ర నమూనాలు సేకరించి టాక్సికాలజీ పరీక్షల నిమిత్తం తిరుపతి ఐఐటీకి పంపించారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్ సూచనల మేరకు ముంబయి నుంచి 50 ప్రత్యేక ఇంజక్షన్లను తెప్పించారు. అవి బుధవారం సాయంత్రానికి హైదరాబాద్ విమానాశ్రయానికి, రాత్రికల్లా రాజమహేంద్రవరానికి చేరుకున్నాయి. బాధితుల ఆరోగ్యస్థితిని బట్టి వాటిని వినియోగిస్తారని వైద్యులు తెలిపారు.



గణేశ్ నుంచి పాలు తీసుకున్న ఇళ్లలోని కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న వైద్యులు

ఇళ్లను జల్లెడ పట్టిన వైద్యాధికారులు

పాల వ్యాపారి గణేశ్ నుంచి పాలు తీసుకున్న 110 ఇళ్లను వైద్యాధికారులు మరోదఫా జల్లెడ పట్టారు. ఇప్పటికే 135 మంది నుంచి రెండురోజుల పాటు రక్త నమూనాలు సేకరించి విశ్లేషించారు. మరోదఫా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యపరిస్థితిపై ఆరాతీశారు. ఆరు ఇళ్లకు తాళాలు వేసి ఉండగా, ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్యంగా ఉన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

గణేశ్ ఫోన్‌లోని ఫొటోల ఆధారంగా..

గణేశ్ ఫోన్‌లోని చిత్రాలు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఘటన జరిగాక అతన్ని అదుపులోకి తీసుకొని ఫోన్ పరిశీలించగా ఫ్రీజర్ ఫొటోలు ఉండడంతో పోలీసులు ప్రశ్నించారు. తద్వారా ఫ్రీజర్ మరమ్మతులు, కూలెంట్ లీకేజీ, పాలు గడ్డ కట్టడం లాంటి కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నెల 15న రాత్రి గడ్డకట్టిన పాలను పగలగొట్టి క్యాన్‌లో ఇళ్లకు సరఫరా చేసినట్లు తెలిసింది. కూలెంట్ లీకవ్వడం వల్లే పాలు గడ్డకట్టాయని, గ్లైకాల్ కలియడం ప్రమాదకరమని, పారబోయాలని సమీప బంధువు చెప్పిన మాట గణేశ్ వినుంటే ఇంత అనర్థం జరిగేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గణేశ్‌ను ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ జిల్లా పోలీసులు రాజమహేంద్రవరంలోని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు.

మంచి కాలం ముందుంది.. ఓపిక పట్టండి

- వైకాపా కార్యకర్తలతో మాజీ సీఎం జగన్

పులివెందుల, న్యూస్‌టుడే: మంచి కాలం ముందుంది.. కాస్త ఓపిక పట్టండి అని వైకాపా కార్యకర్తలతో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజల నుంచి జగన్ వినతులు స్వీకరించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా. . ముందుంది మంచి కాలమంటూ సమాధానమిచ్చారు. అనంతరం వేంపల్లె మండలం నందిపల్లెలో నూతనంగా ఆధునికీకరించిన నందీశ్వరాలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నందిపల్లెలోని నందీశ్వరాలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో జగన్

హిందూ ధర్మానికి జగన్ మరో అపచారం

- తీర్థాన్ని స్వీకరించకుండా కింద పారబోస్తారా?
- బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ హిందూ ధర్మానికి ఎంత వ్యతిరేకో మరోసారి రుజువైందని, పులివెందులలో ఆయన బుధవారం మరో మహాపచారానికి ఒడిగట్టారని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ధ్వజమెత్తారు. పులివెందుల నియోజకవర్గం నందిపల్లెలోని నందీశ్వరాలయంలో జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జగన్.. పూజారులిచ్చిన తీర్థాన్ని స్వీకరించకుండా కింద పారబోశారని, హవిస్సుల్ని అగ్నిగుండంలో వేయకుండా తిరిగి పూజారికిచ్చేశారని తెలిపారు. హిందూధర్మంపై నమ్మకం లేనప్పుడు ఆలయాలకు ఎందుకు వెళ్తున్నారని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుచ్చి రాంప్రసాద్ ప్రశ్నించారు. 'గతంలో ఆయన భార్య భారతి కూడా ప్రసాదాల్ని స్వీకరించకుండా పేపర్‌లో చుట్టి పక్కన పడేశారు. తితిదేకి కల్తీనెయ్యి సరఫరా కుంభకోణాన్ని, పరకామణిలో చోరీ చేసినవారిని జగన్ సమర్థించడంతో హిందువుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాని నుంచి భక్తుల దృష్టి మళ్లించేందుకు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు' అని విమర్శించారు.

లో'పాలు' బోలెడు

- అనంతలో నాణ్యత లేని పాలు.. కాకినాడలో నాసిరకం పాలపొడి
- రాష్ట్రవ్యాప్తంగా విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు
- తొలిరోజు 150 నమూనాల సేకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో వైద్యారోగ్య శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో ఈ స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. అనంతపురంలో రెండుచోట్ల నిర్వహించిన తనిఖీల్లో 100 లీటర్ల నాణ్యతలేని పాలు గుర్తించి పారబోశారు. మరో కేంద్రంలో ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన 30 లీటర్ల పాడైపోయిన పాలు గుర్తించారు. ఇంకోచోట 70 లీటర్ల పాలలో నాణ్యత లోపాన్ని, మచిలీపట్నంలో తనిఖీల్లో 20 లీటర్ల నాణ్యత లేని బాదం పాలు గుర్తించారు. కాకినాడలో నాణ్యత లేని ఐదు కేజీల పాలపొడిని సీజ్ చేశారు. పలు కేంద్రాల నుంచి 150 నమూనాలు సేకరించి పరీక్షల కోసం చెన్నై, హైదరాబాద్, కాకినాడల్లోని ల్యాబ్‌లకు పంపామని ఐపీఎం సంచాలకులు నీలకంఠారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మ్యాజిక్ కిట్ల ఆధారంగా పాల నాణ్యతను గుర్తిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. పాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేంద్రియ సాగుదారులకు 'ఫెలో ఫార్మర్' పురస్కారాలు



కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నుంచి 'ఫెలో ఫార్మర్' పురస్కారం అందుకుంటున్న యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతు బండారు శ్రీనివాసరావు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఇదే మండలం అనంతవరప్పాడుకు చెందిన సేంద్రియ వ్యవసాయ రైతు బండారు శ్రీనివాసరావు భారత వ్యవసాయ పరిశోధన సంస్థ దిల్లీలో బుధవారం నిర్వహించిన 'పూసా కృషి విజ్ఞాన్ మేళా 2026'లో 'ఫెలో ఫార్మర్' పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్, భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యడ్లపల్లి మాట్లాడుతూ చిరుధాన్యాల నుంచి ఉప ఉత్పత్తుల తయారీ, విలువ జోడింపు, సేంద్రియ వ్యవసాయంపై తెలుగు రాష్ట్రాల రైతులకు అవగాహన కల్పించడం, ప్రకృతి విధానంలో సాగు తదితర అంశాల్లో చేస్తున్న కృషికిగాను తనకు ఈ అవార్డు లభించిందని తెలిపారు. అధునాతన పద్ధతుల్లో సేంద్రియ విధానంలో పంటల సాగుకు గాను తనకు పురస్కారం లభించినట్లు బండారు శ్రీనివాసరావు చెప్పారు.

పీ-4లో భాగంగా సివిల్స్‌కు ఉచిత శిక్షణ

లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ప్రకటన

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకునేలా, డబ్బులేకున్నా వారి ఆకాంక్షలు నెరవేర్చుకునేలా పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ అకాడమీ గౌరవ ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ (ఏపీఎస్‌వీసీ) ఛైర్మన్ డాక్టర్ పీపీ లక్ష్మయ్య తెలిపారు. తిరుపతిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో డిస్కమ్ సీఎండీ శివశంకర్ లోతేటితో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షల మేరకు పీ-4లో భాగంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన 200 మంది విద్యార్థులకు రాష్ట్ర, కేంద్ర సివిల్ సర్వీసెస్‌లను చేరువ చేసేలా మూడేళ్ల పాటు 'వేంకటపతి విద్యాదీవెన' పథకం కింద ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 'పురుషులకు పల్నాడు జిల్లా వినుకొండలోని పీపీఆర్ ఎడ్యుకేషన్ సిటీలో, మహిళలకు విజయవాడలోని కేతనకొండ సీబీఆర్ ఎడ్యుకేషన్ సిటీలో శిక్షణ ఇస్తాం. మహిళలు మార్చి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి. మార్చి 15న ప్రవేశ పరీక్ష ఉంటుంది. పురుషులు మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 5న ఉంటుంది. వివరాలకు 78420 54669కు మెసేజ్ చేయాలి' అని లక్ష్మయ్య సూచించారు. పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు భాగవతుల రవికుమార్, చెన్ను రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పనులకు రూ.1,400 కోట్లకు పాలనానుమతి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు రూ.1,400 కోట్లకు ప్రభుత్వం పాలనానుమతి ఇచ్చింది. 2025-26లో రెండు, మూడో త్రైమాసికాలకు నిధుల కోసం సీఆర్‌డీఏ కమిషనర్ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

EENADU Vol: 52, Issue: 197 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మకరందం
makarandam@eenadu.in
గురువారం ఫిబ్రవరి 26, 2026
ఈనాడు
13 మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

మార్చి 3 లక్ష్మీ జయంతి



కనకధార కురిపించే కరుణామయి!

సంపదకీ, సౌభాగ్యానికీ, శక్తికీ, సౌందర్యానికీ ప్రతీక లక్ష్మీదేవి. జగన్నాథుడైన శ్రీమహావిష్ణువుకి దేవేరిగా ఆమె జగన్మాత. భక్తుల కష్టాలకు కరిగి కనకధార కురిపించే కరుణామయి. పాలసముద్రంలో సిరులతల్లి అవతరించిన ఫాల్గుణ శుద్ధపూర్ణిమను లక్ష్మీ జయంతిగా ఆచరించడం సంప్రదాయం.

జీవితంలో లాభం, సంపద, అభివృద్ధి, క్షేమం, యోగం- అన్నీ లక్ష్మీ స్వరూపాలేనన్నది ఋగ్వేద వాక్యం. వాటిలో ఏది ప్రాప్తించినా, స్వార్జితమని అహంకరించకూడదు, అమ్మవారి అనుగ్రహంగా భావించాలని వేదం చెబుతోంది. ఆధ్యాత్మిక విద్యకు అధిష్ఠాన దేవత లక్ష్మీదేవేనని పేర్కొని.. 'ఓ జగదేకమాతా! అజ్ఞానమనే చీకటిని పారదోలే జ్ఞాన ప్రకాశినివి నువ్వు! ఆ అనంత తేజస్సులో ఒక్క కళనైనా నాలో ప్రవేశపెట్టు తల్లీ!' అని ప్రార్థించమంటోంది అథర్వణ వేదం. లక్ష్మీదేవి ప్రసాదించే ఆ ప్రకాశంతో అనంత ఐశ్వర్యాలు, జ్ఞానసంపద ప్రాప్తిస్తాయని తెలియజేసింది.

అష్టలక్ష్ములుగా అనుగ్రహిస్తూ...

శ్రీమహావిష్ణువు దశ అవతారాలు దాల్చి భక్తులను ఆదుకున్నట్లే శ్రీలక్ష్మి ఎనిమిది రూపాలు ధరించి ఆశ్రితులను అనుగ్రహించింది. ఆదిలక్ష్మిగా ప్రాణశక్తిని, ధాన్యలక్ష్మిగా పుష్కలమైన ఆహార ధాన్యాల్ని, ధైర్యలక్ష్మిగా ధీరత్వాన్ని, గజలక్ష్మిగా పేరుప్రతిష్ఠలను, సంతానలక్ష్మిగా సత్ సంతానాన్ని, విజయలక్ష్మిగా సత్కార్యసిద్ధిని, విద్యాలక్ష్మిగా జ్ఞానసంపదను, ధనలక్ష్మిగా సకల ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది. లక్ష్మీదేవి వాహనం గుడ్లగూబ. శ్రీలక్ష్మి నాలుగు హస్తాలు మానవుడికి నాలుగు పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలను ప్రసాదిస్తాయి. 'శుద్ధలక్ష్మి' అని కూడా ఆ అమ్మను కీర్తిస్తారు. శుచిశుభ్రత నెలకొన్న ఇళ్లు లక్ష్మికి ఆలవాలం. పరుల శ్రేయస్సు కోరేవారిని, శాంతస్వభావులని, ఇంద్రియనిగ్రహం కలిగినవారిని, పరోపకారుల్ని, అతిథులను ఆదరించేవారిని, కాలం వృథాపరచక సద్వినియోగం చేసుకునేవారిని, కృతజ్ఞతగా ఉండేవారిని, కార్యాల్లో సమర్థత చూపేవారిని.. ఎన్నడూ విడిచిపెట్టనని రుక్మిణీదేవికి మహాలక్ష్మి స్పష్టం చేసిందని పురాణకథనం. లక్ష్మి ఎక్కడ కొలువై ఉంటుందని ధర్మరాజు ప్రశ్నించగా.. 'సత్యం, దానం, వ్రతాలు, జలం, అగ్ని, వాయువు, పచ్చని పొలాలు, గోవు, ఏనుగు కుంభస్థలం, ఇంటిగడప, ఇల్లాలి నుదుటి సిందూరం, అతిథులను సత్కరించే ఇళ్లలో లక్ష్మీదేవి ఉంటుంది' అని వివరించాడు భీష్ముడు.

అవతారాల్లో ఆ స్వామి వెంట..

శ్రీమన్నారాయణునితో పాటు లక్ష్మీదేవి కనిపించిన మొదటి అవతారం నరసింహావతారమని పండితుల భావన. మీన, కూర్మ, వరాహావతారాల్లో అమ్మవారి ప్రసక్తి ఉండదు. క్షీరసాగర మథనంలో కూర్మావతారం మందరగిరిని పైకెత్తటానికి వచ్చింది. ఆ వెంటనే పాలసముద్రం నుంచి జనించిన లక్ష్మిని శ్రీమహావిష్ణువు స్వీకరించాడు. ఆ తరువాతి అవతారంలో వరాహుడు భూదేవిని తన దేవిగా చేసుకున్నాడు. నరసింహావతార సమయంలో ఆమె విడిగా అవతరించలేదు కానీ బ్రహ్మదేవుని కోరికపై స్వామిని శాంతింపజేసే ప్రయత్నం చేసింది. శ్రీరాముని అర్ధాంగి సీతాదేవి, శ్రీకృష్ణుని భార్య రుక్మిణి, పరశురాముని సతీమణి ధరణి లక్ష్మీదేవి ప్రతిరూపాలే. జగన్నాథుడు ఆదిత్యుడి రూపం దాల్చినప్పుడు అమ్మవారు పద్మం రూపంలో ఆవిర్భవించింది. విష్ణువు పృథుచక్రవర్తిగా అవతరించినప్పుడు ఆ అమ్మ 'అర్చి'గా జన్మించింది. ఋషభుని రూపంలోనున్న స్వామికి జయంతిగా వెంట వచ్చింది. ఇలా సందర్భానుసారం పాలసముద్రం, అగ్ని, జలం, బిల్వవృక్షం, భూమి నుంచి శ్రీమహాలక్ష్మి అవతారాలు దాల్చింది.

కొల్హాపుర్‌లో కొలువైన తల్లి..


మహారాష్ట్ర కొల్హాపుర్‌లోని మహాలక్ష్మి ఆలయం అత్యంత ప్రసిద్ధమైంది. అష్టాదశ శక్తిపీఠాల్లో ఇదొకటి. స్థలపురాణం ప్రకారం ఒకసారి శ్రీమహాలక్ష్మి విష్ణుమూర్తిపై అలిగింది. ఆ అలకతో వైకుంఠం వదిలి, భూలోకాన కొల్హాపుర్ విచ్చేసింది. ఆ పవిత్ర స్థలంలోని మహాలక్ష్మి కోవెలలో విగ్రహాన్ని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించాడని చెబుతారు.

స్త్రీలలో శ్రీలక్ష్మి..

భూలోకంలో లక్ష్మీదేవి ప్రతి స్త్రీలోనూ కొలువై ఉంటుందని మన పురాణాలు పేర్కొన్నాయి. మహిళలను గౌరవించే చోటే లక్ష్మీదేవి ప్రసన్నంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. మగువలను అవమానిస్తే లక్ష్మి ఆగ్రహిస్తుందని, ఆ ఇంట అశాంతి, దారిద్ర్యం తాండవిస్తాయని హెచ్చరించారు. అలాగే గోవును రక్షించే, సత్యనిష్ఠతో ధర్మబద్ధంగా జీవించేవారి లోగిళ్లలో లక్ష్మీ నివాసం ఉంటుందని శాస్త్రాలు స్పష్టం చేశాయి. నవగ్రహాల్లో శుక్రగ్రహం శాంతించి మనకు అనుకూలంగా మారాలంటే మహాలక్ష్మిని పూజించాలని మహర్షులు సూచించారు.

ఆమె అలక్ష్మి కూడా

లక్ష్మికి వ్యతిరేకం అలక్ష్మి. ఈమె కూడా దేవతాస్వరూపమే! పౌరాణిక కథనం ప్రకారం సముద్ర మథనంలో లక్ష్మీదేవి కన్నా ముందు అలక్ష్మి ఆవిర్భవించింది. ఈమెకు జ్యేష్ఠాదేవి అని కూడా పేరు. ఈమె వాహనం గార్దభం. చేతిలో చీపురుకట్ట ఉంటుంది. జెండాగుర్తు కాకి. జ్యేష్ఠాదేవిని పూజిస్తే అపాయాలు తొలగించి భాగ్యాలను ప్రసాదిస్తుందని విశ్వసిస్తారు. దురదృష్టాల్ని, దుఃఖపు సమయాల్ని కూడా నిబ్బరంగా స్వాగతించాలని సూచించేందుకే అమ్మవారు అలక్ష్మి రూపంలో అవతరించిందని ఆధ్యాత్మికవేత్తల ఉవాచ.



మధురవాక్కూ మాధవి ఆరాధనే!

'జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ' అంటోంది మన సనాతన ధర్మం. నాలుక చివరన ఆ తల్లి కొలువై ఉంటుందని సూచిస్తోంది. పరుషంగా మాట్లాడేవారు ఆ అమ్మవారికి దూరమైపోతారు. మధురంగా సంభాషిస్తే ఆ దేవిని ఆరాధించినట్లే. దుర్భాషలాడినా, వ్యర్థంగా మాట్లాడినా ఆ దేవదేవికి అపచారం చేసినట్లే. అందుకే సాత్వికస్వభావులు, మృదుభాషా మాధుర్యాలు, హితమితప్రియవాక్కులు పలికేవారు ఆ సముద్ర తనయ ప్రియభక్తులు. ఇంతటి మహిమాన్వితమైన ఆ మాధవిని లక్ష్మీజయంతి రోజున 'జ్ఞానదాయై బుద్ధిదాయై సర్వదాయై నమోనమః' అని స్తుతిద్దాం! ఆ దేవి అనుగ్రహాన్ని పొందుదాం.

– శ్రీశారద

అల్లాహ్‌తో అనుసంధానం..

ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఉపవాసాలు ఉంటూ అంకితభావంతో దైవారాధనలో నిమగ్నమయ్యే కాలం పవిత్ర రంజాన్ మాసం. నెలంతా ఉపవాసాలు ఉండే విశ్వాసులు ఆచరించే ప్రత్యేక ప్రార్థన తరావీహ్ నమాజ్. రాత్రివేళ ఇషా నమాజ్ తర్వాత దీన్ని ఆచరించటం ఎంతో పుణ్యప్రదంగా భావిస్తారు. తరావీహ్ అంటే విశ్రాంతి లేదా విరామం అని అర్థం. సాధారణంగా 20 రకాత్‌లు కలిగి ఉండే ఈ నమాజులో ప్రతి నాలుగు రకాత్‌లకు ఒకసారి కొంత విరామం ఇస్తూ కొనసాగిస్తారు. పూర్వకాలంలో మక్కాకు చెందిన ముస్లింలు తరావీహ్‌లో నాలుగు రకాత్‌ల తర్వాత విశ్రాంతి కోసం కాబా చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. ఇది అపారమైన ఆధ్యాత్మిక, సామాజిక ప్రయోజనాలను చేకూరుస్తుంది. దైవ గ్రంథం ఖురాన్ పూర్తిచేయటానికి ఉపకరిస్తుంది.

తొలినాళ్లలో దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఈ ప్రార్థనను మసీదులో కొన్ని రోజులు సామూహికంగా ఆచరించినా.. విశ్వాసుల సంఖ్య విపరీతంగా పెరుగుతుండటంతో దీన్ని కొనసాగించలేదు. ఈ ఆచారం తప్పనిసరి అవుతుందని, విశ్వాసులపై అనవసర భారం మోపుతుందని భావించి ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉన్నారు. ఆ తర్వాత మసీదుల్లో క్రమపద్ధతిలో నిర్వహించకున్నా.. విశ్వాసులు తమ ఇళ్లలో ఆచరించేవారు. హిజ్రీ క్యాలెండర్ 14వ సంవత్సరంలో తరావీహ్ ప్రార్థనలను మసీదుల్లో సామూహికంగా ఆచరించాలని ఖలీఫా ఉమర్ ఆదేశించారు. నాటి నుంచి ప్రవక్త ఆచరించిన సంప్రదాయం (సున్నత్)గా కొనసాగుతోంది.



రంజాన్ నెలలో పూర్ణ విశ్వాసంతో తరావీహ్ నమాజును ఆచరించేవారి పాపాలన్నీ క్షమకు నోచుకుంటాయని ప్రవక్త ముహమ్మద్ (స) సందేశమిచ్చారని హదీసులు వివరిస్తున్నాయి. ఇమామ్‌తో కలిసి ప్రార్థన చేసేవారికి అపార ప్రతిఫలం లభిస్తుంది. ఇది రాత్రంతా దైవచింతనలో గడిపిన దానికి సమానం. సమష్టిగా ఖురాన్ శ్రవణం పూర్తిచేయటం ఈ ప్రార్థన ప్రధాన ఉద్దేశం. ఇది దైవగ్రంథంతో అనుసంధానాన్ని ఏర్పరుస్తుంది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక పునరుత్తేజానికి దోహదం చేస్తుంది. రోజువారీ పనులన్నీ ముగించుకుని రాత్రివేళ ప్రశాంతంగా దైవ ధ్యానంలో నిమగ్నమవటానికి అత్యంత అనుకూలంగా ఉంటుంది. ఈ సుదీర్ఘ ప్రార్థన నెలంతా క్రమం తప్పకుండా ఆచరించే వారికి సహనం పెరిగి క్రమశిక్షణ అలవడుతుంది. శారీరక సామర్థ్యాన్ని, కీళ్ల పటుత్వాన్ని పెంచుతుంది. ఎక్కువ సమయాన్ని వెచ్చించి జమాత్‌తోపాటు ప్రార్థన చేయటం సామాజిక ఐక్యతను పెంపొందిస్తుంది. దైవం పట్ల విశ్వాసాన్ని మరింత బలపరుస్తుంది.



చంచలత్వం తగ్గుతుంది..

బుద్ధ భగవానుడు ధర్మసూత్రాలను ప్రతిపాదించినప్పుడు.. వాటికి విజ్ఞానీనతను ఆపాదించాడు. ధర్మాచరణ ఏ దేశంలోనైనా, ఏ కాలంలోనైనా ఒకేలా ఉంటుంది. ఎవరు పాటించినా ఒకే ఫలితాన్ని ఇస్తుంది. అంటే దేశకాలాదులను బట్టి బౌద్ధధర్మం మారదు. అందుకే బుద్ధుడు- సద్ధర్మ సాధనలో.. ఆది, మధ్య, అంత్యం.. ఎక్కడైనా, ఎప్పుడైనా మంచిదేనని తెలియజేశాడు.

బుద్ధుని ప్రతి వాక్కులోనూ లోతైన అర్థం ఉంటుంది. ధర్మ సాధనకు తగిన ఫలితం కూడా అమోఘంగా ఉంటుంది. దీన్నే బుద్ధుడు పాళీ భాషలో 'సాత్త' అని చెప్పాడు. సాధకుడు మూడు దశల్లో చేయవలసిన క్రియలూ, వాటి ఫలితాలను ఆయన స్పష్టంగా తెలియజేశాడు. బౌద్ధ ధర్మాన్ని అనుసరించే వారికి ముందు శీలం, నైతిక ప్రవర్తన, హింసకు పాల్పడకపోవడం, సత్యమే చెప్పడం, చౌర్యం చేయకపోవడం వంటి పంచశీలను బోధిస్తారు. వాటిని పాటించడం ద్వారా ఈ దశలో శీలం స్థిరపడుతుంది. సచ్ఛీలత గలవారు ఎప్పుడూ సన్మార్గాన్నే అనుసరిస్తారు. శీల సాధనతో ఆదిలోనే మనకు సర్వత్రా మంచి జరుగుతుంది. మధ్యలో ఎలా మంచిదంటే- ఏకాగ్రతను అలవర్చుకోవడం ద్వారా ఇక్కడ పురోగతి ఉంటుంది. ధ్యానంతో మనసు పరిణతి చెందుతుంది. లౌకిక చంచలత్వం తగ్గుతుంది. అల్పమైన కోరికల వెనుక మనసు పరుగులు తీయదు. సర్వత్రా సత్యమే గోచరిస్తుంది. ఫలితంగా ఇక్కడ స్థిరచిత్తం రూఢీ అవుతుంది. అంత్య దశలో సాధకుడు ప్రజ్ఞావంతుడవుతాడు. రాగం, ద్వేషం పూర్తిగా అంతరిస్తాయి. ఇవి మళ్లీ సాధకుని అనుభవంలోకి రావు. ఇక్కడ దుఃఖం నుంచి విముక్తి కలుగుతుంది. అమలిన ఆనందం సిద్ధిస్తుంది. సాధకుడు ఒక్కో దశలో ఉత్తీర్ణత సాధిస్తూ ధార్మికుడవుతాడు. కాబట్టి సద్ధర్మ సాధన ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా మంచే చేస్తుంది.

ప్రకృతి కొత్త చిగుళ్లతో ముస్తాబయ్యే మధుర వసంతంలో ఉత్సాహంగా చేసుకునే వేడుక హోలీ. ఇది రంగుల పండుగే కాదు; చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం. పరస్పరం ప్రేమానురాగాలను చిలకరించుకునే సరదా సమయం.

హోలీ... వసంత కేళి

నిన్నటి నిరాశలను తుడిచేస్తూ, రేపటి ఆశలను చల్లుకుంటూ, ముఖానికి పూసిన రంగు వెనుక మనిషిలోని మమకారాన్ని చూపే అద్భుత ఘట్టం హోలీ. చిన్న పెద్ద, పేద ధనిక అనే భేదాలను రంగుల వెల్లువలో ముంచేసి, లోకమంతా ఒకటే అనే సమతా భావాన్ని చాటుతుంది. ప్రకృతి పులకించే ఈ వేళ.. రాధాకృష్ణుల ప్రణయ గాథలను స్మరిస్తూ ప్రతి మనసులో ఆనందంతో రంగులమయం చేయడమే హోలీ విశిష్టత.

హోలీ వేడుకలు హోలికా దహనంతో ప్రారంభమవుతాయి. పౌరాణిక కథను అనుసరించి.. విష్ణునామస్మరణ చేస్తున్న ప్రహ్లాదుణ్ణి అంతం చేసేందుకు ప్రయత్నించాడు తండ్రి హిరణ్యకశిపుడు. కానీ ప్రతిసారీ తన భక్తుణ్ణి కాపాడుతున్నాడు విష్ణువు. చివరి ప్రయత్నంగా.. మంటల్లో కాలకుండా వరం పొందిన తన సోదరి హోలిక ఒడిలో ప్రహ్లాదుణ్ణి కూర్చోబెట్టి చితికి నిప్పు పెట్టించాడు. దైవకృపతో ప్రహ్లాదుడు క్షేమంగా బయటపడగా, అపచారం చేసిన హోలిక కాలి బూడిదయ్యింది. ధర్మం ముందు అధికారం, అహంకారం తలవంచక తప్పదనేదే సందేశం. ఈ ఘట్టానికి నిదర్శనంగా కామదహనం పేరిట కూడళ్లలో కట్టెలు పేర్చి, మంటలు వేస్తారు. మనలోని అసూయ, క్రోధం, స్వార్థం వంటి రాక్షస ప్రవృత్తులను ఆ అగ్నిలో ఆహుతి చేయాలన్నది దీని వెనుక ఉన్న అసలు ఉద్దేశం.

శివుని కోపం.. మన్మథుని పునర్జన్మ: తారకాసురుణ్ణి సంహరించేందుకు శివపార్వతులకు పుత్రుడు జన్మించాల్సి ఉంది. అందుకోసం తపోదీక్షలో ఉన్న పరమశివుడికి బాహ్య ప్రపంచంపై ధ్యాస కలిగించమని.. ఇంద్రుడు మన్మథుణ్ణి పంపించాడు. అతడు పుష్ప బాణాలను ప్రయోగించగా.. ఆగ్రహించిన పరమేశ్వరుడు మూడో కన్ను తెరిచి మన్మథుణ్ణి భస్మం చేశాడు. అప్పుడు అతడి భార్య రతీదేవి వేడుకోగా.. శివుడు శాంతించి మన్మథుడికి ఆత్మ రూపంలో ప్రాణం పోశాడు. ఈ సంఘటన జరిగిన రోజే హోలీ అని, అందుకే హోలీని కామదహనం అని పిలుస్తారని మరో కథనం ఉంది. కోరికలను (కామాన్ని) జయించి, దైవత్వం వైపు సాగాలనే సంకేతం ఇందులో దాగి ఉంది.

రంగులు పులుముకున్న రాధాకృష్ణులు: విస్తృత ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం.. పూతన అనే రాక్షసి ఇచ్చిన విషపు పాలు తాగడం వల్ల కృష్ణుడు నీలిరంగులోకి మారిపోయాడు. తన మేని వర్ణం అలా మారినందుకు కృష్ణుడు ఆందోళన చెందాడు. అది చూసిన యశోదమ్మ రాధ ముఖానికి రంగు పూయమని సలహా ఇచ్చింది. అలా రాధాకృష్ణుల మధ్య మొదలైన ఈ రంగుల ఆట- లోకమంతా వ్యాపించింది. బృందావనంలో కృష్ణుడు ఆడిన వసంత కేళి.. భక్తికి ఆనందాన్ని జోడించింది. మధురలో జరిగే హోలీవేడుకలు కృష్ణుని స్మరణతో మార్మోగుతాయి.

అల్లరి భరించలేని దుండి రాక్షసి: పౌరాణిక కథను అనుసరించి.. రఘుమహారాజు కాలంలో దుండి అనే రాక్షసికి దేవతల వల్ల గానీ, మనుషుల వల్ల గానీ మరణం రాదని వరం ఉంది. అయితే చిన్నారులను వేధించే ఆ రక్కసికి పిల్లల అల్లరి వల్ల మరణిస్తుందన్న శాపం కూడా ఉంది. వసంత కాలంలో పిల్లలంతా కేకలు వేస్తూ, పాటలు పాడుతూ ఆ రాక్షసిని తరిమికొట్టి, ఆమె జన్మకు విముక్తి కలిగించారని, ఆ రోజును హోలీగా సంబరం చేసుకుంటారని ప్రతీతి. అందుకే ఈ పండుగ రోజున చిన్నారుల అల్లరిని దైవకార్యంగా భావిస్తారు.

మనసుల కలయిక.. సామాజిక ఐక్యత: హోలీ రోజున ధనిక, పేద, యజమాని, సేవకుడు అనే తారతమ్యాలుండవు. రంగుల్లో మునిగి అందరూ ఒకేలా కనిపిస్తారు. హోదా కన్నా ప్రేమే ప్రధానంగా నిలుస్తుంది. అంతరాలు అదృశ్యమవుతాయి. పూర్వం వసంతకాలం వాతావరణ మార్పుతో వచ్చే చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి పసుపు, మోదుగపూల రంగులు, వేప వంటి ప్రకృతిసిద్ధమైన వాటిని వాడేవారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తూనే వినోదాన్ని పంచేవి.

ప్రాంతీయ వైవిధ్యం.. సంస్కృతుల మేళవింపు: హోలీని ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా చేసుకుంటారు. ఉత్తర ప్రదేశ్‌లో లాత్మార్ పేరుతో- పురుషులను స్త్రీలు కర్రలతో సరదాగా కొడుతుంటే, వారు రంగులు చల్లుతారు. పశ్చిమ బెంగాల్‌లో 'డోల్ జాత్రా' పేరిట రాధాకృష్ణుల విగ్రహాలను ఊరేగిస్తూ భజనలు చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో పల్లెల్లో పిల్లలు ఇంటింటికి తిరిగి కట్టెలు సేకరించి, రాత్రివేళ కామదహనం చేస్తారు. మర్నాడు వసంతోత్సవం చేసుకుని పాయసం, బొబ్బట్లు వంటి రుచులను ఆస్వాదిస్తారు.

పండుగ పూట ఆనందం ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ అంతే ముఖ్యం. రసాయనాల రంగులు కళ్లకు, చర్మానికి హాని చేస్తాయి కాబట్టి.. వాటికి దూరంగా ఉండటం శ్రేయస్కరం. గంధం, గోరింటాకు, కుంకుమ, పసుపు, పూల పొడులు, బీట్‌రూట్, పాలకూర, గులాబీ, మందారం, దానిమ్మ.. ఇలా సహజ రంగులను చల్లుకోవడం ఉత్తమం. అప్పుడు పండుగ స్ఫూర్తి దెబ్బతినకుండా ఉంటుంది.

వసంతలక్ష్మి తన రంగుల చీరను నేలంతా పరిచిన వేళ, హృదయాలను కలిపే అందమైన అనురాగాల వేదిక హోలీ. ఇది రంగుల కేళి మాత్రమే కాదు, లోకంలోని విసుగులు, చిరాకుల చీకటిని హోలికా దహనంతో అంతరింపచేసి, స్నేహ కాంతిని నింపే మంగళకరమైన సమయం. బాహ్యంగా రంగులు చిలకరించుకోవడం కాదు, హృదయాలను కలిపే వంతెన అని గ్రహించాలి. కలతలు, కల్లోలాలను మరచి, ప్రేమను చిగురింపజేసుకునే వేళ ఇది. సమాజంలో మత సామరస్యం, సోదరభావం వెల్లివిరియడానికి ఇటువంటి పండుగలు దోహదపడతాయి. ప్రకృతితో మమేకమవుతూ చేసుకునే హోలీ మన సంస్కృతికి కిరీటం వంటిది. ఈ రంగుల పండుగ ప్రతి మదిలో ఆనందాలను వెదజల్లుతుంది.

– డా. చిట్యాల రవీందర్



మూడు కర్రల పాఠం

ఒక గురువు దగ్గర ముగ్గురు శిష్యులు ఆధ్యాత్మిక శిక్షణ పొందుతున్నారు. ఒకరోజు గురువు వారిని పరీక్షించదలచి మూడు కర్రలు అందించి.. 'వీటిల్లో ఏది బలమైనదో చెప్పండి' అన్నారు. మొదటి వ్యక్తి ఒక్కో కర్రను విరిచి చూపిస్తూ, 'ఇవేవీ బలమైనవి కావు' అన్నాడు. రెండో వ్యక్తి ఆ మూడింటినీ ఒక మోపులా కట్టి,



ఎవరూ విరచలేని బలం సమష్టితత్వంలో ఉంటుందని నిరూపించాడు. మూడో వ్యక్తి కర్రలను తాకకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

గురువు అతని వంక చూసి 'నువ్వేంటి మౌనంగా ఉండిపోయావు? నీ అభిప్రాయమేంటో చెప్పు' అన్నారు. అతను గురువుకు నమస్కరించి 'ఒక్కో కర్రను విరగ్గొట్టి అవి బలహీనం అనడం లేదా మిగిలినవాటితో చేర్చి మహా బలం చేకూరిందని నిరూపించడం ఎందుకు గురువర్యా? ప్రతి కర్రను యథాతథంగా ఉంచడంలోనే దాని ఉనికి, శక్తి చెక్కుచెదరకుండా ఉంటుంది. వాటిని మార్చకుండా వాటి స్వరూపాన్ని గౌరవించడమూ ముఖ్యమే కదా! అప్పుడే అది సహజం, సంపూర్ణం అవుతుందనేది నా ఉద్దేశం' అని ప్రశాంతంగా బదులిచ్చాడు.

ఆ సమాధానం విన్న గురువు హర్షం వ్యక్తం చేసి 'సత్సంగంలో కలిసి ఉండటం వల్ల వచ్చే సమష్టి బలం కూడా మంచిదే. కానీ నిజమైన ఆధ్యాత్మికత అంటే సమూహ బలం మీద ఆధారపడకుండా, ఒంటరిగా నిరంతర సాధన చేస్తూ అంతరంగంలో వెలుగొందుతున్న దీపకాంతితో శోభించాలి. నువ్వు అదే మార్గంలో నడుస్తున్నావు. చాలామంది సత్సంగాల్లో పాల్గొని, సామూహికంగా ప్రవచనాలు విని ఆధ్యాత్మిక బలం పొందుతున్నామని అనుకుంటారు. కానీ వ్యక్తిగతంగా శ్రమించి, తమను తాము శోధించుకుని ఎదిగినప్పుడే నిజమైన వృద్ధి సాధించగలరు. మోక్షానికి దారి చూపేది సమూహబలం కాదు, వ్యక్తిలో చిగురించే ఆధ్యాత్మిక శక్తి' అన్నారాయన.


– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

సంతోషం.. సంతృప్తి

క్రీస్తు వాణి

దేవుడు మనకు అనేకవిధాల మేలు చేశాడు. మనం శ్వాసించే గాలి, తాగే నీరు, తినే తిండి.. అన్నీ ఆయన ఇచ్చినవే. చేసే కొలువు ఆయన బహుమానం. మనం సజీవులమై ఆరోగ్యంగా జీవిస్తున్నామంటే ఆయన కృపతోనే. ఎండల్లో వానల్లో కొలువు చేసే వ్యక్తి- తన అవస్థకు చింతించే బదులు 'ఈ ఉద్యోగం కూడా లేక ఆకలితో అలమటిస్తున్నవారున్నారు. అలాంటిది నాకు ఈ అవకాశం కలిగినందుకు సంతోషం' అనుకున్నప్పుడు ఆందోళనకు బదులు ఆనందం కలుగుతుంది. వెలకట్టలేని ఇంద్రియాలన్నీ ఇచ్చినందుకు దేవుడికి ఎన్ని ధన్యవాదాలు తెలియజేసినా తక్కువే కదా! ఇంత మాత్రమే కాదు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనకు దక్కిన ప్రతి అంశానికీ, అవకాశానికీ ప్రతి జీవికీ, వస్తువుకీ కృతజ్ఞతలు సమర్పించుకోవాలి. పౌలు మహాశయుడు- 'ప్రతి విషయంలో ప్రభువుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి' అన్నాడు. భక్త దావీదు దైవంపట్ల కృతజ్ఞత చూపటంలో ఆదర్శంగా ఉన్నాడు. ఆయన ఒక కీర్తనలో ప్రభువు చేసిన ఒక్కొక్క ఉపకారాన్నీ స్మరిస్తూ స్తుతించాడు. కొందరు 'దేవుడు నాకేం చేశాడని ఆయనకు ధన్యవాదాలు చెప్పాలి? నా కన్నా తక్కువ చదివినవారు- నాకంటే ఉన్నత స్థానాల్లో ఉన్నారు' వంటి అసంతృప్తిని వ్యక్తంచేస్తుంటారు. మనకు ఏది మేలైనదో దాన్నే ప్రభువు అనుగ్రహిస్తాడని అర్థంచేసుకోవాలి. కొందరికి తమ యోగ్యతకు తగిన పదవి, హోదా లభించకపోవచ్చు. అవసరాలన్నీ తీరకపోవచ్చు. కానీ భూత, భవిష్యత్తులన్నీ తెలిసిన దైవం ఎవరికి, ఏది ఇవ్వాలో ఆ ప్రకారమే అందిస్తాడు. అందువల్ల లేనివాటిని తలచుకుని అసంతృప్తితో రగిలిపోవడం, దుఃఖించడం, నిరాశానిస్పృహల్లో కూరుకుపోవడం సరికాదు. మనకు లభించిన వాటితో సంతృప్తిచెంది, సంతోషించాలి. ప్రాప్తించిన వాటిని ఆనందిస్తూ దైవానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేయాలి. అంతేకాదు.. మనకు నిత్యం ఏదో విషయంలో ఎవరో ఒకరు తోడ్పాటు అందిస్తుంటారు. అలా సాయపడిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేయాలని బైబిల్ పేర్కొంది. కాబట్టి దేవునికి ప్రతి విషయంలోనూ స్తుతులు చెల్లించాలి. అలాగే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మేలు చేసిన వారందరిపట్ల కృతజ్ఞతాభావం చూపాలి.

– మర్రి ఎ.బాబ్జీ



స్వామి కల్యాణం.. భక్తుల కోలాహలం

కోరుకొండ.. వైష్ణవ దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ప్రతి సంవత్సరం శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణోత్సవం ఫాల్గుణమాసం ఏకాదశి నాడు మొదలై పౌర్ణమి వరకూ ఐదురోజుల పాటు కొనసాగుతుంది. రథోత్సవంతో స్వామివారికి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కోరుకొండ తీర్థంలో ఈ ఉత్సవాలకు నాంది పలుకుతూ ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఎగురవేస్తారు. భక్తజనుల కోలాహలం మధ్య స్వామివారికి, లక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కల్యాణం జరిగిన మరుసటి రోజు భారీ రథంపై స్వామివారు గ్రామోత్సవానికి బయల్దేరగా.. వేలాదిమంది భక్తులు రథాన్ని లాగేందుకు తరలివస్తారు. కొండ పైనున్న స్వామివారిని దర్శించుకొని, కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం ఇక్కడి ఆచారం. కోరుకొండను దర్శించడం వల్ల పితృదేవతలకు పుణ్యగతులు లభిస్తాయని భక్తుల నమ్మకం. కొండ పైన ఉన్న ఆలయం, మెట్ల మార్గంలో ఉన్న శిల్పకళా చాతుర్యం అబ్బురపరుస్తాయి. కోరుకొండ క్షేత్రం కాకినాడ నుంచి 60 కి.మీ., రాజమండ్రి నుంచి 20 కి.మీ. దూరంలో ఉంది.



ప్రసన్న వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఫాల్గుణ పూర్ణిమ రోజున స్వామివారికి కల్యాణోత్సవం, తదుపరి రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అసంఖ్యాకంగా తరలి వస్తారు. స్థల పురాణం ప్రకారం.. సప్త ఋషుల ఆగ్రహానికి గురైన నారదమహర్షి శాపవిమోచనం కోసం ఈ క్షేత్రంలో తపస్సు చేశాడు. గజేంద్రుణ్ణి రక్షించేందుకు వెళ్లిన విష్ణుమూర్తి.. తిరుగు ప్రయాణంలో నారద మహర్షి తపస్సుకు మెచ్చి ప్రసన్న వదనంతో దర్శనమిచ్చాడు. శాప విమోచనం పొందిన నారదుడి కోరిక మేరకు విష్ణుమూర్తి ప్రసన్న వేంకటేశ్వరుడిగా బిలకూట క్షేత్రంలో కొలువయ్యాడు. ఇక్కడి ప్రసన్న వేంకటేశ్వరుని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. గిరిప్రదక్షిణ, అంకురార్పణతో ఇక్కడ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. అనంతరం ధ్వజారోహణ, శేషవాహన సేవ, హనుమంత సేవ, మోహినీ ఉత్సవం, గరుడ సేవ, స్వామివారికి మొక్కుబడులు, తెప్పోత్సవం, గజ వాహన సేవ, కల్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహన సేవ, పుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏకాంత సేవతో ఉత్సవాలు పూర్తవుతాయి. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ ఉత్సవాల్లో చక్రస్నానం ప్రత్యేకం. టీటీడీ దేవస్థాన పండితుల ఆధ్వర్యంలో ఈ క్రతువు మనోహరంగా జరిపిస్తారు. వాహన సేవల్లో పాల్గొన్న భక్తుల కోరికలు నెరవేరుతాయని, గరుడసేవలో పాల్గొంటే మోక్షం లభిస్తుందని పండితులు చెబుతారు.



ఈనాడు సినిమా

రాఖీ పండక్కి భోగి


శర్వానంద్

కథానాయకుడు శర్వానంద్. దర్శకుడు సంపత్ నంది కలయికలో 'భోగి' పేరుతో ఓ పాన్ ఇండియా చిత్రం ముస్తాబవుతోంది. కేకే రాధామోహన్ నిర్మాత. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా రక్షా బంధన్ సందర్భంగా ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటిస్తూ బుధవారం పోస్టర్‌ను పంచుకుంది. సాధారణంగా చాక్లెట్‌బాయ్‌లా ప్రేమకథల్లో ఒదిగిపోయే శర్వా.. ఈ సినిమాలో తను పోషిస్తోన్న గంగ పాత్ర కోసం ఓ కొత్త మేకోవర్‌ని చూపించారు. మాసిన జుట్టు.. డార్క్ స్కిన్.. గుబురు మీసాలతో చేతిలో కత్తి పట్టుకుని రగ్గడ్ లుక్‌లో కనిపించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సిద్ధం చేసిన భారీ సెట్‌లో రెండు యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో సాగే ఆసక్తికర కథతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: కిశోర్ కుమార్ మన్నె.

విరోష్ వివాహం
ప్రధాని శుభాకాంక్షలు


విజయ్, రష్మిక

వెండితెరపై జంటగా అలరించిన విజయ్ దేవరకొండ - రష్మిక నేడు వివాహ బంధంతో ఒక్కటి కానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ జంటకు భారత ప్రధాని నరేంద్ర మోదీ నుంచి శుభాకాంక్షలు అందాయి. విజయ్ తల్లిదండ్రులు పంపిన వివాహ ఆహ్వాన పత్రికకు స్పందనగా కాబోయే జంటకు ఆశీసులు అందిస్తూ మోదీ లేఖ పంపారు. "విజయ్ - రష్మికల జీవితంలో ఇదొక కొత్త, అందమైన అధ్యాయం. సప్తపది స్ఫూర్తితో ఏడడుగులు వేస్తున్న ఈ జంట జీవితాంతం స్నేహితులుగా.. ప్రేమతో ఒకరినొకరు అర్థం చేసుకునే భాగస్వాములుగా కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షిస్తున్నా. సినిమాల్లో ట్విస్టులు మీకు కొత్త కాదు. కానీ, మీ నిజ జీవితాల్లోని ఈ అధ్యాయం దైవికంగా రాసిన స్క్రిప్ట్ లాంటిది. ప్రేమ, ఆప్యాయతతో నిండిన ఈ కథ తెరపై మీరు సృష్టించిన మాయ కంటే ఎంతో ఎక్కువ మ్యాజిక్‌తో కూడుకుని ఉంటుంది. రానున్న రోజులు మీరు కన్న కలలన్నీ సాకారమవ్వాలి. ఒకరి బాధ్యతల్ని ఒకరు పంచుకోవాలి. బలహీనతల్ని స్వీకరించాలి. బలాల నుంచి నేర్చుకోవాలి. నిజమైన జీవిత భాగస్వాములుగా, ప్రేమతో, ఆలోచనాత్మకంగా జీవిత ప్రయాణం చేయాలి'' అని లేఖ ద్వారా మోదీ దీవెనలు అందించారు. దేవరకొండ, మందన్నా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

రెండు సంప్రదాయాల్లో పెళ్లి!

'వెడ్డింగ్ ఆఫ్ విరోష్' పేరుతో జరగనున్న విజయ్ - రష్మికల పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా ఉండనుందని సమాచారం. తొలుత ఈ రోజు ఉదయం 10:10గం.లకు విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరగనుంది. అనంతరం సాయంత్రం 4:30గం.లకు రష్మిక కుటుంబ సంప్రదాయ ప్రకారం మరోసారి పెళ్లి జరగనుందని తెలిసింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరగనున్న ఈ పెళ్లి వేడుక కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ - రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేశారు. ఇక వీరి వివాహ విందు వేడుకను మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

ఆలోటు తీరింది: రాజమౌళి



"'బాహుబలి', 'ఈగ' లాంటి సినిమాలు చేస్తున్నప్పుడు మన దగ్గర మోషన్ క్యాప్చర్ సాంకేతికత అందుబాటులో ఉంటే బాగుండేదని అనుకునేవాణ్ని" అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. ఇప్పుడా సాంకేతికత అన్నపూర్ణ స్టూడియోలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే 'వారణాసి' సినిమా కోసం అన్నపూర్ణలోని ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని వాడి కీలక సన్నివేశాలు తీశారు.. అవి అద్భుతంగా వచ్చాయని తెలియజేశారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఏ అండ్ ఎం మోషన్ క్యాప్చర్ ల్యాబ్‌ను ఆవిష్కరించారు. ఈ సాంకేతికతను అన్నపూర్ణ సంస్థ, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమా ట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా అందుబాటులోకి తెచ్చాయి. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ.. "భారతదేశంలో ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులు ఉన్నారు. కానీ, ఆ అధునాతన సౌకర్యాలు ఇక్కడ లేవు. కానీ, ఇప్పుడా లోటు ఏ అండ్ ఎం తీర్చింది. దీని ద్వారా ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ ఆలోచనాధోరణిని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లొచ్చు. నేను ప్రపంచవ్యాప్తంగా చూసిన మోషన్ క్యాప్చర్ ల్యాబ్‌లలో ఏ అండ్ ఎం అత్యంత అద్భుతమైనది. పని తీరు చాలా గొప్పది. 'వారణాసి'లోని కీలక సీన్స్ ఇక్కడే షూట్ చేశాం. ఫలితాలు అద్భుతంగా వచ్చాయి" అన్నారు. "ఇప్పుడు భారత సినిమా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఇదింకా ఎత్తుకు చేరాలి" అన్నారు అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత, హీరో నాగార్జున. ఈ కార్యక్రమంలో శోభు యార్లగడ్డ, బ్రిట్ ఐసెన్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం నవ్వుకుంటారు.. నాదీ బాధ్యత: శ్రీవిష్ణు


సుమంత్ నాయుడు, యదునాథ్ మారుతీరావు, శ్రీవిష్ణు, నయన్ సారిక సుబ్రహ్మణ్యం,

"అందరికీ ఓ మంచి అనుభూతిని అందించే సినిమా 'విష్ణు విన్యాసం'. హ్యాపీగా కుటుంబంతో కలిసి నవ్వుకోవడానికి థియేటర్‌కి రండి. వందశాతం నవ్వుకుంటారు. ఆ బాధ్యత నాది" అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన.. నయన్ సారిక జంటగా నటించిన ఈ చిత్రాన్ని యదునాథ్ మారుతీరావు తెరకెక్కించారు. సుమంత్ నాయుడు.జి నిర్మించారు. ఇది శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "చాలా రోజులు గుర్తుండిపోయే చిత్రమిది. ప్రథమార్ధం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ద్వితీయార్ధం మంచి ఫ్యామిలీ డ్రామాగా మారుతుంది. సినిమా పూర్తయ్యేసరికి ఓ మంచి చిత్రం చూసిన అనుభూతి కలుగుతుంది. ఇది కచ్చితంగా సూపర్ హిట్ సినిమా" అన్నారు. "ఈ చిత్రం ఇంత అద్భుతంగా రావడానికి కారణం శ్రీ విష్ణునే. ఈ సినిమా చూస్తున్నంత సేపూ అందరూ నవ్వుతూనే ఉంటారు" అన్నారు దర్శకుడు యదునాథ్ మారుతీరావు. నిర్మాత సుబ్రహ్మణ్యం, సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో విష్ణు విన్యాసాలు చాలా బాగుంటాయి. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులకు ఇది బాగా నచ్చుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నయన్ సారిక, రధన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈటీవీ విన్‌లో 'శ్రీచిదంబరంగారు'


సంధ్య వశిష్ఠ, వంశీ తుమ్మల

"కొత్త ఆలోచనలతో వస్తున్న దర్శకులకు ఈటీవీ విన్ అండగా నిలుస్తోంది. ఆ సంస్థ కారణంగా కొత్త కథలు వెలుగు చూడటంతోపాటు... కొత్త రకమైన దర్శకులు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. భవిష్యత్తులో మలయాళం ప్రేక్షకులూ మన సినిమాల్ని చూస్తార"న్నారు దర్శకురాలు నందినీరెడ్డి. గురువారం ఉదయం నుంచి 'శ్రీచిదంబరంగారు' చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానున్న సందర్భంగా బుధవారం రాత్రి చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. నందినీరెడ్డితోపాటు, దర్శకులు వేణు ఊడుగుల, సాయిలు కంపాటి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వంశీ తుమ్మల, సంధ్య వశిష్ఠ జంటగా నటించిన చిత్రమే... 'శ్రీచిదంబరంగారు'. వినయ్ రత్నం దర్శకత్వం వహించారు. చింతా వినీషరెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం థియేటర్లలో విడుదలై విజయవంతంగా ప్రదర్శితమైంది. ఓటీటీ వేదికలో విడుదలను పురస్కరించుకుని నందినీరెడ్డి మాట్లాడుతూ "25 ఏళ్ల యువకుడైన దర్శకుడు ఎన్నో సవాళ్లని ఎదుర్కొంటూ ఈ సినిమాని చేశాడు. ఈరోజుల్లో కూడా ఇలాంటి తపన కలిగిన దర్శకులు ఉన్నారంటే అది తెలుగు ప్రేక్షకుల అదృష్టం. ఇలాంటి ఫిలిం మేకర్స్‌కి ఈటీవీ విన్ అండగా నిలుస్తోంది. అందుకు పరిశ్రమ తరఫున మేం కృతజ్ఞతలు చెబుతున్నాం. మంచి సినిమాల్ని ప్రేమించే తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీ విన్ ఇలాంటి మంచి కథల్ని తీసుకొస్తోంది. రూ.49కే ఈటీవీ విన్ సభ్యత్వం లభిస్తోంది. ప్రతి ఒక్కరూ ఆస్వాదించే ఓ మంచి సినిమా ఇది" అన్నారు. వేణు ఊడుగుల మాట్లాడుతూ "కొన్ని మంచి సినిమాలు ప్రేక్షకులకు చేరువ కాకుండానే థియేటర్ల నుంచి వెళ్లిపోతుంటాయి. 'శ్రీచిదంబరంగారు' కూడా అంతే. థియేటర్‌లో ఈ సినిమాని చూస్తున్నప్పుడు గొప్ప అనుభూతి కలిగింది. కథలో ఎంతో నవ్యత ఉంది. నిజమైన వైకల్యం అంటే వ్యక్తిత్వం లేకపోవడం అని ఈ సినిమాలో చూపించిన విధానం చాలా బాగుంది. ఇలాంటి సినిమాని భుజానికెత్తుకుని ప్రేక్షకుల్లోకి తీసుకెళుతున్న ఈటీవీ విన్‌కి అభినందనలు'' అన్నారు. "నేటితరంలో ఎక్కువమంది అభద్రతా భావంతో బాధపడుతూ వాళ్ల విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. ఇలాంటి సమయంలో చెప్పాల్సిన కథ ఇదనే రాశా. ఎక్కువమందికి చేరువ కావల్సిన కథ ఇది. ఈటీవీ విన్‌తో మరింత మందికి చేరువవుతుంది. చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమాపై అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుతున్నా" అన్నారు సాయిలు. ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ "వినయ్ రత్నం, ఆదిత్య హాసన్, ఈటీవీ కలిసి సినిమా చేయాలనుకున్నప్పుడు చర్చకొచ్చిన తొలి కథ ఇది. ఎంతో నిజాయతీగా తెరకెక్కించాడు వినయ్‌రత్నం. ఇలాంటి మూలాల్ని ఆవిష్కరించే తెలుగు సినిమాల్ని ఈటీవీ ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటుంది. ఇలాంటి మంచి సినిమా ఈటీవీ విన్ వేదికపై ఉండాలనుకున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

అలా చేయకపోతే... ఏమీ మిగలదు!


తమన్నా

నటీనటులు వరుస విజయాలతో జోరుమీదున్నప్పుడు సంపాదించడం సర్వసాధారణం. కానీ, దానిని సరైన సమయంలో ఆదా చేయకపోతే చివరికి ఆర్థిక నష్టాలే మిగులుతాయంటోంది కథానాయిక తమన్నా. తెరపై రెండు దశాబ్దాలుగా వైవిధ్యమైన పాత్రలతో అలరిస్తూనే ప్రత్యేక గీతాల్లోనూ సందడి చేస్తోన్న ఆమె వ్యాపార రంగంలోకీ అడుగుపెట్టింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్నా తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు పంచుకుంది. "కెరీర్ తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతునిస్తూ మార్గనిర్దేశం చేసేవారు. దానివల్లే ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. భవిష్యత్తులో అవే నాకు ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయన వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో కొంచెం ముందుచూపు అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు. ఎల్లప్పుడూ సినిమాలతో స్థిరమైన ఆదాయం ఉండకపోవచ్చు. అందుకని ఆర్థిక అంశాల పట్ల అవగాహన, వ్యూహాత్మకంగా ఆలోచించి సరైన సమయంలో నిర్ణయం తీసుకోవడం చాలా అవసరమ"ని చెప్పుకొచ్చింది. తమన్నా తదుపరి హీరో విశాల్‌కు జంటగా తమిళ చిత్రం 'పురుషన్'తో పాటు పలు హిందీ చిత్రాల్లోనూ నటిస్తోంది.


నాగచైతన్య

వృషకర్మ ప్రపంచంలోకి ఆ రోజే

'తండేల్' విజయం తర్వాత కథానాయకుడు నాగచైతన్య నుంచి రానున్న సినిమా 'వృషకర్మ'. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థలు నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర గ్లింప్స్‌ను మార్చి 5న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. ఈ గ్లింప్స్‌తో ఈ చిత్ర ప్రపంచాన్ని.. దీని కథను ప్రేక్షకులకు పరిచయం చేయనుంది చిత్రబృందం. చైతూ ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా అలరించనున్నారు. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

భయం పోతే.. ఆట ముగిసినట్లే


'సుబేదార్'

'నేనొక సైనికుణ్ని.. నా ఛాతీపై బుల్లెట్‌ను భరించగలను కానీ, అగౌరవాన్ని కాదు!' అంటూ ఇసుక మాఫియా గ్యాంగ్‌స్టర్‌లను సైతం పరుగులు పెట్టిస్తున్నాడు బాలీవుడ్ నటుడు అనిల్‌కపూర్. ఆయన ప్రధాన పాత్రలో రూపొందిన యాక్షన్ చిత్రం 'సుబేదార్'. సురేశ్ త్రివేణి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మార్చి 5 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా వీక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నాన్న నాకు ఒకే ఒక్క విషయం నేర్పించారు.. భయం పోయిన తర్వాత ఆట ముగిసినట్లే' లాంటి ఆకట్టుకునే సంభాషణలు అనిల్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించేలా ఉందీ ట్రైలర్. ఈ సినిమాలో రాధికా మదన్, సౌరభ్ శుక్లా, మోనా సింగ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రంలో సుబేదార్ అర్జున్ మౌర్య అనే రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు అనిల్. ఇసుక మాఫియా దందాపై ఓ మాజీ సైనికుడు చేసిన పోరాటం, వారి నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునే పరిస్థితులలో ఎదురైన సవాళ్ల నేపథ్యంలో రూపొందిందీ చిత్రం.

గోల్‌మాల్ 5 లో ప్రియమణి!


ప్రియమణి

ప్రయోగాత్మక పాత్రలతో ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలోనూ అగ్రహీరోల సినిమాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది నటి ప్రియమణి. ఇటీవల ఓ ఇండో- హాలీవుడ్ చిత్రంలోనూ భాగమైనట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె ఖాతాలో బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న 'గోల్‌మాల్ 5' చిత్రం చేరినట్లు తెలుస్తోంది. కామెడీ ఫ్రాంఛైజీగా రూపొంది సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న ఈ గోల్‌మాల్ ఫ్రాంఛైజీకి రోహిత్ శెట్టి దర్శకుడు. ప్రస్తుతం ఆయన ఈ సీక్వెల్ చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం. "ముంబయిలో 'గోల్‌మాల్ 5' చిత్రీకరణ ప్రారంభమైంది. అజయ్ దేవగణ్ కూడా సెట్స్‌లో చేరనున్నారు. ఈ సినిమాలో ప్రియమణి నటిస్తుంది. ప్రస్తుతం చిత్రబృందం ఆమె పాత్ర గురించి గోప్యంగా ఉంచినప్పటికీ.. ప్రియమణి ఇప్పటికే కీలకమైన సన్నివేశాల చిత్రీకరణను ప్రారంభించింద''ని బాలీవుడ్ వర్గాలు చెప్పినట్టు సమాచారం.

టైటిల్ మార్చాలని దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ప్రగతి తివారీ, విశాల్ మోహన్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'యాదవ్ జీ కీ లవ్ స్టోరీ'. ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టైటిల్‌ను నిషేధించాలి లేదా మార్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. రికార్డులో పేర్కొన్న విషయాలను పరిశీలించిన ధర్మాసనం ఇది ఒక కులాన్ని చెడుగా ప్రతిబింబిస్తుందనేది ప్రధాన విషయంగా గుర్తించింది. ఈ మేరకు "ఈ సినిమా టైటిల్ సమాజాన్ని చెడుగా ప్రతిబింబిస్తుందంటున్నారు. కానీ దీనిని మనం అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నాము. సినిమా టైటిల్‌లో ఎక్కడా సంబంధిత కులాన్ని చెడుగా చిత్రీకరించే విశేషణం లేదా పదం లేదు. ఈ భయాలు పూర్తిగా నిరాధారమైనవి. గతంలో 'ఘూస్‌ఖోర్ పండత్'కు సంబంధించిన ఇలాంటి కేసులో ఆ సినిమా టైటిల్ మార్చమని నిర్మాతను ఆదేశించాము. ఆంగ్లంలో 'ఘూస్‌ఖోర్' అంటే అవినీతి అని అర్థం. అందువల్ల సమాజానికి ప్రతికూల అర్థం వస్తుందని మార్చాల్సిన పరిస్థితి వచ్చింది. కానీ ఈ టైటిల్ ఆ సమాజాన్ని ఏ విధంగానూ చెడుగా చిత్రీకరించలేదు. అందువల్ల పిటిషన్‌ను కొట్టివేస్తున్నామ"ని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెరపైకి ఆర్.డి బర్మన్ జీవితం?


నీరజ్ పాండే

తన బాణీలతో అబాలగోపాలన్నీ అలరించిన ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు ఆర్.డి బర్మన్. ఇప్పుడాయన జీవితం తెరపైకి రాబోతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు నీరజ్ పాండే ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. "ఇప్పటికే నీరజ్‌పాండే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని పూర్తి చేశారు. నటీనటుల ఎంపిక ఇంకా ఖరారు కాలేదు. కానీ ఇంతకు ముందు ఓ బయోపిక్‌లో నటించినందుకుగానూ ప్రశంసలు అందుకున్న ఓ హీరోతో ఇందులో ప్రధాన పాత్ర పోషించడానికి చర్చలు చేస్తోంది చిత్రబృందం. మరికొన్ని రోజుల్లో వివరాల్ని వెల్లడించనున్నార"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



వేలానికి రూ.2.1 లక్షల కోట్ల స్పెక్ట్రమ్

దిల్లీ: అందుబాటులో ఉన్న మొత్తం స్పెక్ట్రమ్‌ను తదుపరి వేలానికి ఉంచాల్సిందిగా, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సిఫారసు చేసినట్లు సమాచారం. 600, 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్ట్జ్, 26 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లలో మొత్తంగా 11,790 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను వేలానికి ఉంచనున్నారు. కనీస ధర వద్ద ఈ మొత్తం స్పెక్ట్రమ్ విలువ సుమారు రూ.2.1 లక్షల కోట్లని చెబుతున్నారు. 2022 కంటే ఈ ధర 19% చౌక అని తెలిపారు. కొత్త సంస్థల నికర సంపద పరిమితిని ఒక లైసెన్స్‌డ్ ఏరియాకు రూ.100 కోట్ల నుంచి రూ.50 కోట్లకు తగ్గించారు.

ఆంత్రోపిక్ @ 380 బి.డా

క్లాడ్ ఛాట్‌బాట్ ద్వారా, సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీలకు కంగారు పుట్టిస్తున్న కృత్రిమమేధ (ఏఐ) సంస్థ ఆంత్రోపిక్ విలువ 380 బిలియన్ డాలర్లు (సుమారు రూ.34.20 లక్షల కోట్లు). ఈ నెలలో 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.70 లక్షల కోట్ల) నిధులను సమీకరించిన సందర్భంగా, ఆంత్రోపిక్ విలువను ఇలా పరిగణించారు. మన దేశ దిగ్గజ ఐటీ సంస్థలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్‌మహీంద్రా విలువ మొత్తం కలిసినా కూడా 240 బిలియన్ డాలర్లు (సుమారు రూ.21.60 లక్షల కోట్లు) మాత్రమేనని ఈటీ నివేదిక పేర్కొంది. అంటే 2021లోనే కార్యకలాపాలు ప్రారంభించిన ఆంత్రోపిక్ విలువ, మన దిగ్గజ సంస్థలన్నింటి విలువను మించింది.

మన సోలార్‌పై అమెరికా 126% సుంకం



- సహేతుకం కాని సబ్సిడీలు ఇస్తున్నందునే: యూఎస్ వాణిజ్య శాఖ
- పరిమిత ప్రభావమే అంటున్న కంపెనీలు

మనదేశం నుంచి ఎగుమతి అవుతున్న కొన్ని సౌర విద్యుదుత్పత్తి వస్తువులపై అమెరికా 125.87% ప్రాథమిక కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని (సీవీడీ) ప్రకటించింది. భారత్ ఆయా వస్తువులపై సహేతుకం కాని రీతిలో సబ్సిడీలు ఇవ్వడమే ఇందుకు కారణమంది. ఇండొనేషియా, లావో పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్ (లావోస్) నుంచి వచ్చే క్రిస్టలిన్ సిలికాన్ ఫొటో ఓల్టాయిక్ సెల్స్‌పైనా వేర్వేరు సుంకాలను అమెరికా ప్రకటించింది. 2026 జులై 6 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని అధికారిక ఉత్తర్వు పేర్కొంది.

ఏమిటీ సుంకం

తయారీ దేశంలో సబ్సిడీలు పొందితే, ఆయా వస్తువులను తక్కువ ధరలకే ఎగుమతి చేసేందుకు కంపెనీలకు వీలవుతుంది. ఫలితంగా దిగుమతి చేసుకునే దేశంలోని కంపెనీల ఉత్పత్తుల కంటే, తక్కువకే లభిస్తాయి. ఇటువంటి సందర్భంలో తమ కంపెనీలను రక్షించుకోవడానికి, దిగుమతి చేసుకునే దేశాలు కౌంటర్ వెయిలింగ్ సుంకాన్ని విధిస్తుంటాయి.

చైనా దిగుమతులు తగ్గించేందుకే..

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు, చైనా నుంచి దిగుమతులను తగ్గించేందుకు మన దేశం పలు చర్యలు చేపట్టింది. సోలార్ మాడ్యూళ్లు, సోలార్ పీవీ సెల్స్, ఇన్‌గాట్స్, వేఫర్ల వంటి కీలక విడిభాగాల దేశీయ తయారీని ప్రోత్సహిస్తోంది. రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్, పీఎం కిసాన్ ఊర్జా సురక్ష ఏవమ్ ఉత్తన్ మహాభియాన్ (పీఎమ్-కుసుమ్), సీపీఎస్‌యూ స్కీమ్ ఫేజ్-2 వంటి పథకాల కింద తప్పనిసరిగా దేశీయ తయారీ ప్యానెల్స్, సెల్స్‌నే వాడాలి. దిగుమతులపై 2022

బుధవారం దేశీయ కంపెనీల షేర్లకు నష్టాలు		
పేరు	నష్టం(%)	ముగింపు (రూ.లలో)
వారీ ఎనర్జీస్	10.47	2708.55
విక్రమ్ సోలార్	10.10	175.25
ప్రీమియర్ ఎనర్జీస్	6.27	729.05
స్టెర్లింగ్ అండ్ విల్సన్	1.51	201.65

ఏప్రిల్‌లో ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మనదేశం విధించింది. అధిక సామర్థ్యం ఉండే సోలార్‌ఫొటో ఓల్టాయిక్ మాడ్యూళ్ల తయారీని ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కిందకు తీసుకొచ్చారు. ఫలితంగా 2024-25లో చైనా నుంచి దిగుమతులు 1.7 బి. డాలర్లకు తగ్గాయి. 2023-24లో ఇవి 2.85 బి. డాలర్లుగా ఉన్నాయి. వియత్నాం, హాంకాంగ్, మలేసియా, సింగపూర్ నుంచి కూడా సౌర ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి.

95% ఎగుమతులు అమెరికాకే..

2023 ఏప్రిల్ నుంచి 2025 నవంబరు మధ్య అమెరికాకు మనదేశం నుంచి రూ.34,000 కోట్ల సెల్స్, మాడ్యూళ్లు ఎగుమతయ్యాయి. గత 3 త్రైమాసికాల్లో భారత సోలార్ సెల్స్, మాడ్యూళ్ల ఎగుమతుల్లో 95% అమెరికాకే వెళ్లాయి. తాజా సుంకంతో అమెరికా మాడ్యూళ్లతో పోలిస్తే, మనదేశం నుంచి వెళ్తున్న మాడ్యూళ్లు కనీసం 30% ప్రియంగా మారతాయి.

మనపై ఎంత ప్రభావం

అమెరికా నిర్ణయం వల్ల తమపై పరిమిత ప్రభావమే ఉంటుందని విక్రమ్ సోలార్, వారీ ఎనర్జీస్, ప్రీమియర్ ఎనర్జీస్ వంటి కంపెనీలు చెబుతున్నాయి. మనదేశ ఉత్పత్తులపై 50% సుంకం ఉన్నపుడూ, అమెరికాకు డెలివరీ చేశామని, అమెరికా ఆర్డర్లను పూర్తి చేయడంపై ప్రభావం ఉండబోదని వారీ ఎనర్జీస్ తెలిపింది. అమెరికాకు ఎగుమతులు సున్నాకు చేరినందున, తమపై ప్రభావం ఉండదని ప్రీమియర్ ఎనర్జీస్ పేర్కొంది.

అనిల్ అంబానీ రూ.3,716 కోట్ల నివాసం జప్తు



మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి చెందిన ముంబయి నివాసం 'అబోడ్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. దీని విలువ రూ.3716 కోట్లు. ముంబయిలోని పాలీ హిల్ ప్రాంతంలో ఉన్న ఈ విలాస భవనం 66 మీటర్ల ఎత్తుతో, 17 అంతస్తులను కలిగి ఉంది. ఆర్‌కామ్ చేసిన బ్యాంక్ మోసం కేసులో, పీఎంఎల్ఏ చట్టం కింద ఈ బహుళ అంతస్తుల భవనాన్ని అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తాజా ఆదేశాలతో, ఈ కేసులో మొత్తం అటాచ్‌మెంట్ విలువ రూ.15,700 కోట్లకు చేరింది.

అతిపెద్ద ట్యాంకర్లలో వెనెజువెలా నుంచి చమురు

అమెరికాతో చర్చల అనంతరం వెనెజువెలా నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు మన దేశీయ కంపెనీలు ఆర్డర్లు ఇచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే, ఒకేసారి 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును తీసుకెళ్లే అతిపెద్ద ట్యాంకర్లను వెనెజువెలా రంగంలోకి దింపినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. సాధారణంగా 70,000 బ్యారెళ్ల నుంచి 20 లక్షల బ్యారెళ్ల వరకు చమురును సరఫరా చేసేలా ట్యాంకర్లు ఉంటాయి. జనవరి నుంచి ట్రేడింగ్ సంస్థలు విటోల్, ట్రాఫిగురా చమురు ఎగుమతులు చేస్తున్నాయి. వెనెజువెలా ప్రభుత్వ చమురు సంస్థ నిర్వహిస్తున్న జోస్ టెర్మినల్‌లో నిస్సోస్ కీ, నిస్సోస్ క్రైత్నోస్, అర్జానా అనే మూడు నౌకలకు మార్చిలో లోడింగ్ కోసం సమయం కేటాయించారు. ఈ మూడు భారత్‌కు రానున్నట్లు సమాచారం.

యాపిల్, మైక్రోసాఫ్ట్ షేర్లు
మనమూ కొనేయొచ్చు



- నేరుగా క్రయవిక్రయాలకు వీలు కల్పించిన ఎన్ఎస్ఈ
- 6 నెలల్లో మరో 30కి పైగా దేశాల షేర్లు కూడా

దేశీయ మదుపర్లు, అమెరికా స్టాక్ మార్కెట్లో షేర్లను నేరుగా కొనుగోలు చేయొచ్చు. ఇందుకోసం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ), తన ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ (ఐఎక్స్)లో ఒక ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తెచ్చింది. అంటే యాపిల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా వంటి అమెరికన్ కంపెనీల షేర్లలో మనమూ ట్రేడింగ్ చేయొచ్చన్నమాట. 6 నెలల్లో మరో 30కి పైగా దేశాల షేర్ల ట్రేడింగుకూ గ్లోబల్ యాక్సెస్ ప్లాట్‌ఫాం ద్వారా అవకాశం కల్పించనుంది. తొలి దశలో అమెరికా మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చామని ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ, సీఈఓ వి బాలసుబ్రమణియమ్ పేర్కొన్నారు.

5 డాలర్లతోనూ యాపిల్ షేరు కొనొచ్చు: యాపిల్ షేరు ధర 272 డాలర్ల దరిదాపుల్లో ఉంది. గ్లోబల్ యాక్సెస్ ప్లాట్‌ఫాం తీసుకొచ్చిన ఫీచరు కారణంగా ఫ్రాక్షనల్ ట్రేడింగ్‌కూ అనుమతి ఉంటుంది. అంటే 5 డాలర్లు పెట్టి కూడా యాపిల్ షేరు కొనొచ్చు. అంటే షేరులో మీరు పెట్టే పెట్టుబడికి ఎంత భాగం వస్తుందో, అంతే మీ ఖాతాలో జమవుతుంది. పెట్టుబడులు డాలర్లలోనే జరుగుతాయి. తొలుత భారత కరెన్సీని డాలర్ల కింద మారుస్తారు. ఈ ప్లాట్‌ఫాం సేవలను వెబ్, మొబైల్ ద్వారానూ పొందొచ్చు.

30-45 సెకన్లలోనే కేవైసీ: ఒక్కసారి ఖాతా తీసుకున్నాక, ఆన్‌లైన్ డిజిటల్ కేవైసీని 30-45 సెకన్లలో పూర్తిచేయొచ్చని బాలసుబ్రమణియమ్ పేర్కొన్నారు. ఆధార్ అథెంటికేషన్, పాన్ కార్డు ద్వారా ఇది జరుగుతుందన్నారు. మొబైల్‌లో డిజిలాకర్ ఉంటే, దానిద్వారానూ చేయొచ్చన్నారు. తర్వాత నిర్దేశిత గిఫ్ట్ సిటీ బ్యాంకు ఖాతాను ట్రేడింగ్ ప్లాట్‌ఫాంకు అనుసంధానం చేయాలి. ఒక్కసారి యాప్‌లోకి డబ్బులు వచ్చాక క్రయవిక్రయాలు ప్రారంభించొచ్చు. గ్లోబల్ ట్రేడ్ యాక్సెస్ ప్లాట్‌ఫాంపై ట్రేడింగ్ చేయడానికి ఎటువంటి డీమ్యాట్ ఖాతా అవసరం లేదు. ఎన్ఎస్ఈకి పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన ఎన్ఎస్ఈ ఐఎక్స్ గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఎంత పెట్టుబడులు పెట్టొచ్చంటే..

రిజర్వ్ బ్యాంక్ తీసుకొచ్చిన లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) కింద ఒక ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత మదుపరి 2,50,000 డాలర్ల (సుమారు రూ.2.25 కోట్ల) వరకు పెట్టుబడులు పెట్టొచ్చు. ఈక్విటీలతో పాటు ఈటీఎఫ్‌లనూ కొనుగోలు చేయొచ్చు. డెరివేటివ్స్, డిజిటల్ అసెట్ ఉత్పత్తులు మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతానికి వ్యక్తిగత మదుపర్లే ఈ ప్లాట్‌ఫాం వినియోగించుకోవచ్చని, సంస్థాగత మదుపర్లకు తర్వాతి దశలో అవకాశం కల్పిస్తామని బాలసుబ్రమణియమ్ అన్నారు.

సెమాగ్లుటైడ్ రేసులోకి డాక్టర్ రెడ్డీస్

- ఒబెడా పేరుతో అందుబాటులోకి
- మార్చిలో తీసుకొచ్చేందుకు సన్నాహాలు



ఈనాడు, హైదరాబాద్: మనదేశంలోనూ మధుమేహం, ఊబకాయ చికిత్సల్లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ విభాగంలో, ఇప్పటివరకు ఖరీదు ఎక్కువగా ఉన్న మందులు సామాన్యులకూ అందుబాటులోకి రానున్నాయి. బ్రాండెడ్ ఔషధాలపై పేటెంట్, వచ్చే నెల 21తో ముగియనుంది. వీటి ధరల్లో సగాని కంటే తక్కువ ధరకే ఈ ఔషధాలను అందించేందుకు దేశీయ ఔషధ కంపెనీలు సిద్ధమవుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సెమాగ్లుటైడ్ ఔషధాలపై నోవో నార్డిస్క్ సంస్థకు పేటెంట్ హక్కులు ఉన్నాయి. ఈ సంస్థ సెమాగ్లుటైడ్‌ను రెండు బ్రాండ్ల పేర్లతో అమ్ముతోంది. ఇందులో 'ఓజెంపిక్'ను మధుమేహం చికిత్సలో వినియోగిస్తారు. దీని ఖర్చు ఒక రోగికి నెలకు రూ.8,800-రూ.11,175 వరకు ఉంది. బరువు తగ్గించేందుకు వాడే 'వెగోవీ' ఖర్చు నెలకు రూ.17,000 - 26,000 అవుతోంది. ఎలీ లిల్లీకి చెందిన మౌంజారో వాడాలంటే, నెలకు రూ.14,000-27,500 వరకు వెచ్చించాల్సిందే. ఈ ఔషధాలకు పేటెంట్ గడువు మార్చి 21న ముగియగానే, అదే రోజున డాక్టర్ రెడ్డీస్ తన జనరిక్ ఔషధం 'ఒబెడా'ను ఇంజెక్షన్లు, మాత్రల రూపంలో తీసుకురానుంది. ఇంజెక్షన్‌కు డీసీజీఐ అనుమతి లభించింది కూడా. 1.2 కోట్ల ఇంజెక్షన్ పెన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, గిరాకీకి తగ్గట్టుగా పెంచుకోగలమని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ప్రారంభంలో ఓజెంపిక్‌కు జనరిక్‌గా మధుమేహ చికిత్స కోసం అందుబాటులోకి వస్తుంది. బరువు తగ్గేందుకు ఉపయోగించే ఔషధాన్ని తదుపరి దశల్లో తీసుకొస్తామని డాక్టర్ రెడ్డీస్ ఇటీవల పేర్కొంది. నెలవారీ వినియోగానికి ఈ ఔషధ ధర ప్రస్తుతం కంటే 60% తక్కువగా రూ.1,800 - 6,300 (20-70 డాలర్ల) వరకు ఉండొచ్చని పేర్కొంది.

15 సంస్థలకు పైగా..

సెమాగ్లుటైడ్ పేటెంట్ గడువు తీరిన వెంటనే జనరిక్ ఔషధాన్ని ఉత్పత్తి చేసేందుకు 15కు పైగా భారతీయ ఫార్మా సంస్థలు సన్నద్ధమవుతున్నాయి. మధుమేహం, బరువు తగ్గించే చికిత్సలకు అనుమతి పొందిన సన్ ఫార్మా, నోవెల్‌ట్రీట్, సెమాట్రినిటీ పేర్లతో ఔషధాలు విడుదల చేయనుంది. సిప్లా, జైడస్ లైఫ్‌సైన్సెస్, ఆల్కెమ్ కూడా ఇదే బాటలో ఉన్నాయి. నాట్కో ఫార్మాతో ఎరిస్ లైఫ్‌సైన్సెస్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ మందులను మార్కెటింగ్ చేయనుంది.

✦ మధుమేహం, బరువు తగ్గించే మందుల మార్కెట్ 2026 చివరికి ప్రపంచ వ్యాప్తంగా రూ.5.27 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. ప్రస్తుతం మన దేశంలో ఊబకాయ ఔషధ మార్కెట్ విలువ రూ.1,400 కోట్లు. అందుబాటు ధర జనరిక్ ఔషధాలొస్తే, ఈ మార్కెట్ పరిమాణం ఏడాదిలోనే రెట్టింపు కావచ్చన్నది పరిశ్రమ వర్గాల అంచనా.

కోడి గుడ్లు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



హైదరాబాద్	470	తూ/ప గోదావరి	480
వరంగల్	472	విశాఖపట్నం	485
విజయవాడ	500	చిత్తూరు	533

అరుదైన భూఖనిజాల వెలికితీతకు 7 క్షేత్రాల గుర్తింపు: ఎస్ఈసీఎల్



దిల్లీ: అరుదైన భూఖనిజాల అన్వేషణ నిమిత్తం 7 గనుల డంప్‌లను గుర్తించినట్లు కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) తెలిపింది. బొగ్గు గనుల వ్యర్థాలను పునర్వినియోగించుకోవాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల్లో భాగంగా ఎస్ఈసీఎల్ దీనిని చేపట్టింది. ప్రధాన బొగ్గు క్షేత్రాల్లోని డంప్‌ల్లో, అరుదైన భూఖనిజాల లభ్యతకు అవకాశం ఉందని గుర్తించామని, వీటిని వెలికితీసే నిమిత్తం ఇప్పటికే టెండర్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఎస్ఈసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు హరీశ్ దుహాన్ తెలిపారు. సాంకేతికతను ఉపయోగించి వచ్చే సంవత్సరంలోగా లోహాల లభ్యతకు సంబంధించి కచ్చితత్వంతో కూడిన ప్రాంతాలను గుర్తించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక విద్యుత్, రక్షణ, వాహన, విమానయానం లాంటి రంగాలకు భూఅయస్కాంత ఖనిజాల అవసరం ఉంది. ప్రస్తుతం వీటి కోసం చైనా మీద భారత్ ఎక్కువగా ఆధారపడుతోంది.

రూ.2.7 లక్షల కోట్ల స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు
2025పై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



దిల్లీ: గతేడాది మనదేశం నుంచి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.7 లక్షల కోట్ల) విలువైన స్మార్ట్‌ఫోన్లు ఎగుమతి అయ్యాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం పేర్కొన్నారు. 'ప్రపంచానికి స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రంగా భారత్ ఎదుగుతోంది' అని సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్ట్ చేశారు. గతేడాది మనదేశం నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యింది కూడా స్మార్ట్‌ఫోన్లేనని తెలిపారు. 2025లో మన దేశంలో రూ.5.5 లక్షల కోట్ల (60 బి.డాలర్ల) విలువైన మొబైల్ ఫోన్లు ఉత్పత్తి అయ్యాయి. 2024-25లో ఈ విభాగ ఎగుమతులు దాదాపు రూ.2 లక్షల కోట్లు (22 బి.డాలర్లు)గా ఉన్నాయి. గత ఏడాదిలో దేశం నుంచి మొత్తం ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు (44 బి.డాలర్లు) మించాయి. ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్లలో ఉత్పత్తి ప్రారంభమైతే, ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది.

✦ చైనా-అమెరికా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాక.. అమెరికా దిగ్గజ సంస్థ యాపిల్, భారత్‌లో తయారీని విస్తరించిందని, ఫలితంగా మన దేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రికార్డు స్థాయికి చేరాయని కౌంటర్ పాయింట్ సహవ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు నీల్ షా పేర్కొన్నారు. 2025లో మన దేశంలో తయారైన ప్రతి నాలుగు స్మార్ట్‌ఫోన్లలో ఒకటి ఎగుమతి అయిందని అన్నారు.

మారుతీ గుజరాత్ రైల్ సైడింగ్‌కు అరుదైన గుర్తింపు

గుజరాత్‌లోని తమ ఇన్-ప్లాంట్ రైల్వే సైడింగ్‌కు వెర్రా వెరిఫైడ్ కార్బన్ స్టాండర్డ్ ఇనీషియేటివ్ కింద ప్రపంచంలోనే మొదటి మోడల్ షిఫ్ట్ ప్రాజెక్టుగా గుర్తింపు లభించినట్లు మారుతీ సుజుకీ ఇండియా ప్రకటించింది. వాహనాల రవాణాను రోడ్డు మార్గం నుంచి రైల్వేలకు మార్చడం ద్వారా, 2023-24 నుంచి 2032-33 మధ్య 10 ఏళ్ల కాలంలో సుమారు 1.7 లక్షల కార్బన్ క్రెడిట్లను ఈ ప్రాజెక్టు సాధిస్తుందని అంచనా.

జీరోహార్మ్‌కు రూ.65 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్: మొక్కల ఆధారిత న్యూట్రాస్యూటికల్స్ ఉత్పత్తి చేసే హైదరాబాద్ సంస్థ జీరోహార్మ్ సైన్సెస్ రూ.65 కోట్ల పెట్టుబడులు సమీకరించింది. కోటక్ లైఫ్ సైన్సెస్ ఫండ్ రూ.40 కోట్లు, ఆల్కెమీ గ్రోత్ క్యాపిటల్ రూ.25 కోట్లు ఇందులో పెట్టుబడి పెట్టాయి. ఈ నిధులతో జాతీయ స్థాయిలో బ్రాండ్ వృద్ధి, అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు వ్యాపార విస్తరణతో పాటు, పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సచిన్ దర్బార్వార్ వెల్లడించారు.

ఏఐపై మాకు ఆందోళన లేదు

- ఆదాయాలు కోల్పోయినా ఫరవాలేదు
- టీసీఎస్ సీఈఓ కృతివాసన్



ముంబయి: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతపై తమకు ఆందోళన లేదని ఐటీ సేవల దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సీఈఓ కృతివాసన్ తెలిపారు. తమ ఉద్యోగులు ఏఐ టూల్స్ వాడటం వల్ల, తాము ఆదాయాలు కొంత కోల్పోయినా పర్లేదని అన్నారు. ఏఐ ఆధారిత సొల్యూషన్లను అభివృద్ధి చేయడంలో యువ నిపుణులతో పోలిస్తే సీనియర్ స్థాయి ఉద్యోగులు అంత చురుకుగా లేరని నాస్కామ్ నిర్వహించిన కార్యక్రమంలో కృతివాసన్ చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

✦ మా ఆదాయాలపై ప్రభావం పడినా.. ఏఐ వాడేందుకు మా ప్రారంభ స్థాయి ఉద్యోగులను (అసోసియేట్స్) ప్రోత్సహిస్తాం.

✦ మా 6 లక్షల మంది ఉద్యోగులు ఏఐ సాంకేతికతలో నిష్ణాతులుగా ఉండాలనే టీసీఎస్ కోరుకుంటోంది. ఈ కొత్త సాంకేతికత, జీవనోపాధిని దూరం చేస్తుందనే భయాలు కంపెనీకి లేవు.

✦ ప్రాజెక్టుల్లో ఏఐని ఎలా ఉపయోగించుకోవాలో అన్వేషించాలని ప్రారంభ స్థాయి ఉద్యోగులకు కంపెనీ సూచించింది. కొత్త ఏఐ నైపుణ్యాలను నేర్చుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

✦ ఉద్యోగులు చాట్‌జీపీటీ లాంటి జెనరేషనల్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లకు కొన్ని ప్రాంప్ట్‌లు (సూచనలు) ఇస్తే సరిపోదు. శారీరకంగానూ కొంత శ్రమించాలి. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి సొల్యూషన్లను రూపొందించాలి.

✦ నాగరికతలో మార్పు తెచ్చే సాంకేతికతగా నేను ఏఐని భావిస్తున్నాను. గత 60 ఏళ్లలో పరిష్కారం కాని సమస్యలను ఇది సాధిస్తుంది.


✦ ఈ కొత్త సాంకేతికత ఉత్పాదకతను పెంచుతుంది. వినియోగదార్లకు ఎలాంటి ప్రయోజనాలను అందించగలమనే అంశంపైనే టీసీఎస్ దృష్టి సారించనుంది.

✦ పాలనా విధానాలనూ ఏఐ శాసిస్తుందనే ఆందోళనలు ఉన్నాయి. అయితే పలురకాల ఏజెంట్లను ఉపయోగించి ఏఐనే ఏఐకి ఆదేశాలివ్వాల్సిన పరిస్థితి ఉంటుందనే కోణంలోనే దీనిని టీసీఎస్ చూస్తోంది.

మదుపర్లు అతిగా స్పందించారు..: మదుపర్లు అతిగా స్పందించడం వల్లే బుధవారం ఐటీ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయని, ఇదే కార్యక్రమంలో ఐటీసీ గ్రూపు ఛైర్మన్, ఎండీ సంజీవ్ పురి పేర్కొన్నారు. సాంకేతికత అనేది ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని, కంపెనీ ఉత్పాదకత, సామర్థ్యాలను పెంచుకునేందుకు, సరఫరా వ్యవస్థల మెరుగుకు ఏఐని వాడతామని వివరించారు. సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి ప్రతి 5-10 ఏళ్లకు సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయని, పనితీరును కొత్తగా మార్చుకుంటూ ముందుకు సాగుతుంటుందని గుర్తు చేశారు. తమ వ్యాపారాలన్నింటిలోనూ సాంకేతికతను ఐటీసీ ఉపయోగిస్తోందని పురి తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావాన్ని మదింపు చేసేందుకు గత కొన్నేళ్ల వాతావరణ ధోరణులపై తమ వ్యవసాయ విభాగం అధ్యయనం చేస్తోందని వెల్లడించారు.

5 ఏళ్లలో 10.1 కోట్ల చ.అడుగులు

- అద్దెకు తీసుకున్న జీసీసీలు
- కొలియర్స్ నివేదిక



మనదేశంలోని 7 ప్రధాన నగరాల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు కోసం విదేశీ కంపెనీలు దాదాపు 10.1 కోట్ల చ.అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకున్నాయి. ఇందులో అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే సంస్థలే అధికంగా ఉన్నాయని స్థిరాస్తి సేవల సంస్థ కొలియర్స్ వెల్లడించింది. బెంగళూరు, చెన్నై, దిల్లీ ఎన్‌సీఆర్, హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి, పుణే నగరాల్లో 2020-25 మధ్య మొత్తం 28.02 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలం లీజుకు వెళ్లింది. ఇందులో జీసీసీల ఏర్పాటు కోసం విదేశీ సంస్థలు 10.1 కోట్ల చ.అడుగుల విస్తీర్ణాన్ని అద్దెకు తీసుకున్నాయి. ఈ ఏడు నగరాల్లోని మొత్తం కార్యాలయాల గిరాకీలో ఇది 36%. అమెరికా సంస్థలే 71లక్షల చ.అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకున్నాయి. 'ఇటీవలి కాలంలో భారతీయ ఆఫీస్ స్పేస్ మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందింది. కొవిడ్ తర్వాత గిరాకీ గరిష్ఠ స్థాయిలను తాకేందుకు ప్రధాన కారణం జీసీసీలే. ఇవి ఆవిష్కరణల కేంద్రాలు, పరిశోధనా హబ్‌లుగా రూపాంతరం చెందాయి' అని కొలియర్స్ పేర్కొంది.


భవిష్యత్తులో జీసీసీల ఏర్పాటు కోసం విదేశీ సంస్థలు ఏటా 3.5 - 4 కోట్ల చ.అడుగుల వరకు కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకోవచ్చని కొలియర్స్ ఇండియా (ఆఫీస్ సర్వీసెస్) మేనేజింగ్ డైరెక్టర్ అర్పిత్ మెహ్రోత్రా అంచనా వేశారు. అమెరికా సంస్థల నుంచి వచ్చే టెక్నాలజీ ఆధారిత జీసీసీల గిరాకీ స్థిరపడినా.. ఇంజినీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ సేవల రంగాలకు చెందిన ఐరోపా, బ్రిటన్ కంపెనీల నుంచి గిరాకీ పెరుగుతుందని ఆశిస్తున్నట్లు వివరించారు. రాబోయే ఏళ్లలో కార్యాలయాల మొత్తం గిరాకీలో జీసీసీల వాటా 40-50 శాతంగా ఉండొచ్చని కొలియర్స్ అంచనా వేసింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మోసం కేసులో నలుగురి అరెస్ట్

దిల్లీ: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం వ్యవహారానికి సంబంధించి నలుగురిని హరియాణా రాష్ట్ర విజిలెన్స్, యాంటీ కరప్షన్ బ్యూరో అరెస్ట్ చేసింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో గతంలో మేనేజర్‌గా పనిచేసిన రిభవ్ రిషి, రిలేషన్‌షిప్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన అభయ్ కుమార్ ఈ మోసంలో కీలక పాత్రధారులు అని అధికారులు తెలిపారు. అరెస్ట్ అయిన వాళ్లలో ఈ ఇద్దరే కాకుండా, మరో ఇద్దరు బయటి వ్యక్తులు ఉన్నారని వారిలో ఒకరు అభయ్ కుమార్ భార్య స్వాతి సింగ్లా కాగా, మరొకరు ఈమె సోదరుడు అభిషేక్ సింగ్లా. వీరిద్దరు కలిసి స్వస్తిక్ దేశ్ ప్రాజెక్ట్ పేరుతో ఒక సంస్థను నిర్వహిస్తున్నారని, రూ.590 కోట్ల నిధుల్లో అధిక భాగం (సుమారు రూ.300 కోట్లు) ఈ సంస్థలోకే మళ్లించారని అధికారులు వెల్లడించారు.

ఒడుదొడుకుల్లో స్వల్ప లాభాలు

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ. 2,992 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.5,119 కోట్లు



సెన్సెక్స్ ▲ 50 — 82276
నిఫ్టీ ▲ 58 — 25482

ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో, దేశీయ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. మన దేశ సోలార్ వస్తువులపై అమెరికా 126% దిగుమతి సుంకాలను విధించడం, మదుపర్ల లాభాల స్వీకరణకు కారణమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 4 పైసలు పెరిగి 90.91 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.14% నష్టంతో 70.67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.74 లక్షల కోట్లు పెరిగి రూ.467.38 లక్షల కోట్ల (5.14 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 295 పాయింట్ల (క్రితం ముగింపు 82,225.92) లాభంతో 82,530.12 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ, 82,957.91 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అనంతరం అమ్మకాలతో 82,132.63 పాయింట్లకు పడిపోయిన సూచీ, చివరకు 82,276.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 57.85 పాయింట్లు పెరిగి 25,482.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,428.20- 25,652.60 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 20 రాణించాయి. హెచ్‌సీఎల్ టెక్ 2.80%, టాటా స్టీల్ 2.63%, టీసీఎస్ 2.14%, ఇండిగో 2.01%, సన్‌ఫార్మా 1.92%, ఎం అండ్ ఎం 1.80%, టెక్ మహీంద్రా 1.13%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.10%, ఇన్ఫోసిస్ 1.08% లాభపడ్డాయి. రిలయన్స్ 2.23%, ఎస్‌బీఐ 1.93%, అదానీ పోర్ట్స్ 1.72%, ఎటర్నల్ 1.46%, భారతీ ఎయిర్‌టెల్ 1.39%, ఐటీసీ 1.22% పడ్డాయి.

రంగాల వారీ సూచీల్లో.. లోహ 2.64%, వాహన 1.82%, ఫోకస్డ్ ఐటీ 1.53%, కమొడిటీస్ 1.49%, ఆరోగ్య సంరక్షణ 1.35% మెరిశాయి. టెలికాం, ఇంధన, ఎఫ్ఎమ్‌సీజీ, స్థిరాస్తి నీరసించాయి. బీఎస్ఈలో 2191 షేర్లు నష్టపోగా, 2012 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 177 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) రేటింగ్‌ను 'బీబీబీ-'గా ఫిచ్ రేటింగ్స్ కొనసాగించింది. భవిష్యత్తు 'స్థిరం'గా ఉండొచ్చని అంచనా వేసింది.

ఓయో బోర్డులో సెబీ మాజీ ఛైర్మన్

ఐపీఓకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్న ఓయో మాతృసంస్థ ప్రిజం బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా సెబీ మాజీ ఛైర్మన్ అజయ్ త్యాగి నియమితులయ్యారు.

ఐపీఓ సమాచారం

✦ పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జువెలరీ ఐపీఓ రెండో రోజుకు 83% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 57,06,235 షేర్లను ఆఫర్ చేయగా, 47,23,424 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 66% స్పందన నమోదైంది.

✦ శ్రీరామ్ ట్విస్టెక్స్ ఐపీఓ ముగిసేసరికి 43.66 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 1,06,00,000 షేర్లను ఆఫర్ చేయగా, 46,28,41,632 షేర్లకు బిడ్లు సమోదయ్యాయి. ఎన్ఐఐ విభాగంలో 220.30 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 76.63 రెట్లు, క్యూఐబీ విభాగంలో 3.94 రెట్ల స్పందన కనిపించింది.

✦ **ఐఆర్ఎఫ్‌సీ ఓఎఫ్ఎస్‌కు దక్కని పూర్తి స్పందన:** ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ)లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 2% ప్రభుత్వ వాటా విక్రయానికి సంస్థాగత మదుపర్ల నుంచి పూర్తి స్పందన లభించలేదు. ఓఎఫ్ఎస్‌లో 23.52 కోట్ల షేర్లకు గాను 94.98 శాతానికి సమానమైన 22.34 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. గురువారం రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. 2% వాటాకు మించి స్పందన లభిస్తే, 4% వరకు వాటా విక్రయించాలన్నది ప్రభుత్వ యత్నం.

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ ఎకానమీ

1. భారతదేశంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు సిఫార్సులు చేసిన కమిటీ?
   1) నరసింహన్ కమిటీ
   2) కె.ఎస్.సి.చక్రవర్తి కమిటీ
   3) పద్మనాభన్ కమిటీ
   4) చంద్రశేఖర్ ఘోష్
2. సావరిన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ) పథకాన్ని ఏ సంస్థ ఆధీనంలో ప్రారంభించారు?
   1) కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ
   2) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
   3) సెబీ 4) నీతి ఆయోగ్
3. భారతదేశ అభివృద్ధిలో ఎంఎస్ఎంఈ పాత్రకు సంబంధించి డిజైనింగ్ ఎ పాలసీ ఫర్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ అనే వ్యూహాత్మక నివేదికను ఏ సంస్థ తయారు చేసింది?
   1) భారతీయ పరిశ్రమల సమాఖ్య
   2) ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ
   3) నీతిఆయోగ్
   4) కేంద్ర గణాంక శాఖ
4. నీతి ఆయోగ్ ద్వారా రూపొందించిన 'నీతి ఆయోగ్ ఫోరం ఫర్ నార్త్‌ఈస్ట్' మొదటి సమావేశం ఇటీవల ఎక్కడ జరిగింది?
   1) షిల్లాంగ్ 2) ఇటానగర్
   3) అగర్తల 4) గాంగ్‌టక్

జవాబులు 1-1, 2-2, 3-3, 4-3.

TENTH Social — GLOBALISATION AND THE INDIAN ECONOMY

1 Mark

1. **What is the main channel connecting distant countries?**
   A: Trade & Globalisation
2. **Expand MNC's?**
   A: Multi National Company
3. **What is an MNC?**
   A: A multinational company is a company that owns or controls production in more than one nation.
4. **What is globalisation?**
   A: Globalisation is the process of rapid integration or interconnection between countries.
5. **What are the factors playing a major role in the globalisation process?**
   A: Technology, Information and communication technology.
6. **Tax on import is an example of.........**
   A: Trade Barriers
7. **Explain e-Mail.**
   A: Electronic mail
8. **......... played a major role in spreading out of production of service across countries.**
   A: MNC (Multi National Companies)
9. **Arrange in correct sequence. i) Manufacture ii) Design. iii) Assemble iv) Market**
   A: i) Design ii) Manufacture iii) Assemble iv) Market
10. **Expand WTO.**
    A: World Trade Organisation
11. **The past two decades of globalisation has seen rapid movement in ....**
    a) goods, services and people between countries.
    b) goods, services and investments between countries.
    c) goods, investments and people between countries.
    A: (b)
12. **Globalisation has led to improvement in living conditions.**
    a) all the people.
    b) of people in the developed countries.
    c) of workers in the developing countries.
    d) none of the above.
    A: (d)

Final Exams-2026 IMPORTANT Q & A

For more IMP Q & A



Writer: K.S.V. Krishna Reddy

అనంత కదలికల్లో ఆసక్తికర సూత్రాలు!

కాస్త గమనిస్తే కళ్ల ముందు ఉన్న లోకం ఒక్క క్షణం కూడా నిలకడగా ఉండదని గుర్తించవచ్చు. ఉదయాన్నే ఆకాశంలో ఎగిరే పక్షులు, రోజంతా వేగంగా ప్రయాణించే వాహనాలు, ఆఖరికి గుండె చప్పుడు కూడా చలనమే. భూమి గంటకు వేల కిలోమీటర్ల వేగంతో అంతరిక్షంలో ప్రయాణిస్తోంది. భౌతిక శాస్త్రానికి సంబంధించి చలనం అంటే కేవలం కదలిక కాదు. వస్తువు ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రయాణించడానికి పట్టిన సమయం, అది ప్రయాణించే దిశ, దాని వేగంలో వచ్చిన మార్పులు, వాటి వెనుక ఉన్న అనేక సూత్రాలు. వీటిని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. చలనానికి కారణాలను, దానిని ప్రభావితం చేసే అంశాలను అర్థం చేసుకోవాలి. వస్తువుల వేగం, దిశ, వాటిపై పనిచేసే బలాలపై అవగాహన పెంపొందించుకోవాలి. చలనం రకాలు, ఇందులోని భౌతిక రాశులైన కాలం, వేగం, దూరాలను కొలిచే ప్రమాణాలు, ప్రామాణిక సూత్రాలను నేర్చుకోవాలి.

జనరల్ స్టడీస్ — భౌతిక శాస్త్రం

చలనం

విశ్వంలోని ప్రతి వస్తువు మధ్య గురుత్వాకర్షణ బలం ఉంటుంది. దాని వల్ల విశ్వం అంతా ఒక బిందువు మాదిరి మారిపోవాలి. కానీ అలా జరగకపోవడానికి కారణం అన్ని వస్తువులు నిరంతరం చలించడమే. ఆ చలనం వల్ల ఏర్పడిన అపకేంద్ర బలం చలించే వస్తువులను గురుత్వాకర్షణ నుంచి కాపాడుతోంది. భూమి గంటకు 1,610 కి.మీ. వేగంతో తన చుట్టూ తాను తిరుగుతూ 1,07,200 కి.మీ./గం. వేగంతో సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. అందుకే భూమి సూర్యుడి ఆకర్షణను తట్టుకోగలుగుతోంది.

కాంతి వేగం సెకనుకు 3,00,000 కిలోమీటర్లు. అందుకే 3,84,400 కి.మీ. దూరంలో ఉన్న చంద్రుడి కాంతి భూమిని చేరేందుకు కేవలం 1.255 సెకన్లు, సుమారు 149.5 మిలియన్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుడి కాంతి చేరేందుకు 8.3 నిమిషాలు (500 సెకన్లు) సరిపోతుంది. ఎవరైనా కాంతి వేగంతో ప్రయాణిస్తే కాలం నెమ్మదిస్తుందని ఐన్‌స్టీన్ సిద్ధాంతం చెప్పింది. అంటే భవిష్యత్తులోకి ప్రయాణించవచ్చు. ప్రస్తుత శాస్త్ర పరిజ్ఞానం కేవలం ధ్వని వేగంతో పోల్చగలిగే వేగాలను మాత్రమే సాధించింది. ధ్వని వేగం సెకనుకు 343 మీ./సె. నేటివరకు 20-27 మ్యాక్ వేగం ఉన్న హైపర్‌సోనిక్ క్షిపణులు తయారయ్యాయి. 27 మ్యాక్ అంటే ధ్వని వేగానికి 27 రెట్లు అని అర్థం.

చలనంలో రకాలు

చలనం మూడు రకాలుగా జరుగుతుంది.

1) భ్రమణ చలనం, 2) డోలయామాన లేదా కంపన చలనం ఉదా: ఊయల
3) స్థానాంతర చలనం



ఎ) వక్రీయ స్థానాంతర చలనం: ఉదా: కొండపై ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న బస్సు.
బి) రేఖీయ స్థానాంతర చలనం: ఉదా: పై నుంచి కిందకు పడుతున్న వస్తువు.



చలనం: ఇదొక సాపేక్ష రాశి అంటే పోల్చి చెప్పేది. మనుషులు, భూమి ఒకే వేగంతో కదులుతూ ఉండటం వల్ల మనిషికి భూమి కదిలినట్లు అనిపించడం లేదు. అంటే మనిషి పరంగా భూమి, భూమి పరంగా మనిషి నిశ్చల స్థితిలో ఉన్నట్లు అర్థం. అదే ఎవరైనా ఒక వ్యక్తి ప్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలులో కూర్చుని ఉన్నప్పుడు, పక్క ప్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలు కదులుతూ ఉంటే ఆ వ్యక్తికి కూడా కదులుతున్న అనుభూతి కలుగుతుంది. దీనికి కారణం పక్కన ఉన్న రైలు పరంగా వ్యక్తి చలనంలో ఉన్నట్లే, కానీ ప్లాట్‌ఫామ్ పరంగా నిశ్చలస్థితిలో ఉన్నట్లు గుర్తించాలి.

చలనంలో భౌతిక రాశులు

చలనంలో ఉపయోగించే భౌతిక రాశులు దూరం, స్థానభ్రంశం, కాలం, వడి, వేగం, త్వరణం.

దూరం: ఒక వస్తువు ప్రయాణించిన మార్గం పొడవును దూరం అంటారు. ఇది అదిశ రాశి. వాహనాల్లో ఓడోమీటరు అనే పరికరాన్ని ఉపయోగించి దీనిని కొలుస్తారు.



ఓడోమీటరు


స్థానభ్రంశం: ఒక వస్తువు ప్రయాణించిన మార్గానికి సంబంధించిన తొలి, తుది బిందువుల మధ్య ఉండే సరళరేఖ దూరాన్ని 'స్థానభ్రంశం' అంటారు. ఇది సదిశరాశి. అందువల్ల ఇది ధనాత్మకం, ఋణాత్మకం, సున్నా కూడా కావచ్చు.

ధనాత్మకం: కొండ ఎక్కుతున్నప్పుడు ధనాత్మకం.

ఋణాత్మకం: బొగ్గు గనిలోకి సముద్ర మట్టం కంటే కిందికి వెళ్లినప్పుడు ఋణాత్మకం.


సున్నా: భ్రమణ చలనం, డోలయామాన చలనంతో వస్తువు తొలి స్థానాన్ని చేరితే సున్నా అవుతుంది.

దూరానికి, స్థానభ్రంశానికి మధ్య సంబంధం: ఒక వ్యక్తి లాంగ్‌జంప్ చేసినప్పుడు అతడి వక్రమార్గం పొడవు దూరం అవుతుంది. కానీ డ్రిల్ మాస్టారు, టేపు ఉపయోగించి కొలిచేది స్థానభ్రంశం. ఈ సందర్భంలో దూరం > స్థానభ్రంశం అవుతుంది.



✦ సరళ రేఖీయ చలనంలో దూరం = స్థానభ్రంశం అవుతుంది.

ఉదా: జారుడు బల్లపై జారడం





దూరం, స్థానభ్రంశం A B

✦ దూరం(d), స్థానభ్రంశం(s) నిష్పత్తి ఎల్లప్పుడూ 1 లేదా 1 కంటే ఎక్కువ ఉంటుంది.

$$\frac{d}{s} \geq 1$$

✦ దూరానికి, స్థానభ్రంశానికి ప్రమాణాలు ఒకటే.

CGS పద్ధతిలో సెంటీమీటరు(cm), SI పద్ధతిలో మీటరు (m).

దూరానికి పెద్ద ప్రమాణం

✦ దూరాన్ని కొలవడానికి వాడే పెద్ద ప్రమాణం పారెసెక్ లేదా పోలారిక్ సెకన్

1 పారెసెక్ = 3.26 కాంతి సంవత్సరాలు (కాంతి సంవత్సరం అంటే కాంతి ఒక సంవత్సరంలో ప్రయాణించిన దూరం.)



✦ కాంతి సంవత్సరం = 9.46×10^{12} కి.మీ.

భూమికి, సూర్యుడికి మధ్య దూరాన్ని 'ఆస్ట్రనామిక్ యూనిట్' అంటారు.

1 కాంతి సంవత్సరం = 6.324×10^{4} AU


✦ పారెసెక్, కాంతి సంవత్సరం అనే ప్రమాణాలను నక్షత్రాల మధ్య దూరాన్ని కొలవడానికి వాడతారు.

✦ ఆస్ట్రనామిక్ యూనిట్ (AU) అనేది సౌరకుటుంబంలో దూరాలని కొలవడానికి ఉపయోగిస్తారు.

✦ దూరాన్ని కొలవడానికి వాడే అతి చిన్న ప్రమాణం - ఫెర్మి.

1 ఫెర్మి = 10^{-15} మీ. లేదా 10^{-5} A°

1 A° = 10^{-10} m


ఫెర్మి

A° అంటే ఆంగ్‌స్ట్రామ్ అని అర్థం. ఇది పరమాణు పరిమాణం కొలవడానికి వాడితే, ఫెర్మిని కేంద్రక పరిమాణం కొలవడానికి వాడతారు. ఫెర్మి అనే వ్యక్తి 1942లో న్యూక్లియర్ రియాక్టర్‌ని కనిపెట్టారు. ✦ న్యూక్లియర్ రియాక్టర్ అంటే నియంత్రిత కేంద్రక చర్యల శ్రేణి.



రచయిత: పి.మధు కుమార్


ఆ రాష్ట్రంలో కులరహిత గ్రామంపై తీర్మానం!

భారత్- ఫ్రాన్స్ దేశాల మధ్య రక్షణ, సాంకేతిక రంగాల్లో సంబంధాలు మరో స్థాయికి చేరుకునే విధంగా ఒప్పందాలు జరిగాయి. బంగ్లాదేశ్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధినేత తారిఖ్ రెహమాన్ ఆ దేశ నూతన ప్రధానిగా ఎన్నికయ్యారు. వాట్సాప్‌ను రష్యా నిషేధించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ ఎక్స్‌పో కార్యక్రమానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. దేశంలో తొలిసారిగా ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టింది. కేరళ ప్రభుత్వం సమగ్ర పట్టణ విధానాన్ని తీసుకొచ్చింది. ముంబయి సముద్ర తీరంలో 'జయ హో' పాట వినిపించే విధంగా మ్యూజికల్ రోడ్డు ప్రారంభమైంది. ఇటీవలి కాలంలో వార్తల్లో నిలిచిన ఇలాంటి ముఖ్యాంశాలు, ప్రధాన పరిణామాలపై పోటీ పరీక్షల అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. వాటితో పాటు ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో మార్పులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల ఫలితాలు, ప్రాధాన్య నివేదికలు, అవార్డుల విజేతల వివరాలను తెలుసుకోవాలి.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. ప్రధాని మోదీ ఇటీవల ప్రారంభించిన 'కుమార్ భాస్కర్ వర్మసేతు' ఏ రాష్ట్రంలో ఉంది?



   1) అస్సాం 2) అరుణాచల్‌ప్రదేశ్
   3) గుజరాత్ 4) కేరళ

నోట్: 1) ఇది బ్రహ్మపుత్ర నదిపై ఆరు వరుసల వంతెన. రూ.3,030 కోట్లతో నిర్మించారు.

2) అస్సాంలో దిబ్రూగఢ్ జిల్లాలోని 37వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ సౌకర్యాన్ని మోదీ ప్రారంభించారు.

2. కింది వాటిలో సరైంది?
   ఎ) ఇటీవల బంగ్లాదేశ్‌లో 18వ సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.
   బి) బంగ్లాదేశ్‌లో 350 పార్లమెంటు స్థానాలున్నాయి.
   సి) 209 సీట్లను బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నెగ్గింది.
   డి) బీఎన్‌పీ 2001 - 2006 మధ్యకాలంలో బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉంది.
   ఇ) బంగ్లాదేశ్ నూతన ప్రధాని తారిఖ్ రెహమాన్.
   1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి, ఇ
   3) ఎ, సి, డి, ఇ 4) బి, డి, ఇ

నోట్: 1) బంగ్లాదేశ్‌లో ఇటీవల 13వ సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.

2) ఈ దేశ పార్లమెంటులో మొత్తం 350 సీట్లు. ఇందులో 300 స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి. మిగతా 50 సీట్లు మహిళలకు రిజర్వు చేశారు. ఎన్నికల్లో పార్టీలు గెలిచిన సీట్ల ఆధారంగా ఈ సీట్ల కేటాయింపులు ఉంటాయి. ఒక నియోజకవర్గంలో అభ్యర్థి మరణించడంతో ఈసారి 299 పార్లమెంటు స్థానాలకే ఎన్నికలు జరిగాయి. రెండు స్థానాల్లో ఫలితాలను ఎన్నికల సంఘం నిలిపేసింది. 297 సీట్లకే ఫలితాలను ప్రకటించింది.

3. జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది?
   1) 1979 2) 1989 3) 1999 4) 1969
4. న్యూజిలాండ్‌లోని కుక్ జల సంధిని 9.22 గంట (23.6 కి.మీ.)ల్లో ఈది చరిత్ర సృష్టించిన భారత పారా స్విమ్మర్ ఎవరు?
   1) శరత్ గైక్వాడ్ 2) సుయాష్ జాదవ్
   3) సతేంద్ర సింగ్ లోహియా
   4) హిమాన్షు నందాల్
5. అమెరికా పౌరహక్కుల నేత జెస్సీ జాక్సన్ ఇటీవల మృతి చెందారు. ఆయనకు ఏ సంవత్సరంలో ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం'ను అందజేశారు?
   1) 2001 2) 2002 3) 2004 4) 2000
6. కింది వాటిలో సరైంది?



   ఎ) ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు ఫ్రాన్స్ అధ్యక్షుడు భారత్‌లో పర్యటించారు.
   బి) ఫ్రాన్స్ అధ్యక్షుడి పేరు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్.
   సి) ఇండియా - ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని మోదీ - మెక్రాన్ ప్రారంభించారు.
   డి) ముంబయిలో ఏర్పాటుచేసే ఎయిర్‌బస్ హెచ్ 125 హెలికాప్టర్ అసెంబ్లింగ్ యూనిట్‌ను ఇద్దరూ వర్చువల్‌గా ప్రారంభించారు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

నోట్: 1) కర్ణాటకలోని వేమగల్‌లో ఏర్పాటుచేసే ఎయిర్ బస్ హెచ్ 125 హెలికాప్టర్ అసెంబ్లింగ్ యూనిట్‌ను ఇద్దరూ ముంబయి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.

2) భారత్‌లో హామర్ క్షిపణుల ఉత్పత్తికి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, సాఫ్రాన్ (ఫ్రాన్స్) మధ్య ఒప్పందం కుదిరింది. మొత్తంగా ఫ్రాన్స్, భారత్ మధ్య 21 ఒప్పందాలు జరిగాయి.

7. కేరళ నుంచి తొలి అంధ మహిళా న్యాయమూర్తిగా కింది వారిలో ఎవరు నిలిచారు?
   1) కవితా నాథన్ 2) రాగిణి యాదవ్
   3) తాన్య నాథన్ 4) సుమిత్రా యాదవ్
8. వాషింగ్టన్ డీసీ ప్రధాన కేంద్రంగా ఉన్న పోర్టులాన్స్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించిన నెట్‌వర్క్ రెడీనెస్ ఇండెక్స్-2025లో భారత్ ర్యాంకు ఎంత?
   1) 36వ 2) 28వ 3) 39వ 4) 45వ

నోట్: 1) అమెరికా మొదటి స్థానంలో నిలవగా ఫిన్లాండ్, సింగపూర్ వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచాయి.

2) అంతర్జాతీయ ఆవిష్కరణల సూచీ (గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్)-2025లో భారత్ ర్యాంకు 38. స్విట్జర్లాండ్, స్వీడన్, అమెరికా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

3) గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైబ్రెన్స్ ఇండెక్స్ 2025లో భారత్‌ది 3వ ర్యాంకు. అమెరికా, చైనాలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

9. కింది వాటిలో సరైంది?
   ఎ) దేశ ఉన్ని ఉత్పత్తిలో 47.35%తో రాజస్థాన్ మొదటి స్థానంలో నిలిచింది.
   బి) భారతదేశంలో సొంతంగా ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రంగా ఉత్తర్‌ప్రదేశ్ నిలిచింది.
   సి) ఆడపిల్లలకు ఉన్నత విద్య అందించడం, బాల్య వివాహాలను నిర్మూలించడం కోసం 'లక్‌పతి బిటియా యోజన' అనే పథకాన్ని దిల్లీ ప్రారంభించింది.



   డి) మహారాష్ట్రలో హంగేరియన్ టెక్నాలజీతో నారీమన్ నుంచి వర్లి వరకు దేశంలో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
10. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో - 2026'కు ఏ నగరం ఆతిథ్యం ఇచ్చింది?
    1) లఖ్‌నవూ 2) దిల్లీ
    3) వారణాసి 4) కోల్‌కతా

నోట్: ఎమ్మెల్యేల కోసం ఏఐ ఆధారిత డిజిటల్ హాజరు వ్యవస్థను ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది.

11. ఇటీవల కులరహిత గ్రామంగా ఉండాలని తీర్మానించుకున్న 'సౌందాలా గ్రామ పంచాయతీ' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) కేరళ
    3) రాజస్థాన్ 4) ఉత్తర్‌ప్రదేశ్
12. భారత్‌లో తొలిసారిగా 'గో సంస్కృతి మ్యూజియం' ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నారు?
    1) రాజస్థాన్ 2) ఉత్తర్‌ప్రదేశ్
    3) గుజరాత్ 4) ఉత్తరాఖండ్

నోట్: 1) ఉత్తర్‌ప్రదేశ్‌లో మధురలోని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వెటర్నరీ సైన్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లో గో సంస్కృతి మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు.

2) 2000 సంవత్సరం నాటి తమిళ - బ్రాహ్మి శాసనాలు ఇటీవల ఈజిప్టులో కనుక్కున్నారు.

13. కింది వాటిలో సరైంది?
    ఎ) ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 15వ ఎడిషన్ 2026, ఫిబ్రవరి 8-14 వరకు బహ్రెయిన్‌లోని మనామాలో జరిగింది.
    బి) ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 2 స్వర్ణాలు, 5 రజతాలు, 8 కాంస్యాలు మొత్తంగా 15 పతకాలతో 3వ స్థానంలో నిలిచింది.
    సి) 11 స్వర్ణాలు, 6 రజతాలు, 8 కాంస్యాలు మొత్తంగా 25 పతకాలతో చైనా మొదటి స్థానంలో నిలిచింది.
    డి) 3 స్వర్ణాలు, ఒక రజతం, 3 కాంస్యాలు మొత్తంగా 7 పతకాలతో జపాన్ 2వ స్థానంలో నిలిచింది.
    1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి 4) ఎ, సి, డి
14. లింఫాటిక్ ఫైలేరియాసిస్‌ను ఏ సంవత్సరం నాటికి భారత్‌లో నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా తెలిపారు?
    1) 2030 2) 2027 3) 2035 4) 2047
15. ఇటీవల రష్యా వాట్సాప్‌ను నిషేధించింది. దీనికి ప్రత్యామ్నాయంగా ఆ దేశ అధికారులు ఏ స్వదేశీ మెసేజింగ్ అప్లికేషన్‌ను ప్రమోట్ చేస్తున్నారు?
    1) టెలిగ్రామ్ 2) ఒడ్నోక్లాస్నికి
    3) మాక్స్ 4) వి.కాంటాక్టే
16. వరుసగా 3వ సారి ఏ దేశ ప్రధానిగా మియా అమోర్ మోట్లీ నియమితులయ్యారు?



    1) బార్బడోస్ 2) లావోస్
    3) సిరియా 4) కంబోడియా

నోట్: బల్గేరియా తాత్కాలిక ప్రధానమంత్రిగా ఆండ్రీ గ్యురోవ్ నియమితులయ్యారు.

17. భారతదేశంలో సమగ్ర పట్టణ విధానాన్ని రూపొందించి, ఆమోదించిన మొదటి రాష్ట్రం?
    1) గోవా 2) మహారాష్ట్ర
    3) అరుణాచల్‌ప్రదేశ్ 4) కేరళ
18. పునీత్ అగర్వాల్ ఏ దేశానికి భారతదేశ కొత్త రాయబారిగా నియమితులయ్యారు?
    1) థాయ్‌లాండ్ 2) లావోస్
    3) ఫిజీ 4) సింగపూర్
19. కింది వాటిలో సరైంది?



    ఎ) 2026, ఫిబ్రవరిలో ఇషా ఫౌండేషన్ తొలిసారిగా భవ్య భూషణ్ అవార్డులను ప్రదానం చేసింది.
    బి) శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నంబినారాయణ్ (ఇస్రో మాజీ శాస్త్రవేత్త), ఎస్. కిరణ్ కుమార్ (ఇస్రో మాజీ ఛైర్మన్)కు ఇచ్చారు.
    సి) క్రీడారంగంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్‌కు ప్రదానం చేశారు.
    డి) కళలు, సంస్కృతిలో అలర్మేల్‌వల్లి (శాస్త్రీయ నృత్య కళాకారిణి - భరతనాట్యం), ఎన్.రాజం (వయొలిన్ విద్వాంసురాలి)కి ఇచ్చారు.
    ఇ) ప్రత్యేక గుర్తింపుగా భారత్ సాయుధ దళాలకు ఇచ్చారు.
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి, ఎ
    3) ఎ, బి, డి, ఇ 4) ఎ, బి, సి, డి, ఇ
20. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ (2026 ఫిబ్రవరి)కి భారత్ ర్యాంకు ఎంత?
    1) 78వ 2) 75వ 3) 79వ 4) 80వ

నోట్: 1) హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ (2026, జనవరి)లో భారత ర్యాంకు 80 (55 వీసా రహిత దేశాలు).

2) 2026, ఫిబ్రవరిలో భారత్ ర్యాంకు 75 (56 వీసా రహిత దేశాలు).

21. కింది వాటిలో సరైంది?



    ఎ) ఆసియా రైఫిల్/పిస్టల్ ఛాంపియన్‌షిప్-2026, ఫిబ్రవరి 2-14 న్యూదిల్లీలో జరిగింది.
    బి) 51 స్వర్ణాలు, 23 రజతాలు, 20 కాంస్యాలు మొత్తం 94 పతకాలతో ఇండియా మొదటి స్థానంలో నిలిచింది.
    సి) 3 స్వర్ణాలు, 16 రజతాలు, 7 కాంస్యాలు మొత్తం 26 పతకాలతో కజకిస్థాన్ రెండో స్థానంలో నిలిచింది.
    డి) 3 స్వర్ణాలు, ఒక రజతం, మొత్తం 4 పతకాలతో ఉజ్బెకిస్థాన్ మూడో స్థానంలో నిలిచింది.
    ఇ) 20 దేశాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు.
    1) ఎ, బి, సి, డి
    2) ఎ, బి, సి, డి, ఇ
    3) బి, సి, డి 4) ఎ, సి, డి



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-1; 2-2; 3-4; 4-3; 5-4; 6-3; 7-3; 8-4; 9-3; 10-2; 11-1; 12-2; 13-1; 14-2; 15-3; 16-1; 17-4; 18-1; 19-4; 20-2; 21-2.

అభివృద్ధి, పర్యావరణ సమస్యలు: భూ వనరుల వినియోగం



భూ ఉపరితలంపై ఉండే నేల, నీరు, ఖనిజాలు, అడవులు లాంటి ప్రకృతిసిద్ధ భాగాలను భూవనరులు అంటారు. ఇవి వ్యవసాయం, నివాసం, పరిశ్రమలకు అత్యంత అవసరం. పరిమితమైన పునరుత్పాదక వనరులుగా ఇవి మానవ మనుగడలో కీలకంగా వ్యవహరిస్తాయి. ఈ వనరులు ఆహార ఉత్పత్తి, ఆర్థిక కార్యకలాపాలు, జీవవైవిధ్యానికి మద్దతు ఇస్తాయి. ఇటీవలి కాలంలో జనాభా పెరుగుదల, అధిక మైనింగ్, వ్యవసాయంలో నూతన సాంకేతికత, పట్టణీకరణ లాంటి వాటివల్ల భూ వనరులు క్షీణతకు గురై ఆ ప్రభావం పర్యావరణంపై పడుతోంది. ఇది జీవ కోటికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. భూ వనరుల విధులు, మన దేశంలో భూ వినియోగ తీరు, క్షీణత సమస్యలు, మెరుగుపరచాల్సిన ఆవశ్యకత మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

పరిమాణం పరిమితం.. అతి వినియోగం అనర్థం!

ఆవశ్యకత

ప్రకృతిలో సహజసిద్ధంగా పరిమిత పరిమాణంలో లభించే అన్ని వనరుల సమూహాన్ని భూవనరులు (Land Resources) అంటారు. ఇవి భూమిపై 20% భాగంలో విస్తరించి ఉన్నాయని అంచనా. భూ వనరులు ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవుడి మౌలిక అవసరాలను తీరుస్తాయి. ఉత్పత్తి ప్రక్రియలో భూమి ప్రాథమిక అంశం. రైతులు పంట పండించడానికి ఇదే ఆధారం. వస్తువులను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలను భూమిపైనే నిర్మిస్తారు. ప్రస్తుత ఆధునిక పరిశ్రమల్లో ప్రధాన ఉత్పత్తి కారకంగా విద్యుత్ శక్తిని వినియోగిస్తున్నారు. దీని తయారీకి అవసరమైన బొగ్గు, నీరు లాంటివి నేల నుంచే లభిస్తాయి. భూగోళంపై పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడేందుకు భూ వనరులు కీలకం. దేశ భౌతిక సంపదకు భూమి మూల స్తంభం. ఆర్థికాభివృద్ధి భూ వనరుల నాణ్యతపై ఆధారపడి ఉంటుంది.

విధులు

జీవావరణ వ్యవస్థను కొనసాగించడానికి భూమి అనేక విధులు నిర్వహిస్తుంది. వాటిలో ముఖ్యమైనవాటిని పరిశీలిస్తే..

◆ వ్యక్తులకు, సమాజానికి భూమి సంపదలా ఉపయోగపడుతుంది. ఆహార ధాన్యాలు (food grains), ఇంధనం, జీవపదార్థాల ఉత్పత్తికి భూమి అవసరం. మొక్కలు, జంతువులు, మానవులకు జీవావరణ నివాసాలుగా నేల ఉంటుంది. ◆ వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మనుగడకు భూవనరుల లభ్యతే ఆధారం. వస్తువుల ఉత్పత్తికి ముడి సరకుగా ఉపయోగించే పత్తి, చెరకు, జనపనార లాంటి పంటలు నేల నుంచే లభిస్తాయి. ◆ తయారీ పరిశ్రమల్లో ఉపయోగించే ఖనిజాలు, లోహాలు, ఇతర ముడిపదార్థాలన్నీ భూగర్భం నుంచే వస్తాయి.

◆ పెరుగుతున్న జనాభాకు భూమి అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. రైల్వే, జల, వాయు రవాణాలో భూమి ప్రధాన అంశంగా ఉంటుంది.

భూమి వినియోగతీరు

భూవనరుల లభ్యతపై అనేక పరిమితులు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) అంచనా ప్రకారం, ప్రపంచంలోని మొత్తం భూభాగంలో 66% వ్యవసాయానికి పనికిరాదు. ఎఫ్ఏఓ 2001 నుంచి 2023 కాలంలో ప్రపంచ భూ వినియోగం, నికర మార్పులపై 2025లో ఒక నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం..

వర్గం	భూ వినియోగం (మిలియన్ హెక్టార్లు)	
	2001	2023
1) అటవీ భూమి	4150	4044 (-109)
2) వ్యవసాయ/ సేద్య భూమి	874	799 (-185)
3) ఇతర భూమి	4334	4149 (-75)
4) శాశ్వత పచ్చిక బయళ్లు, పచ్చిక బయళ్లు	3381	3230 (-151)
5) పంట భూమి	1493	1571 (+78)
6) తాత్కాలిక పచ్చిక బయళ్లు/ వ్యవసాయ యోగ్యమైన భూములు	181	138(-43)
7) తాత్కాలిక బీడు భూములు/ సాగు చేయకుండా వదిలేసిన భూమి	202	168 (-40)
8) తాత్కాలిక పంటలు/ వార్షిక/ రుతుపవన పంటలు	976	1081 (+105)
9) శాశ్వత పంటలు	135	191 (+56)

ఆధారం: ఎఫ్ఏఓ విడుదల చేసిన ది స్టేట్ ఆఫ్ ది వరల్డ్స్ ల్యాండ్ అండ్ వాటర్ రిసోర్సెస్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ నివేదిక 2025.

మన దేశంలో..

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

▼ భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ 2025లో దేశంలో భూమి వినియోగ తీరు గణాంకాల స్వరూపం 2023-24 పేరుతో ఒక నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం 2023-24లో దేశంలో నివేదించిన మొత్తం భూ వినియోగ విస్తీర్ణం 3,06,964 వేల హెక్టార్లు. ఇది మొత్తం భౌగోళిక వైశాల్యం 3,28,755 వేల హెక్టార్లలో దాదాపు 93.37%.

▼ నివేదించిన మొత్తం భూ వినియోగం విస్తీర్ణం (Reporting Area for land utilization statistics) 3,06,964 వేల హెక్టార్లలో 2023-24లో దేశంలో 45.28% నికర సేద్య భూమి ఉంది.

▼ అటవీ ప్రాంతం 72,021 వేల హెక్టార్లలో ఉంది. ఇది మొత్తం భూ వినియోగంలో 23.46%. పర్యావరణ సమతౌల్యం, స్థిరత్వంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది.

▼ వ్యవసాయేతర ఉపయోగాల కింద ఉన్న భూమి 28,549 వేల హెక్టార్లు. ఇది మొత్తం భూ వినియోగంలో 9.3%. ఇది పట్టణ స్థావరాల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది.

▼ బంజరు, సాగుచేయలేని భూమి 16,589 వేల హెక్టార్లుగా ఉంది. ఇది మొత్తం భూ వినియోగంలో 5.40%. ఇది వ్యవసాయానికి పనికిరాని భూమిని సూచిస్తుంది.

▼ శాశ్వత పచ్చిక బయళ్లు, మేతభూములు 10,210 వేల హెక్టార్లలో (3.32%) ఉన్నాయి. ఇది పశువుల స్థిరత్వానికి దోహదం చేస్తుంది.

▼ ఇతర చెట్ల పంటల కింద ఉన్న భూమి 2,948 వేల హెక్టార్లు (0.96%).

▼ నీటి వసతి కల్పిస్తే సాగులోకి వచ్చే బంజరు భూమి 11,586 వేల హెక్టార్లు (3.77%). ఇది భూ పునరుద్ధరణ, వ్యవసాయ అభివృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తుంది.

భూ వనరుల క్షీణత సమస్య

❖ మానవకారక చర్యల వల్ల భూమిపై జీవ భౌతిక పర్యావరణ విలువలకు భంగం వాటిల్లడాన్ని భూ క్షయీకరణ అంటారు.

❖ సహజంగా జరిగే ప్రకృతి వైపరీత్యాలు కాకుండా, మానవ కార్యకలాపాల కారణంగానే ఇటీవలి కాలంలో వరదలు, అగ్నిప్రమాదాల లాంటి ఉత్పాతాలు సంభవిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం ప్రపంచంలోని మొత్తం వ్యవసాయ భూమిలో 40% భూమి క్షయీకరణకు గురైంది.

❖ ఆహారం, మేత, ఇంధనం, ఫైబర్ పంటలు ఈ నాలుగు ప్రధాన ప్రయోజనాల కోసమే భూమి వినియోగానికి పోటీ ఏర్పడుతోంది. మానవులకు నేరుగా ఆహారం ఇవ్వడం; పశువుల పోషణకు మేత అందించడం; బయోఎనర్జీ/ ఇంధన అవసరాలు; పారిశ్రామిక అవసరాలకు పత్తి, జనపనార పంటలు పండించడం లాంటి అవసరాలు నేల ద్వారానే తీరతాయి. వీటికి డిమాండ్ పెరిగే కొద్దీ భూమి ఒత్తిడికి తద్వారా క్రమక్షయానికి గురవుతుంది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - భూవనరులు మెరుగుపరచడం

ప్రపంచస్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డీజీ) సాధించడంలో Circular Agriculture (వృత్తాకార వ్యవసాయం) ముఖ్య భూమిక పోషిస్తుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. పునరుత్పత్తి, వ్యర్థాలు లేని వ్యవసాయ నమూనాను ఇది సూచిస్తుంది. ఇది నేలలోని పోషకాలు, నీరు, జీవపదార్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా రసాయనాలు, కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గిస్తుంది. ఇది నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరిస్తుంది. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక స్థితిస్థాపకతను పెంచుతుంది.


రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

933 Word of the Day

Inimical

Telugu meaning: హానికర, ప్రతికూల

English meaning: The word 'inimical' (ఇనిమికల్) is an adjective that describes something harmful, hostile, or unfriendly.

Synonyms: Hostile, Harmful

Antonyms: Friendly, Beneficial

Usage: **1.** Excessive stress is inimical to both mental health and physical well-being if not managed properly.

2. His inimical attitude toward colleagues prevented him from building healthy professional relationships.

Current Affairs



Senior bureaucrat Nidhi Chibber was given additional charge of Niti Aayog's Chief Executive Officer (CEO) on 24 February 2026. She is the 1994 batch Indian Administrative Service officer of the Chhattisgarh cadre.

☛ Incumbent CEO B V R Subrahmanyam completed his tenure on February 24.



The Troops of the Indian Army's Southern Command conducted Exercise Agni Varsha at the Pokhran Field Firing Range in Rajasthan on 24 February 2026. The exercise focused on coordinated employment of combined arms, precision long-range fires and network-enabled command and control in a realistic battlefield setting.



The Union Cabinet approved a proposal to alter the name of the State of Kerala to "Keralam" on 24 February 2026. The decision was taken at a meeting chaired by Prime Minister Narendra Modi. Following the Cabinet's approval, the President of India will refer the proposed legislation – the Kerala (Alteration of Name) Bill, 2026 – to the Kerala Legislative Assembly for its views, as mandated under Article 3 of the Constitution.



Ministry of Home Affairs unveiled the country's new national counter-terrorism policy and strategy titled PRAHAAR on 23 February 2026. The strategy outlines a comprehensive framework to address evolving terror threats using a proactive approach to prevent and counter terrorist threats.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు

భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.

రాష్ట్ర ఆర్థిక సంఘం

73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి ప్రతి రాష్ట్రంలో 243 (i) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. కేంద్ర ఆర్థిక సంఘాన్ని 280వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ సంఘంలో ఒక ఛైర్మన్, నిర్దేశించిన సంఖ్యలో సభ్యులు ఉంటారు.

◆ ఛైర్మన్, సభ్యులుగా నియమితులు కావాలంటే ఆర్థిక విషయాల్లో నిష్ణాతులై ఉండాలి. పరిశోధన, బోధనా రంగాల్లో అనుభవం ఉన్నవారిని గవర్నర్ నియమిస్తారు.

సహకార వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సహకార సంఘాన్ని 1918లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో స్థాపించారు. ఇది స్వయంప్రతిపత్తి కలిగిన సంఘం.

◆ ఏటా నవంబరు 14 - 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తారు.



నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈ-ప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

బ్రిటిష్ కాలంలో రైతు తిరుగుబాట్లు

స్టడీ జోన్

భారతదేశానికి వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు ఇక్కడి రాజకీయ అనైక్యతను ఆసరాగా చేసుకుని దేశాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రజలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, మతపరంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. వీరి హయాంలో గ్రామీణ భారతదేశం తీవ్ర ప్రభావానికి గురైంది. వ్యవసాయ రంగంలో కొత్తగా భూమి శిస్తు విధానాలు అమలు చేశారు. వాణిజ్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం, అధిక వడ్డీరేట్లు లాంటివి రైతులను కుంగదీశాయి. వారు జమీందార్లు, వడ్డీ వ్యాపారుల చేతుల్లో అణచివేతకు, దోపిడీకి గురయ్యారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా రైతులు తిరుగుబాట్లు చేశారు. ఇవి దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో జరిగాయి. పోటీపరీక్షల కోణంలో ఈ ఉద్యమాలకు సంబంధించిన ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!



సన్యాసి తిరుగుబాటు

ఇది 18వ శతాబ్దం చివర్లో బెంగాల్‌లో జరిగిన ముఖ్యమైన తిరుగుబాటు. ముర్షిదాబాద్, వైకుంఠపుర్ అడవుల్లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభమైంది. అక్కడి సన్యాసులు, సాధువులు పాల్గొన్నారు.

కారణాలు: హిందూ, ముస్లింల పవిత్ర స్థలాలను సందర్శించే యాత్రికులపై 1770, ఏప్రిల్‌లో బ్రిటిష్ వారు ఆంక్షలు విధించడం.

☛ 1770లో బెంగాల్‌లో విపరీతమైన కరవు సమయంలోనూ ఆంగ్లేయులు ప్రజల నుంచి పన్ను వసూలు చేయడం.

నాయకత్వం వహించింది:

☛ జల్పాయిగురి (ప్రస్తుత పశ్చిమ్ బంగా)కి చెందిన పండిట్ భవానీ చరణ్ పాఠక్.

పాగల్ పంథీ తిరుగుబాటు

☛ ఇది 1825-35 కాలంలో సాగింది. పాగల్ పంథీ అనేది ఒక మతపరమైన సంస్థ. దీన్ని 19వ శతాబ్దంలో బెంగాల్ ప్రావిన్స్‌లోని ఉత్తర మెమన్సింగ్, షేర్పూర్ ప్రాంతాల్లో కరీం షా ఏర్పాటు చేశాడు. ఇతడి మరణం తర్వాత కొడుకైన టిప్పు షా పాగల్ పంథీ బాధ్యతలు స్వీకరించాడు.

తిరుగుబాటుకు కారణం:

☛ జమీందార్లు ఎక్కువ మొత్తంలో రైతుల నుంచి పన్నులు వసూలు చేయడం. సుంకం కట్టని వారి ఆస్తులు జప్తు చేయడం.

రంగాపూర్, పబ్నా తిరుగుబాట్లు, ఖేదా సత్యాగ్రహం, మోప్లా తిరుగుబాట్లతోపాటు గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Nursing Officer Posts

All India Institute of Medical Sciences (AIIMS), New Delhi, invites online applications for the Nursing Officer Recruitment Common Eligibility Test (NORCET) - 10 for the recruitment of Nursing Officer posts for AIIMS New Delhi and other AIIMS. The total number of posts is 2551. The application fee is Rs.3000. Eligible candidates can apply online before 16 March 2026.

Assistant Manager Jobs

Bokaro Power Supply Company Limited (BPSCL) is inviting applications for the filling of the Assistant Manager posts on a regular basis. The total number of posts is 15. The last date for online applications is 5 March 2026.

Posts in NIRDPR

National Institute of Rural Development and Panchayati Raj (NIRDPR), Rajendranagar, Hyderabad, invites applications for the following posts on a contractual basis. The total number of posts is 9. Eligible candidates can apply online before 8 March 2026.

Did You Apply..?

Today (February 26) is the last date for the following Jobs

☛ 419 Manager jobs at Bank of Baroda. **Eligibility:** Degree.

☛ 48 Engineering Professionals posts at RITES Limited. **Eligibility:** B.Tech.Degree.

For more information and other notifications - scan QR code

Number, Ranking & Time Sequence Test

1. How many 5's are there in the following sequence which are immediately followed by 3 but not immediately preceded by 7?
8 9 5 3 2 5 3 8 5 5 6 8 7 3 3 5 7 7 5 3 6 5 3 3 5 7 3 8
A) One B) Two C) Three
D) Four E) More 'than four

2. How many even numbers are there in the following sequence of numbers which are immediately followed by an odd number as well as immediately preceded by an even number?
8 6 7 6 8 9 3 2 7 5 3 4 2 2 3 5 5 2 2 8 1 1 9
A) One B) Three C) Five
D) Six E) None of these

3. In the series, 6 4 1 2 2 8 7 4 2 1 5 3 8 6 2 1 7 1 4 1 3 2 8 6 how many pairs of successive numbers have a difference of 2 each?
A) 4 B) 5 C) 6
D) 7 E)10

4. How many 8's are there in the following number series which are exactly divisible by its immediately preceding and also divisible by immediately succeeding numbers?
8 2 4 5 1 7 2 8 4 8 4 2 2 8 2 6 9 8 4 5 4 8 3 2 8 4 3 1 8 3
A) 1 B) 2 C) 3
D) 4 E) None of these

5. Which is the third number to the left of the number which is exactly in the middle of the following sequence of numbers?
1 2 3 4 5 6 7 8 9 2 4 6 8 9 7 5 3 1 9 8 7 6 5 4 3 2 1
A) 3 B) 4 C) 5
D) 6 E) 7

6. How many 3's are there in the following sequence which are neither preceded by 6 nor immediately followed by 9?
9 3 6 6 3 9 5 9 3 7 8 9 1 6 3 9 6 3 9
A) One B) Two C) Three
D) Four E) None of these

7. Count each 7 which is not immediately preceded by 5 but is immediately followed by either 2 or 3. How many such 7's are there?
A) 2 B) 3 C) 4
D) 5 E) 7

8. How many 6's are there in the following series of numbers which are preceded by 7 but not immediately followed by 9?
6 7 9 5 6 9 7 6 8 7 6 7 8 6 9 4 6 7 7 6 9 5 7 6 3
A) One B) Two C) Three
D) Four E) Six

Bank Exams

Reasoning

9. How many 7's are there in the following series which are not immediately followed by 3 but immediately preceded by 8?
8 9 8 7 6 2 2 6 3 2 6 9 7 3 2 8 7 2 7 7 8 7 3 7 7 9 4
A) 10 B) 3 C) 2
D) 0 E) None of these

10. Count each 1 in the following sequence of numbers that is immediately followed by 2, if 2 is not immediately followed by 3. How many such 1's are there?
1 2 1 3 4 5 1 2 3 5 2 1 2 6 1 4 5 1 1 2 4 1 2 3 2 1 7 5 2 1 2 5
A) 2 B) 4 C) 5
D) 7 E) 9

11. Rahul ranked ninth from the top and thirty eighth from the bottom in a class. How many students are there in the class?
A) 45 B) 46 C) 47
D) 48 E) 60

12. In a row of 21 girls, when Monika was shifted by four places towards the right, she became 12th from the left end. What was her earlier position from the right end of the row?
A) 9th B) 10th C) 11th
D)12th E) 14th

13. In a row of boys, Deepak is seventh from the left and Madhu is twelfth from the right. If they interchange their positions, Deepak becomes twenty-second from the left. How many boys are there in the row?
A) 19 B) 31 C) 33
D) Cannot be determined
E) None of these

14. In a row of trees, one tree is fifth from either end of the row. How many trees are there in the row?
A) 8 B) 9 C) 10
D) 11 E) 15

15. Sanjeev ranks seventh from the top and twenty eighth from the bottom in a class. How many students are there in the class?
A) 37 B) 36
C) 35 D) 34
E) 39

Scan the QR code for Key

These model questions were prepared by ***Rajesh Madhu, Asst. Prof. of Mathematics.***

చిన్నారి పేరుతో ట్రంప్ కొత్త బిల్లు

న్యూయార్క్: అక్రమ చొరబాటుదారులకు వాణిజ్య డ్రైవింగ్ లైసెన్సులను ఏ రాష్ట్రమూ మంజూరు చేయకుండా నిరోధించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త బిల్లును ప్రతిపాదించారు. దీనికి 2024లో ఓ భారత ట్రక్కు డ్రైవర్ జరిపిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి 'డలీలా కోల్‌మన్' పేరు పెట్టారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించే వారికి డ్రైవింగ్ లైసెన్సు అందకుండా డలీలా బిల్లు నిరోధిస్తుందని 'ఉభయ సభల సంయుక్త సమావేశం'లో ట్రంప్ పేర్కొన్నారు. దీనిని వెంటనే కాంగ్రెస్ ఆమోదించాలని కోరారు. అక్రమ వలసదారులకు ఆంగ్లంలో మాట్లాడటం రాదని, కనీసం రోడ్డుపై ఉండే సంకేతాలను చదవలేరని వ్యాఖ్యానించారు. ఓ అక్రమ వలసదారుడు జరిపిన ప్రమాదంలో కోల్‌మన్ తీవ్రంగా గాయపడిందని, ఆమె ఎప్పటికీ నడవలేదని, మాట్లాడలేదని వైద్యులు తెలిపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ చిన్నారి నడవటం నేర్చుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. 'ఆమె ఇప్పుడు మనవద్దే ఉంది. తన తండ్రితోపాటు ఇక్కడకు వచ్చిందంటూ కోల్‌మన్, ఆమె తండ్రిని అందరికీ పరిచయం చేశారు. ట్రక్కు డ్రైవర్ పేరు ట్రంప్ చెప్పనప్పటికీ.. 2024లో జరిగిన బహుళ వాహనాల ప్రమాదంలో ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి అరెస్టయ్యాడు.

కేఎస్‌యూ విద్యార్థుల ఆందోళనలో కేరళ ఆరోగ్య మంత్రికి గాయాలు

కన్నూర్/తిరువనంతపురం: కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కేఎస్‌యూ) నిర్వహించిన ఆందోళనలో కేరళ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జి బుధవారం గాయాలపాలయ్యారు. వందే భారత్ రైలు ఎక్కడానికి కన్నూర్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఆమెను కేఎస్‌యూ కార్యకర్తలు నల్లజెండాలతో అడ్డగించడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో మంత్రి మెడకు, చేతికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఆసుపత్రిలో మంత్రి చికిత్స పొందుతున్నారు. సీఎం పినరయి విజయన్ ఆమెను పరామర్శించారు. ఈ దాడిని ఖండించారు. "కన్నూర్ రైల్వే స్టేషన్‌లో వీణా జార్జిపై కేఎస్‌యూ చేసిన దాడి.. కాంగ్రెస్ ముసుగు రాజకీయాలకు నిదర్శనం" అని పేర్కొన్నారు.

ఒకరిని కిడ్నాప్ చేయబోయి.. వేరొకరిని ఎత్తుకెళ్లి..

- అమెరికాలో సిక్కు వ్యక్తి హత్యలో అనూహ్య మలుపు

న్యూయార్క్: అమెరికాలో అవతార్ సింగ్ అనే 57 ఏళ్ల సిక్కు వ్యక్తి అపహరణ, హత్య కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఈ ఘటనలో కిడ్నాపర్లు వేరొకరిని అపహరించబోయి, పొరపాటున అవతార్ సింగ్‌ను కిడ్నాప్ చేసి, హత్య చేసినట్లు అధికారులు తెలిపారు. స్థానిక గురుద్వారాలో 23 ఏళ్లుగా వంటమనిషిగా పని చేస్తున్న అవతార్ ఈ నెల 17 రాత్రి అదృశ్యమయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళుతున్న సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో నాపా కౌంటీలోని ఓ సరస్సు సమీపంలో 20న ఆయన మృతదేహం లభ్యమయింది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

బ్రెజిల్ వరదల్లో 40 మంది మృతి

జుయిజ్ డె ఫోరా: బ్రెజిల్‌లోని మినాస్ గెరాయిస్ రాష్ట్రంలో కురిసిన కుండపోత వర్షాలకు వచ్చిన వరదల్లో మృతుల సంఖ్య బుధవారానికి 40కు చేరింది. దాదాపు మూడువేల మంది తమ నివాసాలు కోల్పోయారు. పలువురు గల్లంతయ్యారు. జుయిజ్ డె ఫోరా, ఉబా పట్టణాల్లో ప్రకృతి వైపరీత్యం తీవ్రంగా ప్రభావం చూపింది. పునరావాస చర్యలు ప్రారంభించామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అయోమయంగానే ఉందని స్థానికులు తెలిపారు. వరద బాధితులు పాఠశాలలు, చర్చిల్లో తల దాచుకుంటున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. భద్రతా దళాలు సహాయ, పునరావాస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయని బ్రెజిల్ అధ్యక్షుడు లుయిజ్ ఇనాసియో లులా డసిల్వా తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రకృతి వైపరీత్యానికి కారణం మానవ చర్యల పర్యవసానంగా జరుగుతున్న వాతావరణ మార్పులేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు 5.6 లక్షల జనాభా కలిగిన జుయిజ్ డె ఫోరా పట్టణం పూర్తిగా బురదమయమైంది. ఉబా పట్టణంలో జనజీవనం స్తంభించింది.

చంపయీ సోరెన్ మనవడి అకాల మరణం

రాంచీ: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, భాజపా నేత చంపయీ సోరెన్ కుటుంబంలో విషాదం నెలకొంది. చంపయీ సోరెన్ మనవడు వీర్ సోరెన్(19)



హిమాచల్‌ప్రదేశ్ మనాలిలోని ఒక హోమ్‌స్టేలో విగతజీవిగా కనిపించారు. ఈ విషయాన్ని చంపయీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. వీర్ సోరెన్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఫిబ్రవరి 22న మనాలి విహారయాత్రకు వెళ్లారు. 24న స్నేహితులు చుట్టుపక్కల ప్రాంతాలను సందర్శించడానికి వెళ్లగా... అతడు మాత్రం హోమ్‌స్టేలోనే ఉండిపోయారు. మధ్యాహ్నం స్నేహితులు తిరిగొచ్చే సరికి తీవ్ర తలనొప్పితో బాధపడుతున్న వీర్‌కు. . వారు మందులను అందించారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా వీర్ నిద్రపోతున్న గదిలోంచి పెద్ద శబ్దం వినిపించింది. వెంటనే స్నేహితులు అక్కడికి వెళ్లి చూడగా...వీర్ మంచంపై నుంచి నేలపై పడి..అపస్మారక స్థితిలో ఉన్నాడు. అప్పటికే అతడి నోట్లో నుంచి నురుగు వస్తుండటంతో అప్రమత్తమైన స్నేహితులు... వీర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీర్‌కు సీపీఆర్ చేసినా...ఫలితం లేకపోయింది. వీర్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఎత్తైన ప్రదేశంలో కలిగే అనారోగ్యం కారణంగా వీర్ మరణించి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత అతడి మరణానికి గల కచ్చితమైన కారణం తెలుస్తుందని పోలీసులు తెలిపారు. వీర్ సోరెన్ ఆకస్మిక మృతిపై ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సంతాపం తెలిపారు.

మోదీ పర్యటనపై ఇజ్రాయెల్ మీడియాలో పతాక కథనాలు



టెల్ అవీవ్‌లో ప్రధాని మోదీకి స్వాగతం పలకుతున్న ప్రవాస భారతీయులు

ఇంటర్నెట్ డెస్క్, దిల్లీ: ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై ఆ దేశ మీడియాలో చాలా ఆసక్తి కనిపిస్తోంది. ఇజ్రాయెల్ ప్రముఖ మీడియా సంస్థ 'ది జెరూసలేం పోస్ట్' మొదటి పేజీలో ప్రచురించిన కథనమే ఇందుకు నిదర్శనం. 'నమస్తే' అని హిందీ భాషలో.. 'షాలోమ్' అని హిబ్రూ భాషలో ప్రధాన శీర్షిక పెట్టి ఆ సంస్థ వార్త అందించింది. ఇజ్రాయెల్ అధికారిక భాష హిబ్రూ. ఆ భాషలో 'షాలోమ్' అంటే 'శాంతి' అని అర్థం. ఎవరినైనా పలకరించడానికి కూడా ఆ పదాన్నే వాడతారు. ఆ పేపర్ ఎడిటర్ ఇన్ చీఫ్ జ్వికా క్లీన్.. బుధవారం ఎడిషన్ ఫ్రంట్ పేజీను 'ఎక్స్'లో పోస్టు చేశారు. మోదీ అభివాదం చేస్తున్న ఫొటోను ఆ కథనంలో వాడారు. దిల్లీ-టెల్‌అవీవ్ సంబంధాలకు సంబంధించిన వార్తలనూ జ్వికా షేర్ చేశారు. మోదీ పర్యటన చరిత్రాత్మకమంటూ పలు ఇజ్రాయెల్ మీడియా సంస్థలు ప్రశంసించాయి. ఆయన పర్యటన గురించి పతాక కథనాలను ప్రచురించాయి.

మోదీది నైతిక పిరికితనం: కాంగ్రెస్

ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును ప్రపంచమంతా విమర్శిస్తున్నవేళ.. మోదీ మాత్రం నైతిక పిరికితనం ప్రదర్శిస్తూ ఆయన్ను ఆలింగనం చేసుకుంటున్నారని మండిపడింది. గాజాను నెతన్యాహు శిథిల భూమిగా మార్చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం పేర్కొన్నారు. గాజా మారణహోమాన్ని ఇజ్రాయెల్ పార్లమెంటులో మోదీ లేవనెత్తాలని, పాలస్తీనియులకు న్యాయం కోసం డిమాండ్ చేస్తారని ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ వాద్రా 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌తో 2014 తర్వాత మోదీ ప్రభుత్వం బంధం ఏర్పరుచుకోవడానికి ఎప్‌స్టీన్ పునాది వేశారని కాంగ్రెస్ ఆరోపించింది. "గతంలో ఇజ్రాయెల్, పాలస్తీనాల విషయంలో రెండు దేశాల విధానానికి భారత్ కట్టుబడి ఉండేదని, కానీ 'అమెరికా-ఇజ్రాయెల్' లాబీ దానిని మార్చేసిందని ఆ పార్టీ మీడియా విభాగం అధిపతి పవన్ ఖేడా విమర్శించారు. 'సామాన్య ప్రజలకు ఎప్‌స్టీన్ కరడుగట్టిన నేరస్థుడు. కానీ మోదీ ప్రభుత్వానికి విదేశీ విధానంలో హీరోలాంటివాడు. మరణించాకా మోదీలో అతడు జీవించే ఉన్నాడు' అని తీవ్రంగా ధ్వజమెత్తారు. 'జెఫ్రీనే బనా ది జోడీ' అని బుధవారం మీడియా సమావేశంలో ఖేడా వ్యాఖ్యానించారు. 'తన చిన్నతనంలో రోబోను తయారు చేశానని మోదీ ఇటీవల చెప్పారు. దానికి తనకు పతకం వచ్చిందని కూడా వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, ఎప్‌స్టీన్ అదే విషయాన్ని చెబుతున్నారు. తాము మోదీ అనే రోబోను తయారు చేశామని, ఆయనే భారత ప్రధాని అని అంటున్నారు' అని ఎద్దేవా చేశారు.

ప్రియాంక 'మహిళా గజని': భాజపా

గాజా మారణహోమాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై ప్రియాంకాగాంధీ వాద్రా చేసిన వ్యాఖ్యలను భాజపా తిప్పికొట్టింది. ఆమెను 'మహిళా గజని'గా అభివర్ణించింది. గాజాలో మానవతా సంక్షోభంపై మాత్రమే ప్రియాంక దృష్టి పెడుతున్నారని.. ఇజ్రాయెల్‌లో 'అక్టోబరు 7' దాడులను మాత్రం మర్చిపోతున్నారని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.

సవాలు విసిరాను.. మోదీ జారుకున్నారు

- ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటనపై రాహుల్ వ్యాఖ్య



దిల్లీ: అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలంటూ సవాలు విసిరి 24 గంటలు గడిచాయని, ఇంతలోనే ప్రధాని మోదీ మెల్లగా ఇజ్రాయెల్‌కు జారుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఎప్‌స్టీన్ సలహా మేరకు మీరు కనీసం ఒకసారి ఇజ్రాయెల్‌లో నృత్య గానాలు చేశారు. ఈసారి ఎవరి ఆదేశాల మేరకు దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఒప్పందాలు కుదుర్చుకోబోతున్నారు' అంటూ ప్రధాని మోదీని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ బుధవారం సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టారు. 'ఒత్తిడికి తలొగ్గి అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ధైర్యం ఉంటే భారత రైతాంగానికి వ్యతిరేకమైన ఆ ఒప్పందాన్ని రద్దు చేయాల'ని మంగళవారం నాడు భోపాల్‌లో రాహుల్ గాంధీ సవాల్ విసిరారు.

దిల్లీలో దక్షిణాసియా టూరిజం ఎగ్జిబిషన్.. ప్రత్యేక ఆకర్షణగా రామోజీ ఫిల్మ్‌సిటీ స్టాల్



ఈటీవీ భారత్: దక్షిణాసియా ట్రావెల్ అండ్ టూరిజం ఎక్స్ఛేంజ్ (ఎస్ఏటీటీఈ- 2026) 33వ ఎగ్జిబిషన్ దిల్లీలోని యశోభూమిలో బుధవారం ప్రారంభమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ స్టూడియోగా గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన స్టాల్ ఇక్కడ ప్రత్యేకాకర్షణగా నిలుస్తోంది. ఈ నెల 27 వరకు జరగనున్న ఈ ఎగ్జిబిషన్ వేదికగా రామోజీ ఫిల్మ్‌సిటీలోని మౌలిక సదుపాయాలు, ఈవెంట్స్ నిర్వహణకు అవసరమైన ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అద్భుతమైన స్టూడియో అనుభవాలను ప్రదర్శించనున్నారు. వినోదం, పర్యాటకం, సృజనాత్మకతలతో అన్ని వయసుల వారిని అలరించే అద్భుత ప్రపంచం రామోజీ ఫిల్మ్‌సిటీ అని చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రుచి పంత్ అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీని సమగ్ర టూరిజం, ఫిల్మ్ ప్రొడక్షన్, ఈవెంట్స్ హబ్‌గా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ ఏడాది ఏప్రిల్ 23 నుంచి ప్రారంభం కానున్న గ్రాండ్ హాలిడే కార్నివాల్‌కు టూరిస్టులు, ఈవెంట్ ప్లానర్లు, సినిమా ప్రియులను ఆహ్వానిస్తున్నట్లు రుచి పంత్ తెలిపారు.

ఆసుపత్రి నుంచి శరద్ పవార్ డిశ్చార్జి

పుణె: డీహైడ్రేషన్ కారణంగా మూడు రోజుల క్రితం పుణెలోని రుబీ హాల్ ఆసుపత్రిలో చేరిన ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్(85) బుధవారం ఉదయం డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మరో రెండ్రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ఆయన దగ్గు, గొంతు ఇన్ఫెక్షన్‌తో ఇదే ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన విషయం తెలిసిందే.

ప్రియుడితో విడిపోవడమే ఆత్మహత్యకు కారణమని చెప్పలేం

- దిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: ప్రియుడితో బంధం ముగిసినంత మాత్రాన ప్రేయసి ఆత్మహత్యకు అదే కారణమని తీర్మానించలేమంటూ దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. నిందితుడిగా ఉన్న యువతి ప్రియుడికి బెయిలు మంజూరు చేసింది. ప్రియుడు తనను విడిచి మరో యువతిని పెళ్లాడిన అయిదు రోజులకే ప్రేయసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియుడు ఆమెను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించాడా లేక అతడు తనకు దూరమయ్యాడనే ఆవేదనతో ప్రేయసే ఆత్మహత్య చేసుకుందా అనేది విచారణలోనే తేలుతుందని న్యాయమూర్తి మనోజ్ జైన్ పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో ప్రేయసి మరణ వాంగ్మూలమూ ఇవ్వలేదు, ఎనిమిదేళ్ల సహజీవనంలో ఆమె ఎన్నడూ ప్రియుడిపై ఎలాంటి ఫిర్యాదూ చేయలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కాగా, ప్రియుడు వేరే మతానికి చెందినవాడనీ, తన కుమార్తెను మతం మారితేనే పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి చేయడంతో ఆమె నిరుడు అక్టోబరులో ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి ఆరోపించారు. నిందితుడిని గత నవంబరులో అరెస్టు చేశారు. కాగా ప్రేయసీప్రియుల మధ్య మత మార్పిడి ప్రస్తావనే ఎన్నడూ రాలేదని మృతురాలి స్నేహితులు చెప్పారు. తాము భిన్న మతాలకు చెందిన వారు కావడంతో ఆమె తల్లిదండ్రులు తమ పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియుడు కోర్టుకు విన్నవించారు. తనతో తెగతెంపులు చేసుకోవాలని వారే ఆమెను ఒత్తిడి చేశారని ఆరోపించాడు. కోర్టు అతడికి రూ. 25,000 వ్యక్తిగత బాండు, అంతే మొత్తానికి ష్యూరిటీ బాండు కట్టే షరతుపై బెయిలు ఇచ్చింది.

డీజీసీఏదీ తప్పే: రోహిత్ పవార్

ముంబయి: మహారాష్ట్రలోని బారామతి వద్ద గత నెల 28న జరిగిన విమాన దుర్ఘటనలో మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ సహా అయిదుగురి దుర్మరణానికి 'పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్' (డీజీసీఏ) తప్పిదం కూడా కారణమని ఎన్సీపీ (ఎస్పీ) శాసనసభ్యుడు రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ విమానాన్ని నడిపిన వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థకు క్లీన్‌చిట్ ఇచ్చేందుకు తొలుత ఈ సంస్థ ప్రయత్నించి, తర్వాత మాత్రం అది నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిందని అంగీకరించినట్లు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. "సీఎం అయ్యే అవకాశాలున్న నేతను కోల్పోయాం. 2025 ఫిబ్రవరిలో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి ప్రధాన లోపాలూ బయటపడలేదని జనవరి 28న మధ్యాహ్నం 1.36 గంటలకు డీజీసీఏ ప్రకటించింది. విమాన సామర్థ్యాన్ని ధ్రువీకరించింది ఎవరు? నిర్వహణను చూసేదెవరు? గగనతల భద్రతకు బాధ్యులెవరు? మొత్తం బాధ్యత డీజీసీయేదే. వీఎస్ఆర్‌ది తప్పయితే డీజీసీఏదీ తప్పే. భద్రతపరమైన లోపాలేవీ లేవని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అదేరోజు ప్రకటించారు. భద్రత లోపాలు కనిపించడంతో వీఎస్ఆర్ వెంచర్స్‌కు చెందిన నాలుగు విమానాలు గాలిలో ఎగరడానికి వీల్లేదని డీజీసీఏ తాజాగా ఆదేశించడం నా పాక్షిక విజయం" అని రోహిత్ చెప్పారు. రామ్మోహన్‌నాయుడి రాజీనామాకు తాను ఒత్తిడి చేస్తుంటానని చెప్పారు.

పోలీసులకు ఫిర్యాదు

విమాన ప్రమాద ఘటనకు సంబంధించిన వీఎస్ఆర్ వెంచర్స్‌పై, దాని డైరెక్టర్లపై రోహిత్ పవార్ ముంబయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదంపై పుణె జిల్లాలో కేసు నమోదు కావడంతో ఈ ఫిర్యాదును కూడా అక్కడి సీఐడీకి పంపించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కుమారుడు పుట్టలేదని.. భార్య, ముగ్గురు కుమార్తెల దారుణ హత్య

దిల్లీ: కుమారుడు కలగలేదన్న దుగ్ధతో ఒక వ్యక్తి గర్భవతి అయిన తన భార్యను, ముగ్గురు కుమార్తెలను గొంతుకోసి హతమార్చిన సంఘటన బుధవారం జాతీయ రాజధానిలోని ప్రేమ్‌చంద్ పార్క్ ప్రాంతంలో చోటుచేసుకుంది. 27 సంవత్సరాల అనిత, మూడు, నాలుగు, ఐదు సంవత్సరాల వయసు కలిగిన ఆమె కుమార్తెలు వారి ఇంట్లోనే రక్తపు మడుగులో పడి ఉన్న విషయాన్ని ఇరుగుపొరుగు ఉదయం గుర్తించారని పోలీసులు తెలిపారు. పదునైన ఆయుధంతో గొంతు కోసిన కారణంగా నలుగురూ మృతి చెందినట్టు వారు వివరించారు. శ్వాసనాళికలు కోసుకుపోయేంత లోతుగా వారికి గాయమైందని తెలిపారు. తమకు ముగ్గురూ బాలికలే కలగడం, కుమారుడు లేకపోవడం ఈ దారుణ హత్యకు దారితీసి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. నిందితుడు ముంచున్ కేవత్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. హత్యకు గల కారణాలపై వివాహేతర సంబంధంతో సహా అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నట్టు చెప్పారు. కేవత్ తన భార్యాపిల్లలకు మత్తు మందు ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పట్నాకు చెందిన కేవత్ ఆజాద్‌పుర్ మండీలో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగించేవాడని, అతని కుటుంబం గడచిన రెండేళ్లుగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటోందని స్థానికులు తెలిపారు. "హత్యకు కచ్చితమైన కారణమేదీ ఇంకా వెలుగులోకి రాలేదు. అయితే రాత్రి 9 గంటల ప్రాంతంలో భార్యాభర్తలిద్దరూ గొడవపడినట్టు తెలుస్తోంది" అని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వివరించారు.



ఈశాన్య అమెరికాలో కొనసాగుతున్న హిమపాతం

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలో మంచు తుపాను కొనసాగుతోంది. ఈశాన్య అమెరికాలోని కొన్ని ప్రాంతాలను మంచు కప్పేసింది. రికార్డు స్థాయిలో 3 అడుగుల మేర మంచు కురిసింది. రోడ్ ఐల్యాండ్‌లోని ఎయిర్‌పోర్టులో 38 అంగుళాల మేర నిండిపోయింది. హిమపాతం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడి.. విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంచు, బలమైన గాలుల కారణంగా పాఠశాలలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. మంగళవారం నాటికి కొన్ని నగరాల్లో రవాణా సాధారణ స్థితికి వచ్చింది. మసాచుసెట్స్, న్యూజెర్సీ, డెలవేర్, రోడ్ ఐల్యాండ్‌లోని కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. గ్రేట్‌లేక్స్‌లో మరో తుపాను రానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, దీని తీవ్రత ఎక్కువగా ఉండనప్పటికీ.. కొన్ని ప్రాంతాలు ప్రభావితమవుతాయని పేర్కొంది.

పెళ్లి వేడుకలో వధువుపై కాల్పులు

ఈటీవీ భారత్: బిహార్‌లోని బక్సర్ జిల్లా మల్లాహ్ టోలిలో వివాహ వేదికపై ఉన్న నవవధువు ఆర్తి కుమారి (19)పై కాల్పులు జరిగాయి. అనూహ్యమైన ఈ ఘటనతో అతిథులు భయభ్రాంతులై ఇటూ అటూ పరుగులు తీశారు. పూలదండలు మార్చుకునే వేడుకలో అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువతిని వారణాసి ఆసుపత్రికి తరలించారు. బాగా దగ్గర నుంచి కాల్చడంతో ఆర్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. నిందితుడు వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఇతడిని దీన్‌బంధుగా పోలీసులు గుర్తించారు. తాను ప్రేమించిన యువతి మరో వ్యక్తిని పెళ్లాడుతోందన్న కోపంతో అతడు కాల్పులు జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు గతంలో మద్యం కేసులో జైలుకు వెళ్లొచ్చాడు. అతడి కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు బక్సర్ డీఎస్పీ గౌరవ్ పాండే తెలిపారు.



వరుడితో నవవధువు ఆర్తికుమారి.. నిందితుడు దీన్‌బంధు

సురక్షిత రక్తం పొందడం జీవించే హక్కులో భాగమే

- సుప్రీంకోర్టులో పిల్

దిల్లీ: ఎలాంటి వ్యాధికారక క్రిములూ లేని సురక్షితమైన రక్తం పొందే హక్కు రాజ్యాంగంలోని 21వ అధికరణంలో పేర్కొన్న జీవించే హక్కులో అంతర్భాగమేనని ప్రకటించాల్సిందిగా కోరుతూ ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) సుప్రీంకోర్టులో దాఖలైంది. సర్వేశాం మంగళం ఫౌండేషన్ దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆస్పత్రుల్లో రోగులకు ఎక్కించే రక్తంలో హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి వ్యాధులు కలిగించే వైరస్‌లను ముందే గుర్తించే 'న్యూక్లిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్' (నాట్) సదుపాయాన్ని కల్పించేందుకు ఎంత ఖర్చవుతుందని సుప్రీంకోర్టు బుధవారం విచారణ సందర్భంగా ప్రశ్నించింది. పేదలకు ఉపయోగపడేలా ప్రభుత్వాసుపత్రుల్లో కూడా ఆ సదుపాయం ఉందా అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని అడిగింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కక్షిదారులుగా పేర్కొన్నారు. రోగులకు కలుషిత రక్తం ఎక్కించిన కారణంగా సంభవించగల వ్యాధి సంక్రమణలను ముందే పసిగట్టేందుకు వీలు కల్పించే నాట్ పరీక్షల్ని దేశంలోని అన్ని బ్లడ్ బ్యాంకులూ తప్పనిసరిగా నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. దాతల నుంచి సేకరించే రక్తంలో హెచ్ఐవీ, హెపటైటిస్ వైరస్, మలేరియా, సిఫిలిస్ వంటి వ్యాధికారక క్రిములు ఉన్నాయా అన్నది పసిగట్టేందుకు నాట్ పరీక్ష ఉపయోగపడుతుంది. రోగకారక క్రిములతో కూడుకున్న కలుషిత రక్తాన్ని రోగికి ఎక్కించినప్పుడు ఆ రోగికీ వ్యాధి సోకుతుందని, ఈ సమస్య నుంచి కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని పిటిషనర్ పేర్కొన్నారు.



30 ఏళ్ల నాటి ప్రసంగాల్ని ఇప్పుడు ప్రవేశపెడితే ఎలా?

- ఎన్ఐఏను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో బెయిలు కోసం కశ్మీరీ వేర్పాటువాద నాయకుడు షబీర్ అహ్మద్ షా దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అహ్మద్ షా 1990 దశకంలో చేసిన విద్వేషపూరిత ఉపన్యాసాలు, ఆయనను దోషిగా నిలిపే ఈ-మెయిల్‌లు అందుబాటులో ఉన్న నేపథ్యంలో బెయిలు నిరాకరించాల్సిందిగా జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనాన్ని ఎన్ఐఏ తరఫు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా అభ్యర్థించారు. షబీర్ షా విద్వేష ఉపన్యాసాలకు సంబంధించిన వీడియోల గురించి న్యాయవాది ప్రస్తావించినప్పుడు ఆ ఉపన్యాసాల తేదీ ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. కొన్ని వీడియోలకు సంబంధించి విచారణ సంస్థ వద్ద తేదీలు ఉన్నాయని, అవి 1990 దశకానికి చెందినవని లూథ్రా కోర్టుకు విన్నవించారు. "ఈ ఉపన్యాసాలు కొత్తగా వచ్చినవి కావు. నేటికి 30 నుంచి 35 సంవత్సరాల నాటివి. మీరు వాటిని 2019లో స్వాధీనం చేసుకొని ఇదిగో విద్వేష ప్రసంగాలు అంటున్నారు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ప్రసంగాల వీడియోలను షబీర్ షా ఇంట్లో స్వాధీనం చేసుకున్నామని, అతనికి వ్యతిరేకంగా సాక్షులు చేసిన ప్రకటనలు కూడా ఉన్నాయని న్యాయవాది తెలిపారు. ఎన్ఐఏ వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

పర్యావరణ అనుమతులపై తిరిగి సమీక్ష ప్రారంభించిన సుప్రీంకోర్టు

దిల్లీ: పర్యావరణ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిన ప్రాజెక్టు నిర్వాహకుల నుంచి కేంద్ర ప్రభుత్వం, ఇతర ప్రాధికార సంస్థలు భారీ జరిమానాలు వసూలు చేసి చట్టాల వర్తింపు నుంచి మినహాయింపు ఇచ్చిన తేదీ నాటి నుంచీ అమల్లోకి వచ్చేలా అనుమతులు మంజూరు చేయడంపై సుప్రీంకోర్టు బుధవారం తిరిగి విచారణ ప్రారంభించింది. చట్టాలకు మినహాయింపు ఇచ్చిన తేదీ నుంచి అమలులోకి వచ్చేలా పర్యావరణ అనుమతులు మంజూరు చేస్తూ గత సంవత్సరం నవంబరు 18న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అనుమతులు ఇవ్వని పక్షంలో వేల కోట్ల రూపాయలు వృథా అయిపోతాయని నాటి ధర్మాసనం పేర్కొంది. ఈ అనుమతులకు 2:1 నిష్పత్తిలో మెజారిటీ న్యాయమూర్తులు ఆమోదం తెలిపారు. ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు గత సంవత్సరం మే 16న తానే వెలువరించిన ఆదేశాలను ఖండించింది. మే 16 నాటి తీర్పును ఉపసంహరించని పక్షంలో సుమారు రూ.20వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల్ని కూల్చివేయాల్సి వస్తుందని జస్టిస్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ఆనాడు పేర్కొంది. ఈ అంశంపై దాఖలైన సమీక్షా పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీల ధర్మాసనం తాజాగా విచారణ ప్రారంభించింది. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించిన ప్రాజెక్టులకు అనుమతి మంజూరు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న పలువురు న్యాయవాదుల పిటిషన్లపై ఈ విచారణ జరుగుతోంది. పర్యావరణ చట్టాలను ఉల్లంఘించినవారికి 2017లో ఒకసారి మినహాయింపు కల్పించారని, 2018 ఏప్రిల్‌తో ముగిసిపోయిన ఆ మినహాయింపు తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని న్యాయవాది శంకరనారాయణన్ వాదించారు. ముందు పర్యావరణ అనుమతులు తీసుకుని తరువాత ప్రాజెక్టులు నిర్మించాలని అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్, కామన్ కాజ్ కేసుల్లో కోర్టు వెలువరించిన తీర్పులను జస్టిస్ గవాయి ధర్మాసనం పట్టించుకోలేదన్నారు.

బ్రిటన్ ప్రయాణాలకు ఇ-వీసా తప్పనిసరి

- బుధవారం నుంచి అమలులోకి

లండన్: బ్రిటన్ వెళ్లాలనుకునే వారికి బుధవారం నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయి. పర్యాటకులు ఎలక్ట్రానిక్ వీసా (ఇ-వీసా)లను కలిగి ఉండటాన్ని అక్కడి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నిబంధన భారతీయులకు కూడా వర్తిస్తుంది. వీసా అవసరం లేనివారు ఎలక్ట్రానిక్ ప్రయాణ ధ్రువీకరణ (ఇ.టి.ఎ.) పొందాలి. అమెరికా, కెనడా, ఫ్రాన్స్‌లతో సహా 85 దేశాలకు చెందినవారు బ్రిటన్ సందర్శించాలంటే ఇంతకాలం వీసాలు అక్కర్లేదు. కొత్త నిబంధనల ప్రకారం వారు ఇ.టి.ఎ. పొందాలి. దీని కోసం 16 పౌండ్లు చెల్లించాలి. అది రెండేళ్లపాటు కానీ, ప్రయాణికుడి పాస్‌పోర్ట్ గడువు ముగిసిపోయే వరకు కానీ చెల్లుబాటులో ఉంటుంది. డిజిటల్ పత్రాలైన ఇ-వీసాలు, ఇ.టి.ఎ. వల్ల కాగితాలతో పనిలేకుండా పోతుంది. బ్రిటిష్ సరిహద్దు భద్రత, వలస వ్యవహారాలను డిజిటలీకరించే కృషిలో భాగంగానే ఇ-వీసాలు, ఇ.టి.ఎ.లను ప్రవేశపెట్టారు. ఇంతవరకు కోటి ఇ-వీసాలు మంజూరయ్యాయి.

అస్సాంలో నెహ్రూ విగ్రహం ధ్వంసం

- ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపాటు

సిల్చర్: అస్సాంలోని కచర్ జిల్లాలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. బారక్ వ్యాలీ ప్రాంతంలోని లఖిపుర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పొక్లెయిన్ సాయంతో దుండగులు మంగళవారం తెల్లవారుజామున విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యాలు సీసీకెమెరాలో రికార్డయ్యాయి. ఈ ఘటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ భగ్గుమంది. "ఇది కేవలం ఓ విగ్రహానికి కాదు, స్వాతంత్ర్య సమర యోధుడు, ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన మహనీయుడి ఘన వారసత్వానికి జరిగిన అవమానం. ఈ దారుణ ఘటనపై భాజపా ప్రభుత్వం మౌనం వహించడం గర్హనీయం" అని అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగొయ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మేటి కోర్సులకు ఐఎస్ఐ పిలుపు

దేశంలో పేరున్న సంస్థలంటే ఐఐటీలు, ఐఐఎంలే కాదు. ఎంతో ముఖ్యమైనవి మరెన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) ఒకటి. ఈ సంస్థ అందిస్తోన్న.. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఎంతో ప్రాధాన్యమున్నవి. వీటిని కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తేజ్‌పుర్, గిరిడీ కేంద్రాల్లో అందిస్తున్నారు. యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సులూ ఐఎస్ఐ క్యాంపసుల్లో చదువుకోవచ్చు. నాణ్యమైన బోధనతోపాటు ప్రతినెలా స్టైపెండూ అందుకోవచ్చు. మరెందుకు ఆలస్యం.. దరఖాస్తుకు సిద్ధం కండి.



పరీక్షలో ప్రతిభ, ఇంటర్వ్యూలతో కోర్సుల్లోకి తీసుకుంటారు. సిలబస్, మాదిరి ప్రశ్నలు ఐఎస్ఐ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ సంస్థల్లో డిగ్రీ కోర్సుల్లో చేరినవారికి నెలకు రూ.5000, పీజీలకు రూ.8000, ఎంటెక్ కోర్సులకు రూ.12,400 స్టైపెండ్ చెల్లిస్తారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్పు (జేఆర్ఎఫ్)కు ఎంపికైతే నెలకు రూ.37,000+హెచ్ఆర్ఏ, సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్పులకు రూ.42,000+హెచ్ఆర్ఏ అందిస్తారు. అన్ని కోర్సుల విద్యార్థులకూ ఏటా కాంటింజెన్సీ గ్రాంటూ చెల్లిస్తారు. తక్కువ ధరకు వసతి, భోజన సౌకర్యాలూ పొందవచ్చు. కోర్సు చివరలో క్యాంపస్ నియామకాలు ఉంటాయి. ఇక్కడ పీజీ కోర్సులు పూర్తిచేసుకున్నవారు ఆకర్షణీయ వేతనంతో మేటి ఉద్యోగాలు పొందుతున్నారు.

యూజీ కోర్సులు

బీస్టాట్: మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. సీట్లు 63.

బీమ్యాథ్స్: మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేసినవాళ్లు ఈ కోర్సుకు అర్హులు. బెంగళూరు క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నడుపుతున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. సీట్లు 63.

ఒక్కో కోర్సులోనూ విద్యార్థినుల కోసం అదనంగా 16 చొప్పున సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయించారు.

పీజీలో

మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్: స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ చదివుండాలి. ఈ కోర్సు మొదటి సంవత్సరం కోల్‌కతా, చెన్నై, దిల్లీల్లో, ద్వితీయ సంవత్సరం కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తారు. 38 సీట్లు ఉన్నాయి.

మాస్టర్ ఆఫ్ మ్యాథమెటిక్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు. 36 సీట్లు ఉన్నాయి.

ఈ సంస్థలో బీస్టాట్, బీమ్యాథ్స్ చదివినవారు నేరుగా ఎంస్టాట్, ఎంమ్యాథ్స్ కోర్సుల్లో చేరవచ్చు. ఈ సీట్లు అదనం.

ఎంఎస్ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్: ఏదైనా డిగ్రీతో పాటు ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. దిల్లీలో 35, కోల్‌కతాలో 21 సీట్లు ఉన్నాయి.

ఎంఎస్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్సెస్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా డిగ్రీలో చదివుండాలి లేదా ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేయాలి. 20 సీట్లు ఉన్నాయి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్నారు. తొలి రెండు సెమిస్టర్లు బెంగళూరు, మూడో సెమిస్టరు హైదరాబాద్ క్యాంపస్‌లో చదువుతారు.

ఎంఎస్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్: ఏదైనా డిగ్రీతో ఈ కోర్సుకి దరఖాస్తు చేసుకోవచ్చు. బెంగళూరు క్యాంపస్‌లో అందిస్తున్నారు. 12 సీట్లు ఉన్నాయి.

ఎంటెక్ కోర్సులు

కంప్యూటర్ సైన్స్ (సీఎస్): బీఈ/ బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీ ఉన్నవారు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. ఐఎస్ఐ పరీక్షతో 30, గేట్ స్కోర్‌తో 15 మందికి అవకాశం కల్పిస్తారు.

క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ (సీఆర్ఎస్): బీఈ/ బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీతో దరఖాస్తు చేసుకోవచ్చు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. ఐఎస్ఐ పరీక్షతో 20, గేట్ స్కోర్‌తో 5 మందిని చేర్చుకుంటారు.

క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్ రిసెర్చ్(క్యూఆర్ఓఆర్): స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉండాలి. దీంతోపాటు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా మ్యాథ్స్‌లో మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీలో స్టాటిస్టిక్స్ ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా బీఈ/బీటెక్ ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందుబాటులో ఉంది. 32 సీట్లు ఉన్నాయి. ఐఎస్ఐ పరీక్షతో 24, గేట్ స్కోరుతో 8 మందిని తీసుకుంటారు.

బీఎస్ డీఎస్

నాలుగేళ్ల వ్యవధితో బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టికల్ డేటా సైన్స్ (బీఎస్ డీఎస్) కోర్సును ఐఎస్ఐ కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు కేంద్రాల్లో అందిస్తున్నారు. ఒక్కో శాఖలో 25 చొప్పున సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులోకి మాత్రం ఏప్రిల్ 28 నుంచి మే 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందులో ప్రవేశానికి మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్‌లో 75 శాతం మార్కులుండాలి. జేఈఈ మెయిన్ లేదా సీయూఈటీ స్కోరుతో ఈ సీట్లు భర్తీ చేస్తారు.

పీజీ డిప్లొమా

స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్: మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. చెన్నైలో 25, తేజ్‌పుర్‌లో 18 సీట్లు ఉన్నాయి.

పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ మేనేజ్‌మెంట్ విత్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్ (పీజీడీఏఆర్ఎస్ఎంఏ) ఏడాది కోర్సును గిరిడీ (ఝార్ఖండ్) క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. ఏదైనా డిగ్రీతో పాటు ఇంటర్‌లో మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ చదివుండాలి. ఈ కోర్సుకు స్టైపెండ్ లేదు.

ఈ సంస్థ అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా కోర్సు ఆన్‌లైన్‌లో కోర్స్ఎరాతో కలిసి అందిస్తోంది. ఇంటర్‌లో మ్యాథ్స్ చదివి, ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షతో ఎంపికలు ఉంటాయి. 30 సీట్లు ఉన్నాయి.

జేఆర్ఎఫ్..

స్టాటిస్టిక్స్ 11, మ్యాథ్స్ 13, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ 9, కంప్యూటర్ సైన్స్ 17, క్వాలిటీ రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రిసెర్చ్ 3, ఫిజిక్స్ అండ్ అప్లయిడ్ మ్యాథ్స్ 6, జియాలజీ 2, బయలాజికల్ సైన్స్ 3, లైబ్రరీ సైన్స్ 1 చొప్పున జేఆర్ఎఫ్‌లో అవకాశం లభిస్తుంది. కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు, చెన్నై, గిరిడీ క్యాంపస్‌ల్లో ఈ కోర్సులు ఉన్నాయి. దీన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నవారిని ఎస్ఆర్ఎఫ్‌లోకి తీసుకుంటారు. సంబంధిత విభాగాల్లో పీజీ పూర్తిచేసుకున్నవారు జేఆర్ఎఫ్‌కు అర్హులు. ఎన్‌బీహెచ్ఎం/ సీఎస్ఐఆర్/ యూజీసీ నెట్ స్కోరుతో అవకాశం కల్పిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 13 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్ పురుషులకు రూ.1500, జనరల్ మహిళలకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఈడబ్ల్యూఎస్‌లకు రూ.750

పరీక్ష తేదీ: మే 10

వెబ్‌సైట్: https://admission.isical.ac.in/

వర్క్స్ ఇంజినీర్లు

రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న ప్రభుత్వ రంగ సంస్థ ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన వర్క్స్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వర్క్స్ ఇంజినీర్ (సివిల్/ ఎలక్ట్రికల్/ ఎస్ అండ్ టీ): 13

విద్యార్హత: సంబంధిత ఇంజినీరింగ్ విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఫుల్ టైమ్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉండాలి. ఏడాది ఉద్యోగానుభవం కావాలి.

వయసు: 01.02.2026 నాటికి 30 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సడలింపులు వర్తిస్తాయి.

వేతనం: నెలకు రూ.36,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.03.2026.

ఎంపిక: రాత పరీక్ష లేదా ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://ircon.org/career-ircon/contract-employment

సుప్రీంకోర్టులో

సుప్రీంకోర్టు రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అసిస్టెంట్ ఎడిటర్: 05
- అసిస్టెంట్ డైరెక్టర్: 01
- సీనియర్ కోర్టు అసిస్టెంట్: 02
- అసిస్టెంట్ లైబ్రేరియన్: 14

అర్హత: సంబంధిత విభాగాల్లో డిప్లొమా/డిగ్రీ/పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 40 ఏళ్లు మించరాదు.

మూల వేతనం: నెలకు అసిస్టెంట్ ఎడిటర్‌కు రూ.78,800. అసిస్టెంట్ డైరెక్టర్‌కు రూ.67,700. సీనియర్ కోర్టు అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్లకు రూ.47,600.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.03.2026.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీలకు రూ.1500. ఎస్సీ, ఎస్టీలకు రూ.750.

వెబ్‌సైట్: www.sci.gov.in/recruitments/

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- వీడియో ఎడిటర్: 01
- వీడియోగ్రాఫర్: 01
- ట్రెయినింగ్ మేనేజర్: 01
- అకౌంట్స్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ కో-ఆర్డినేటర్: 02
- మల్టీ టాస్క్ అసిస్టెంట్: 02
- అసోసియేట్ ప్రొఫెసర్: 02

వేతనం: పోస్టు ప్రకారం నెలకు రూ.20,000 నుంచి రూ.2,25,000 వరకు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ/పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు. మిగిలినవారికి రూ.300.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08-03-2026.

వెబ్‌సైట్: http://career.nirdpr.in/

అప్రెంటిస్ ట్రెయినీ

నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.. అప్రెంటిస్ ట్రెయినీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- అప్రెంటిస్ ట్రెయినీ: 28 ఖాళీలు

ట్రేడులు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ మోటర్ వెహికల్, డ్రాఫ్ట్స్‌మెన్, వెల్డర్.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఐటీఐ

వేతనం: నెలకు రూ.10,560. (వెల్డర్‌కు రూ.9,600).

ఇంటర్వ్యూ తేదీలు: మార్చి 11, 12.

వేదిక: ఆర్ఏబీ మీటింగ్ కాంప్లెక్స్, సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.

వెబ్‌సైట్: https://www.nal.res.in/

ఎన్‌సీడీసీ దిల్లీలో

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ గ్రేడ్-3 ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతోంది.

- స్పెషలిస్ట్ గ్రేడ్-3 (పబ్లిక్ హెల్త్) - 14 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ లేదా ఎంబీబీఎస్.

వేతనం: నెలకు రూ.1,23,500.

పోస్టు ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6.

చిరునామా: జనరల్ సర్వీసెస్ సెక్షన్, రూమ్ నెం. 202, ఎన్‌సీడీసీ, 22- శ్యామ్ నాథ్ మార్గ్, దిల్లీ - 110054.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://ncdc.mohfw.gov.in/vacancies/

జూనియర్ ఇంజినీర్లు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లీగల్ అసిస్టెంట్: 11
- అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్): 33
- జూనియర్ ఇంజినీర్ (సివిల్): 281
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: 586

అర్హత: సంబంధిత విభాగాల్లో డిప్లొమా/ డిగ్రీ/ బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.


వయసు: 18 - 35 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్షతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.03.2026.

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు. మిగిలిన వారికి రూ.100. **వెబ్‌సైట్:** https://dsssb.delhi.gov.in/dsssb-vacancies

బీఏ తర్వాత ఏం చేయాలి?

ప్రస్తుతం బీఏ (హెచ్ఈపీ) చదువుతున్నాను. ఉన్నత విద్యలో భాగంగా ఏ కోర్సులో చేరితే త్వరగా ఉపాధి పొందవచ్చు. - రాజు



■ హెచ్ఈపీ(హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) గ్రూపుతో బీఏ చదువుతున్న విద్యార్థిగా, ఉన్నత విద్యలో సరైన సబ్జెక్ట్‌ను ఎంచుకోవడం ద్వారా భవిష్యత్తులో త్వరగా ఉపాధి పొందే అవకాశం ఉంది. సంప్రదాయ కోర్సులకు ఆధునిక నైపుణ్యాలు కలిస్తేనే ఉద్యోగ అవకాశాలు మరింతగా విస్తరిస్తాయి. బీటెక్, బీబీఏ, బీసీఏ లాంటి ప్రొఫెషనల్ డిగ్రీలతో పోలిస్తే, బీఏ విద్యార్హతతో త్వరగా ఉద్యోగం పొందడం కొంత కష్టమే! కాబట్టి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయడం ద్వారా మీ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చు.

✦ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్లో అత్యంత ప్రాచుర్యం పొందిన, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న పీజీగా 'ఎంబీఏ' ని చెప్పవచ్చు. ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ వంటి స్పెషలైజేషన్లు మంచి ఉద్యోగ అవకాశాలను అందిస్తాయి. ప్రస్తుతం కంపెనీలు డేటా ఆధారిత నిర్ణయాలను తీసుకోవడంవల్ల బిజినెస్ అనలిటిక్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. మంచి విద్యాసంస్థ నుంచి ఎంబీఏ పూర్తి చేస్తే, క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా త్వరగా ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నాయి.

✦ బోధనపై ఆసక్తి ఉంటే, బీఈడీ చేయొచ్చు. ఇంగ్లిష్‌పై ఆసక్తి ఉంటే ఎంఏ ఇంగ్లిష్ గురించీ ఆలోచించవచ్చు. సామాజిక స్పృహ ఉంటే జర్నలిజంలో పీజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ కూడా మంచి అవకాశాలిచ్చే కోర్సులు. సోషల్ వర్క్ ద్వారా ఎన్‌జీఓలు, ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ రంగాల్లో పనిచేసే అవకాశాలు ఉంటాయి.

✦ న్యాయ రంగంపై ఆసక్తి ఉంటే ఎల్ఎల్‌బీ ఉత్తమ మార్గం. మూడేళ్ల ఎల్ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాది, లీగల్ కన్సల్టెంట్, కార్పొరేట్ లాయర్ లేదా ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరవచ్చు. మూడేళ్లు పట్టినా, దీర్ఘకాలంలో స్థిరమైన, గౌరవప్రదమైన కెరియర్‌ను అందిస్తుంది.

✦ ప్రస్తుతం తక్కువ కాలంలో చదువు పూర్తిచేసి త్వరగా ఉద్యోగం పొందాలనుకునే వారికి డేటా అనలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ వంటి స్వల్పకాలిక కోర్సులు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఈ కోర్సులు మూడు నుంచి ఆరు నెలల వ్యవధిలో పూర్తవుతాయి. ముఖ్యంగా డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

✦ ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి ఉంటే పీజీ చేస్తూనే యూపీఎస్సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, లాంటి పరీక్షలకు సన్నద్ధం అవ్వొచ్చు. ఆసక్తి ఉంటే, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ వంటి పోటీ పరీక్షలకు కూడా సిద్ధం అవ్వొచ్చు.

మీ ఆసక్తులు, సామర్థ్యాలు, లక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని సరైన మార్గాన్ని ఎంచుకుంటే, మీరు త్వరగా స్థిరమైన కెరియర్‌ను నిర్మించుకోవచ్చు.

ఎకనామిక్స్‌పై ఆసక్తి ఉన్నవారికి ఎంఏ ఎకనామిక్స్ ఒక మంచి ఎంపిక. దీనిద్వారా మీరు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, పరిశోధనా సంస్థలతోపాటు ప్రభుత్వ విభాగాల్లోనూ అవకాశాలు పొందవచ్చు. దీంతోపాటు డేటా అనలిటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ నైపుణ్యాలు (ఎంఎస్ ఎక్సెల్, పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్) నేర్చుకుంటే, ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎంఏ ఎకనామిక్స్ విశ్లేషణాత్మక ఆలోచన అభివృద్ధి చేయడంలో సాయపడుతుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కార్పొరేట్ స్కిల్స్

కిందపడి.. పైకిలేస్తే వైఫల్యమూ విజయమే!

కార్పొరేట్ సంస్థలు చేపట్టిన ప్రతి ప్రాజెక్టూ విజయవంతం కావాలని లేదు. ఈ విషయం సంస్థలకూ తెలుసు. అయితే ఇలాంటి ఫెయిల్యూర్ ప్రాజెక్టుల్లో భాగమైనవారు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. పడినప్పటికీ లేవగలిగే సమర్థత ఉందని నిరూపించుకోవడానికి దీన్ని ఒక అవకాశంగా మలచుకోవాలి. లేదంటే వైఫల్యం అనే ట్యాగ్‌లైన్ అప్రయత్నంగానే అంటగడతారు.



ఒక కార్పొరేట్ సంస్థలో మనోహర్, ప్రభాకర్ మార్కెటింగ్ ట్రెయినీలుగా చేరారు. శిక్షణలో భాగంగా వీరికి ఒక కొత్త వస్తువును మార్కెట్ చేసే ప్రాజెక్ట్ అప్పగించారు. మార్కెట్ అనిశ్చితి, వినియోగదారుల అవగాహన లోపం లాంటి సవాళ్లతో ఉన్న ప్రాంతంలో కొత్త వస్తువును మార్కెట్ చేయడం సాహసంతో కూడిన పని అని జట్టు సభ్యులు మనోహర్‌ను హెచ్చరించారు. ఈ ప్రాజెక్టులో విఫలమయ్యే ప్రమాదం ఉందని అతడు అర్థం చేసుకున్నాడు. టీమ్ లీడర్‌ను కలిసి ప్రాజెక్టులో ఆయన మార్గదర్శకత్వం కావాలని కోరాడు. ఈ ప్రాజెక్టు సమస్యలతో కూడుకున్నదని బృంద నాయకుడికీ అర్థమైంది. అయితే మనోహర్ తన ప్రయత్నాలను వివరించి, ప్రతి దశలోనూ అతడిని భాగస్వామిని చేశాడు. అంచనా వేసినట్టుగానే ఈ ప్రాజెక్టు చివరకు ఫెయిల్ అయ్యింది. టీమ్ లీడర్ స్వయంగా పర్యవేక్షించడం వల్ల ఈ వైఫల్యాన్ని తప్పుపట్టలేకపోయాడు. అదనంగా మనోహర్ ప్రయత్నాలను ప్రశంసించాడు.

ఇందుకు భిన్నంగా ప్రభాకర్ ఎవరి సహాయమూ కోరలేదు. టీమ్ లీడర్ కూడా ఈ ప్రాజెక్టు అతడి సామర్థ్యాలకు తగినదిగా భావించాడు. అతడి సహాయం కోరమని సభ్యులు సలహా ఇచ్చినప్పుడు 'సమర్థంగా చేయగల పనులకు సీనియర్ల సహాయం కోరడం సమంజసం కాదని' చెప్పాడు. ఈ ప్రాజెక్టు విజయం సాధిస్తుందని ప్రభాకర్‌తో పాటు టీమ్ సభ్యులూ భావించారు. అయితే ఇది కూడా విఫలమైంది. చాలా చిన్న ప్రాజెక్టునీ ప్రభాకర్ విజయవంతం చేయలేకపోయాడని భావించి, అతడిపై అసమర్థుడి ముద్ర వేశారు. ఫలితంగా సంస్థలో ప్రభాకర్ ఎదుగుదల ప్రశ్నార్థకమైంది.

వైఫల్యాల ప్రదర్శన

పై అధికారుల ప్రమేయం లేకుండా మీరు ఎంత పెద్ద ప్రాజెక్టు చేసినా అందులో విఫలమైతే అది మీ అసమర్థతగా ముద్ర వేస్తారు. అందువల్ల వారిని భాగస్వామ్యం చేసి, ప్రాజెక్టుపై స్పష్టమైన అవగాహన కల్పించాలి. దీంతో చేపట్టే పనిలో విఫలమైతే మీరు రిస్క్ తీసుకున్నారని, సంస్థ కోసం మీ కెరియర్‌ను త్యాగం చేశారని భావిస్తారు. చేపట్టిన పనుల్లో విఫలమవడం తప్పు కాదు. అయితే ఆ వైఫల్యాన్ని మీరు ఎలా ప్రదర్శిస్తారు? ఉన్నతాధికారులకు ఎలా వివరిస్తున్నారన్న విధానంపై సంస్థలో మీ ఎదుగుదల ఆధారపడి ఉంటుంది.

పని విధానం

కార్పొరేట్ సంస్థలు ఫలితాలపై దృష్టి సారిస్తాయి. కానీ ప్రతిసారీ విజయం సాధించడం అసాధ్యం. కొన్నిసార్లు పని విధానంపై పట్టున్నప్పటికీ మార్కెట్ అనిశ్చితి, వినియోగదారుల ఆలోచనల్లో వచ్చే మార్పులు మీ నియంత్రణలో లేకపోవడం వల్ల విఫలం కావొచ్చు. ఒక్కోసారి ఫలితాలు అనుకూలంగా రాకపోతే మీ సమర్థతా ప్రశ్నార్థకమవుతుంది. అలాంటి సందర్భాల్లో ముందస్తుగా మీరు అనుసరించిన విధానాన్ని మీ పైఅధికారులకు తెలిపి, వారి విశ్వాసాన్ని పొందండి.

వ్యూహాత్మక నాయకత్వం

ఒక వినియోగ వస్తువుల తయారీ సంస్థలో అధికారిగా చేరిన రమేష్ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలు సాధించలేకపోయాడు. మరోవైపు అమ్మకాలు పడిపోతున్నాయి. ఈ పరిణామానికి కారణాలు తెలిపాడు. వినియోగదారుల అభిరుచులపై సర్వే చేశానని, వాళ్ల ఆలోచనల్లో చోటు చేసుకుంటున్న మార్పులు గమనించి అప్రమత్తమయ్యానన్నాడు. వస్తువుల సరఫరా తాత్కాలికంగా ఆపి, సంస్థకు భారీ నష్టాన్ని నివారించగలిగామని రిపోర్టు పంపాడు.

రమేష్ తనకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించలేక పోయానని మాత్రమే తెలిపి ఉంటే అది అతడి అసమర్థతగా పరిగణించేవారు. ఉన్నతాధికారులకు అతడు రిపోర్టులో చెప్పిన విధానం నచ్చింది. దీంతో రమేష్‌ను వ్యూహాత్మక నాయకుడని, సంక్షోభాలను ఊహించి సమర్థంగా ఎదుర్కోగలడని ప్రశంసించారు. చేపట్టిన పనిలో విజయావకాశాలు తగ్గుతున్నాయని గమనించినప్పుడు బాహ్య కారణాలను విశ్లేషించి నివేదికలో నమోదు చేయండి.

కెరియర్‌లో ఎదుగుదల

కార్పొరేట్ సంస్థల్లో చేరినవారు తొలి రోజు నుంచే విజయాలు సాధించి, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటారు. అయితే ఏ పనిలోనైనా నిరంతర విజయాలు అంత సులభం కాదు. వైఫల్యాలను ఎలా ప్రాజెక్ట్ చేయాలి, ఎలా పెట్టుబడిగా మార్చుకోవాలో కాలేజీలో చెప్పరు, కార్పొరేట్ సంస్థల్లోనూ శిక్షణనివ్వరు.

సమీక్షలు

- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల 'హిట్ రిఫ్రెష్' పుస్తకంలో 'అన్నీ తెలుసు' అనే మనస్తత్వం కంటే 'నేర్చుకునే మనస్తత్వం' ఉత్తమమని తెలిపారు. ఇది అభివృద్ధి మనస్తత్వానికి ఆధారం. ప్రతి వైఫల్యాన్నీ పాఠంగా మార్చుకోవాలని ఈ సిద్ధాంతం తెలుపుతుంది.
- వైఫల్యాలు, ఆటంకాల నుంచి నేర్చుకున్న పాఠాలను స్పష్టంగా వివరించే నాయకులు విజయాలు మాత్రమే చెప్పుకునే నాయకుల కంటే ఎక్కువ విశ్వాసాన్ని చూరగొంటారని 'హార్వర్డ్ బిజినెస్ రివ్యూ' లో వచ్చిన అనేక సమీక్షలు స్పష్టం చేస్తున్నాయి.

కార్పొరేట్ ప్రపంచంలో మీరు ఎంత విఫలమయ్యారన్న అంశం కంటే మీరు మీ వైఫల్యాలను ఎలా ప్రజెంట్ చేశారన్నది మీ ఎదుగుదలకు సహకరిస్తుంది. పడి లేచే శక్తి ఉన్న వారిని కార్పొరేట్ సంస్థలు ఉద్యోగులుగా కోరుకుంటాయి.



– దొరైరాజ్, సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్), న్యూదిల్లీ.. ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ: 70 పోస్టులు.

విభాగాల వారీ: కెమికల్ 17, ఇన్‌స్ట్రుమెంటేషన్ 21, ఎలక్ట్రికల్ 16, మెకానికల్ 16.

అర్హత: సంబంధిత ఇంజినీరింగ్ డిగ్రీలో 65 శాతం మార్కులతో పాటు గేట్-2026 స్కోరు తప్పనిసరి.

వయసు: 18.03.2026 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు. (ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు; పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది).

వేతన శ్రేణి: నెలకు రూ.60,000 - 1,80,000.

ఎంపిక: గేట్- 2026 స్కోరుతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.03.2026.

వెబ్‌సైట్: https://www.gailonline.com/CRApplyingGail.html



సభా సమయం

మహిళలు, పిల్లలపై నేరాల నివారణకు ప్రత్యేక విభాగం

● హోం మంత్రి అనిత

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై నేరాలు నివారించేందుకు తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూసేందుకు ఐజీపీ స్థాయి అధికారి నాయకత్వంలో మహిళా, శిశు భద్రతా విభాగం ఏర్పాటు చేశాం. మహిళలకు 13 భద్రతా సాధనాలతో శక్తి యాప్‌ను ప్రారంభించాం' అని హోం మంత్రి అనిత శాసనసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు ఆమె ఈ సమాధానం ఇచ్చారు. '164 శక్తి బృందాలు హాట్‌స్పాట్‌లలో గస్తీ తిరుగుతున్నాయి. ఈవ్‌టీజింగ్‌ను నిరోధించేందుకు బాధితులకు సలహా ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తాయి. తప్పిపోయిన 3,928 మంది మహిళల్లో 3,159 మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. తప్పిపోయిన 1,730 మంది బాలికల్లో 1,496 మంది ఆచూకీని 2026 జనవరి 1నాటికి గుర్తించారు. మిగిలిన మహిళలు, బాలికల ఆచూకీ కనిపెట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. లైంగిక నేరస్థులపై 4,837 షీట్లు తెరిచాం' అని మంత్రి వెల్లడించారు.

అనంతపురంలో పరిశ్రమల ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తాం: సవిత

ఈనాడు, అమరావతి: "అనంతపురంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు అవకాశం లేదు. అక్కడ చేనేత రంగంపై ఆధారపడ్డ వారు లేరు. అనంతపురం నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల ఉపాధికి చర్యలు తీసుకుంటాం. అక్కడ పారిశ్రామిక హబ్ వస్తున్నందున పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తాం' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు. "రాయదుర్గంలో ఇప్పటికే ఒక టెక్స్‌టైల్ పార్క్ ఉందని, 8 యూనిట్లు పని చేస్తున్నాయని చెప్పారు. రూ.38.03 కోట్లతో ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరు చేశాం" అని వెల్లడించారు.

బ్రెజిల్‌లో లిథియం మైనింగ్ కోసం సింగరేణికి ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: తాము చేపట్టిన లిథియం మైనింగ్‌లో భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన సి.బి.ఎల్. (కంపానియా బ్రసిలీరా డి లిటియో) సంస్థ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సింగరేణికి ఆహ్వానం పలికింది. బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమ్, సీఈఓ విసినియస్ ఆల్వారెంగాలు బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండీ జ్యోతి బుద్ధప్రకాశ్‌ను కలిశారు. బ్రెజిల్‌లో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు.

అవినీతికి ప్యాంటు, షర్టూ వేస్తే జగన్‌లా ఉంటుంది

● నాడు నిజాయతీగా పనిచేసినవారికి బదిలీ, సస్పెన్షన్లు

● రూ.500 కోట్లుపైనే సంపాదించిన 'దుమ్ము'రేపే అధికారికి ప్రాధాన్యం

● వాణిజ్య పన్నులశాఖ అధికారుల అవినీతితో ఆదాయం కోల్పోతున్న రాష్ట్రం

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఈనాడు, అమరావతి: అవినీతికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్‌లా ఉంటారని అవినీతి మాత చెబుతుందని, అటువంటి అవినీతి చక్రవర్తి పాలనలో నిజాయతీపరుడైన అధికారికి బదిలీ బహుమానంగా ఇచ్చి, అక్రమార్కులకు మద్దతుగా నిలిచారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. వాణిజ్య పన్నులశాఖలో కొందరు అధికారుల తీరుతో రాష్ట్రం ఎంతో ఆదాయం కోల్పోతోందన్నారు. శాసనసభలో బుధవారం ఆర్థిక, ప్రణాళిక, పన్నులు, శాసన వ్యవహారాలశాఖ బడ్జెట్ డిమాండ్లపై చర్చ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో విశాఖలో ఒక స్టీల్ వ్యాపారి రూ.975 కోట్లు పన్ను ఎగవేసినట్లు.. ఓ సహాయ కమిషనర్ గుర్తించి, నోటీసు ఇస్తే, ఆయన్ను పాడేరుకు బదిలీచేసి, తర్వాత సస్పెండ్ చేశారని తెలిపారు. ఆ వ్యాపారి హైకోర్టుకు వెళ్లి..సంబంధిత అధికారికి పన్ను ఎసెస్‌మెంట్ చేసే అర్హతలేదంటూ పిటిషన్ వేశారని, తర్వాత సుప్రీంకోర్టుకు కూడా వెళ్లారని చెప్పారు. కేసు మళ్లీ హైకోర్టుకు వచ్చి రెండేళ్ల 8 నెలలు అవుతున్నా.. కాంపిటెంట్ అథారిటీ ఎవరనే విషయంలో జీఎస్టీ అధికారులు కౌంటర్ వేయకపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో నిక్కు శ్రీనివాస్ అనే ఉప కమిషనర్.. వైకాపా హయాంలో సొంతంగా వాణిజ్యపన్నులశాఖ వెబ్‌సైట్‌ను రూపొందించి, దాని ద్వారా వసూలుచేసిన రూ.1,200 కోట్లను సొంత ఖాతాలో వేసుకున్నారని, దీనిపై ఇప్పటికీ చర్యలు లేవని తెలిపారు. విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పనిచేసే శేఖర్ అనే అధికారిపై గతంలో ఏసీబీ దాడులు జరిగితే, ఆయనకు కన్ఫర్డ్ ఐఏఎస్ ఇవ్వాలని జగన్ ప్రభుత్వం సిఫార్సు చేసిందని చెప్పారు.

తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ తిరిగే 'దుమ్ము రేపే' అధికారి

వాణిజ్య పన్నులశాఖ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తూ, ఇంటిపేరు దమ్మ్ము అని ఉండి.. అవినీతిలో దుమ్ము రేపుతున్న అధికారి రూ.500 కోట్లకు పైనే సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయని కూన రవికుమార్ ఆరోపించారు. వాటిపై విచారణ జరుపుతుంటే. .సంపాదన రూ.వెయ్యి కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోందని చెప్పారు. రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన జీఎస్టీ రిఫండ్ ఫైల్ వస్తే.. ఆ అధికారి రూ.130 కోట్లు ఎక్కువ రిఫండ్ ఇచ్చారని తెలిపారు. అప్పిలేట్ కమిషనర్ హోదాలో ఉన్న ఆ అధికారికి గత ప్రభుత్వ నేతల అండదండలు ఉండేవని, గత ఎన్నికల్లో బాపట్ల ఎంపీ సీటుకు ఆయన ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. ఇప్పటికీ నిత్యం తాడేపల్లి ప్యాలెస్ వద్ద తిరుగుతుంటారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆదాయం బాగున్నా.. బాగోలేదంటూ సాక్షి పత్రికకు తప్పుడు వివరాలు ఇస్తున్నారని మండిపడ్డారు.

బకాయిలు ఎందుకు వసూలు వేయడంలేదు?

జీఎస్టీ కొత్త చట్టం 2017, జులై నుంచి అమల్లోకి వచ్చిందని, అంతకు ముందున్న వ్యాట్‌కు సంబంధించి రూ.7,732 కోట్ల బకాయిలు ఉన్నా, ఇప్పటికీ వసూలు చేయడంలేదని రవికుమార్ అన్నారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అమలుచేస్తే కనీసం రూ.3 వేల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. 2023-24 వరకు జీఎస్టీలో రూ.11,863 కోట్లు పెండింగ్ ఉందని, కొంత మంది అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణంగా వీటిని వసూలు చేయడంలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నకిలీ బిల్లులతో రూ.515 కోట్లు స్వాహా చేశారని దిల్లీ, ముంబయి, చెన్నై నుంచి రాష్ట్రానికి బంగారం వస్తున్నా.. అధికారులు అడ్డుకోకుండా, రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వాణిజ్య పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యానికి తావులేదు

● కేసుల వారీ సమీక్షించి చర్యలు తీసుకుంటున్నాం

● ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ఈనాడు, అమరావతి: వాణిజ్య పన్నులశాఖ ద్వారా పన్ను వసూళ్లలో నిర్లక్ష్యానికి తావులేదని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. కేసుల వారీగా సమీక్షిస్తున్నాం.. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. నకిలీ బిల్లుల సమస్య దేశవ్యాప్తంగా ఉందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అసెంబ్లీలో బుధవారం శాసన వ్యవహారాలు, గవర్నర్, మంత్రిమండలి, ప్రణాళికాశాఖ, సాధారణ పరిపాలనశాఖ, ఆర్థికశాఖకు గ్రాంట్ల అభ్యర్థనపై చర్చ తర్వాత ఆయన సమాధానం ఇచ్చారు. సంస్కరణల తర్వాత జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయంలో 6.2% వృద్ధి నమోదైందని తెలిపారు. 'వైకాపా ప్రభుత్వం నుంచి వారసత్వంగా రూ.9,74,556 కోట్ల అప్పులు వచ్చాయి. వడ్డీ భారాన్ని 12.5% నుంచి 9.1%కు తగ్గించాం. మరింత తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం' అని కేశవ్ చెప్పారు. 'రూ.18,700 కోట్లు చెల్లించి 85 కేంద్ర ప్రాయోజిత పథకాల్ని పునరుద్ధరించాం. సాస్కీ కింద కేంద్రం నుంచి గతం కంటే ఎక్కువ మొత్తంలో నిధులు తెచ్చుకుంటున్నాం' అని మంత్రి వివరించారు. 'సాస్కీ' సంస్కరణ ఫలాల్ని ప్రజలకి తీసుకెళ్లడంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎంతో చొరవ తీసుకున్నారని ప్రశంసించారు.

నియోజకవర్గాలకు ఇళ్ల కోటాపై కేంద్రంతో చర్చిస్తాం

● గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



ఈనాడు, అమరావతి: "ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్ని చొప్పున' అన్న ప్రాతిపదికన గతంలో ప్రభుత్వాలు ఇళ్లు మంజూరు చేసేవి. ఇప్పుడు కేంద్రమే నేరుగా యాప్ ద్వారా లబ్ధిదారులను ఎంపికచేస్తోంది. ఎమ్మెల్యేలందరూ నియోజకవర్గాల వారీగా ఇళ్లు మంజూరుచేస్తే ఎక్కడ ఎన్ని ఇవ్వాలో తాము నిర్ణయించుకునేందుకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ అంశాన్ని లేవనెత్తారు. అంతకుముందు ఎమ్మెల్యేలు గొండు శంకర్, అరవిందబాబులు వాంబే కాలనీల్లో ఇళ్ల మరమ్మతులు కష్టంగా ఉందని ప్రస్తావించగా, మంత్రి స్పందిస్తూ 'వాటి మరమ్మతులకు ఎలాంటి విధానమూ లేదు. బ్యాంకు రుణం, లబ్ధిదారు వాటాతోనే నాడు ఈ ఇళ్లు నిర్మించారు. మరమ్మతులకు ఉన్న అవకాశాలపై పరిశీలిస్తామ'ని చెప్పారు.

వార్షికాదాయ పరిమితి పెంపుపై ప్రతిపాదిస్తాం

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి



ఈనాడు, అమరావతి: 'కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.22 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల లోపు ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఈ పరిమితి పెంచాలన్న సభ్యుల డిమాండ్‌ను ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్తామ'ని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. 'మూడు ఎకరాల మాగాణి, 10 ఎకరాల్లోపు మెట్ట భూములు ఉన్నవారికి ఈ పథకాలు వర్తిస్తాయి. ఒక్క మున్సిపల్ శాఖలో పారిశుద్ధ్య కార్మికులకే 'సడలింపు' ఉంది' అని మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్యేలు జి.మాధవి, పల్లె సింధూరారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, కొండయ్యలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 26,138 మంది పొరుగు సేవల సిబ్బందికి ఈ సంక్షేమ పథకాలు అందాయని మంత్రి చెప్పారు. 23,919 మందికి తల్లికి వందనం, 1,762 మందికి ఆటోడ్రైవర్ సేవ, 457 మందికి సముద్ర చేపలవేట నిషేధ ఉపశమనం అందించినట్లు చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే మాధవి ఒక కుటుంబ ఉదాహరణ చెబుతూ ఆ ఇంట్లో మనిషి మంచం పట్టినా పింఛను రావట్లేదని, ఆ ఇంటిపెద్ద పోలీసుశాఖలో పొరుగుసేవల విభాగంలో రూ.12 వేలకు ఉద్యోగం చేయడమే కారణమని చెప్పారు. ఈ పరిమితిని నెలకు రూ.20వేలకు పెంచాలని సింధూరారెడ్డి పేర్కొన్నారు. పొరుగుసేవల సిబ్బంది వేతనాలు పెంచాలని ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు.

వసతిగృహాల్లో కల్తీ నివారణకు చర్యలు

'ప్రభుత్వ వసతిగృహాల్లో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలు చోటు చేసుకున్నా, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో అలాంటివి చోటుచేసుకోలేదు. ఆహార కల్తీ సమస్యను తగ్గించేందుకు వసతిగృహాలకు వైద్యాధికారులు మ్యాపింగ్ చేయడం, క్రమం తప్పకుండా తనిఖీలు వంటి చర్యలు చేపడుతున్నాం' అని మంత్రి వీరాంజనేయస్వామి లిఖితపూర్వకంగా తెలిపారు.

అమ్మలాంటి మాతృభాషను మరవొద్దు

● విద్యార్థులతో లోకేశ్ మాటామంతీ

ఈనాడు, అమరావతి: పిల్లలే రాష్ట్ర భవిత.. రాబోయే కాలంలో చరిత్ర సృష్టించేది నేటి విద్యార్థులే. . మీరు ఆంగ్ల మాధ్యమంలో చదువుకుంటున్నా అమ్మలాంటి తెలుగుభాషను మరవొద్దని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సూచించారు. శాసనసభ సమావేశాల్ని వీక్షించేందుకు బుధవారం సత్తెనపల్లి నియోజకవర్గంలోని సుగాలి జడ్పీ హైస్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులతో లాబీలో ఆయన ముచ్చటించారు. "అసెంబ్లీ చూడటం ఎలా ఉంది. మీరు చూస్తున్నప్పుడు ఏ అంశంపై చర్చ జరిగింది" అని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల్ని ప్రత్యక్షంగా చూడటం వల్ల చాలా విషయాలు తెలిశాయని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫాం ఎలా ఉంది? టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు? మధ్యాహ్న భోజనం రుచిగా ఉంటుందా? రాగి జావ అందుతోందా? అని లోకేశ్ వారిని అడిగి తెలుసుకున్నారు.

కల్తీ నెయ్యి కుంభకోణంపై నేడు మండలిలో చర్చ

● శాసనసభ ముందుకు కీలక సవరణ బిల్లులు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి వైకాపా పాలనలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కుంభకోణంపై గురువారం శాసనమండలిలో లఘుచర్చ నిర్వహించనున్నారు. ప్రశ్నోత్తరాల్లో రాయలసీమ ఎత్తిపోతల పథకం, విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక అక్రమాలు, ప్రభుత్వ సలహాదారులు, కన్సల్టెంట్ల నియామకం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, అసంఘటిత రంగ కార్మికులకు ఉచిత బీమా, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాలపై ఎమ్మెల్సీల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలివ్వనున్నారు.

శాసనసభలో..: ఎసైన్‌మెంట్ భూముల చట్టం సవరణ బిల్లు, గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల సవరణ బిల్లును గురువారం శాసనసభలో మంత్రులు ప్రవేశపెట్టనున్నారు. శాఖలవారీగా బడ్జెట్ డిమాండ్లు, గ్రాంట్లపై చర్చ కొనసాగనుంది. సాగునీటి పారుదల శాఖ డిమాండ్లు, గ్రాంట్ల ఆమోదానికి ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతిపాదన చేయనున్నారు. ప్రశ్నోత్తరాల్లో భూ పునఃసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు, బుడగట్ల ఫిషింగ్ హార్బర్, స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు తదితర అంశాలపై సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలివ్వనున్నారు.

వైకాపా పాలనలో ఆలయ వ్యవస్థ నాశనం

● శాసనసభలో ఎమ్మెల్యేల ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో ఆలయ వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, పాలు, లడ్డూ, ప్రసాదాలు సహా అన్నీ కల్తీచేసి మహాపాపం చేశారని పలువురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. హిందూమత విశ్వాసాలను దెబ్బతీసేలా వ్యవహరించారని మండిపడ్డారు. శాసనసభలో బుధవారం దేవాదాయశాఖ బడ్జెట్ పై చర్చ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 2019-24 మధ్య రాష్ట్రానికి జె వైరస్ పట్టిందని విమర్శించారు. హుండీలో పడిన డబ్బులే స్వామికి, మిగిలినవన్నీ మావే అనేలా వ్యవహరించారని మండిపడ్డారు. 2024లో శ్రీకాళహస్తి ఆలయ రాబడి నెలకు రూ.20-90 లక్షల మధ్య ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.3 కోట్లకు పైగా పెరిగిందని చెప్పారు. దేవుడి సొమ్ము బొక్కేసేవారిని నియంత్రిస్తే, ఆలయ రాబడి పెరిగిందని తెలిపారు.

ఆలయాలపై వైకాపా నీచ రాజకీయం

హిందూ ఆచారాలు, సంప్రదాయాలను వైకాపా ప్రభుత్వం మంటగలిపిందని, దేశంలో మరెక్కడా జరగని విధంగా అపచారాలు ఏపీలో జరిగాయని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. నాడు ఇతర మతాలకు చెందినవారిని ఆలయాల ఛైర్మన్లు, సభ్యులుగా నియమించారని విమర్శించారు. ఆలయ భూములను కాపాడేది కూటమి ప్రభుత్వమే అనే భరోసా ఇవ్వాలని కోరారు.

జల్‌జీవన్ నిధుల వినియోగంలో వైకాపా విఫలం

● రూ.26 వేల కోట్ల పనులకు కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు

● శాసన మండలిలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: జల్‌జీవన్ మిషన్ కింద కేంద్రం రాష్ట్రానికి రూ.13,499 కోట్లు కేటాయిస్తే.. వాటి వినియోగంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం రూ.2,324 కోట్లే వినియోగించుకుందని గుర్తుచేశారు. శాసనమండలిలో ఓ ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరఫున మంత్రి మనోహర్ సమాధానం చెప్పారు. 'ప్రస్తుతం ఈ పథకం కింద కూటమి ప్రభుత్వం రూ.26 వేల కోట్లతో కొత్త పనులు ప్రతిపాదించింది. వాటికి కేంద్రం నుంచి ఆమోదం వస్తుంది. 2024 తర్వాత పథకాన్ని కొనసాగించబోమని ఇప్పటివరకు కేంద్రం ప్రకటించలేదు. గతేడాది రాష్ట్రప్రభుత్వం రూ.1,700 కోట్లు ఖర్చు చేస్తే.. కేంద్రం నుంచి రూ.70 కోట్లే వచ్చాయి' అని వెల్లడించారు. రాష్ట్రంలోని పంచాయతీలు వసూలు చేస్తున్న ఇంటి పన్నుల్లో ప్రతి రూపాయికి 8 పైసల చొప్పున గ్రంథాలయ సెస్ కింద జమచేస్తున్నాయని మరో ప్రశ్నకు జవాబిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే 200 గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేశామని, భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లోని 890 లైబ్రరీలను ఆధునికీకరిస్తామని పేర్కొన్నారు.

క్రెడిట్ చోరీకి పాల్పడింది వైకాపానే

– మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

భోగాపురం విమానాశ్రయం శంకుస్థాపనకు ముందే అన్ని అనుమతులూ తీసుకున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసన మండలిలో ఓ ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. క్రెడిట్ చోరీ చేశారంటూ వైకాపా ఎమ్మెల్సీల ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టారు. '2015లో భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ ప్రారంభించాం. గుత్తేదారు సంస్థతో 2020 జూన్ 12న ఒప్పందంపై సంతకాలు చేశాం. గుత్తేదారు సంస్థతో 2023లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. 2026 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తికావాలి. 2026 జనవరి 4న ప్రయోగాత్మకంగా రన్‌వేపై విమానం దిగింది. 2014-19 మధ్య కర్నూలు విమానాశ్రయాన్ని మేం పూర్తి చేస్తే.. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్రారంభించింది' అని విమర్శించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పోర్టుల ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదనా ప్రభుత్వ పరిశీలనలో లేదని మరో ప్రశ్నకు జవాబిచ్చారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మరింత విస్తృతంగా డయాలసిస్ సేవలు

– మంత్రి సత్యకుమార్ యాదవ్

కిడ్నీ రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత డయాలసిస్ సేవలను మరింత విస్తృతం చేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండలిలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. '76 ప్రభుత్వ, 176 అనుబంధ ఆసుపత్రుల్లో 2,721 యంత్రాల ద్వారా 21,504 మంది రోగులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారు. గత 20 నెలల్లో సెకండరీ ఆసుపత్రుల్లోనూ కొత్తగా 14 డయాలసిస్ కేంద్రాలు ప్రారంభించగా, మరో 11 త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతున్నాం' అని వెల్లడించారు. తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామంటూ మరో ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

18 నెలల్లో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు

– మంత్రి దుర్గేష్

రాష్ట్రంలో నూతన పర్యాటక పాలసీ ద్వారా 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు వచ్చాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మండలిలో ఓ ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. 'పర్యాటక రంగానికి ప్రభుత్వం పారిశ్రామిక హోదా కల్పించింది. రూ.9,445 కోట్లతో సుమారు 7,348 హోటల్ గదులు నిర్మిస్తున్నారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా 39,264 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. కేంద్రం అందించే వివిధ పథకాల కింద రాష్ట్రానికి రూ.429.05 కోట్లు మంజూరయ్యాయి' అని వెల్లడించారు.

వ్యవసాయ రంగంలో సాంకేతికతను విస్తరిస్తాం

– మంత్రి అచ్చెన్నాయుడు

వ్యవసాయ రంగంలో సాంకేతికతను విస్తరింపజేస్తామని ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శాసన మండలిలో ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయ్యర్ల పనితీరును పరిశీలిస్తాం. ఫలితాలు బాగుంటే రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం. విశాఖ మినహా.. మిగిలిన జిల్లాల్లో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎఫ్) కింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బహుళ ప్రయోజన సౌకర్యాల కేంద్రాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఈ పథకం కింద రూ.504.42 కోట్లతో గోదాములు, డ్రైయింగ్ యార్డుల నిర్మాణం కొనసాగుతోంది' అని వెల్లడించారు.

ఖాయిలా పడిన ఎంఎస్‌ఎంఈలకు మద్దతు

– మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రాష్ట్రంలో ఖాయిలాపడిన ఎంఎస్‌ఎంఈలకు మద్దతు ఇచ్చేందుకు 'ఎంఎస్‌ఎంఈ పునరుద్ధరణ విధానం-4.0' ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలిలో ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. 'పరిశ్రమలకు ప్రోత్సాహకాల కింద ఈ ఏడాది రూ.1,500 కోట్లు చెల్లించాం. దీనికోసం వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.3వేల కోట్లు కేటాయించింది. వివిధ కారణాలతో ఎంఎస్‌ఎంఈల రిజిస్ట్రేషన్లు రద్దవుతున్నాయి. అవన్నీ ఖాయిలాపడినవిగా భావించలేం. ఉద్యమ్ పోర్టల్ గణాంకాల ఆధారంగా 3,041 ఎంఎస్‌ఎంఈలు మూతపడ్డాయని కేంద్రం తెలిపింది' అని వివరించారు.

ఐదు బిల్లుల ఆమోదం

శాసన మండలి బుధవారం ప్రారంభమైన వెంటనే ఛైర్మన్ మోషేనురాజు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. సభ్యుల ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలిచ్చారు. తరువాత ప్రత్యేక ప్రస్తావనలు.. వైద్య శాఖకు సంబంధించిన బిల్లు, దేవాదాయ శాఖకు చెందిన 2 బిల్లులు, జలవనరుల శాఖ, జైళ్ల-సంస్కరణ సర్వీసులకు సంబంధించి ఒక్కొక్క బిల్లును మండలి ఆమోదించింది. దేవాదాయ, జలవనరుల శాఖల బిల్లులను ఆయా శాఖల మంత్రుల తరఫున మంత్రి పార్థసారథి ప్రవేశపెట్టారు. వ్యవసాయంపై లఘుచర్చ చేపట్టకుండానే సభను ఛైర్మన్ వాయిదా వేశారు.

కల్తీ మాఫియాపై చర్యలు శూన్యం

● వైకాపా ఎమ్మెల్సీల ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీలకు పాల్పడుతున్న మాఫియాపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని వైకాపా ఎమ్మెల్సీలు ధ్వజమెత్తారు. బుధవారం ఈ మేరకు మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కల్తీ పాలు, నీళ్లు, మద్యం, ఆహారం అన్నీ కల్తీ అవుతున్నా ఎలాంటి చర్యలూ లేవని విమర్శించారు.

● తురకపాలెంలో వరుస మరణాలు, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీపాలు.. ఇలా కూటమి అధికారంలోకి వచ్చాక 25 ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వంలో స్పందన లేదని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ విమర్శించారు.

● ప్రభుత్వ వసతిగృహాల్లో గత 20 నెలల్లో కలుషిత ఆహారం వల్ల ఎలాంటి ఘటనలూ చోటుచేసుకోలేదని సభలో అసత్యాలు చెబుతున్నారని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆరోపించారు.

● ఎన్టీఆర్ వైద్యసేవ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆ ఆసుపత్రుల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు.

● 2014-19, 2019-24 మధ్య ప్రతిపాదించి, నిర్మించిన పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు ఎన్ని..? ఖర్చుచేసిన నిధులు ఎంత అని అడిగితే సరైన సమాధానం చెప్పే పరిస్థితిలో మంత్రి లేరని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఆరోపించారు.

● ఎంఎస్‌ఎంఈలు సిక్ అయి నడపలేని స్థితిలో ఉన్నా..రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదని చెప్పి ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ఆరోపించారు.

● అసెంబ్లీ సాక్షిగా జగన్ హిందూ వ్యతిరేకి అని సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అనడం సరికాదని, జగన్ ప్రభుత్వంలోనే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 3,100 ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తెలిపారు.


● కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అమలులో జాప్యం చేస్తోందని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు.

● తిరుమల లడ్డూ గురించి అసత్య ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబు. . వైవీ సుబ్బారెడ్డి భార్యపైనా అసెంబ్లీలో అసత్యాలు చెప్పారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు.

నా కుమారుడి వివాహానికి రండి

సోనియా, రాహుల్, నిర్మలకు భట్టి ఆహ్వానం

ఈనాడు, దిల్లీ: వచ్చే నెల 5న హైదరాబాద్‌లో జరిగే తన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు రావాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌లను ఆహ్వానించారు.



ఓపిక పట్టే వారి వద్దే సంపద

ప్రతి ఒక్కరు మల్టీబ్యాగర్ షేర్లంటూ మాట్లాడతారు తప్ప స్టాక్‌మార్కెట్‌లో దీర్ఘకాలం వేచి ఉండాలనే విషయాన్ని విస్మరిస్తారు. మంచి షేర్లను ఎంచుకున్నా మార్కెట్ ఒడుదొడుకుల్లో భావోద్వేగాలకు గురై వాటిని విక్రయించకుండా సహనంతో వేచి ఉండేవారే నిజమైన పెట్టుబడిదారులు. సంపద ఎప్పుడూ భయంతో అమ్మేసేవారి నుంచి ఓపిగ్గా ఉండేవారి వద్దకు బదిలీ అవుతుంది. – అభిజిత్ భోక్సే, ఇన్వెస్టర్

అధ్వాన రోడ్ల నుంచి విముక్తి

● ఆర్‌అండ్‌బీకి బడ్జెట్‌లో రూ.9,998 కోట్లు

● కూటమి ప్రభుత్వం రోడ్లకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం

● జగన్ హయాంలో గుంతలైనా పూడ్చకుండా నరకం చూపారన్న ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ రోడ్లపై కనీసం గుంతలు కూడా పూడ్చకుండా నరకం చూపించిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి 9 నెలల్లోనే గుంతలరహితం చేసి ప్రజలకు ఉపశమనం కల్పించిందని పలువురు ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. శాసనసభలో బుధవారం రహదారులు, భవనాల శాఖకు చెందిన బడ్జెట్ డిమాండ్‌పై చర్చ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. ఈ శాఖకు రూ.9,997.71 కోట్ల బడ్జెట్ కేటాయించారంటే ప్రభుత్వం రహదారులకు ఎంత ప్రాధాన్యమిస్తోందో అర్థమవుతోందని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ రహదారులు, మౌలిక వసతుల కల్పనపై ఎక్కువగా దృష్టిసారిస్తారని చెప్పారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో 30 వేల కి.మీ. రోడ్లు దెబ్బతిన్నా పట్టించుకోలేదని, అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే, అమరావతి ఔటర్ రింగ్‌రోడ్‌ను పక్కన పెట్టారని విమర్శించారు. 2019-24 మధ్య రోడ్డు ప్రమాదాల్లో 43వేల మంది చనిపోయారని, రహదారి భద్రతకు అప్పట్లో రూ.10 కోట్లే ఖర్చుచేశారని తెలిపారు. గ్రానైట్, రోడ్‌మెటల్ క్వారీలున్న ప్రాంతాల్లో మరింత నాణ్యమైన రోడ్ల కోసం ప్రత్యేక డీపీఆర్ ఉండాలని సూచించారు.

● భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ పంట కాల్వల వెంట ఉన్నవి, చేపల చెరువులున్న ప్రాంతాల్లోని రోడ్లకు బీటీ వేస్తే ఉపయోగం ఉండదని, సిమెంట్ రోడ్లు నిర్మించడమే పరిష్కారమని చెప్పారు.

● ఉపాధి హామీ నిధులను చిన్నచిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులకు కేటాయించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు.

● గత ప్రభుత్వంలో జగన్ హెలికాప్టర్లలో తిరుగుతూ రోడ్లను పట్టించుకోలేదని, సభకు రాకుండా బయట నుంచి విమర్శలు చేస్తున్న అలాంటి వ్యక్తి రాజకీయాలకు పనికిరారని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు.

● జగన్ ప్రభుత్వంలో మంజూరుచేసిన ఎన్‌డీబీ రోడ్ల విస్తరణ పూర్తికాలేదని, వైకాపా కాంట్రాక్టర్లు పనులు చేయట్లేదని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చెప్పారు.

● ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతున్నచోట్ల పంచాయతీరాజ్ రోడ్లను ఆర్‌అండ్‌బీకి బదలాయించి, అభివృద్ధి చేయాలని కోరారు. అనకాపల్లి జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నందున అక్కడి రోడ్లను ఉన్నతీకరించాలన్నారు.

● గత ప్రభుత్వం వంతెనలను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా వీటి నిర్మాణంపై దృష్టిసారించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు.

● ట్రాక్టర్లు దమ్ముచక్రాలతో రోడ్లపై తిరగకుండా చూడాలని, వీటివల్ల రహదారులు దెబ్బతింటున్నాయని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. తన నియోజకవర్గంలో దమ్ముచక్రాలతో రోడ్లపైకి వస్తే రూ.25 వేలు జరిమానా వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

స్మగ్లర్ల వాహనాలకూ ఎమ్మెల్యే స్టిక్కర్లు

ఎందరో మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు కూడా వాహనాలపై ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకొని తిరుగుతున్నారని, గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లు సైతం ఇదే స్టిక్కర్లు వినియోగిస్తున్నారని రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు.

మాజీ సైనికుడి భూమి కబ్జా చేసిన వైకాపా నాయకులు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: భారత నౌకాదళంలో పని చేసి పదవీవిరమణ చేసిన తనకు ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల భూమిని స్థానిక వైకాపా నాయకులు కబ్జా చేశారని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన విజయభాస్కరరావు వాపోయారు. తనకు న్యాయం చేయాల్సిందిగా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అడవులపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారుల సహకారంతో 96 ఎకరాల సీలింగ్ భూమిని కబ్జాదారులు ఆక్రమించారని బాపట్లకు చెందిన సాధు నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

మోదీ నామినేషన్‌ను తిరస్కరించండి

ఈసీఐ, రాష్ట్రపతికి యుగతులసి పార్టీ అధ్యక్షుడి వినతి

ఈనాడు, దిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వారణాసి లోక్‌సభ నుంచి ఎన్నికైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నామినేషన్ నిబంధనల ప్రకారం లేనందున దాన్ని రద్దుచేసి ఆ స్థానానికి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని యుగతులసి పార్టీ అధ్యక్షుడు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు కె.శివకుమార్ కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ములను కోరారు. బుధవారం ఆయన ఈ మేరకు వారిద్దరికీ ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో నల్గొండ లోక్‌సభ నుంచి నామినేషన్ దాఖలు చేసిన నాగపుల్లారావు అనే వ్యక్తి తన అఫిడవిట్‌లోని కొన్ని బాక్సులను ఖాళీగా వదిలేశారన్న కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారని, అదే విధానాన్ని ప్రధాని మోదీకి కూడా వర్తింపజేయాలని కోరారు. మోదీ కూడా తన అఫిడవిట్‌లో కొన్ని బాక్సులను ఖాళీగా వదిలేసినట్లు పేర్కొన్నారు. అందువల్ల ఆ ఎన్నికను రద్దుచేసి తిరిగి నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఆర్థికసాయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మదనపల్లెలో ఈ నెల 17న హత్యాచారానికి గురైన చిన్నారి కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.15 లక్షలు పరిహారం, తిరుపతిలో ఇంటి స్థలం మంజూరు చేశారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఆధ్వర్యంలో చిన్నారి తల్లిదండ్రులను మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వారికి భరోసా కల్పించారు. తెలుగు యువత అధ్యక్షుడు బుధవారం చిన్నారి తల్లిదండ్రులను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత వద్దకు తీసుకెళ్లి సంఘటనను వారికి వివరించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే, తెలుగు యువత అధ్యక్షుడికి వారు ధన్యవాదాలు తెలిపారు.

పశు వైద్య విద్యకు జబ్బు

- రెగ్యులర్ నియామకాలు లేకపోవడమే అసలు సమస్య
- గరివిడి కళాశాలకు ఈ ఏడాదీ గుర్తింపును తిరస్కరించిన వీసీఐ
- 253 అధ్యాపక పోస్టుల భర్తీకి పడని ముందడుగు
- ప్రభుత్వం పూనుకోకపోతే వర్సిటీ కొలుకోవడం కష్టమే

ఈనాడు, అమరావతి, తిరుపతి(వ్యవసాయం)న్యూస్‌టుడే: రాష్ట్రంలో పశు వైద్య విద్యకు జబ్బు చేసింది. రెగ్యులర్ అధ్యాపక నియామకాలేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కాగా... తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ)లో వీసీ సహ కీలక పోస్టులన్నీ ఇన్‌ఛార్జులతోనే నడుస్తున్నాయి. పాలకమండలి నియామకాన్ని ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. ఫలితంగా వర్సిటీ కార్యకలాపాలు దెబ్బతినడమే కాదు.. గరివిడిలోని పశువైద్య కళాశాలకు ఈ ఏడాదీ భారత వెటర్నరీ కౌన్సిల్ (వీసీఐ) గుర్తింపును తిరస్కరించింది. గన్నవరం, ప్రొద్దుటూరు కళాశాలలపై నెగెటివ్ రిమార్కులు రాసింది.

గరివిడికి గుర్తింపు కరవు

గరివిడిలో పశువైద్య కళాశాలను 2021లో ఏర్పాటుచేసినా ఇప్పటివరకూ వీసీఐ గుర్తింపు దక్కలేదు. రెగ్యులర్ అధ్యాపకులు తగిన సంఖ్యలో లేకపోవడం, సదుపాయాల లేమి కారణంగా ఈ ఏడాదీ వీసీఐ గుర్తింపును తిరస్కరించింది. తొలినుంచి ఇక్కడ రెగ్యులర్ అధ్యాపక సిబ్బంది లేకపోవడంతో.. వీసీఐ తనిఖీల సమయానికి తాత్కాలికంగా ఇతర కాలేజీల నుంచి అధ్యాపకులను బదిలీ చేసి రికార్డుల్లో చూపిస్తూ గుర్తింపు సాధించేందుకు అధికారులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ సర్దుబాట్లను వీసీఐ పసిగట్టింది. అన్నిచోట్లా ఒకేసారి తనిఖీలు చేపట్టిన వీసీఐ.. నిబంధనల మేరకు రెగ్యులర్ అధ్యాపకులు లేరని గరివిడి కాలేజీకి గుర్తింపు ఇవ్వలేదు. గన్నవరం, ప్రొద్దుటూరు కాలేజీలపై నెగెటివ్ రిమార్కులు రాసింది. ఉండాల్సిన అధ్యాపకుల్లో గన్నవరంలో 70%, ప్రొద్దుటూరులో 65% మంది ఉన్నారని, పరిస్థితిని చక్కదిద్దుకోకపోతే ముందుముందు ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో గరివిడి కాలేజీలో చివరి సంవత్సరం విద్యార్థులను గన్నవరం, ప్రొద్దుటూరు కాలేజీలకు బదిలీ చేసి అక్కడే ఇంటర్న్‌షిప్ చేయించి, కోర్సును పూర్తి చేశామనిపించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గరివిడి కాలేజీలో వైకాపా హయాంలో రెండుసార్లు, ఈ ప్రభుత్వ హయాంలో మూడుసార్లు తనిఖీ చేసిన వీసీఐ బృందాలు గుర్తింపు తిరస్కరించాయి.

నియామకాలు జరిగేనా?

2005లో ఎస్వీవీయూ ప్రారంభించినప్పుడు ప్రొఫెసర్-79, అసోసియేట్ ప్రొఫెసర్-120, సహాయ ప్రొఫెసర్-278 పోస్టులను మంజూరుచేశారు. అప్పుడు కొన్ని భర్తీచేయగా, చివరిసారిగా 2013లో 150 పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుతం ప్రొఫెసర్-56, అసోసియేట్ ప్రొఫెసర్-78, సహాయ ఆచార్యుల-119 మొత్తంగా 253 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైకాపా ఐదేళ్లలో ఈ నియామకాలపై దృష్టిపెట్టలేదు. కూటమి ప్రభుత్వం 253 పోస్టుల భర్తీకి గతేడాది అనుమతినిచ్చింది. కానీ, దీనిపై ఇప్పటికీ ముందడుగు పడలేదు. వర్సిటీ పరిధిలో బోధనేతర సిబ్బంది ఖాళీలు కూడా 400 వరకు ఉన్నాయి.

పాలకమండలి లేనందువల్లే

పాలకమండలి లేకపోవడం వల్లే నియామకాలు, ఇతర పనులు ముందుకు సాగడం లేదు. 2023 నుంచి స్వాతంత్ర్యాలేమిలా చేపట్టడం లేదు. పాలకమండలిలో ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు జడ్పీటీసీ/ఎంపీటీసీ సభ్యులు, పశు సంవర్ధక పరిశ్రమ నుంచి ఒకరు, ఏపీ వెటర్నరీ కౌన్సిల్ నుంచి ఒకరితో పాటు పదవి రీత్యా ఆరుగురు అధికారులు బోర్డులో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. గత ప్రభుత్వం నామినేట్ చేసిన సభ్యుల 2024 ఆగస్టులో వెళ్లిపోయారు. ప్రస్తుత ప్రభుత్వం ఎవరినీ నామినేట్ చేయకపోవడంతో 2024 నుంచి ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతో పాలకమండలి పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తోంది. కానీ, ఐసీఏఆర్ తరఫున సభ్యుడిగా ఉన్న డాక్టర్ సాయికుమార్ 2024 డిసెంబరులో పదవీవిరమణ చేయడంతో పాలకమండలిలో కోరం లేకుండా పోయింది. దీంతో పాలకమండలి సమావేశాలు లేవు, నిర్ణయాలు తీసుకోవడం లేదు. రెండు పేర్లు సిఫార్సు చేస్తూ యూనివర్సిటీకి ఏడాది క్రితం ప్రతిపాదన పంపినా నియామకం చేపట్టలేదు.

అందరూ ఇన్‌ఛార్జులే

వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు, పరీక్షల నియంత్రణాధికారి, డీన్, విస్తరణ సంచాలకులు ఇలా కీలక పోస్టులన్నింట్లో ఇన్‌ఛార్జులే ఉన్నారు. దీనికితోడు ఈ నెల మొదటివారంలో రాష్ట్రంలోని అన్ని పశువైద్య కళాశాలల అసోసియేట్ డీన్ పోస్టులు ఖాళీ అయ్యాయి.

ఖాళీలతో జాతీయస్థాయి ర్యాంక గల్లంతు

ఎన్ఐఆర్ఎఫ్ ఏటా వ్యవసాయ అనుబంధ రంగాల వర్సిటీలకు ఇచ్చే ర్యాంకుల్లో 2025లో పశువైద్యవర్సిటీకి చోటు దక్కలేదు. వివాదాలు, నిబంధనల ఉల్లంఘనలు, ఇతర సమస్యలు ఇందుకు కారణమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలో పశువైద్య విద్య మరింత దుర్భరమయ్యే ప్రమాదం ఉంది.



అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటుచేసిన చేనేత స్టాల్‌లో భూమా అఖిలప్రియ, సవిత, అనిత, ప్రశాంతిరెడ్డి, సంధ్యారాణి, ప్రశాంతి రెడ్డి, జౌళిశాఖ కార్యదర్శి రేఖారాణి

బదిలీ అయిన డిప్యూటీ కలెక్టర్లు

1. రాజీ సుస్మిత, కొవ్వూరు, తూర్పుగోదావరి జిల్లా
2. కె.శ్రీనివాసులు రాజు, కుప్పం, చిత్తూరు జిల్లా
3. నీలపు రామలక్ష్మి, రేపల్లె, బాపట్ల జిల్లా
4. కె.మధులత, నరసరావుపేట, పల్నాడు జిల్లా
5. దాట్ల కీర్తి, విజయనగరం, విజయనగరం జిల్లా
6. ఎస్.భరత్ నాయక్, పత్తికొండ, కర్నూలు జిల్లా
7. ఆదిమూలం సాయిశ్రీ, జమ్మలమడుగు, వైఎస్సార్ కడప జిల్లా
8. జి.వెంకటేశ్, పలాస, శ్రీకాకుళం జిల్లా
9. ఎం.అచ్యుత అంబరీష, ఏలూరు, ఏలూరు జిల్లా
10. గాజులపల్లి వెంకట రమాకాంత్‌రెడ్డి, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా
11. బోడ సంపత్ హేల షరాన్, ఉయ్యూరు, కృష్ణా జిల్లా
12. వి.శ్రీకర్, కొత్తపేట, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
13. మహేశ్ అలకాటూర్, ధర్మవరం, అనంతపురం జిల్లా
14. ఎం.ఎస్.వంశీకృష్ణ, కావలి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
15. ఈతముక్కల కరుణశ్రీ, సూళ్లూరుపేట, తిరుపతి జిల్లా
16. వై.భవాని శంకరి, నగరి, చిత్తూరు జిల్లా
17. కావూరి చైతన్య, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా
18. రమావత్ కృష్ణానాయక్, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా
19. కొత్త మాధవి, అమలాపురం, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
20. దేవరకొండ అఖిల, రామచంద్రపురం, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
21. జి.కేశవర్ధనరెడ్డి, కనిగిరి, ప్రకాశం జిల్లా
22. జాన్ ఇర్విన్ పాలపర్తి, కడప, వైఎస్సార్ కడప జిల్లా
23. ఖాతీబ్ కౌసెర్ బానో, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా
24. దేశిరెడ్డి నాగజ్యోతి, ఆత్మకూరు, నంద్యాల జిల్లా
25. నిమ్మనపల్లి మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కడప, వైఎస్సార్ కడప జిల్లా
26. ఎం.వాణి, సీసీఎల్ఏలో సీఎంఆర్‌వో పీడీ (ఆమెను మళ్లీ ఇదే పోస్టుల్లో కొనసాగించారు)

బదిలీ అయిన డీఎస్పీలు

1. నర్రెడ్డి భాను ప్రకాశ్‌రెడ్డి - స్పెషల్ బ్రాంచ్, విజయవాడ
2. పీ.గీతాకుమారి - ఎస్‌డీపీవో, గూడూరు
3. శ్రీకాంత్ ఎలిశెట్టి - ఎస్‌డీపీవో, రాజమహేంద్రవరం ఉత్తర మండలం
4. వల్లేం విష్ణు స్వరూప- ఎస్‌డీపీవో, పరవాడ
5. పైడికాల్వ సాయి ఈశ్వర్ యశ్వంత్ - ఎస్‌డీపీవో, కనిగిరి
6. పెసరు సింధుప్రియ - డీఎస్పీ, పోలీసు కంప్యూటర్ సర్వీసెస్
7. దేవినేని పావన్‌కుమార్ - ఏసీపీ, విజయవాడ సౌత్
8. బలగ హేమంత్‌కుమార్ - ఎస్‌డీపీవో, ధర్మవరం
9. గుండ్రె భవ్యారెడ్డి - ఎస్‌డీపీవో, బొబ్బిలి
10. బిట్ర రఘువీర్ - ఎస్‌డీపీవో, రామచంద్రాపురం
11. సయ్యద్ మహ్మద్ అజీజ్ - ఎస్‌డీపీవో, నగరి
12. గొండేసి భానోదయ - ఎస్‌డీపీవో, గుంటూరు దక్షిణం
13. కె.అరవింద్ - ఎస్‌డీపీవో, గుంటూరు పశ్చిమం
14. గుడిదేశి సాయిప్రశాంత్ - ఎస్‌డీపీవో, రంపచోడవరం
15. బొడ్డేద లోవ నాగ జగదీష్ - ఎస్‌డీపీవో, గురజాల
16. తాళ్లూరి విద్య శ్రీ - ఎస్‌డీపీవో, అవనిగడ్డ
17. జి.శ్రీవేద - ఎస్‌డీపీవో, నరసాపురం
18. పూతి భావన - డీఎస్పీ, పోలీసు కంప్యూటర్ సర్వీసెస్
19. రాజ చెప్పిడి - ఎస్‌డీపీవో, మచిలీపట్నం
20. షేక్ షాబాజ్ అహ్మద్ - ఎస్‌డీపీవో, కాశీబుగ్గ
21. కొలికిపూడి ప్రమోద్ - ఎస్‌డీపీవో, ఆళ్లగడ్డ
22. వీసా ధీరజ్ వినీల్ - ఎస్‌డీపీవో, గుడివాడ
23. అనుసూరి బాలశుభ పృథ్వీ తేజ- ఏసీపీ, పశ్చిమ, విశాఖపట్నం
24. మర్రిపాటి హేమలత - ఎస్‌డీపీవో, ఆదోని
25. సాకే మహేంద్ర - ఎస్‌డీపీవో, మదనపల్లె

బీచ్‌శాండ్ ఖనిజాలపై రూ.50వేల కోట్ల పెట్టుబడులు

- వచ్చే ఐదేళ్లలో 40 వేలకుపైగా ఉద్యోగాల కల్పన
- 'టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'పై వర్క్‌షాప్‌లో వక్తలు

ఈనాడు, అమరావతి: "దేశంలోని బీచ్‌శాండ్ ఖనిజాల్లో 30% ఏపీలోనే ఉన్నాయి. టైటానియం, జిర్కాన్, ఇలిమినైట్ లాంటి రేర్ ఎర్త్ ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. రక్షణరంగ పరికరాలు, అధునాతన ఇంజినీరింగ్ సాంకేతికత, బ్యాటరీలు, విండ్ టర్బైన్లు, విద్యుత్తు వాహనాల్లో వీటిని వినియోగిస్తారు. ప్రస్తుతం ఈ ఖనిజాల్లో అత్యధిక శాతం విదేశాల నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 2030 నాటికి దేశానికి అవసరమైన 70-75 శాతం రేర్ ఎర్త్ ఖనిజాలను ఏపీ నుంచే సరఫరా చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. వచ్చే ఐదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, కనీసం 40-50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయనేది అంచనా. ఒకటి రెండు నెలల్లో కొత్త పాలసీ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది" అని పలువురు ఉన్నతాధికారులు, నిపుణులు వెల్లడించారు. 'బీచ్ శాండ్ మినరల్స్ టు టైటానియం, రేర్ ఎర్త్స్ అండ్ ఆర్ఈ పర్మినెంట్ మ్యాగ్నెట్స్- బిల్డింగ్ డొమెస్టిక్ వాల్యూ చైన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్- పాజిబిలిటీస్ అండ్ ఎక్స్‌పెక్టేషన్స్' ' అనే అంశంపై బుధవారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర గనుల శాఖ, ఏపీఎండీసీ ఉన్నతాధికారులు, జాతీయస్థాయి శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఇందులో పాల్గొన్నారు. నిపుణులతో ప్యానెల్ చర్చలు నిర్వహించారు. రాష్ట్రంలో స్పష్టమైన సింగిల్ విండో విధానంలో వేగవంతమైన అనుమతులు, భూకేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రోత్సాహాల గురించి.. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, పరిశ్రమల కార్యదర్శి యువరాజ్, ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, మైన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ క్రిటికల్ మినరల్స్ మిషన్ డైరెక్టర్ అనీష్‌పాండే తదితరులు వివరించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో చంద్రశేఖర్, ముకేష్‌కుమార్ మీనా, జి.సతీష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్

◆ ఖనిజ ముడి పదార్థాలను వెలికితీసి ఎగుమతి చేయడంతోనే ఆగిపోకుండా.. ఇక్కడే శుద్ధి చేసి, ఉత్పత్తుల తయారీ ద్వారా సమగ్ర విలువను పెంచేలా పూర్తి పారిశ్రామిక గొలుసును నిర్మించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

కేడర్ స్ట్రెంగ్త్ ఆధారంగా

సచివాలయం, హెచ్‌ఓడీ టవర్లలో స్థలం కేటాయింపు

- ఆయా శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాల నుంచి వివరాల సేకరణ
- కేటగిరీల వారీగా ప్రామాణిక యూనిట్ ఏరియా నిర్దేశించిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న సచివాలయం, విభాగాధిపతుల (హెచ్‌ఓడీ) కార్యాలయాల టవర్లలో ఏ శాఖకు/విభాగానికి ఎంత స్థలం కేటాయించాలన్న అంశంపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. దీనిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ నెల 13న సమావేశమై.. ఆయా శాఖలు, విభాగాల్లో కేడర్ స్ట్రెంగ్త్ వివరాలు సేకరించాలని ఆదేశించింది. ఆయా శాఖలు, విభాగాధిపతుల కార్యాలయాల్లో మంజూరు చేసిన అధికారులు, సిబ్బంది పోస్టులు (శాంక్షన్డ్ స్ట్రెంగ్త్), ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సంఖ్య (వర్కింగ్ స్ట్రెంగ్త్) వివరాల్ని గురువారం నాటికి పంపించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ సర్క్యులర్ జారీచేశారు. మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు, మిడిల్ లెవెల్ అధికారులు.. ఇలా కేటగిరీల వారీగా కేటాయించే ప్రామాణిక స్థల విస్తీర్ణాన్ని ఆ సర్క్యులర్‌లో పొందుపరిచారు. ఆయా శాఖలు, విభాగాల్లో కేటగిరీల వారీగా శాంక్షన్డ్ స్ట్రెంగ్త్, వర్కింగ్ స్ట్రెంగ్త్ వివరాల్ని బట్టి ఎంత స్థలం కేటాయించాలన్న దానిపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు చేస్తుంది. శాంక్షన్డ్, వర్కింగ్ స్ట్రెంగ్త్ వివరాల్ని పట్టిక రూపంలో సాధారణ పరిపాలనశాఖకు ఈ మెయిల్ ద్వారా పంపించాలని సీఎస్ ఆదేశించారు.

సచివాలయ శాఖల్లో కేటగిరీల వారీగా నిర్దేశించిన ప్రామాణిక యూనిట్ ఏరియా

కేటగిరీ	మొత్తం వ్యక్తులు/యూనిట్‌లు	విస్తీర్ణం చదరపు అడుగుల్లో
మంత్రి	మంత్రి, ఒక ఓఎస్‌డీ, ఒక పీఎస్, ఒక పీఏ, 12 మంది సిబ్బంది	3,500
కార్యదర్శి	కార్యదర్శి, ఒక పీఎస్, ఒక పీఏ, 10 మంది సిబ్బంది	2,000
సలహాదారు/ప్రత్యేక కార్యదర్శి	సలహాదారు, ఒక పీఎస్, నలుగురు సిబ్బంది	1,000
మిడిల్ లెవెల్ ఆఫీసర్	ఒకరు	250
అసిస్టెంట్ సెక్రటరీ	ఒకరు	120
సెక్షన్ అధికారి	ఒక సెక్షన్ అధికారి, నలుగురు సిబ్బంది	300
మినీ కాన్ఫరెన్స్ హాల్	16 మంది కూర్చునేలా ఒకటి లేదా 8 మంది కూర్చునేలా రెండు	320
మధ్యస్థాయి కాన్ఫరెన్స్ హాల్	75 మంది కూర్చునేలా	1,500
పెద్ద కాన్ఫరెన్స్ హాల్	125 మంది కూర్చునేలా	3,125
మరింత పెద్ద కాన్ఫరెన్స్ హాల్	200 మంది కూర్చునేలా	6,000
తపాల్ కౌంటర్	3 వర్క్‌స్టేషన్లతో	100
రికార్డు రూమ్	ఒకటి	300
స్టోర్ రూమ్	ఒకటి	300
సర్వర్‌రూమ్	ఒకటి	1,000
ఐటీ సపోర్ట్ రూమ్	ఒకటి	200
డిపార్ట్‌మెంట్ లైబ్రరీ	ఒకటి	100

విభాగాధిపతుల కార్యాలయాల్లో కేటగిరీల వారీగా నిర్దేశించిన ప్రామాణిక యూనిట్ ఏరియా

కేటగిరీ	మొత్తం వ్యక్తులు/యూనిట్‌లు	విస్తీర్ణం చదరపు అడుగుల్లో
హెడ్1	హెడ్, ఒక పీఎస్, 10 మంది సిబ్బంది	3,500
హెడ్2	హెడ్, ఒక పీఎస్, 10 మంది సిబ్బంది	1,200
డిప్యూటీ హెడ్	ఒకరు	350
సూపర్వైజరీ ఆఫీసర్	ఒకరు	120
వర్క్‌స్టేషన్	ఒకరికి	60
మినీ కాన్ఫరెన్స్ హాల్	16 మంది కూర్చునేలా ఒకటి లేదా 8 మంది కూర్చునేలా రెండు	320
మీడియం కాన్ఫరెన్స్ హాల్	75 మంది కూర్చునేలా	1,500
పెద్ద కాన్ఫరెన్స్ హాల్	125 మంది కూర్చునేలా	3,125
మరింత పెద్ద కాన్ఫరెన్స్ హాల్	200 మంది కూర్చునేలా	6,000
తపాల్ కౌంటర్	3 వర్క్‌స్టేషన్లతో	100
రికార్డు రూమ్	ఒకటి	300
స్టోర్ రూమ్	ఒకటి	300
సర్వర్ రూమ్	ఒకటి	1,000
డిపార్ట్‌మెంటల్ లైబ్రరీ	ఒకటి	100



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వివిధ దేశాల నౌకాదళ అధికారులు ◆ మిలన్ విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధనౌకలు

దేశాల పరస్పర సహకారానికి మిలన్ దోహదం

ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద్

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: హిందూ మహాసముద్రంలో దేశాల నడుమ మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహించిన 'మిలన్-2026' విన్యాసాలు విజయవంతంగా ముగిశాయని ఫ్లీట్ కమాండర్ రియర్ అడ్మిరల్ అలోక్ ఆనంద అన్నారు. బుధవారం మిలన్-26 సముద్ర విన్యాసాల ముగింపు వేడుకలను 'ఐఎన్ఎస్ విక్రాంత్'పై నిర్వహించారు. ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్), మిలన్ విన్యాసాలు ఏకకాలంలో నిర్వహించడం గొప్ప విషయమని అలోక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో 74 దేశాలు పాల్గొన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రతి 50 రోజులకు ఒక యుద్ధనౌక నౌకాదళంలో చేరుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

అస్పష్ట చూపుతో లోతైన గ్రహణశక్తికి ముప్పే!

- ఎల్వీప్రసాద్ ఐ ఆసుపత్రి అధ్యయనం



పరిశోధనకు ఉపయోగించిన బజ్-వైర్ పరికరం

ఈనాడు, హైదరాబాద్: క్రికెట్ బంతి మీ వైపు వేగంగా దూసుకొస్తోంది.. పట్టుకోవడానికి బంతి వైపు పరుగెడుతూ చేతులు చాపుతారు కదా.. ఆ కొన్ని సెకన్లలోనే రెండు కళ్ల ద్వారా అందుకున్న భిన్నమైన చిత్రాలను మన మెదడు విశ్లేషించి.. బంతి దూరం, వేగం, ఆకారాన్ని అంచనా వేసి మనల్ని అప్రమత్తం చేస్తుంది. అప్పుడే జారిపోకుండా క్యాచ్ పట్టుకునే అవకాశం ఉంటుంది. అదే కళ్లల్లో అస్పష్ట(బ్లర్) చూపు ఉంటే.. మెదడు అంచనా తప్పి.. క్యాచ్ చేజారిపోతుంది. అస్పష్ట చూపుతో రోగుల రోజువారీ పనులకూ తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని, ముఖ్యంగా గ్లాసులో నీళ్లు పోయడం, తాళం తీయడం లాంటి పనులు సక్రమంగా చేసుకోలేరని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు ఓ అధ్యయనంలో గుర్తించారు. లండన్‌లోని సిటీ సెయింట్ జార్జెస్ యూనివర్సిటీతో కలిసి ఎల్వీపీఈఐ వైద్యులు తై జార్కమ్, ప్రీతి రూపాదేవి, శ్రీకాంత్ భరద్వాజ్ ఈ అధ్యయనం నిర్వహించారు. 'ఇన్వెస్టిగేటివ్ ఆప్తల్మాలజీ అండ్ విజువల్ సైన్స్ జర్నల్'లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. ఎల్వీపీఈఐ శాస్త్రవేత్తలు బజ్-వైర్‌ను ఉపయోగించి సాధారణ చూపు ఉన్న వారిపై పరీక్షలు చేశారు. లెన్స్ ద్వారా కొందరికి ఒక కంటికి, మరికొందరికి రెండు కళ్లకు అస్పష్ట దృష్టిని కల్పించారు. 24 రకాల ఆకృతులుగా ఉన్న బజ్‌వైర్‌లో వంపులను తాకకుండా లోహ లూప్‌ను కదిలించాలని వారికి సూచించారు. ఒక కన్నుకు అస్పష్టత ఉన్న వ్యక్తులు.. రెండో కంటిని ఉపయోగించి లూప్‌ను వేగంగా ముందుకు కదిలించారు. రెండు కళ్లూ బ్లర్‌గా ఉన్న వారు.. లూప్‌ను వేగంగా కదిలించినా, ఎక్కువసార్లు వైర్‌ను తాకించి తప్పులు చేశారు. రెండు కళ్లు బ్లర్‌గా ఉండడమే దీనికి కారణమని పరిశోధకులు గుర్తించారు.

అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లకు ఆర్థిక ప్రణాళికలు

- ప్రాంతీయ ప్రణాళిక బోర్డులు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- స్టీరింగ్ కమిటీ ఛైర్మన్‌గా సీఎం, కార్యనిర్వాహక కమిటీకి సీఎస్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్), తిరుపతి ఎకనమిక్ రీజియన్ (టీఈఆర్)లకు.. ప్రాంతీయ ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మాస్టర్ ప్లాన్ల అమలు పర్యవేక్షణతోపాటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలతో సమన్వయం, సకాలంలో సమస్యల పరిష్కారం, జవాబుదారీతనం కోసం ప్రత్యేక అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనుంది. దీనిలో భాగంగా రెండు ఎకనమిక్ రీజియన్లకు ప్రభుత్వం ప్రాంతీయ ప్రణాళిక బోర్డులు ఏర్పాటుచేసింది.

ఇప్పటికే వీఈఆర్ ప్రణాళిక ఆవిష్కరణ

వికసిత్ భారత్ 2047 విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ అమలు ప్రారంభించింది. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనమిక్ జోన్ల ఏర్పాటుకు నిర్దేశించింది. నీతి ఆయోగ్ సహకారంతో రూపొందించిన విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) ఆర్థిక ప్రణాళికను 2025 నవంబరు 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. నీతి ఆయోగ్ గుర్తించిన దేశంలోని నాలుగు గ్రోత్ హబ్‌లలో విశాఖపట్నం ఒకటిగా ఉంది. 1.65 కోట్ల జనాభా కలిగిన ఈ రీజియన్ పది జిల్లాల పరిధిలో ఉంటుంది. మరోవైపు, సిటీ ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధికి కేంద్రం తాజా బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం కావడంతో.. కేంద్ర నిధులు సాధించే తొలి నగరంగా విశాఖపట్నం నిలవనుంది. వీఈఆర్ తరహాలోనే అమరావతి, తిరుపతి ఎకనమిక్ రీజియన్లకు కూడా ప్రణాళికలు తయారు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

9 జిల్లాలతో అమరావతి ఎకనమిక్ రీజియన్

జిల్లాలు(9): ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం

విస్తీర్ణం : 44,962 చదరపు కిలోమీటర్లు

రాష్ట్ర జీడీపీలో వాటా: 35.15%

ప్రాంతీయ బలాలు : వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలకు సమ ప్రాధాన్యం ఉంటుంది. పట్టణాభివృద్ధి, ప్రధాన రవాణా కారిడార్లు, తీరప్రాంత అనుసంధానం, పటిష్ఠమైన ఆగ్రో పరిశ్రమలతోపాటు.. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, ఈవీ, సెమీకండక్టర్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తదితర ఫ్యూచర్ రెడీ ఇండస్ట్రీస్

9 జిల్లాలతో తిరుపతి ఎకనమిక్ రీజియన్

జిల్లాలు (9): తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, కర్నూలు, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల

రాష్ట్ర జీడీపీలో వాటా: 34%

ప్రాంతీయ బలాలు: ఉద్యాన పంటలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఏవియేషన్, స్పేస్ టెక్, ఆరోగ్యం, పర్యాటకం, విద్య, లాజిస్టిక్ రంగాల్లో బలమైన సామర్థ్యం

ప్రాంతీయ ప్రణాళిక బోర్డుల ఏర్పాటు

ఆర్థిక ప్రణాళికలు, మాస్టర్ ప్లాన్ల అమలులో భాగంగా ప్రాంతీయ ప్రణాళిక బోర్డులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. విశాఖపట్నం ప్రాంతీయ ప్రణాళిక బోర్డు ఇప్పటికే ఏర్పాటైంది. అమరావతి, తిరుపతి ప్రాంతీయ ప్రణాళిక బోర్డుల ఏర్పాటుపై బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీటికి సీఈఓలు, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ప్రణాళికశాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తుంది.

◆ రెండు ప్రణాళిక బోర్డుల్లోనూ స్టీరింగ్ కమిటీకి సీఎం ఛైర్మన్‌గా ఉంటారు. ప్రణాళికశాఖ కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో వ్యవసాయ, ఆర్అండ్‌బీ, విద్యుత్తు, హౌసింగ్, పర్యాటక, పురపాలక, అటవీ, ఐటీ, పరిశ్రమలు, ఆరోగ్యం, ఆర్థిక, హోం శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు.

◆ ఎగ్జిక్యూటివ్ కమిటీలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్‌పర్సన్, అమరావతి ఎకనమిక్ రీజియన్ సీఈఓ సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వివిధ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

◆ అమలు కమిటీల ఛైర్మన్లుగా సీఈఓలు ఉంటారు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌కు సీఆర్‌డీఏ కమిషనర్ సభ్య కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్‌కు తుడా వీసీ సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.